==================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 20:10 October 2020
================================================================

# Sūrya Dinapatrika Sāhitya Sēva: Samakālīna Dr̥kpathaṁ

**A Dissertation submitted to University of Madras for the partial fulfilment of the award of the M.Phil. Degree in Telugu**

**BOTLAGUDURU VENKATA SAI GOWTAMA**
20415005

Uncovering contemporary social life in all aspects is the main objective of every mass medium. The basic idea behind any mass medium is giving facts, especially by the Newspapers. Literature with its cornerstone as fiction, when integrated into a newspaper it gives a perfect apparatus in shaping a better society. In this fashion newspapers like *Surya* daily are unveiling the world literature to Telugu readers. Hence, I want to analyze this cocktail of facts and fiction by observing *Surya* daily as a case study.

First chapter covers the history of *Surya* Daily. Besides this I have also explained its objectives and stance.

In the second chapter I tried to throw some light on the poetry published in *Surya* daily. It covered every trend and moment in modern Telugu poetry. Based on my study, most of the poetry published fit into the literary trend called Empiricism. Poetry from other literary trends like Romantic poetry, Progressive poetry, Revolutionary poetry, Feministic poetry, Dalit Poetry and Globalization poetry were also published in *Surya* daily.

Third chapter deals with the literary essays published in *Surya* daily. In this chapter I have analyzed various writers in view of their writing style and perspective. Essays on literature in other languages and translated works in Telugu published by *Surya* daily were also studied. During the process of my study I have realized how greatly a newspaper can benefit literature. Examining the critical reviews of numerous writers in a chronological order will give us the exact path with respect to the evolution of Telugu literary criticism.

Fourth chapter includes the review of literary essays published in the literary page of *Surya* daily entitled *Aksharam*. These essays not only provide information on literary issues but on social issues as well. The two main driving points of Classical Telugu literature were Rejoice and Preach. The modern literature has an addition to the earlier two and that is social benefit. As the watchdog of society, it is the newspaper's prime concern to look into social problems and make people aware of these problems which, in turn, encourages the mass to find possible solutions. *Surya* daily is also making its way to reach the mass through its

*Aksharam* page. On top of this, *Surya* daily is boosting the fascination on literature among its readers. Also it endorses the idea of “Newspaper Literature” for contemporary writers and researches.

# Sūrya Dinapatrika Sāhitya Sēva: Samakālīna Dr̥kpathaṁ

**(Dissertation submitted for the partial fulfilment of the award of the M.Phil. Degree)**

**By**

**BOTLAGUDURU VENKATA SAI GOWTAMA**

**SUPERVISOR**
**DR. VISTHALI SANKA RAO**

**DEPARTMENT OF TELUGU**

**UNIVERSITY OF MADRAS**

**CHENNAI – 600 005**

**AUGUST 2016**

# సూర్య దినపత్రిక సాహిత్య సేవ: సమకాలీన దృక్పథం

**(ఎం.ఫిల్. పట్టా కోసం సమర్పించిన పరిశోధన వ్యాసం)**

**పరిశోధకుడు**

**బొట్లగూడూరి వెంకట సాయి గౌతమ**

**పర్యవేక్షకుడు**

**డా॥ విస్తాల శంకరరావు**

**తెలుగు శాఖ**

**మద్రాసు విశ్వవిద్యాలయం**

**చెన్నై – 600 005**

**ఆగస్టు, 2016**

# DECLARATION

I hereby declare that the Dissertation for the partial fulfilment of the M.Phil. Degree "**Sūrya Dinapatrika Sāhitya Sēva: Samakālīna Dr̥kpathaṁ"** is my original work and that it has not been previously formed the basis for the award of any Degree, Diploma, Associateship, Fellowship or other similar titles.

Signature of the Student
Name: Botlaguduru Venkata Sai Gowtama
Reg. No.20415005

# కృతజ్ఞతలు

నా తప్పులను క్షమించి పరిశోధనకు సంబంధించిన ప్రాథమికమైన విషయాలను సహితం నాతో చర్చించి, ఈ పరిశోధనా వ్యాసాన్ని రాసే క్రమంలో నా భావాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పరిశోధన పట్ల నాకున్న దృక్కోణాన్ని సరైన దిశగా మరల్చి ఈ పరిశోధనకి పర్యవేక్షకత్వం వహించిన నా గురువు, డా॥ విస్తాలి శంకర్ రావు గారికి సవినయంగా, సభక్తికంగా నమస్కారములు, కృతజ్ఞతలు. అలాగే తెలుగు శాఖాధ్యక్షులు, మాడభూషి సంపత్ కుమార్‌గారికి హృదయపూర్వక ధన్యవాదాలు...

నాకు ఈ పరిశోధనాంశాన్ని ఇచ్చి ఎన్నో రోజులు ఆ అంశంపై చర్చించి తన స్వంత కొడుకులాగా చూసుకున్న డా॥ దార్ల వెంకటేశ్వరరావుగారికి నా పాదాభివందనం. ఎప్పుడు చంద్రుడు అని ఆప్యాయంగా పిలిచే తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి నా నమస్సులు. ప్రేమగానో, కోపంగానో తిట్టి జీవితాన్ని గుర్తు చేస్తూ ఉండే డా॥ పమ్మి పవన్‌కుమార్‌గారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు. అడిగిన వెంటనే ముఖాముఖికి సమయం కేటాయించి నేనడిగిన ప్రశ్నలన్నింటికీ సహనంతో సమాధానాలు చెప్పిన ప్రముఖ సాహితీవేత్త శ్రీదేవరాజు మహారాజు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ చదువు రాని శుద్ధ మొద్దుకి చదువు చెప్పే ప్రయత్నం చేసిన కీర్తిశేషులు బొట్లగూడూరు శేషగిరి రావుగారికి (తాతయ్య), అలాగే కీర్తిశేషులు సుబ్బమ్మ (సుబ్బు)కి నా నమస్కారాలు...

ఎప్పటికైనా ప్రయోజకుడు కాకపోతాడా అనే ఎదురు చూసే పునుగోటి నిర్మలాదేవి అయిన మా అమ్మగారికి ఎప్పటికీ ఋణపడి ఉంటాను. మా నాన్న నిలువెత్తు పరమేశ్వరుడు. నేను ఎమన్నా పడే భోళా శంకరుడు. నేను తెలుగు చదవడానికి కారకుడు. జీవితాంతం నీతో ఉంటాను నాన్న. అలాగే ఎల్లప్పుడు ఏ అవసరం వచ్చినా తీర్చే నా తోబుట్టువులు అయిన మా ఇద్దరు అన్నయ్యలకు, నాకు రెండవ అమ్మ అయినా మా వదినకు నా తుది శ్వాస విడిచేవరకు తోడు ఉంటా... నేను యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాదులో ఎం.ఏ. చదువుతున్న రోజుల్లో రెండు సంవత్సరాలు రూంమేట్‌గా నన్ను భరించి నన్ను తమ్ముడుగా చూసుకున్న ఎ.వి.వి.కె. చైతన్య అన్నకు దండాలు...

అలాగే నా సీనియర్ అయిన గరికిపాటి గురజాడ మొదట కొద్దిగా పరిచయమే అయినా తరువాత తరువాత స్నేహ బంధం బాగా దృఢపడింది. ఆయన ద్వారా అఖిల భారత విద్యార్థి పరిషత్తు పరిచయం అది నా జీవితంలో ఇప్పుడు సగ భాగమైంది. ఇంకా చెప్పాలంటే గంగిశెట్టి లక్ష్మీనారాయణ అన్న, అలాగే మల్లిపూడి రవిచంద్ర అన్న నా పరిశోధన వ్యాసం రాసే క్రమంలో చక్కని సూచనలు, సలహాలు ఇచ్చి ఈ పరిశోధనకు తుది మెరుగులు దిద్ది, తన విలువైన సమయాన్ని నాకోసం వెచ్చించినందుకు మీకు కృతజ్ఞతలు...

నాకు ఎటువంటి సందేహాలు వచ్చినా సకాలంలో వాటిని నివృత్తి చేసిన కోదండ లక్ష్మణ్ అన్నకు, ఓపికతో డిటిపి చేసి, అతి తక్కువ కాలంలో అందించిన ఆనంద్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

సందీపన్న, ఆనందన్న, ఇలా చెబుతూ పోతే పేజీలు సరిపోవు. నాకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు...

**బొట్లగూడూరు వెంకట సాయి గౌతమ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | కృతజ్ఞతలు | i – ii |
| | **సూర్య దినపత్రిక – స్వరూప స్వభావం** | **(1 – 09)** |
| **అధ్యాయం – 1:** | | |
| 1.1. | సూర్య దినపత్రిక పరిచయం – చరిత్ర | 01 |
| 1.2. | సమకాలీన తెలుగు దినపత్రికలు – సాహిత్య పుటల నేపథ్యం | 02 |
| | 1.2.1. వార్త | 06 |
| | 1.2.2. ఆంధ్రప్రభ | 06 |
| | 1.2.3. ఆంధ్రజ్యోతి | 06 |
| | 1.2.4. ఈనాడు | 07 |
| | 1.2.5. ఆంధ్రభూమి | 07 |
| | 1.2.6. సూర్య | 08 |
| | 1.2.7. సాక్షి | 08 |
| | 1.2.8. నమస్తే తెలంగాణ | 08 |
| | 1.2.9. నవ తెలంగాణ | 09 |
| 1.3. | సూర్య దినపత్రిక ఆశయాలు – లక్ష్యాలు | 09 |
| **అధ్యాయం – 2:** | **సూర్య దినపత్రిక సాహిత్య పుటలు – కవిత్వం:** | **(10 – 53)** |
| 2.1. | పరిచయం | 10 |
| 2.2. | ఆధునిక కవితా శాఖలు | 10 |
| | 2.2.1. భావ కవిత్వం | 11 |
| | 2.2.2. స్మృతిగేయం | 16 |
| | 2.2.3. దేశభక్తి కవిత్వం | 17 |
| | 2.2.4. అభ్యుదయ కవిత్వం | 19 |
| | 2.2.5. ఉద్యమ కవిత్వం | 28 |
| | 2.2.6. స్త్రీవాద కవిత్వం | 30 |
| | 2.2.7. దళిత కవిత్వం | 36 |
| | 2.2.8. ప్రపంచీకరణ కవిత్వం | 42 |
| | 2.2.9. అనుభూతివాద కవిత్వం | 46 |
| **అధ్యాయం – 3:** | **సూర్య దినపత్రిక సాహిత్య దృక్పథం – విశ్లేషణ** | **(54 – 127)** |
| 3.1. | అక్షరం – నేపథ్యం | 54 |

| | | |
|---|---|---|
| 3.2. | సూర్య దినపత్రికలోని సాహిత్య వ్యాసాలు – విశ్లేషణ | 54 |
| 3.2.1. | ఎం.బి.డి. శ్యామల | 54 |
| 3.2.2. | జూపాక సుభద్ర | 62 |
| 3.2.3. | వేంపల్లి గంగాధర్ | 67 |
| 3.2.4. | నండూరి రాజగోపాల్ | 70 |
| 3.2.5. | పెన్నా శివరామకృష్ణ | 74 |
| 3.2.6. | జరపుల రమేశ్ | 77 |
| 3.2.7. | పులికొండ సుబ్బాచారి | 81 |
| 3.2.8. | ఎండ్లూరి సుధాకర్ | 86 |
| 3.2.9. | వేదగిరి రాంబాబు | 88 |
| 3.2.10. | రామా చంద్రమౌళి | 92 |
| 3.2.11. | అంకె శ్రీనివాస్ | 98 |
| 3.2.12. | రామతీర్థ | 100 |
| 3.2.13. | దేవరాజు మహారాజు | 111 |
| 3.2.14. | దార్ల వెంకటేశ్వరరావు | 114 |
| **అధ్యాయం – 4:** | **సూర్య దినపత్రిక సాహిత్య, సామాజిక సేవ – సమీక్ష** | **(128 – 138)** |
| 4.1. | సూర్య దినపత్రిక సాహిత్య సేవ | 128 |
| 4.2. | సూర్య దినపత్రిక సామాజిక సేవ | 137 |
| | **ముగింపు** | **(139 – 140)** |
| | **అనుబంధం – 1** | **(141 – 142)** |
| | **అనుబంధం – 2** | **(143 – 147)** |
| | **ఉపయుక్త గ్రంథసూచి** | **(148 – 149)** |

# అధ్యాయం – 1
# సూర్య దినపత్రిక – స్వరూప స్వభావం

## 1.1. సూర్య దినపత్రిక పరిచయం – చరిత్ర:

సూర్య దినపత్రిక 2007 అక్టోబర్ 21 తేదీన ప్రారంభమయ్యింది. అప్పటి సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్ అయిన నారాయణ్ దత్త్ తివారీ ఈ దినపత్రికను ప్రారంభించారు. ఈ దినపత్రిక అధిపతి తెలుగు సినిమా నిర్మాత నూకారపు సూర్య ప్రకాశరావు. ఈ పత్రిక ప్రత్యేకంగా అన్ని తెలుగు పత్రికల కంటే భిన్నంగా, మొదటగా ప్రామాణిక యూనికోడ్ పద్ధతిలో అంతర్జాలంలో ప్రచురింపబడింది. ఈ పత్రిక అంతర్జాలంలో సమాచారం 2010 సెప్టెంబర్ 1వ తేదీ నుండి శాశ్వత లింకులను కలిగి వున్నది. సూర్య దినపత్రిక ప్రారంభించిన రోజున ఈ పత్రిక అధిపతి అయిన నూకారపు సూర్య ప్రకాశరావుగారు కొన్ని గొప్ప మాటలు చెప్పారు. 'మేము కొద్ది నెలలు చాలామందికి శిక్షణ ఇచ్చి వారికి పత్రికా రంగంలో నిలదొక్కుకోవడానికిగాను, అసలు వార్తలను ఎలా రాయాలి?, దానిని ఎలా రిపోర్టు చేయాలి? అన్న విషయాల మీద శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఇలా మా పత్రిక కోసం కొంత మంది ఉద్యోగులను మేము తయారుచేసుకోవటం జరిగింది. వారే మా సంస్థ బలం' అని అన్నారు.

అప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిగారు ఈ పత్రిక ప్రారంభ దినోత్సవ రోజున మాట్లాడుతూ 'ఈ సూర్య దినపత్రిక బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతికి తోడ్పడుతుంది. ఎంతో మంచి సంపాదకీయాలతో, మంచి వ్యాసాలతో, మంచి సమీక్షలతో ప్రజల జ్ఞాన జ్యోతిని వెలిగిస్తుం'దని అన్నారు.

ప్రభుత్వం ప్రజలకోసం ప్రవేశపెడుతున్న పథకాలను, ప్రజల వద్దకు తీసుకుపోయే వాహకంగా సూర్య పత్రికను వై.యస్. రాజశేఖర్ రెడ్డిగారు అభివర్ణించారు.

అలాగే కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) స్టేట్ యూనిట్ సెక్రటరీ కె. నారాయణగారు, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) స్టేట్ యూనిట్ సెక్రటరీ బి.వి. రాఘవులుగారు ఈ పత్రికను ఉద్దేశించి 'ప్రజల కష్టాలను తారతమ్య భేదం లేకుండా పత్రికలో ప్రచురించా'లని

కోరారు. సూర్య పత్రిక గురించి కె.సి.ఆర్.గారు 'పత్రికలకి సంచలనాత్మకమైన వార్తలను ప్రచురించడంలో ఉండే ఆసక్తి ప్రజల సమస్యలను పరిష్కరించే వార్తలను ప్రచురించడంలో ఉండాలి' అన్నారు. బండారు దత్తాత్రేయగారు 'వార్త ప్రచురించే సమయంలోగాని, వార్తలను స్వీకరించే సమయంలోగాని పక్షపాత ధోరణి వ్యవహరించకూడదు' అని చెప్పారు. తరువాత సూర్య దినపత్రిక వ్యవస్థాపకుడు నూకారపు సూర్యప్రకాశరావుగారు మాట్లాడుతూ 'ప్రజల అంచనాలకు, మా అంచనాలకు తగ్గట్టుగానే పత్రిక పనిచేస్తుం'దని అన్నారు.

## 1.2. సమకాలీన తెలుగు దినపత్రికలు – సాహిత్య పుటల నేపథ్యం:

ప్రపంచవ్యాప్తంగా ముద్రణ యంత్రాల స్థాపన పత్రికా రంగ ఆవిర్భావానికి కారణమైంది. అయితే, ముద్రణ యంత్రాల వాడకం మొట్టమొదట యూరప్ ఖండంలో ప్రారంభమై ఆ తర్వాత విశ్వవ్యాప్తమైనది. 1439–1449 మధ్య ప్రాంతంలో జాన్ గూటన్‌బర్గ్ జర్మన్‌లోని స్ట్రాస్‌బర్గ్ పట్టణంలో ముద్రణ యంత్రాన్ని తయారుచేసి వాడుకలోకి తీసుకొని వచ్చారు. తొలిసారిగా 1450 సంవత్సరంలో గూటన్‌బర్గ్ ఒక జర్మన్ కవితను కాగితం అచ్చు వేశాడని, దీంతో తొలి ముద్రాపకుడు కూడా గూటన్‌బర్గేనని చరిత్రకారులు, పరిశోధకులు విశ్వసిస్తున్నారు. అచ్చువేసిన జర్మన్ కవిత విజయవంతంగా అచ్చు కావడంతో బైబిల్ ముద్రించడం ప్రారంభించారు. తొలి బైబిల్‌ను పూర్తిగా ముద్రించడానికి బర్గ్‌కు మూడేళ్ళు (1452–1455) పట్టింది. దీనికే 'గూటెన్‌బర్గ్ బైబిల్', '42 బైబిల్ లేన్' అని పేర్లు. ఈ బైబిల్‌ను బర్గ్ పేజీకి 42 లైన్ల చొప్పున 1272 పేజీలతో లాటిన్ భాషలో 180 కాపీలను అచ్చువేశారు. వీటిలో ప్రస్తుతం ప్రపంచం మొత్తం మీద 48 కాపీలే మిగిలి ఉన్నాయి. పారిస్‌లోని వార్డినల్ మెజారిన్ గ్రంథాలయంలో మనం చూడవచ్చు.

కానీ ప్రపంచంలోనే తొలి ముద్రణగా భావించబడుతున్న 'డైమండ్ సూత్ర'ని క్రీ.శ. 868 చైనా దేశంలో ముద్రించారని చెన్నయ్య, జె (1998:పుట:2) పేర్కొన్నారు. అయితే దానిని ముద్రించింది ఎవరు అనే విషయాన్ని మాత్రం పేర్కొనలేదు. కాబట్టి ఇప్పటి వరకు లభించిన చరిత్ర ఆధారాల ప్రకారం తొలి ముద్రాపకుడు జాన్ గూటన్‌బర్గ్.

అనంతర కాలంలో ముద్రణ యంత్రాలు ఇతర దేశాలలో విస్తరించాయి. అలాగే భారతదేశంలో కూడా. క్రీ.శ.1556 నుంచి దాదాపుగా తీర ప్రాంతాలన్నింటిలో ముద్రణ యంత్రాల స్థాపన జరిగింది. భారత్‌లో జెసూట్ మిషనరీలు మొట్టమొదట ముద్రణ యంత్రాన్ని గోవాలో స్థాపించి, దీని ద్వారా మత వ్యాప్తికి సంబంధించిన వాటిని ముద్రించారు. దీనిని బట్టి భారత దేశంలో మొట్టమొదట ముద్రణ సెయింట్ జేవియర్ రచించిన డౌట్రినా క్రిష్టా అని చెన్నయ్య, జె (1988: పుట:4) తెలియజేశారు. క్రమంగా మత గ్రంథాలు మొదలగు వాటిని తెలుగు, బెంగాలీ, అరబ్బీ తదితర భాషలలో వెలువరించేవారు. ఆ తరువాత కొంత కాలానికి (1761) మద్రాసుతోపాటు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల్లో ముద్రణ యంత్రాల స్థాపన జరిగింది. తెలుగులో మొట్టమొదట ముద్రణ 'మోక్షానికి కొంచుపోయే దోవ' అనే పుస్తకంతో ప్రారంభమయ్యింది. ఆ తర్వాత మతవ్యాప్తి, స్థానిక సమాచార వ్యాప్తి, విద్యావ్యాప్తి మొదలైన లక్ష్యాలను సాధించే దిశగా ప్రయత్నాలు మన రాష్ట్రంలో జరిగాయి. ఈ విధంగా భారతీయ పత్రికా రంగం వేగం పుంజుకుంది.

తెలుగు పత్రికా రంగానికి 174 ఏళ్ళ చరిత్ర ఉంటే అందులో తెలుగు దినపత్రికా వ్యవస్థకు 112 ఏళ్ళ చరిత్ర ఉంది. 20వ శతాబ్దం రెండవ దశకంలో జాతీయోద్యమం ప్రారంభమైంది. ఈ జాతీయోద్యమ కాలంలో మిగతా పత్రికలతోపాటు దినపత్రికల పాత్ర కూడా ప్రశంసనీయమైనది. ఈ కాలం దినపత్రికలు ఒకవైపు దేశంలోనే సమస్యలను చిత్రిస్తూనే మరొక వైపు స్వాతంత్ర్యాన్ని సాధించడమే ధ్యేయంగా సామాజిక, రాజకీయ, తదితర వార్తాంశాలను ప్రచురించి ప్రజలను చైతన్యపరిచేవి. ఈ మధ్య కాలంలో మూడు దినపత్రికలు వెలువడ్డాయి. అవి: 1) ఆంధ్ర ప్రకాశిక (1885), 2) ఆంధ్ర పత్రిక (1908), 3) వృత్తాంతం (1916). ఇలా స్వాతంత్ర్య ఉద్యమకాలంలో ప్రారంభం అయిన తెలుగు దినపత్రికలు. అనతికాలంలో అభివృద్ధి పదుల సంఖ్యలో పత్రికలు అవడం మనం గమనించవచ్చు. 1951–1960లో దాదాపు ఎనిమిది దినపత్రికలు వెలువడ్డాయి అవి: 1) విశాలాంధ్ర (1952), 2) ఆంధ్ర జనత (1958), 3) రాజమండ్రి సమాచారమ్ (1964), 4) ముందడుగు (1958), 5) ఆంధ్రజ్యోతి (1960), 6) ఆంధ్రభూమి (1960), 7) ఆంధ్రరత్న (1960–1961), 8) ప్రజాప్రభ (1960). 1951–1960 మధ్య

కాలంలో దినపత్రికలలో చెప్పుకోదగిన మార్పులు సంభవించాయి. మాండలిక భాష నుంచి పదాలు స్వీకరించి తెలుగు భాషను ప్రామాణీకరించే ప్రయత్నం జరిగింది. అంతేకాకుండా ఆధునిక పత్రికా సంప్రదాయాలను పుణికి పుచ్చుకుంటూ, వాడుక భాషను ప్రచురిస్తే దినపత్రికా రంగం మరో అడుగు ముందుకు వేసింది. ఈ దశాబ్ద కాలంలో ఇంతటి నిత్య నూతనత్వాన్ని కల్పించిన ఘనత నార్ల వెంకటేశ్వరరావుగారికే దక్కుతుంది.

తెలుగులో 1901–2015 వరకు ఎన్నో దినపత్రికలు వచ్చాయి. ప్రతి పత్రికకు తనదైన శైలి, లక్ష్యాలు ఉన్నాయి. ఈ పత్రిక గొప్పది, ఆ పత్రిక గొప్పది కాదు అని చెప్పలేం. ఏ పత్రికకు ఉండవలసిన విశిష్టత ఆయా పత్రికలకు ఉన్నది. ఆ పత్రికల వివరాలను కింది పట్టికలో గమనించవచ్చు.

**1901 – 1950 మధ్యలో కొన్ని పత్రికలు**:

| | | |
|---|---|---|
| 1. | దేశాభిమాని | 1901 |
| 2. | శశిలేఖ | 1910 |
| 3. | గౌతమి | 1908 |
| 4. | ఆంధ్ర ప్రకాశిక | 1916 |
| 5. | ఆంధ్ర పత్రిక | 1914 |
| 6. | వృత్తాంతం | 1916 |
| 7. | నర్వదీపిక | 1916 |
| 8. | వార్తా | 1925 |
| 9. | జనవాణి | 1925 |
| 10. | ఆంధ్రప్రభ | 1938 |
| 11. | తెలంగాణ | 1941–1942 |
| 12. | ప్రజాశక్తి | 1945 |
| 13. | మీడాన్ | 1943–1944 |
| 14. | గోల్కొండ | 1947 |
| 15. | విజయ ప్రభ | 1950 |

**1951 – 2014 మధ్యకాలంలో వెలువడిన పత్రికలు**:

| | | |
|---|---|---|
| 1. | విశాలాంధ్ర | 1952 |
| 2. | ఆంధ్ర జనత | 1955 |
| 3. | రాజమండ్రి సమాచారమ్ | 1956 |

| | | |
|---|---|---|
| 4. | ముందడుగు | 1958 |
| 5. | ఆంధ్రజ్యోతి | 1960లో ప్రారంభం |
| 6. | ఆంధ్రభూమి | 1960లో ప్రారంభం |
| 7. | ప్రజాప్రభ | 1960 |
| 8. | ఆంధ్రరత్న | 1961 |
| 9. | రత్న గర్భ | 1964 |
| 10. | విజయభాను | 1966 |
| 11. | నవ్యాంధ్ర | 1973 |
| 12. | ఈనాడు | 1974లో ప్రారంభం |
| 13. | జనత | 1977 |
| 14. | వరంగల్ వాణి | 1980 |
| 15. | కోస్తా వాణి | 1983 |
| 16. | ఉదయం | 1984 |
| 17. | ఉజ్జ్వల | 1985 |
| 18. | జీవగడ్డ | 1985 |
| 19. | బహుజన | 1991 |
| 20. | వార్త | 1996లో ప్రారంభం |
| 21. | తణుకు పబ్లిసిటీస్ | 1988 |
| 22. | సూర్య | 2007లో ప్రారంభం |
| 23. | సాక్షి | 2008లో ప్రారంభం |
| 24. | తహల్క | 2004లో ప్రారంభం |
| 25. | నమస్తే తెలంగాణా | 2011లో ప్రారంభం |
| 26. | నవ తెలంగాణా | 2015 |
| 27. | మన తెలంగాణ | 2015 |

పైన పట్టికలో ఇచ్చిన దినపత్రికల వివరాలను బట్టి నా పరిధి మేరకు ఇవ్వగలిగాను. 1901 నుండి 2015 దాకా వెలువడిన పత్రికలలో కొన్ని పత్రికలు కాలగర్భంలో కలిసిపోయాయి. కొన్ని కొత్త పత్రికలు ఆవిర్భవించాయి. అన్ని పత్రికల ముఖ్య లక్ష్యం ప్రజల వద్దకు వార్తలను తీసుకునిపోవడం, ప్రజల కష్టాలను ప్రభుత్వాలకు తెలియజేయటం, ప్రభుత్వాలు చేసే కుంభకోణాలు, వారి చేసే కుటిల రాజకీయాల గురించి విపులంగా రాసి ప్రజల వద్దకు వార్తలను చేర్చటం దినపత్రికల యొక్క ముఖ్య లక్ష్యం.

పత్రికలు ప్రపంచ వార్తలు, బిజినెస్ వార్తలు, షేర్ మార్కెట్ వార్తలు మొదలైనవాటిని కూడా ప్రచురించడం జరుగుతోంది. చలన చిత్రాల విషయాలు తెలుపటం, అలాగే క్రీడా రంగ వార్తలను తెలియజేయటం, అలాగే సంపాదకీయం అంటూ ప్రత్యేక వ్యాసాలను ప్రచురించటం జరుగుతున్నది. ముఖ్యంగా కొన్ని పత్రికలు వారి సర్క్యులేషన్ పెంచుకోవడం కోసం ఏడు రోజులకు ఏడు ప్రత్యేక అనుబంధాలను ప్రచురించడం మనం గమనించవచ్చు. దీనిలో ముఖ్యంగా దాదాపు అన్ని దినపత్రికలు సాహిత్య పేజీలను ప్రచురిస్తున్నాయి.

1866లో మార్చి 1న ప్రారంభమయి ఇప్పటికి దినపత్రికగా వెలువడుతున్న పత్రిక 'వార్త పత్రిక'. ఈ వార్తా పత్రికను ప్రవేశపెట్టింది A.B.K. ప్రసాద్ గారు. మొట్టమొదటి ఎడిటర్ కూడా ఆయనే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇది మొట్ట మొదటి దినపత్రిక.

### 1.2.1. వార్త:

వార్త దినపత్రికలో మాత్రం ప్రత్యేకంగా సాహిత్య పేజీని ఇవ్వడం లేదు. నేడు ఈ పత్రిక ప్రతిరోజు 'చెలి' శీర్షిక పేర మహిళలకు, 'మొగ్గ' శీర్షికలో బాలలకు వార్తాంశాలను, వార్త కథనాలను అందిస్తోంది. అలాగే విద్యార్థుల కోసం, ఉద్యోగ అభ్యర్థుల కోసం ప్రత్యేక వారాంతపు అనుబంధాన్ని 'కెరీర్' పేరుతో అందిస్తోంది. ఈ విధంగా 'వార్త' దినపత్రిక మిగతా పత్రికలలో సమానంగా విషయ వైవిధ్యంతో కూడిన వార్తా కథనాలను, వార్తాంశాలను ప్రచురిస్తూ తెలుగు దినపత్రికా రంగంలో కొనసాగుతుంది.

### 1.2.2. ఆంధ్రప్రభ:

ఈ పత్రికను 1938లో ప్రారంభించారు. ఈ పత్రికను 15 ఆగస్టు 1938న చెన్నయ్‌లో ప్రారంభించడం జరిగింది. ఈ పత్రిక వ్యవస్థాపకులు రామ్‌నాథ్ గోయింకా. 1942 నుండి నార్ల వెంకటేశ్వర రావుగారు న్యూస్ ఎడిటర్‌గా పనిచేయడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటివరకు ప్రతి సోమవారం *సాహితీ గవాక్షం* అనే పేరు మీద సాహిత్య పేజీని ప్రచురిస్తున్నారు. మిగతా దినాలలో యువ, సిరిగమలు, చిత్రప్రభ అనే ప్రత్యేక అనుబంధాలు ప్రచురిస్తున్నారు.

### 1.2.3. ఆంధ్రజ్యోతి:

ఆంధ్రజ్యోతి మొట్టమొదట 01.07.1960లో ప్రారంభించబడింది. 30.12.2000– 14.10.2002 మధ్యకాలంలో పత్రిక ప్రచురింపబడలేదు. ఈ పత్రికకు మొట్టమొదటి సంపాదకుడు, హేతువాది అయిన నార్ల వెంకటేశ్వరరావు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త కె.యల్.యన్. ప్రసాద్ మరికొందరు కలిసి ఆంధ్రా ప్రింటర్స్ లిమిటెడ్ పక్షాన ఈ పత్రికను విజయవాడలో ప్రారంభించారు. మళ్ళీ 2002లో కొత్త యాజమాన్యంతో వేమూరి రాధాకృష్ణ సారధ్యంలో తిరిగి ప్రచురణ మొదలైంది. ఆంధ్రజ్యోతి పత్రికలో కూడా ప్రతి సోమవారం సాహిత్యానికి ఒక ప్రత్యేక పేజీని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ప్రతి ఆదివారం అనుబంధం, మంగళవారం దిక్సూచి (విద్య ఉద్యోగావకాశాల ప్రత్యేకం), బుధవారం సకల, గురువారం చింతన, శుక్రవారం వైద్యం, శనివారం సంస్కృతి.

## 1.2.4. ఈనాడు:

ఈనాడు ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక. తెలుగు పత్రికా రంగంలో ఒక ప్రత్యేక అధ్యాయం. వార్తలు సమర్పించడంలో కొత్త పుంతలు తొక్కి అశేష ప్రజల ఆదరాభిమానాలు పొందింది. తెలుగు పత్రికలలోనేకాక యావద్దేశంలో అత్యధిక ప్రజాదరణ పొందిన పత్రికలలో ఒకటిగా నిలిచింది. 10.08.1974 రోజున రామోజీరావుగారు విశాఖపట్నం శివార్లలోని సీతమ్మధార పక్కన గల నక్కవానిపాలెం అనే ఊరిలో ఈనాడును ప్రారంభించారు. ప్రముఖ పాత్రికేయుడు ఎ.బి.కె. ప్రసాద్ ఈనాడుకు ప్రారంభ సంపాదకుడు. కాని ఈనాడు పత్రికలో సాహిత్యానికి సంబంధించి ప్రత్యేక పేజీ అంటూ ఏమి లేదు.

## 1.2.5. ఆంధ్రభూమి:

ఆంధ్రభూమి పత్రిక దక్కన్ క్రానికల్ గ్రూపు నిర్వహణలో ఉంది. మద్రాసు నుండి 1932 సంవత్సరంలో ప్రారంభించబడి ఏడు ముద్రణా కేంద్రాలకు విస్తరించిన తెలుగు దినపత్రిక. దీనికి ఆంధ్ర శేషగిరిరావు సంపాదకులుగా ఉన్నారు. ఎం.వి.ఆర్. శాస్త్రి, గోరాశాస్త్రి, పండితారాధ్యుల నాగేశ్వరరావు, గజ్జెల మల్లారెడ్డి, ఎ.బి.ఎన్. ప్రసాదు, కె.ఎన్.వై. పతంజలి, సి. కనకాంబర రాజు సంపాదక బాధ్యతలు వహించారు. సామల రమేశ్ బాబు నిర్వహణలో 'నుడి' శీర్షికన తెలుగు భాషాభివృద్ధి వ్యాసాలు ప్రతి గురువారం వెలువడుతున్నాయి. అన్ని పత్రికలకంటే భిన్నంగా ఆంధ్రభూమిలో

ఇప్పటి (21/07/2016) వరకు రెండు రోజులు సాహిత్య పేజీలు వస్తున్నాయి అంటే ఒక దినపత్రిక తెలుగు సాహిత్యానికి ఇస్తున్న విలువలను అర్థం చేసుకోవచ్చు. ప్రతి సోమవారం *సాహితి* పేరు మీద సాహిత్యం రావడం జరుగుతోంది. అలాగే *అక్షర* పేరు మీద సాహిత్య పేజీ రావడం కూడా మనం గమనించవచ్చు.

### 1.2.6. సూర్య:

సూర్య దినపత్రిక అక్టోబర్ 21, 2007న హైదరాబాద్‌లో స్థాపించబడింది. సూర్య దినపత్రికను వెనుకబడిన తరగతుల వారి గొంతు రాష్ట్రంలో వినపడాలనే ఉద్దేశంతో నూకారపు సూర్యప్రకాశరావు ఈ పత్రికను స్థాపించారు. ఈ దినపత్రికను అప్పటి గవర్నరైన శ్రీ నారాయణ్ దత్ తివారీ ప్రారంభించారు. ఈ పత్రిక తెలుగు పత్రికలలో మొదటగా ప్రామాణిక యూనికోడ్ పద్ధతిలో అంతర్జాలంలో ప్రచురింపబడింది. ఈ పత్రిక అంతర్జాలస్థల సమాచారం 1.09.2010 నుండి శాశ్వత లింకులను కలిగి ఉన్నది. సూర్య దినపత్రికలో కూడా సాహిత్యానికి పెద్ద పీట వేయడం జరిగింది. ప్రతి సోమవారం అక్షరం శీర్షికన, సాహిత్య పేజీ వెలువరిస్తున్నారు.

### 1.2.7. సాక్షి:

సాక్షి దినపత్రిక సంపాదకులు వై.యస్. జగన్ యాజమాన్యం మరియు ప్రచురణకర్తలు జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్. దీని ప్రధాన కేంద్రం హైదరాబాద్. దీని స్థాపన జరిగిన సంవత్సరం 24.03.2008. ఈ పత్రికను రూపకల్పన చేసింది అమెరికాకు చెందిన మారియో గాసియా. మొట్ట మొదటిసారిగా తెలుగు దినపత్రికా రంగంలో అన్ని పేజీలు రంగులలో ముద్రణ చేసిన చరిత్ర సాక్షిదే. ఇతర దినపత్రికల ప్రాంతీయ ఎడిషన్లు చిన్న సైజులలో వస్తూంటే, దీనిలో పెద్ద సైజులో వెలువడుతున్నాయి. సజ్జల రామకృష్ణారెడ్డి సంపాదకీయ సంచాలకునిగా, కె. ఎన్. వై. పతంజలి వ్యవస్థాపక సంపాదకునిగా మొదలైంది. పతంజలి అకాల మరణంతో, వర్ధెల్ల మురళి సంపాదకునిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎడిటోరియల్ డైరక్టరుగా రామచంద్రమూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### 1.2.8. నమస్తే తెలంగాణ:

నమస్తే తెలంగాణ మన పత్రిక, మన ఆత్మగౌరవం అనే ఉప శీర్షికన వెలువడుతోంది. ఈ పత్రిక స్థాపన 06.06.2011న జరిగింది. తెలంగాణ ప్రాంతంలోని ఏడు జిల్లాల నుండి ఇది ప్రచురించబడుతోంది. ఈ పత్రిక తెలంగాణ ప్రాంతపు సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తోంది. తెలంగాణ ప్రత్యేక ఉద్యమానికి ఈ పత్రిక మద్ధతు పలికింది. ప్రముఖ జర్నలిస్టు అల్లం నారాయణ ఈ పత్రిక చీఫ్ ఎడిటర్. *ప్రాణహిత* శీర్షికన 4వ పేజీలో సంపాదకీయం ప్రచురించబడుతుంది. నమస్తే తెలంగాణ పత్రికలో *చెలిమి* పేరు మీద సాహిత్య పేజీ వెలువడుతోంది.

## 1.2.9. నవ తెలంగాణ:

ఈ పత్రిక స్థాపన 21.03.2015న జరిగింది. ఈ పత్రికా సంపాదకులు యస్. వీరయ్య. ఈ పత్రిక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ప్రజాశక్తిగాను, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తరువాత నవ తెలంగాణ పత్రికగా ఆవిర్భవించింది. ఈ పత్రికలో కూడా ప్రతి సోమవారం *కలం* పేరుతో సాహిత్య పేజీ రావడం జరుగుతుంది (Source by www.manatelangana.news).

## 1.3. సూర్య దినపత్రిక ఆశయాలు – లక్ష్యాలు:

ముఖ్యంగా అన్ని పత్రికలు సమాజంలో జరుగుతున్నటువంటి అవినీతిని బట్టబయలు చేయడానికి వచ్చినవే. కానీ, కొన్ని పత్రికలు మాత్రం ఒక ప్రత్యేక భూమిక మీద రావడం జరిగింది. ఉదాహరణకు “నమస్తే తెలంగాణ” పత్రిక తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ తెలంగాణలో జరుగుతున్న ఉద్యమాన్ని భూమికగా చేసుకొని వచ్చిన పత్రిక. అలాగే “నవ తెలంగాణ” పత్రిక కూడాను. అలాగే నేను పరిశోధనకు తీసుకున్న పత్రిక “సూర్య”. ఈ పత్రిక కూడా కొన్ని ఆశయాలు, లక్ష్యాలు పెట్టుకొని పత్రికా రంగంలోకి అడుగు పెట్టడం జరిగింది. అణగారిన ప్రజలు ఎక్కడైతే ఉన్నారో వారి కష్టాలు తెలుసుకొని వారి గొంతుకగా మారుతాం అని, మరీ ముఖ్యంగా బి.సి.ల అభ్యున్నతి కొరకు పాటుపడుతాం అని సూర్య పత్రిక అధిపతి నూకారపు సూర్యప్రకాశరావుగారు ప్రకటించడం జరిగింది. ఈ పత్రిక స్థాపించడంలో ముఖ్య ఉద్దేశాలు:

1) రాజకీయాలలో జరుగుతున్న అవినీతిని ప్రజల వద్దకు తీసుకుపోవడం.

2) సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న అన్యాయాలను పసిగట్టి ఈ పత్రిక ద్వారా ప్రభుత్వాలను నిలదీయడం.

3) ఏ రాజకీయ పార్టీకి కొమ్ము కాయకుండా, నిజాయితీగా, నిబద్ధతతో పనిచేయడం.

4) ఈ పత్రిక ద్వారా సమాజ స్థాపనకు తగిన కృషి చేయడం.

5) ఈ పత్రిక ద్వారా తెలుగు సాహిత్యానికి తోడ్పడడం.

***

# అధ్యాయం – 2
# సూర్య దినపత్రిక సాహిత్య పుటలు – కవిత్వం: విశ్లేషణ

## 2.1. పరిచయం:

ఆధునిక సాహిత్యంలో చెప్పుకోదగిన ప్రక్రియల్లో కవిత్వం ముందు వరుసలో ఉంటుంది. కాలం మారుతున్న కొద్దీ, తద్వారా కవిత్వంలోనూ కూడా అనేక మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. ఆధునిక కవిత్వానికి ఆద్యుడు, మూల పురుషుడు కందుకూరి వీరేశలింగం గారని చెప్పవచ్చు. ఆయన తరువాత తెలుగు కవిత్వాన్ని తన ముత్యాల సరాలతో ముంచెత్తినవారు గురజాడ. ఆయన ఆధునిక కవిత్వానికి గట్టి పాదులు వేశారు. గురజాడ ముత్యాలసరాలు రాసే నాటికి ఆధునిక కవిత్వం ఒక నిర్దిష్ట రూపాన్ని సంతరించుకోకపోయినా, ఆయన వేసిన మార్గమే నేటి కవిత్వం ఇన్ని పుంతలు తొక్కడానికి కారణం అయ్యింది. గురజాడ అప్పారావు ముత్యాల సరాలతో గేయంగా ప్రారంభమయి ఆధునిక కవిత్వం ఎప్పటికప్పుడు తన స్వరూపాన్ని మార్చుకుంటూ, అనేక రంగులు పులుముకుంటూ, నూతన భావాలతో, కొత్త కొత్త ప్రక్రియలతో ఆకాశంలో సూర్యుడిలా నిరంతరం వెలుగుతూనే ఉంది.

## 2.2. ఆధునిక కవితా శాఖలు:

కాలానికి అనుగుణంగా మారుతూ వచ్చిన కవిత్వంలో అనేక వాదాలు బయలుదేరాయి. ఇవి అన్నీ కూడా కవిత్వ పటిష్ఠతకు తోడ్పడ్డాయి. అలాంటి కవిత్వానికి సమాజం శ్రేయస్సే పరమావధిగా మారింది. కవిత్వం స్థూలంగా అంతా ఒకే రకంగా కనిపించినా దాని స్వరూప స్వభావాల్లో మార్పు ఉంటుంది.

ఈ విధంగా ప్రారంభమైన తెలుగు కవిత్వం అనేక ప్రక్రియలుగా మారుతూ వచ్చింది. నూతనంగా వస్తున్న కవిత్వ ప్రక్రియలకు దినపత్రికలు ఊతం ఇచ్చాయి, ఇస్తున్నాయి. తెలుగు దినపత్రికలు ప్రారంభ కాలంలోనే నూతన కవితా ప్రక్రియలు అప్పుడే పురుడు పోసుకుంటున్నాయి (1901). దీంతో ఆధునికతను అంది పుచ్చుకున్న తెలుగు దినపత్రికలు ప్రారంభంనుంచే ఆధునిక కవిత్వానికి పెద్ద పీట వేశాయి. కవిత్వాన్ని ప్రజలకు చేరువ చేయడానికి నడుం కట్టాయి.

తరువాతి కాలంలో దినపత్రికలు కేవలం కవిత్వానికే కాక, తెలుగు సాహిత్యంలోని అన్ని రకాల ప్రక్రియలకు స్థానమిచ్చి ఆ సాహిత్యం ప్రజలకు చేరువ కావడానికి వాహికలుగా పనిచేశాయి. ఏదైనా ఒక సంఘటన జరిగిన తరువాత దానిమీద స్పందించి కవిత్వం లేదా వ్యాసం రాస్తే, అది పుస్తక రూపం దాల్చడానికి, తరువాత ప్రజలకు చేరువ కావడానికి కొంత

సమయం పడుతుంది. కాని పత్రికలలో మాత్రం వెనువెంటనే ఆ సంఘటనల మీద కవితలు గాని, వ్యాసాలు రావడం జరుగుతుంది. దీని ద్వారా అతి తక్కువ సమయంలో విషయం ప్రజలకు అందుతోంది.

నాటి నుంచి నేటి వరకు తెలుగు దిన పత్రికలు సాహిత్యం ద్వారా సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూన్నే వస్తున్నాయి. అయితే, సాంకేతిక, ఆధునికతలతో మిళితమైన నేటి కాలపు దిన పత్రికల్లో ఎలాంటి కవిత్వం అచ్చు వేయబడుతుంది? అలా వెలువడుతున్న కవిత్వం సమాజాన్ని ఎలా ప్రతిబింబిస్తుంది? అది సమాజానికి ఎంత వరకు ఉపయోగపడుతుంది? కవిత్వం ప్రజల జీవితాల మీద, సమాజం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? అన్నది ముఖ్యమైన అంశం.

పైన నేను పేర్కొన్న అంశాలను దృష్టిలో పెట్టుకొని జనవరి 2011 నుండి డిసెంబర్ 2011 వరకు సూర్య దినపత్రికలోని *అక్షరం* పేరున ప్రచురితమైన కవితలను వాటిలోని విషయం ఆధారంగా కింది విధంగా విభజించి, విశ్లేషించడం జరిగింది.

1) భావ కవిత్వం
2) అభ్యుదయ కవిత్వం
3) విప్లవ కవిత్వం
4) ఉద్యమ కవిత్వం
5) అనుభూతి కవిత్వం
6) స్త్రీవాద కవిత్వం
7) దళిత కవిత్వం
8) ప్రపంచీకరణ కవిత్వం

## 2.2.1. భావ కవిత్వం:

భావకవిత్వం అన్నది ఒక్కసారి ఉద్యమంలా వచ్చిన కవిత్వం కాదు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులో ప్రవేశించింది. ఆంగ్లంలో దీనిని కాల్పనికోద్యమ కవిత్వంగా చెప్పుకోవచ్చు. ఆంగ్ల సాహిత్యంలో కాల్పనిక ఉద్యమం 1798లో వర్డ్స్‌వర్త్, కాలరిడ్జ్‌ల “లింకల్ బాలడ్స్” ప్రచురణతో ప్రారంభమయినట్లుగా కొందరు విమర్శకుల అభిప్రాయం. కానీ కాల్పనిక కవిత అన్నది ఆంగ్ల సాహిత్యంలోనూ హఠాత్సంఘటన కాదు. ఎలిజబెత్ కాలంనాటి సాహిత్యంలో ఈ కాల్పనిక ధోరణి కనిపిస్తుంది.

వెల్చేరు నారాయణరావు భావకవిత్వమనేది కథా సన్నివేశ రహితమైనదనీ ఇందులో ఎవరు? ఎందుకు? ఏం జరిగింది? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకదని కేవలం భావమే ప్రధానం అని అన్నారు. ఆంగ్లంలో కాల్పనిక కవిత్వం తెలుగులోకి వచ్చేసరికి భావకవిత్వంగా రూపొందిం. 19వ శతాబ్దంలో తెలుగులోకి భావకవిత్వం ప్రవేశించినది. ఈ

కవిత్వాన్ని అప్పటి సంప్రదాయవాదులు దీనిని నిరసించడం జరిగింది. ఈ కవిత్వానికి ఒక ఉద్దేశం లేదని అన్న కవులూ లేకపోలేదు. ఆ కాలంలో కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, అక్కిరాజు ఉమాకాంత పండితులు ఆ తరువాత కాలంలో రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, బసవరాజు అప్పారావుగారు వీరందరూ భావకవిత్వాన్ని ఒక గొప్ప స్థాయిలో నిలబెట్టారు. ఆ తరువాత కాలంలో భావకవిత్వం ఒక ఉద్యమంలాగా మారి కవిత్వంలో గొప్ప స్థాయిని సంపాదించుకుంది. **కోకిలా కోకిలా కూయబోవే**

**గుండెలూ బద్దలూ చేయబోవె (బసవరాజు)**

ఇలాంటి కవిత్వంతో భావకవులు అప్పటి కాలంలో ఒక గొప్ప ఉద్యమాన్ని సృష్టించారు. అలాంటి కవిత్వానికి పత్రికలూ పెద్ద పీట వేశాయి. ఇప్పటికీ వేస్తున్నాయి. అటువంటి వాటికి సూర్య పత్రిక మినహాయింపు కాదు. కవిత్వానికి కావాల్సిన ప్రాధాన్యతను ఇచ్చి, విస్తృత వ్యాప్తిలోకి తీసుకొని రావడానికి సూర్యపత్రిక ఇతోధికమైన కృషిని చేస్తోంది. అందులో భావ కవిత్వానికి కూడా అగ్ర తాంబూలమే అందుతోంది. అదే స్ఫూర్తితో నేటి దినపత్రికలు చాలా కూడా భావకవిత్వాన్ని ప్రచురిస్తున్నాయి.

సూర్య పత్రికలో కవి ఎలనాగ 'శకలాలు' అన్ని శీర్షికన ఒక భావకవిత రాశారు.

**ఆకాశపు పళ్ళెంలో**
**రజత నాణెం చందమామ**
**తారకలు శ్వేతాక్షతలు**
**దిగంబర వృక్షాల దేహాలమీద**
**చిగురల పువ్వుల చీరలుచుట్టి**
**సింగారించిన వసంత రాణి**

**మబ్బు పరదాల మాటున**
**ఆకాశ సుందరి కళ్ళు**
**అస్రు పూరితాలై**
**ఈ వాన**

**అడవి కన్నె కప్పుకున్న**
**అందమైన హరిత వస్త్రం**
**అంతులేని చైతన్యానికి**
**అచ్చమైన సంకేతం**
**..........................**

**కృతజ్ఞతా భారంతో**
**శిరసువంచిన వరిపైరు**
**శతధా శ్రమించిన రైతులకు**
**తృప్తినిచ్చే నీరు**
**ప్రాణచైతన్య పత్రహరితాన్ని**
**ప్రతి అణువులో నింపుకున్న**
**ప్రణవమూర్తి చెట్టు (సూర్య – అక్షరం, ఆగస్టు 22, 2011)**

కవి మంచి ఊహ చేశారు. ఆకాశాన్ని పళ్ళెంలాగా, చందమామను వెండి నాణెంలాగా, నక్షత్రాలను తెల్లని తలంబ్రాలులాగా వర్ణించారు.

**కృతజ్ఞతా భారంతో**
**శిరసు వంచిన వరిపైరు**
**శతధా శ్రమించిన రైతులకు**
**తృప్తినిచ్చే నీరు**

పై పంక్తులను గమనిస్తే కవి సూక్ష్మ పరిశీలన అవగతమవుతుంది. వరి కోతకు వచ్చిన తరువాత గింజల భారాన్ని మోయలేక ఆ వరి ఎన్నులు కిందకు వంగుతాయి. దానిని కవి ఆరుకాలం కష్టపడ్డ రైతుకు ఆ వరి కృతజ్ఞతా భారంతో తల వంచినదని రాయటం చాలా గొప్ప విషయం. ఎంతో సునిశిత పరిశీలన చేస్తే తప్ప ఈ వాక్యాలు రావు.

ఆశారాజు అలనాటి చందమామ కవితను ఈ కింది విధంగా చెప్పారు.

**ఆ రోజులు**
**మళ్ళీ వచ్చేనా**
**ఆ వేసవి రాత్రులు**
**తిరిగి దొరికేనా**
**అలనాటి చందమామ**
**కలగా కమ్మగా కురిసేనా!**
**గాలిలో లీలగా సాగేపాట**
**మధురంగా మంత్రంగా సే**
**నిలువునా గుండెకోసెనా!**

**(సూర్య – అక్షరం, సోమవారం, 5/08/2011)**

కవి చందమామను జరిగిపోయిన కాలానికి ప్రతీకగా తీసుకొని చెప్పడం జరిగింది. అప్పటి రోజులలో అనుభవించిన వేసవి రాత్రులు. అలనాటి చందమామ మళ్ళీ తిరిగి వస్తాయా అన్న ఆవేదనను ప్రతి పదంలో పొందుపరిచారు.

**ఎన్నిటిని వదులుకున్నాం**
**ఎన్నిని పోగొట్టుకున్నాం**

**ఎనెన్ని ఆటుపోట్లను స్వీకరించాం**
**ఎలాంటి అనుభవాల్ని పొందాం**
**ఎన్ని గుణపాఠాల్ని నేర్చుకున్నాం**
**ఎంత గొప్ప విలువల్ని కాపాడుకున్నాం**

అంటూ కవి కళ్ళ ముందు ఆయన పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ పై పంక్తులు రాశారు. అప్పుడు ఎన్నో పనులు చేశాం, ఎన్నో ఒడిదుడుకులను అనుభవించాం అంటూ కవి చెప్పడం జరిగింది.

**నడక నేర్పిన చేయి జారిపోయింది**
**గొడుగు లాంటి నీడ చెరిగిపోయింది**
**చినుకులా తడిపిన కాలం**
**కనుకోలకుల్లో నిలిచిపోయింది**

పై పంక్తులలో జరిగిన కాలంలో ఆయన కోల్పోయినటువంటి వాటిని స్మరిస్తూ ఈ కవితా రూపంలో తన గత స్మృతులను కవి నెమరు వేసుకొన్నారు.

ఎస్.ఆర్. భల్లం ఉగాది పండగను పురస్కరించుకొని 'సర్వజన హృదయాహ్లాది' అనే కవితను రాశారు.

**ఉగాది**
**పాతలో కొత్తది**
**కొత్తలో పాతది**
**ప్రకృతి పత్రంమీద ఆకుపచ్చనది!**
**కోకిల చిగురువేదికపై వెదజల్లిన**
**కుగ్ర కుగ్ర సంగీతమౌతుంది**
**పూబాల –**
**గాలిపుప్పొడి నలగుపెడుతూ**
**పరిమళం గుట్టు విప్పుతుంది**
**ఇదొక దృశ్యావరణం**

ఉగాది వచ్చే సమయానికి ప్రకృతి కొత్త చీర కట్టుకొని ఉగాదికి స్వాగతం పలుకుతుందని, వాతావరణం మొత్తం ఆహ్లాదభరితంగా ఉంటుందని కవి అభిప్రాయం.

'ప్రభాత వేళ' అన్న శీర్షికన తవ్వా ఓబుల్‌రెడ్డి ఒక కవిత రాశారు.

**పున్నమి వెన్నెలలో తడిచి తడిచి**
**ముద్దుగా ముడుచుకొని ఉంటుంది పల్లె**

**వేటకోసం లేచిన వేకువ పిట్టలు**
**వేగుచుక్క దిశగా గాలిలో పాడుతూ ఉంటాయి**

**తరతరాల విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నట్లుగా పల్లెనలు చెరుకులా కోడికూతలు**

**(సూర్య – అక్షరం, 5/12/2011)**

కవి ఒక గొప్ప వాక్యంతో ప్రారంభించారు. పున్నమి వెన్నలలో తడచి తడచి ముద్దుగా ముడుచుకొని ఉంటుంది పల్లె.

తవ్వా ఒబుల్‌రెడ్డిగారు పై కవితలో ఒక్కసారి పల్లె జీవితాన్ని మొత్తాన్ని కళ్ళ ముందు సాక్షాత్కరింపచేశారు. పల్లె జీవనం అంటే అక్కడ నివసించే జనమే కాదు, వారి జీవితాలతో పెనవేసుకొన్న పక్షులు కూడా. వారి జీవనంలోని ఒక భాగమే వేకువ జాము అయిందని, పల్లెను నిద్రలేపే కోడి, రాత్రి గ్రామాలకు కాపలాదారులుగా ఉండే గ్రామ సింహాలు (కుక్కలు), మేతకు పోతున్న ఎద్దులు... మొదలైన వాటిని కవి పల్లె జీవనంలో భాగంగా వర్ణించారు.

## 2.2.2. స్మృతిగేయం:

స్మృతి గేయం అనే మాట ఆంగ్లభాష పదమైన ఎలిజీ (Elegy) అన్న పదానికి సమానార్థకంగా వాడుతున్నాం. మరణంవల్ల అప్తజన వియోగం కలిగినప్పుడు, ఆ వ్యక్తి గురించి రచించిన గేయాన్ని స్మృతి గేయం అనవచ్చు. ఇంగ్లీషులో ఎలిజీకి ఇంచుమించు ఈ విధమైన నిర్వచనమే ఉన్నది. The Elegy is a lyric expressive of melancholy or grief in particular, when commemorative of dead friend) (*ఆధునికాంధ్ర గేయకవిత్వం:పుట:217*). ఈ నిర్వచనంలో మిత్రస్మృతి అని ప్రత్యేకంగా పేర్కొని, ఆప్తులైన వారి మరణం పట్ల రాసిన కవిత్వాన్నే 'ఎలిజీ' అనవచ్చు. 'ఎలిజీ' ఒక ప్రత్యేక కావ్యశాఖగా అభివృద్ధి చెందింది భావకవితాయుగంలోనే.

భావకవితాయుగంలోనే మొట్టమొదట స్మృతి కావ్యం రచించింది రాయప్రోలు సుబ్బారావుగారు. గోపాలకృష్ణ గోఖలే మరణం వల్ల రాసిన ఖండకావ్యమిది. అయితే, అది పద్యంలో ఉన్నది. అంతకు పూర్వం విక్టోరియా రాణిపై స్మృతి గేయాలు రాసిన కవులు కొందరున్నారు. జీవితంలో శోకాన్నే దర్శించిన, శోకాన్నే కోరుకున్న భావకవులు శోకగీతాలు (స్మృతిగేయాలను) ఒక ప్రత్యేక శాఖగా వెలయించడంలో ఆశ్చర్యం లేదు. భావకవితాయుగంలో 'వరలక్ష్మిత్రిశతి', 'భగ్నహృదయము', 'మాతృగీతాలు' మొదలైనవన్ని ఉత్తమస్మృతి కావ్యాలే కానీ, అవన్నీ పద్యకావ్యాలు.

'కొన్ని క్షమాపణలు' అనే శీర్షికతో రామా చంద్రమౌళి ఎలిజీని రాశారు.

**అమ్మ కొట్టినప్పుడు**
**తలవంచుకొని**
**చేతులు కట్టుకొని నిలబడ్డ జ్ఞాపకమొస్తుంది**

**వెంటనే అమ్మ ఎందుకు ఏడుస్తుందో అర్థం కాదు**
**దుఃఖం సముద్రమై పిడికెడు గుండెలో తెలుస్తుంది**
**గాఢంగా నిద్రపోతున్నప్పుడు**
**చటుక్కున మెలకువవచ్చి**
**నాన్న గడ్డం గాజుపొడిలా చెంపలపై**
**గీసుక పోవడం జ్ఞాపక మొస్తుంది**
**కళ్ళు తెరువను**
**నాన్న స్పర్శ శరీరమంతా విద్యుత్తై జలదరింపజేస్తుంటుంది**
**ఏమిటో ఎందుకో అర్థం కాదు**
**................................................**
**................................................**
**రాజయ్య సార్ కూడా అంతే**
**ఎక్కాలను తప్పుగా చదివితే**
**పిర్రలను పగులగొట్టేవాడు**
**కాని సారంటే... గుడిలో దేవుడు**
**మొక్కాలనిపించేది**
**ఇప్పుడు వీళ్ళంతా ఏరి?**
**ఎందుకో దుఃఖం పొంగి పొంగి**
**నేను దారం తెగిన గాలిపటాన్నైపోతున్నా**
**కొన్ని క్షమాపణలు**
**నాపై చినుకులై వర్షిస్తున్నాయి**

కవి రాసిన పై కవితను గమనిస్తే తన జీవిత కాలంలో తనతో నడిచిన తన స్నేహితులు, తనను పెంచి పెద్ద చేసిన నాన్న, తనను దగ్గర కూచోబెట్టుకొని చదువు చెప్పిన రాజయ్య సార్ వీళ్ళంతా కనుమరుగు కావడం, వారిని గుర్తుచేసుకొని కవి దుఃఖ సాగరంలో మునిగి రాసిన కవితగా చెప్పుకోవచ్చు.

### 2.2.3. దేశభక్తి కవిత్వం:

భావకవిత్వం తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్న కాలంలో స్వాతంత్ర్యోద్యమం ఉత్కృష్టస్థాయిలో కొనసాగుతున్నది. కవులు తమ కవిత్వం ద్వారా తమ దేశభక్తి స్వాతంత్ర్యోద్యమ కాంక్షను తెలియజేస్తున్నారు. పుంఖానుపుంఖాలు కవిత్వాన్ని వెలువరిస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదురిస్తున్నారు. వారికి అప్పటి పత్రికలే ప్రధాన ఆకరాలయ్యాయి. వారు రాసిన కవిత్వాన్నంతటినీ నిరభ్యంతరంగా ప్రచురించేవి. వాటి మూలంగా అప్పటి కవులంతా విజయాన్ని సాధించగలిగారు. ఆ స్ఫూర్తి అప్పటి పత్రికల నుండి నేటి పత్రికలు పుణికి

పుచ్చుకొన్నాయి. దేశభక్తిని, స్వేచ్ఛను కోరుకొనే కవిత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

కటుకోఝ్వల రమేశ్ రాసిన "స్వాతంత్ర్యం నవ్వుతోంది" అనే కవిత అందుకు చక్కని ఉదాహరణ.

**బానిస బతుకుల్లోంచి**
**కష్టాల కాసారంలోంచి**
**బయట పడాలని**
**మనల్ని మనం**
**ఎన్నిసార్లు చంపుకున్నామో!**
**మరెన్ని సార్లు జన్మలెత్తామో! (సూర్య – అక్షరం, 15/08/2011)**

బ్రిటీష్ దాస్య శృంఖలాలనుండి మన భారతదేశాన్ని రక్షించుకున్న క్షణాల నుండి ఇప్పటివరకు ఎన్నిసార్లు చనిపోయామో, ఎన్ని సార్లు జన్మలెత్తామో! అని ప్రజలకు సమాజంలోని అనేక విషయాలపై ఎరుక కలిగించారు.

**అదిగో**
**ఉగ్రవాద**
**కులమతాల జల్లెళ్ళూ**
**మారణహోమాల భగభగలు**
**అన్ని జవాబు లేని దృశ్యాలే**

స్వాతంత్ర్యం వచ్చి 58 సంవత్సరాలు అయినా భారతదేశంలో 'ఉగ్రవాద అగ్నిపూలు' మండుతూనే ఉన్నాయి. ప్రజలు కాలిపోతూనే ఉన్నారు. కులమతాలకు అడ్డుగీతలు గీసేవాళ్ళే లేరు. అన్నీ మారణహోమాలే అని కవి ఒక వనంతో పోల్చడం జరిగింది.

**పిప్పరమెంట్లూ – చాకిలేట్లే కాదు**
**బాలల బంగారు భవితకు**
**అక్షర రుచుల్ని వడ్డిద్దాం**
**ఆకాశాన ఎగిరే త్రివర్ణ పతాకానికి**
**నిండారా సెల్యూట్ చేద్దాం...**

సంవత్సరం సంవత్సరం జరిగే స్వాతంత్ర్య దినోత్సవం, ఆ రోజు ఏదో జరిగింది. దేశమంతా సుభిక్షంగా ఉంది అనే చెప్పే రాజకీయ నాయకులు. చిన్న పిల్లలకు పిప్పరమెంట్ల రుచులే కాదు అక్షర రుచుల్ని వడ్డిద్దాం అని చెప్పటం కవి ఉద్దేశం. పిల్లలు బడికి వెళ్ళాలని, వాళ్ళ చేతులు కూడా నాలుగు అక్షరాలు దిద్దాలని, వారు కూడా గొప్పవాళ్లు కావాలని దేశ కీర్తి

కిరీటంలో వాళ్ళు కూడా కలికితురాళ్ళు కావాలని తన కవిత ద్వారా రమేశ్ ఆశావాహ దృక్పథాన్ని వెల్లడి చేశారు.

## 2.2.4. అభ్యుదయ కవిత్వం:

తెలుగు సాహిత్యంలో ఇప్పటి వరకు ఉన్న అన్ని ప్రక్రియలకన్నా అభ్యుదయవాదంకాని, అభ్యుదయం కవిత్వంగాని ప్రజలను ఎక్కువగా ఆలోచింపచేసిందనే చెప్పాలి. ఈ అభ్యుదయ కవిత్వం ప్రకృతిని చూసో, మనస్సు పరవశించో వచ్చింది కాదు పేదవాడి బాధలోంచి వచ్చింది. భాషలోనూ, భావనలోనూ, ఛందస్సులోనూ, ఆలోచనలలోనూ పూర్తిగా కొత్తదనాన్ని ప్రదర్శించి తెలుగు సాహిత్యంలోనే ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకొని వచ్చింది. యూరప్‌లోని అభ్యుదయవాద సాహిత్య ప్రభావం భారతీయ కవుల మీద పడింది. 1935 డిసెంబర్‌లో అలహాబాద్‌లో ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ ఏర్పడింది (*తెలుగు కవిత్యోద్యమాలు:పుట:108*). ఏప్రిల్ 9 – 10, 1936 తేదీల్లో లక్నోలో మున్షీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభలు జరిగాయి (*తెలుగు కవిత్యోద్యమాలు:పుట:108*). ఈ సభలో జాతీయ స్థాయి నుంచి ప్రాంతీయ స్థాయి వరకు అభ్యుదయ రచనలు సాగాలనే తీర్మానం జరిగింది. దీని ప్రభావంతో తెలుగులో తాపీ ధర్మరావుగారి అధ్యక్షతన తొలి తెలుగు అభ్యుదయ రచయితల మహాసభ తెనాలిలో 1934లో జరిగింది. ఇందులో శ్రీశ్రీ, అనిసెట్టి, సోమసుందర్, కుందుర్తి వంటి గొప్ప కవులందరూ పాల్గొన్నారు. ఇలా ప్రారంభమైన తెలుగు అభ్యుదయ సాహిత్యం మార్క్సిజం దృక్పథంతో దాదాపు రెండు దశాబ్దాలలోనే ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిందని చెప్పవచ్చు.

ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవుడికి సాహిత్యంలో స్థానం కల్పించినదీ అభ్యుదయ కవిత్వమే. శిష్ట్లా, పఠాభి, పురిపండా, అబ్బూరి, శ్రీశ్రీ, రోణంకి, నారాయణబాబు, ఆరుద్ర, దాశరథి, కాళోజీ మొదలగు కవులు తమ తమ పద్ధతుల్లో కాల్పనిక కవిత్వంపై తిరుగుబాటు చేసి అభ్యుదయ కవిత్వాన్ని పైకి తీసుకొని వచ్చారు. వారి ప్రేరణతో అభ్యుదయ భావజాలాన్ని తమ కవితారూపంలో కొనసాగిస్తున్నవారు నేటికీ అనేకులు ఉన్నారు. అటువంటి వారికి పత్రికలు వేదికలవుతున్నాయి. వారు సామాన్యుల గురించి రాసిన కవిత్వాన్ని సామాన్యులకు చేరవేయడంలో గురుతరమైన బాధ్యతను పోషిస్తున్నాయి.

సూర్యపత్రికలో ప్రచురితమైన కోట చంద్రశేఖర్‌గారి 'జైత్రయాత్ర' అన్న కవిత గమనిస్తే మనకు విషయం బోధపడుతుంది.

**ఆకాశం ఎర్రబడింది**
**అకస్మిక మేఘాల ఆత్మార్పణ చేరికతో**
**సమస్యలు సర్పాలుగా కాటేస్తే దుఃఖవివశత్వం**
**'రీలు' తెంపేసుకపోతావా?**
**ఒక జీవితకాల సిన్మా నాదని**
**రైలు పట్టాల మీద రక్తసిక్తమవుతావా?**
**ఒక సుదూర ప్రయాణాన్ని ఆపేసుకొని**
**నెర్రలు విచ్చిన నేలలో చినుకులు కురియవా?**
**బీటలు వారిని పొలాల్లో జలాలు పొంగి పొర్లవా**
**అధిగమిస్తే ఒత్తిడి**
**ఆలోచనలో పుత్తడి**
**వేధించాలన్న వ్యవస్థలలో**
**సాధించాలనే పట్టుదలే గెలుస్తుంది**
**ఏకాగ్రత లోపిస్తే**
**ఎడారే తోడై నీడై నిలుస్తుంది –**
**జీవితాన్ని కబళించడానికి**
**జరుగుతున్న ప్రయత్నంలో**
**పెనుగులాడు పోట్లాడు –**
**స్వీయ శక్తుల్ని సానబెట్టుకో**
**శక్తియుక్తులన్ని కూడబెట్టుకో**
**బిగుసుకునే ఉరితాడు వెంటాడే నీడకు**
**నీ మెడకు కాదు**
**వంటిట్లో కిరోసిన్ డబ్బా ఆత్మ న్యూనతకు**
**నీ దేహాన్ని కాదు**
**బహిష్కరించు**
**మత్తెక్కించే నిద్ర మాత్రలు;**
**మనో ఫలకాలపై ప్రగాఢ ముద్రలు**
**ఎక్కడైనా ఎప్పుడైనా**
**చీకట్లు లేని వెలుగులు**
**దుఃఖాలు లేని ఆనందాలు కల్లలు –**
**గెలుపూ ఓటమి**
**కవల పిల్లలు** **(సూర్య – అక్షరం, 7/11/2011)**

ఈ కవిత మొత్తాన్ని పరిశీలించినట్లైతే చిన్న చిన్న కష్టాలకు యువతగాని, పెద్ధలు ఎవరైనాగాని 'ఈ జీవితం వ్యర్థం. ఈ భూమి మీద ఈ కష్టాలను తట్టుకొని జీవించడం నావల్ల కాదు. మరణమే నాకు శరణ్యం' అంటూ ఆత్మహత్యలు చేసుకొంటూ ఉంటారు. వారిని ఉద్దేశించి రాసినది. అలాంటి వారికి కవి 'నీ శక్తి ముందు ఈ సమస్యలు చాలా చిన్నవి. నీవు కష్టపడి పనిచేస్తే నీకు ఏవి కావాలంటే అవి దొరుకుతాయి. అంతే తప్ప నీ జీవితాన్ని ఏ రైలు పట్టాలకూ అంకితం చెయ్యకు. ఏ ఉరి తాడుకో అప్పచెప్పకు. ఏ నిద్ర మాత్రలకో అర్పణం చెయ్యకు. నీ జీవిత యానానికి చుక్కానివి నీవే అంటూ హితబోధ చేశారు. ప్రేరణను ఇచ్చారు. కష్టాలు లేని జీవితాన్ని కాని సుఖాలు లేని జీవితాన్ని కాని చూడటం కల్ల'. జీవితం అంటే షడ్రుచుల సంగమం అని కవి ఉద్దేశం.

'ఒక బ్యూరోక్రాట్ స్వగతం' అంటూ డా॥ కొండపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్ కవితను రాశారు.

**కుంభకోణాలు కప్పెట్టుకునేందుకు**
**బొక్కసాలు నింపుకునేందుకు**
**వ్యవధి చాలక చస్తున్నప్పుడు**
**వసతి గృహాల సంక్షేమాలు ఏం చూడగలం**
**వార్డెన్లను ఆఫీసర్లను అదిలిస్తూ**
**హడావుడి చేయడం తప్ప (సూర్య – అక్షరం, 12/12/2011)**

కవి జరుగుతున్న అన్యాయాలను వ్యంగ్య ధోరణిలో చెప్పడం మనం పై పంక్తులలో గమనించవచ్చు. అధికారులకు డబ్బులు దోచుకోవడానికే సమయం లేదు, వసతి గృహాల బాగోగులు పట్టించుకోవడానికి సమయమెక్కడిది? అంటూ చురకలు అంటించడం ఈ కవితకే అందం.

**భూమి పుత్రా బినామీలకు సర్దుబాటు చేస్తూ**
**నగా నట్రా రహస్య స్థావరాలకు చేరుస్తూ**
**కిందా మీదా అవుతున్నప్పుడు**
**ఏ పిల్లకాయలో నేల మీద పాడుకున్నారంటే**
**చాలీచాలని దుప్పట్లో సతమతమవుతున్నారంటే**
**ఏమి చేయగలం!**

భూములను మింగేయడమే కాకుండా, ఆఖరికి వసతి గృహాలలోని విద్యార్థుల బియ్యం దగ్గర, వారికి పంచిపెట్టే దుప్పట్ల దగ్గర కూడా అధికారులు కక్కుర్తిని ప్రదర్శిస్తుంటే ఏమి చేయగలం అంటూ, ఒక నిస్సహాయ స్థితిలో ఉండి, కవిత ద్వారా తన ఆవేదనను తెలియజేశారు.

**ఈ నిక్కూ – పై టక్కూ**

**ఎప్పుడైనా కన్నారా – విన్నరా?**
**త్రీ–జీ స్పెక్ట్రమ్ వచ్చేసింది**
**పలకండంతా ముక్త కంఠంతో**
**భక్తి భావంతో తూర్పు తిరిగి**
**మేరా భారత్ మహాన్!**

కనీవిని ఎరుగని రీతిలో కుంభకోణాలు వెలుగు చూస్తుండడం, భారతదేశం అభివృద్ధి చెందే దేశాలతో ప్రథమ వరుసలో ఉందని రాజకీయ నాయకులు ముక్త కంఠంతో చెప్పడం, స్కాములు, స్కీములు బయటపడటం అన్ని శుభశకునాలే అని కవి తన బాధను చివరి రెండు పంక్తులలో ఒక వ్యంగ్య భావనతో తెలియజేశారు.

ఏరుకులపూడి గోపినాధరావుగారి 'ఆకలి' అనే కవితను గమనిస్తే మన సమాజం ఎలాంటి స్థితిలో ఉందో అర్థమవుతుంది.

**ఆకలి! ఆకలి! ఆకలి!**
**ఇది కలి ఆకలి! ఆకలి కలి!**
**దేవుడు దేహానికి ఆకలి పుట్టిస్తే**
**మనిషి మనస్సుకు ఆకలి సృష్టిస్తే**
**అంతరంగం అరిషడ్వర్గాలకు అంతులేని ఆకలి కల్పించింది!**
**క్షుధాతురాణాం నభయం నలజ్జా అనిపిస్తూ**
**క్షుద్రాతి క్షుద్ర విద్యలతో చెలరేగిపోతూ**
**కొడుకు కొడుకు కొడుకు తిన్నా తరగని సంపద కొండలను**
**కూడబెట్టి కుట్రలు పన్నుతున్నది!**
**వాములు మింగే స్కాములు స్వాములకు**
**వందకోట్ల పచ్చ గడ్డయినా పంటి కిందకు చాలడం లేదు**

**(సూర్య – అక్షరం, 22/08/2011)**

రాజకీయ నాయకులుగాని, ప్రభుత్వ ఉద్యోగులుగాని ఎవరని చెప్పగలం అందరూ అందరే దొరికినవాడు దోచుకుంటున్నాడు, దొరకనివాడు దోచుకోవడానికి ఎదురు చూస్తున్నాడు. సమాజంలో పెద్దవాడు చిన్నవాడిని, చిన్నవాడు ఇంకా చిన్నవాడిని దోచుకుంటూ తరతరాలు తిన్నా తరగని అస్తులు సంపాదించి బ్యాంకులలో భద్రం చేసుకొంటున్నారు.

**బడుగుజీవి ఆకలి కేకలు అరణ్యరోదనలవుతున్నాయి!**

**అత్యాశ పరుల ఆకలే అణగారినవారి కడుపు కొడుతున్నది**
**ఆకలి దయ్యాల అపరిమిత ఆకలే సంఘంలో**
**అసమానతలు సాగుతున్నది!**

అన్నంలేక బడుగుజీవుల ఏడుపులు ఏ ప్రభుత్వాలకు వినబడుతున్నాయి. వారి ఆకలి మంటల గురించి పట్టించుకునేదెవ్వరు. వందల కోట్లు సంపాదించినా చాలక ఇంకా ఇంకా అనే ఆశ బడుగు జీవుల బతుకులను ప్రశ్నార్థకం చేస్తుంది.

**పొదుగు కోసుకొని గానీ తృప్తి చెందని**
**తుచ్ఛమైన ఆకలి రోగాన్ని పోగొట్టే**
**అనువైన కాలం అతి త్వరలో అవతరిస్తుందని ఆశిద్దాం!**

అపరిమిత ఆకలిపరులు ప్రపంచమంతా తయ్యారై, ఉన్న పొదుగు కోసుకొని అంటే – ఉన్న మొత్తం సొమ్మును మూలల్లోకి పెకలించి తింటే గాని వాడి ఆకలి తీరదు. అలాంటివారు నానాటికి పెరిగిపోతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశారు.

'చీకటి కెరటం' అన్న కవితలో పులికొండ సుబ్బాచారిగారు ఇలా వ్రాశారు –

**ఒక చీకటి కెరటం**
**ఆ చివరనుండి ఈ చివరిదాకా**
**ప్రవహిస్తూ ఉంది**
**రైల్లో ఎగసిన కెరటపు అంచున**
**తొణికే జల్లు పూలలా రెండు భుజాలకు**
**వీపుమీద పొట్టమీద**
**పసి నవ్వుల్ని పలకరించే బొమ్మలు**
**కిర్రుకిర్రుమని ఒక బొమ్మ ఊపుతూ**
**కెరటం బోసి నవ్వుల్ని లేలేత చేతుల్ని**
**పిలుస్తూ పోతుంటుంది.**
**…………………………………**
**చేతి వేళ్ళ కొనల భాషతో**
**నాణేల్ని నోట్లను చదువుతుంది కెరటం**
**బతుకు పాటగా చిల్లర ఎగరేస్తూ**
**చేయి చాపలేదు.**
**…………………………………**
**…………………………………**
**ఆకాశమంత తెగువతో**

**అంతరిక్షమంత ఆత్మవిశ్వాసంతో**
**ఆకలి అన్నింటిని మించిన ఆరో జ్ఞానేంద్రియం**
**రైలు చక్రాల మధుర లయలో**
**ఒక విశ్వచైతన్యం**
**సాగుతుంది**
**ముందుకు దూకుతుంది...**
**చీకటి కెరటంలా....  (సూర్య – అక్షరం, 20/06/2011)**

అంటూ రైలులో అటునుంచి ఇటు, ఇటునుంచి అటూ తిరుగుతూ, పాటలు పాడుతూ అందరి దగ్గర బిక్షం ఎత్తుకుంటూ తిరిగే చిన్నపిల్లల దయనీయతను వెల్లడించారు. రైళ్ళలో భిక్షానికై తిరిగే చిన్న పిల్లల చీకటి బతుకులకు ప్రతీకగా 'చీకటి కెరటాన్ని అనే శీర్షిక పెట్టారు సుబ్బాచారి. ఆ చిన్న పిల్ల ఆకాశమంత తెగువతో, అంతరిక్షమంత విశ్వాసంతో అటూ ఇటూ తిరుగుతుందని వాళ్ళ లేనితనంలో ఉన్న నైపుణ్యాన్ని కొనియాడారు.

'వర్తమానం కానిది' అంటూ రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు సూర్య దినపత్రికలో ఒక కవిత రాయడం జరిగింది:

**జనం పొలంలో**
**నాటాల్సిన గింజలను**
**వేదం కుండీలలో కుక్కితే**
**మొలిచేవి వంకర మొలకలే**
**చమటకు దూరమైన**
**వేదం చదువు అయినా**
**భట్టీయం సాముతో**
**ఊపిరి ఆడక అరాచకమే అవుతుంది**
**చదివేది వేదమే అయినా**
**వర్తమానం గాలి వెలుతురు అందనపుడు**
**విద్యాలత**
**చీకటి వంకర్లు తిరుగుతుంది**
**(సూర్య – అక్షరం, 30/05/2011)**

రాచపాళెం హేతువాద దృక్పథంతో పై పంక్తులు చెప్పడం జరిగింది. వేదం అయినా, ఇంకో చదువు అయినా అది వర్తమానంలో లేకపోతే బతికి బట్ట కట్టదు అని రాచపాళెంగారి ఉద్దేశం.

**కంటి ముందరి ప్రపంచాన్ని వదలి**
**పంటి కింద**
**మంత్రాలే చాలనుకుంటే**
**ఏ వేదమైనా**

**లైంగిక వేధింపై తేలిపోతుంది**
**వేదాలను వేషంలో మూటగడితే**
**మనసు**
**జిలెటిన్ స్టిక్కై పేలిపోతుంది**
**స్వామి గుడిలో**
**డాలర్లకే నిగ్రహం లేదు**
**స్కాలర్ల కెక్కడుంటుంది**
**వర్తమానం నుంచి**
**దూరమైందేదైనా**
**అర్థవంతం కాదు!**
**ఆరోగ్యకరమూ కాదు!**

రాచపాళెంగారు రాసిన కవితను నిశితంగా పరిశీలిస్తే హేతువాద దృష్టితో రాశారనే విషయం స్పష్టంగా కనబడుతుంది.

'ఎన్‌చాంటెడ్ కోటు' కవితను రాసింది చిత్తలూరి సత్యనారాయణమూర్తిగారు. ఈ కవితను వివరించే ముందు కవి ఈ కవిత రాయటం వెనుక ఉన్న నేపథ్యం గురించి చెప్పాలి మొదట.

'ఎన్‌చాంటెడ్ షర్ట్' పొయెట్ జానె పీకి కృతజ్ఞతలతో ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన 51 లక్షల రూపాయల ఖరీదైన కోటును గురించి చదివి, విని కవి ఈ కవిత్వాన్ని రాయడం జరిగింది.

**అతని ఊహల్లోంచి**
**బయలుదేరిన సైనికులు**
**ఇంకా వెతుకున్నారు**
**హ్యాపీ మ్యాన్ కోసం**
**నాదేశం ఎప్పటికీ**
**ఎంతోమంది హ్యాపీ మ్యాన్‌లు వున్నారు**
**వంటి మీద చొక్కా లేకుండా**
**ఆకాశం చూరు కింద**
**పొర్లి పొర్లి నవ్వుకుంటున్న హ్యాపీ మాన్‌లు**
**చాలా మందే ఉన్నారు**
**తప్పు తెలుసుకున్న రాజుగారు**
**ఊహల్లోంచి విడుదలై**
**తన రాజ్యానికి ఒక చొక్కా కుట్టించారు**
**తప్పని కూడా తెలియని**
**మా రాజుగారు! నా దేశంపై ఓ కోటు వదిలారు**
**ఎంతో మంది తాకను కూడా తాకలేని**
**ఒక ఖరీదైన కోటును వేలాడదీశారు**

**కోటు వెనుక ఎన్ని చీమలు చచ్చిపడివున్నాయి**
**ఎన్నో చెమట చుక్కలు కురిసి**
**తడిసిన ఎంత నేల వుంది?**
**కోటు ముందు నుంచి**
**వొంటిమీద చొక్కా లేకుండా**
**పరుగెత్తుతున్న ఒక మానవ సమూహం వుంది**

కవి 'ఎన్‌చాంటెడ్ కోటు!'ను వస్తువుగా స్వీకరించి దేశంలో ధనవంతులకు, దరిద్రులకు మధ్య ఉన్న వ్యత్యాసం గురించి చెప్పడం జరిగింది. తినడానికి తిండిలేక కనీసం తాగడానికి గంజి కూడా లేని పేదవారికి రచయిత మరో గొంతుక అయ్యాడు. ఈ భయంకరమైన చలిగాలులకి, ఎండలకి తన శరీరాన్ని దాచుకోవడానికి చిన్న పీలిక కూడా లేని ప్రజలకు రచయిత స్వరం అయ్యాడు. దారిద్ర్యం ఒళ్లో తలపెట్టుకొని పడుకున్న ప్రజల గురించి వివరించాడు ఈ కవి.

**ఎన్ని శవాల మీద**
**కఫతిన్‌లు లాగేసుకోని**
**తనని తను అల్లుకుందో ఈ కోటు**
**ఎన్ని శ్రమ చేతులను**
**కట్టిపడేసి తనను తాను**
**కుట్టుకుంటుందో ఈ కోటు**
**మసిబారిన ఒక గులాబి**
**ఉప్పొంగే పరిమళాన్ని**
**దాచుకునేందుకు**
**తన రెండు చేతులను**
**కోటుగా అల్లుకుంటున్న దేశంలో**

ఎంతమంది పేదవారి బతుకులను ఛిద్రం చేస్తే వచ్చిందో ఆ కోటు. ఎన్ని ప్రాజెక్టుల డబ్బులు దోచుకుంటే వచ్చిందో ఆ కోటు. ఎంత మంది ప్రజల జీవితాలతో ఆడుకుంటే వచ్చిందో ఆ కోటు. ఆ కోటు రూపానికి

**ఏమో కానీ**
**కోటు వెనుక అనే దేహాలు**
**చొక్కా లేకుండా**
**నా దేశాన్ని**
**వెక్కిరిస్తూ నిలుచునున్నాయి**

ఎంతో మంది ప్రజలకు నిలవడానికి నీడ కూడా లేదు. కనీసం తన శరీరాన్ని కప్పుకోవడానికి చిన్న గుడ్డ ముక్క కూడా లేదు. అలాంటి నా దేశంలో 51 లక్షల ఖరీదు కోటు అంటూ కవి తన బాధను ఈ కవిత ద్వారా వెల్లడి చేశారు.

## 2.2.5. ఉద్యమ కవిత్వం:

ఉదాత్తమైన సామాజిక నేపథ్యంలో అధికుల ఆశల్ని నెరవేరుస్తూ మౌలికమైన మార్పుకు దోహదం చేసేదాన్ని ఉద్యమం అనాలి (*జయదేవ్ తిరుమలరావు వాజ్మయి: జనవరి – జూన్:1991: పుట:25*). ఇటువంటి ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన కవిత్వాన్ని ఉద్యమ కవిత్వం అంటారు. ఉద్యమాలను భూమికగా చేసుకొని ఉద్యమ కవిత్వం వెలువడుతోంది, బలపడుతోంది. ఏ సామాజిక ఉద్యమమైనా మొట్టమొదట కవిత్వంతో వ్యక్తమైన తర్వాతే ఇతర సాహిత్య ప్రక్రియల్లోకి ప్రవేశిస్తుంది. ఈ దృష్టితో చూసినప్పుడు సామాజికోద్యమ నిర్దిష్ట లక్ష్యాల ప్రక్రియల్లోకి ప్రవేశిస్తుంది. ఈ దృష్టితో  చూసినప్పుడు సామాజికోద్యమపు నిర్దిష్ట లక్ష్యాల ప్రచారానికి బలమైన మాధ్యమంగా కవిత్వం ఉపయోగపడుతుంది. ఇదే ఉద్యమ కవిత్వానికి గల అత్యంత ప్రధానమైన కర్తవ్యం.

ఆధునిక సమాజంలో ప్రత్యేకంగా ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాల కోసం దిన, వార, పక్ష మాస పత్రికలు ఆవిర్భవిస్తున్నాయి.  అవి ఉద్యమాల వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. ఉద్యమాల కోసం ఉద్యమాల నేపథ్యంలో వచ్చిన సాహిత్యాన్ని ప్రచురించి ప్రజల్ని చైతన్య పరచడంలో పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. జాతీయోద్యమ కాలం నుంచి నేటికి కూడా ఉద్యమ సాహిత్యాన్ని, కవిత్వాన్ని ప్రచురిస్తూ దినపత్రికలు తమ ఘనతను చాటుకున్నాయి. మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి తెలంగాణ ప్రాంతం నుంచి ప్రాంతీయ సాహిత్యం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో విస్తృతంగా వెలువడుతోంది. ఇలా వెలువడుతున్న సాహిత్యానికి కవిత్వానికి సూర్య పత్రిక తగిన ప్రాధాన్యం కల్పిస్తుంది.

'ఉనికి కోసం' అంటూ వఝుల శివకుమార్ రాసిన ఈ కవిత ఉద్యమ నేపథ్యాన్ని తెలియజేస్తుంది.

**వల నించి వలలోకి**
**జారిపోతున్న**
**వర్తమానాల మధ్య**
**స్వేచ్ఛ అర్థం కోల్పోయిన పదం**
**నాది కాని మాట**
**నాది కాని నడక**
**నాది కాని బతుకు**
**నా అస్తిత్వం చుట్టూ**
**చెదపుట్టలౌతున్నప్పుడు**
**నా చేతలే నీ వురి తాళ్ళు**

**నాదైన భవిష్యతు ఒక అభూత కల్పన**

**విషపు నీడలో మొక్కలా బతికే కాలాన్ని**
**బహిష్కరిస్తున్నా**
**కాలాన్ని వంచించిన సమైక్య మంత్రాల్ని**
**నిషేధిస్తున్నా**
**గొంతుక చుట్టూ బిగుసుకున్న**
**ఇతడి గుడ్డ నించి**
**నా ఊపిరి విముక్తం చేసుకోవాలి**
**............................................**
**............................................**
**రెట్టలతోనో గొట్టలతోనో బేరుకున్న కలుపును**
**పెరికెయ్యాల్సిందే**
**ఇప్పుడు మా ఉద్యమం కలపుతీత**
**మా ఉద్యమం కడుపు కోత**
**తాలు మాకిచ్చి**
**గింజలు తరలించుకుపోయే**
**రాజకీయాలకు కాలం చెల్లింది**
**కంచే చేసిన కాపలా ద్రోహాలను**
**మంచే చేసిన వినయ వంచనలను**
**చేను పసిగట్టింది**
**ఇంక చెరిగిపోసుడే**
**చెండాడుడే**
**పరిక్కంపల మధ్య ప్రశ్నార్థకమైన ఉనికి కోసం**
**కలపు పీకుడే**
**కలవడుడే! (సూర్య – అక్షరం, 24/01/2011)**

ఈ కవితను పరిశీలించిన తరువాత తెలంగాణలో ఉద్యమ నేపథ్యంలో వచ్చిందని అవగతమవుతున్నది. రచయిత ఆంధ్ర వలసవాదులు తెలంగాణ ప్రాంతానికి చేసిన అన్యాయం గురించి చెప్పడం జరిగింది. ఆంధ్ర నాయకులు తెలంగాణ ప్రజలకు చేసిన మోసాలను తెలంగాణ వారికి జరిగిన అన్యాయాలు పై కవితలో చెప్పడం జరిగింది. సమైక్య మంత్రాన్ని మేము ఒప్పుకోం అంటూ పై కవితలో చెప్పడం జరిగింది.

### 2.2.6. స్త్రీవాద కవిత్వం:

**ఆడ బ్రతుకే మధురమ్**
**వయసూ వలపూ సొగసు కులికే యువతి బ్రతుకే మధురమ్**

**పసుపు కుంకుమ నొసటను వెలిగే ఆడ బ్రతుకే మధురమ్**
**పతి కౌగిటిలో పరమశమయ్యే భార్య బ్రతుకే మధురమ్**
**పసికూనకు పాలొసగుచు మురిసే తల్లి బ్రతుకే మధురమ్**
**ఆ ఆడ బ్రతుకే మధురమ్ (20వ శతాబ్ది తెలుగు కవిత్వం:పుట:213)**

అంటూ వాహినీ వారి సుమంగళి సినిమా కోసం సముద్రాల రాఘవాచార్య రాసిన గీతమిది. అత్యంత ప్రాచీన కాలంనుండి స్త్రీని గౌరవించే రచనలు భారత దేశంలో ఉన్నాయి. అలాగే అత్యంత ప్రాచీన కాలం నుండి స్త్రీని నీచంగా చూసిన వాళ్లు, ఇప్పటికీ చూస్తున్న వాళ్లు ఉన్నారు.

స్త్రీవాదం ప్రపంచంలో సామాజిక ఉద్యమంగా రెండు వందల ఇరవై సంవత్సరాల కిందటే ప్రారంభమైనప్పటికీ, తెలుగులో మాత్రం 1970 దశకం తర్వాతే సాహిత్య ఉద్యమంగా వెలుగులోకి వచ్చింది. 1789 ఫ్రెంచి విప్లవం, 1870 రష్యన్ విప్లవం, 1911 చైనా విప్లవాలలో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు చేశారు. ఈ పోరాటాల ద్వారానే స్త్రీల ఓటు హక్కు, విద్య హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు మొదలైన మానవ హక్కులను సాధించారు. ఇటువంటి సామాజిక ఉద్యమాలతోపాటు కొంతమంది విదేశీ స్త్రీల రచనలు ఉద్యమానికి బాటలు వేశాయి. యు.ఎన్.ఓ. (U.N.O.) 1975వ సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా 1975–1985 దశకాన్ని అంతర్జాతీయ మహిళా దశాబ్దంగా ప్రకటించింది. దాంతో అనేక దేశాల్లో స్త్రీల సమస్యలపై, సదస్సులు, సమాలోచనలు, మహా సభలు నిర్వహించబడ్డాయి. మహిళల దృష్టి కోణం నుంచి సమాజాన్ని అధ్యయనం చేయడం వేగవంతమైంది. ఈ ప్రభావం మన తెలుగు సాహిత్యం మీద కూడా తీవ్రమైన ప్రభావం చూపింది.

కవయిత్రులు ఆధునిక కాలంలోనే కాక ప్రాచీన కాలంలో కూడా ఉన్నారు. వేదాల నాటికి గార్గి, ఆత్రేయ, లోపాముద్ర మొదలైన ఇరవై మూడు మంది స్త్రీల పేర్లు తెలియ వస్తున్నాయని పరిశీలకులంటున్నారు (*20వ శతాబ్ది తెలుగు కవిత్వం:పుట:214*).

క్రీ.శ.19వ శతాబ్దంలో సంఘ సంస్కర్తలు సమాజంలో అన్యాయాలను గుర్తించారు. ఆంగ్ల చదువు మేధావులలో మార్పులు తీసుకొని వచ్చింది. రాజా రామ్మోహన్ రాయ్, ద్వారకానాథ్ టాగూర్ మొదలైన విద్యావంతులు సతీ సహగమనాన్ని నిషేధించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

1862 నాటికే స్వామినేని ముద్దు నరసింహం 'హితసూచిని'లో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాల గురించి ప్రస్తావించడం, స్త్రీ జనోద్ధణకు పాటుబడడం చేశారు. కాని అది ఉద్యమంలా సాగలేదు. తరువాత కందుకూరి వీరేశలింగం, గురజాడ, చలం మొదలైన కవులతో పాటు అభ్యుదయ విప్లవ రచయితలు పూర్వ రంగాన్ని ఏర్పరిచారు. సమాజంలో అందరూ సమానమే అన్న భావన కోసం అందరూ పోరాడడం జరిగింది. ఆధునిక కాలంలో స్త్రీవాదం మీద రచనలు చేసేవాళ్లు విరివిగానే ఉన్నారు. ప్రాచీన కాలం వారిని వేళ్ల మీద లెక్కించవచ్చును. భండారు అచ్చమాంబ 1901లో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' పుస్తకాన్ని రచించడం జరిగింది (*2వ శతాబ్ధి తెలుగు కవిత్వం:పుట:217*).

1972లో వోల్గా రాసిన "ప్రతి స్త్రీ ఒక నిర్మల కావాలి" అనే కవిత నవతరం స్త్రీని చూపించింది. ఆ తర్వాత రంగనాయకమ్మ 'జానకీ విముక్తి' అనే నవల, మిగిలిన స్త్రీ వాదులు రాసిన నవలలు, కథలు, కవిత్వాలు, వ్యాసాలు స్త్రీవాద సాహిత్య అంతః ప్రక్రియల విస్తృతికి తోడ్పడ్డాయి. దీంతో లిబరల్, రాడికల్, మార్క్సిస్టు, సోషలిస్టు స్త్రీవాద ధోరణులు ఆవిర్భవించాయి. వీటన్నింటిలో కూడా స్త్రీ ఉనికికి సంబంధించిన మాతృత్వం, లైంగిక వివక్ష, వివాహ వ్యవస్థ, కుటుంబ హింస, సామాజిక జీవితం, ప్రపంచీకరణ మొదలైన వాటిని వస్తువులుగా చేసుకున్నాయి.

"స్త్రీవాద కవిత్వం మీద ఘాటుగా విమర్శలు కూడా తలెత్తడం జరిగింది. ఈ సోకాల్డ్ స్త్రీవాద కవిత్వం మొత్తం స్త్రీ జాతిని రెప్రెజెంట్ చేయట్లేదు. కేవలం ఒళ్లు బలిసిన పట్టణ ఉన్నత వర్గాల యువతుల వాంఛలను మాత్రమే రిఫ్లెక్ట్ చేస్తున్నది. పైగా స్త్రీ జాతి చైతన్య కవితగా బుకాయిస్తున్నది" అని డా॥ ఎస్వీ స్త్రీవాదాన్ని నిందించారు.

ఈ విధంగా అంతః ప్రక్రియాధోరణి వరకు అభివృద్ధి చెందిన స్త్రీవాద సాహిత్యం తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నప్పటికి వస్తువులో నవ్యతను ప్రదర్శిస్తూ స్త్రీవాదులు పోరాటం పురుషులపైన కాదనీ, పురుషాధిక్య సమాజంపైనేనని పాఠకులకు, విమర్శకులకు విడమర్చి చెప్పింది.

స్త్రీవాద సాహిత్యం 1990–1995 తెలుగులో దాదాపు అన్ని దిన, వార, పక్ష మాస పత్రికల్లో సాహిత్య పుటల్లో అధికంగా ప్రచురింపబడింది. కానీ నేడు ఈ పరిస్థితి కొంత మేరకు తగ్గింది. అస్తిత్వ ఉద్యమాలు ఉధృతంగా జరుగుతున్న సమకాలీన సమాజంలో అనేక అస్తిత్వ పత్రికలు ఆవిర్భవించాయి. అవన్నీ కూడా తమ అస్తిత్వ సాహిత్యాంశాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి మిగిలిన ఇతర విషయాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలుగు దినపత్రికలు కూడా స్థల, కాల,

పరిమితులను దృష్టిలో పెట్టుకొని తెలుగు సాహిత్యం సమప్రాధాన్యాన్ని ఇస్తూ ప్రచరిస్తున్నాయి. స్త్రీవాద కవిత్వం వస్తువులో కొత్తదనం ప్రదర్శిస్తూ స్త్రీల చైతన్యానికి కృషి చేస్తుంది. ఉదాహరణకు డా॥ ఎం.బి.డి. శ్యామలగారు రాసిన 'ఏనాటికి ఆమె ఆమేనా!' అనే స్త్రీవాద కవితను చూడవచ్చును.

**నింగి గొప్పా, నేల గొప్పా! అని ఆమె ఎప్పుడూ**
**ప్రశ్నించి ఎరుగదు.**
**ఫెళ ఫెళ ఉరుములతో గర్జించి**
**అనంత జలరాశుల తనపై వర్షించినా**
**నిదాఘ తాపంతో మలమల మాడ్చి**
**మండుటెండ దన దేహాన్ని బీటలు వాల్చినా**
**తన మనుగడకు దోహదమాయే రుతుచక్రంగా**
**వీటిని మార్చుకొని ప్రాణాలకు ఏడుగడగా మారి**
**అనేకానేక వృక్షరాశుల్ని పచ్చటిపొలాల్ని**
**ప్రసవించింది!**
**అవును! ఆమె అవని!!**
**ఎన్ని తరాలు గడిచినా పురుషుడితో సమానం**
**అవని 'అవని'!**
**.............................................................**
**ఆమే త్రేతాయుగంతో అగ్నిపునీతైనా**
**నాటి నుండి ఈనాటి వరకు తన కంటిని**
**అనుమానపు చెదలను వదిలించుకోలేని సీత!**
**..........................................................**
**వంతులు వేసుకున్న తనువునప్పచెప్పి**
**మనసు దోచుకొని మండిపోతున్న యజ్ఞసేనాని**
**రాజులిచ్చే ఆడ గుర్రాలు ఏనుగులు పల్లకీలతోపాటు**
**తాను వోదాన వస్తువైన నిస్సహాయ!**
**తరాలు గడుస్తూనే ఉన్నాయి**
**వంటిటి గడప దాటి విదేశాల కేగినా**
**విహాయసమేగినా...**
**..................................**
**ఆ యుగానికి ఈ యుగానికి ఒకటే తేడా!**
**బీదల గాథలలో వైవిధ్యం... అనుమానపు చూపులో వైదగ్ధ్యం!**
**అంతే! అలా నిలబడి చూస్తుంటే ... సుదూరాన**
**నింగి నేల కలిసినట్టే కనిపిస్తున్నాయి**
**అచ్చం స్త్రీ పురుష సమానత్వంలాగా**

డా॥ ఎం.బి.డి. శ్యామల ఈ కవితలో ఒకటవ పాదం నుండి చివరి పాదం వరకు స్త్రీ పుట్టినప్పటినుండి ఈ రోజు వరకు పడుతున్న కష్టాలన్నింటి గురించి రాయడం జరిగింది. కవికి కావల్సినవి నిశిత పరిశీలన, వర్తమాన విషయాల గురించి అవగాహన. అప్పటికి ఇప్పటికి సమాజంలో మార్పు వచ్చింది. అవి మనిషి చూపే చూపులో మాత్రమే అనుమానంలో కాదు. అనుమానంలో కొద్ది మార్పులు తప్ప చివరలో కవయిత్రిగా నిరాశావాదంగా ఒక మాట అన్నారు. 'నింగీ నేలా కలిసినట్లే కనిపిస్తాయి. అచ్చం స్త్రీ పురుష సమానత్వంలాగా!' అవి ఎప్పటికీ కలువనట్టే, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం కూడా ఎప్పటికీ రాదని ఆ మాటల్లోని అంతరార్థం.

మందరపు హైమావతి 'అంతరంగ గాయాలు' అంటూ స్త్రీలు పురుషుల వల్ల పడుతున్న బాధలను కింది కవితలో చెప్పడం జరిగింది.

**ప్రేమంటే**
**కన్నీటి ముసురు జీవనంలో**
**కళ్యాణ రాగాలు ఆలపించడమే గదా**
**ప్రేమంటే అంతరంగం రాతి ప్రతిమను**
**అంతరిక్ష వీధుల్లో**
**రెక్కల గుర్రం చేసి పరుగులెత్తించడమే గదా**
**ప్రేమంటే**
**రాగమూ రక్తిలేని**
**గాయాల లోయలలో**
**గాన వృక్షాలను నాటడమే కదా!**
**మరి ఇప్పుడు ఏమిటి**
**శబ్దాలకి మారిపోయాయా అర్థాలు**
**పదాలకి నిర్ణయించారా సరికొత్త పర్యాయపదాలు**
**అడిగిన వెంటనే**
**అంగీకార ప్రేమలేఖ అందించలేదని**
**చూపుల వలలో**
**వేగ విహంగం చిక్కుకోలేదని**
**అగ్ని వర్షమో ఆమ్ల వర్షమో కురిపించి**
**తనూ కావ్యాన్ని దగ్ధం చేస్తావా**
**.....................................**
**ఇక ఇప్పుడు**
**కామ కీచకులు**
**వేధించే గిరీశాల శికారుల బారినుండి**
**తప్పించుకోవడానికి**
**తల్లడిల్లే ఆధునిక మహిళను కాపాడడానికి**

**ఏ పురుషోత్తముడు అక్కరలేదు**
**ఇప్పుడు మేం**
**అవమాన ప్రపంచాల ధిక్కరించే**
**అత్యాభిమాన ఆయుధాలం**
**అంతరంగ గాయాలకు లేపనాలం (సూర్య – అక్షరం, 12/12/2011)**

ఈ పురుష సమాజం స్త్రీకి ప్రేమను పంచాల్సినది పోయి ఆమె పడే కష్టాలు చాలవన్నట్లు ప్రేమించకపోతే యాసిడ్ దాడులు, చెంతకు చేరకపోతే కత్తిపోట్లు అంటూ స్త్రీని త్రేతాయుగ కాలం నుండి ఇప్పటి అత్యాధునిక కాలం దాకా బాధలకు గురిచేస్తున్నాడని పై కవితలోని సారాంశం. మా గాయాలకు మేమే లేపనాలం అంటూ స్త్రీ శక్తి చైతన్యాలకు ప్రతీకగా చెప్పారు కవయిత్రి హైమవతిగారు.

'ఆమె' అంటూ శైలజా మిత్ర ఈ కింది కవితను రాశారు.

**ఆమె**
**అతని కోసమే**
**పుట్టాను అంది**
**ఎంత బతికినా**
**అతని కోసమే అంది**
**వెన్నెల రాత్రి**
**నిరెండ, చల్లని అల**
**అన్ని అతనే అంది**
**అతని కోసమే**
**బతుకుతానంది**
**అతనే సర్వస్వమంది**
**అతనే లేకుంటే తనకు జన్మే వద్దంది**
**అన్నీ ఆశ్చర్యంగా విని**
**అతడామెను అన్నాడు**
**నాక్కూడా... అని!**
**ఆ అందమైన అబద్ధంతో**
**అతడు అద్దంలా మెరుస్తూ**
**నాటినుంచి నేటి దాకా**
**కనిపించేదంతా నిజమని నమ్మే**
**ఆమె ఒక పిచ్చిదానిలా ఏడుస్తుంది**

'శైలజామిత్ర' గారు ఈ చిన్న కవితలో స్త్రీ పడే ఆవేదనను కళ్ల ముందుంచారు. పురుషుడు చేసిన మోసానికి స్త్రీ ఏళ్ళు ఏళ్ళు అనుభవించిన బాధను చెప్పడం జరిగింది. ఈ కవిత ఎన్ని యుగాలు

మారితే మారుతుందో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానం అయ్యే రోజు ఎప్పుడు వస్తుందో అంటూ అశావహ దృక్పథాన్ని వ్యక్తం చేశారు కవయిత్రి.

### 2.2.7. దళిత కవిత్వం:

సమాజంలోని కొన్ని వర్గాల వారు చండాలురు, పంచములు, అవర్ణు, అంటరానివారు, నిమ్నజాతులవారు, మాలలు, మాదిగలు హరిజనులుగా పిలవబడుతూ తరతరాలుగా అవమానాలకు గురవుతున్నారు. 'అగ్ర'వర్ణాల -+ బలి అవుతున్నారు. అలాంటి దళితుల బాధల్ని, అవమానాల్ని తెలిపేది దళిత కవిత్వం. దళితులు సాంఘిక బంధాలనుండి విముక్తిని, సమాజంలో ఇతరులతో సమానత్వాన్ని కోరేది దళిత కవిత్వం. దళితుల ఆత్మగౌరవాన్ని ప్రస్తుతించేది దళిత కవిత్వం (*20వ శతాబ్ద తెలుగు కవిత్వం, కడియాల రామమోహనరాయ్:పుట:238*).

ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత కవిత్వం 20వ శతాబ్దం ఆరంభం నుంచి వెలువడుతున్నది. జాతీయోద్యమ కాలంలో హరిజనోభ్యుదయ కవిత్వంగా వెలువడిన దళిత కవిత్వం మొదటి దశ అయితే, రెండవ దశలో వామపక్ష ఉద్యమాలలో పీడితవర్గ కవిత్వంగా వికసించింది. నేడు దళిత ఉద్యమాల స్ఫూర్తితో ప్రవర్తిల్లుతోంది.

అగ్ర కుల దురహంకారానికి హిందూ మతవాద తాత్త్వికత పునాదై వర్ణాశ్రమ ధర్మాలను, కులవ్యవస్థ, మూర్ఖపు కట్టుబాట్లు, మూఢ నమ్మకాలు, కర్మ సిద్ధాంతం మొదలైనవి దళితులను అంటరానివాళ్లుగా చేసి పీడించాయి. సాంఘిక అణచివేతకు, ఆర్థిక పీడనకు, రాజకీయ అణచివేతకు గురిచేశాయి. మనుషులుగా పరిగణింపబడకపోవటం, పశువులకంటే హీనంగా చూడడం దళితుల జీవిత వాస్తవికత నుంచి దళితవాదం, దళిత సాహిత్యవాదం ఆవిర్భవించాయి. మొట్ట మొదటిసారి జ్యోతిరావు పూలే దళితవాదాన్ని, దళిత సాహిత్యవాదాన్ని, దళిత తత్త్వశాస్త్రాన్ని రూపొందిస్తే డా॥ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పోరాటాలకు అవసరమైన తాత్త్విక నేపథ్యాన్ని ఏర్పరిచారు.

ఆధునికాంధ్ర తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దం నుంచే దళిత కవిత్వం వెలువడుతుంది. ఈ ప్రారంభ కాలంలోనే దళిత దృక్పథంతో ప్రతిఘటన చైతన్యాన్ని ప్రదర్శించిన తొలి దళితకవి మహాకవి గుర్రం జాషువా. ఆ తర్వాత బోయి భీమన్న, జ్ఞానానందకవి మొదలైనవారు చెప్పుకోదగినవారు. అయితే దళిత కవిత్వం విస్తృతంగా వ్యాప్తిలోకి వచ్చింది మాత్రం 1985 తర్వాతే. ఎందుకంటే దళిత అస్తిత్వ ఉద్యమాలు ఈ సంవత్సరంనుంచే ఊపందుకున్నాయి. దళిత విద్యార్థి సంఘాలు, దళిత ప్రజా సంఘాలు, దళిత మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. దీనికి ప్రధాన

కారణం 1985లో జరిగిన కారంచేడు సంఘటన. ఈ సంఘటన తరువాత దళితుల అందరిలో ఐక్యత భావన పెరిగి అందరూ ఒక తాటిమీదకు రావడం జరిగింది. అంబేద్కర్ మాటలను ఆయుధాలుగా మార్చుకొని ఉద్యమంలా అందరూ ప్రశ్నించడం జరుగుతూ వస్తుంది.

ఆ తర్వాత దళిత కవిత్వం విస్తృతంగా వస్తున్న క్రమంలో దళితులు అంటే ఎవరు? దళిత కవిత్వం అంటే ఏమిటి? అనే చర్చకు తెర లేచింది. డా॥ బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో ఎస్.సి., ఎస్.టి.లు అన్న భావనకు అదనంగా ఎస్.సి. ఎస్.టి. బి.సి. మైనార్టీ స్త్రీలు అందరూ దళితులే (*సత్యనారాయణ, ఎస్.వి:2012:పుట:210*) అన్న విశాలార్థాన్ని ఇచ్చారు. కాబట్టి అప్పుడు పై వర్గాలవారు రాసిందంతా దళిత కవిత్వం అవుతుంది. అంతే కాదు దళిత స్పృహతో ఎవరు రాసినా అది దళిత కవిత్వమే అనబడుతుంది. ఈ విధంగా దళిత కవిత్వం నేడు శాఖోపశాఖలుగా ప్రవర్ధిల్లుతూ సమాజ నిర్మాణానికి మార్గం సుగమం చేసింది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో పత్రికల ద్వారానే దళిత కవిత్వం వెలుగులోకి వచ్చింది. 1909 'ఆంధ్ర ఖ్యాతి' మాస పత్రికలో అచ్చయిన 'మాలవాండ్ర పాట' నే ఇందుకు నిదర్శనం. అప్పటి నుండి ఇప్పటివరకు కూడా దళిత సాహిత్య వ్యాప్తికి వార, పక్ష మాస పత్రికలతో పాటు దినపత్రికలు కూడా విశేష కృషిని చేస్తున్నాయి. ఈ పత్రికల్లో ప్రచురించే కవితలు, చర్చలు, వాదోపవాదాలు, వ్యాసాలు, సమీక్షలు మొదలైన దళిత వాదవివాదాలు వంటి ఉన్నతమైన గ్రంథాలకు పత్రికలు ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సూర్య దినపత్రికలో వెలువడుతున్న దళిత కవిత్వం మౌలిక భావాలను ఇక్కడ చర్చించడం జరిగింది. అయితే ఈనాటి దళిత కవిత తాత్కాలిక ఉపశమనపు నీడలోంచి సంపూర్ణ వెలుగు కోసం రావాలని తపిస్తుంది. ఉదాహరణకు కత్తి పద్మారావు రాసిన 'పక్షి వీక్షణం' అనే దళిత కవితను చూడవచ్చు.

**విశాలమైన పచ్చికబయళ్ళు**
**ఆ మధ్యలో**
**ఏపుగా పెరిగిన ఒక చెట్టు**
**ఆ పైన రెండు పక్షులు**
**అవి తెల్లగా వున్నాయి**
**ప్రపంచ పరిణామం గురించి ముచ్చట్లు**
**నిన్నటి ధనవంతుడు**
**నేడు పేదరికాన్ని నటిస్తున్నాడు**
**పేదవాణ్ణే అడిగి చిరుగు చొక్కాలు**
**ధరిస్తున్నాడు**

**యుద్ధ నౌకల్లో సరకు మాత్రం**
**లోడ్ అవుతూనే వుంది**
**తెల్ల భవనాల్లో**
**పావురాల మేతలకేమి దిగులు లేదు**
**డాలరుని ఒక**
**మారక ద్రవ్యంగా కాక**
**ఒక మత్తు మందులా చల్లారు**
**మానవతా స్ఫూర్తిని విస్మరించి**
**ఎందరినో ఆకాశానికి**
**వేలాడదీసి చూస్తున్నారు (సూర్య – అక్షరం, 24/10/2011)**

పై పంక్తులను మనం గమనిస్తే ప్రపంచ పరిణామం గురించి రెండు పక్షులు మాట్లాడుకుంటున్నాయి అంటూ పక్షులను ప్రతీకగా తీసుకున్నారు. జరుగుతున్న ప్రపంచీకరణ గురించి, అందులో దగా పడుతున్న పేదవారి గురించిగాని చెప్పడం జరిగింది. అమెరికా రాష్ట్రాలు పేద దేశాలపై డాలర్ మత్తును జల్లి వారి పనిని సజావుగా సాగించుకుంటున్నాయి. మానవతను వదిలి పనివాళ్ళుగాచూసి క్షోభకు గురిచేస్తున్నారు అన్నది కత్తి పద్మారావుగారి ఆలోచన.

**చినుకుపడితే**
**ఒళ్ళంతా పుండ్లు**
**జీవితానికి కునుకు లేదు**
**ఓ వీక్షణమా!**
**మన దేశాన్ని మనం పచ్చగా చూడాలి!**
**ముందు మనసులకు**
**వ్యవసాయం**
**జరగాలి!**
**మనల్ని మనం**
**నిర్మించుకోవాలి!**
**అప్పుడే పునర్జీవనోద్యమం**
**తథ్యం!**

150 అంతస్తులు బడా భవంతులు ఉన్న నా దేశం కనీసం పేదవాడికి శరీరానికి కప్పుకోవటానికి ఒక చిన్న దుప్పటి కూడా లేదు. ఒక చినుకు పడితే వర్షంలో తడిసి ముద్ద అవ్వాల్సిందే తప్ప, తల దాచుకోనుటకు హైవే బ్రిడ్జులు తప్ప ఇళ్ళెక్కడున్నాయి అంటూ ప్రశ్నించారు.

'మీరే మా వెంట రండి' అనే ఈ కవితను కూడా కత్తి పద్మారావు రాశారు.

**ఆ రాగంలో శ్రుతి వుంది**
**లయ వుంది**
**ఆకాశ వీధులనుంచి**
**అది దిగంతాలకు పాకుతుంది**
**..................................**
**చరిత్రకు స్ఫూర్తి కాదు**
**చరిత్ర త్యాగాన్ని కోరుతుంది**
**నెత్తుటి ధారలతో**
**అక్షరాలు పేరుస్తుంది**
**పునర్నిర్మాణమైన**
**ప్రతి సందర్భంలో**
**.................................**
**కూలిపోతున్నది ప్రతిదీ**
**పునాదిగా మారుతుంది**
**మాయావతి**
**దళితస్థాన్ రూపొందించింది**
**ఇవి ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగమే**
**ఇది ఓట్ల యుద్ధమే కాదు**
**సాంస్కృతిక పోరాటం కూడా**
**అవును!**
**...................**
**మా విగ్రహాలను మీకు**
**చూడడానికే విసుగేస్తుందా!**
**మా అంబేద్కర్, పూలే, పెరియార్**
**కాన్షీరామ్ లెవరకి ఆయుధాలు లేవే**
**పరుశురాములు అందరూ**
**ఆయుధ ధారులే కదా!**
**.............................**
**మమ్మల్ని మేము**
**పునః ప్రతిష్టించుకుంటున్నాం**
**ఇక మా నడక మాదే**
**మీరే మా వెంట రండి!**
**మాది సమతా మార్గం!!** **(సూర్య – అక్షరం, 21/11/2011)**

దళితుడిగా పిలవబడుతున్న మేము అనేక సంవత్సరాలనుండి మీ కాళ్ల క్రింద బతికాం. అది కూడా మీకు ఇష్టంలేదు. మేము పువ్వులు పూచి కాయలు కాసి వృక్షంగా మారితే అది చూసి మీరు ఒర్చుకోలేరు. మా పేర్ల భవంతులు కడితే ఒప్పుకోరు. మీకు నచ్చినవారి పేరుమీద రోడ్లు, భవనాలు పేర్లు పెడితే తప్పులేదు. మేము నిర్మిస్తే తప్పా అంటూ కొన్ని సూటి ప్రశ్నలు అడగడం జరిగింది.

ఇన్ని సంవత్సరాలు బానిస సంకేళ్ళను తెంచుకొని మా బతుకులు మేము బతుకుతాం. అది కూడా మీకు ఇష్టం లేదా ఎందుకంటే మీకు ఊడిగం చేసేవారు లేరు కదా! మిమ్మల్ని మేము పునః ప్రతిష్ఠించుకుంటున్నాం. ఇక నుంచి మాదారి మాదే. కావాలంటే మీరే మా వెంట రండి మాది మీలాగా దోపిడి రాజ్యం కాదు. దగా రాజ్యం అసలే కాదు. వీలయితే మీరే మా వెంట రండి అంటూ ఈ కవితలో చర్చించడం జరిగింది.

'భీమ్ పాలరాగం' అనే శీర్షికతో నీతల ప్రతాప్‌కుమార్ ఒక కవితను రాశారు.

**తూర్పు పడమర**
**ఉత్తరాన ఒకటై పోయాయి**
**కలవని దిక్కులు కలిసిపోయాయి**
**పోయే కాలం పోయి**
**కాలం కొత్త కలలు కంటున్న కాలం ఇది**
**సరిహద్దు రేఖల్ని చెరిపి వేసుకుంటూ**
**దిక్కులు ఒక్కటిగా ఐక్యమవుతున్న వేళ ఇది**
**సూర్యుడు తూర్పున ఉదయించాలని లేదు**
**దిక్కులు కలిసేచోట ఎక్కడైన ఉదయించవచ్చు**
**పొద్దు తిరుగుడు పువ్వు**
**నిరంతరం పొద్దు వైపే చూస్తున్నట్టు**
**.............................................**
**ఎన్నటికీ కలవవనుకున్న**
**దిక్కులు కలిసి సాధించిన దిక్సూచి విప్లవం –**
**ఔను – తూర్పు – పడమర–**
**ఉత్తరం ఒకటై పోయాయి**
**రేపు దక్షిణం ఉత్తరమై పోతుంది**
**పరిణామ క్రమం ఎప్పుడూ అనివార్యమే అవుతుంది**
**(సూర్య – అక్షరం, 28/02/2011)**

నీతల ప్రతాప్‌కుమార్ ఈ కవిత రాయడానికి వెనుక ఒక చిన్న కారణం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో గొప్ప ఐక్యతకు శ్రీకారం చుట్టిన సంస్కారవంతులైన బ్రాహ్మణులు, దళితులకు ప్రతీకగా – ఈ కవితను రాయడం జరిగింది.

సమాజం అన్న తరువాత మార్పు సహజం. అది ఎలాంటి మార్పు అయినా కావచ్చు. ఇది కూడా అలాంటిదే అయినప్పటికి కవి బ్రాహ్మణులు, దళితులు ఇద్దరు కలిసిన సందర్భానికి 'భీమ్ పాలరాగం' అని నామకరణం చేయటం హర్షించదగ్గ విషయం.

కవి ఎప్పటికీ కలవనటువంటివైన దిక్కులు కలిసాయని ఇక సూర్యుడు తూర్పునే ఉదయించాలని లేదు అని చాలా చక్కగా అభివర్ణించడం జరిగింది. భీమ్‌రావు రాంజీ అంబేద్కర్ ఆశించిన సమాజానికి సింబాలిక్‌గా భీమ్ పాలరాగం అని ఉపయోగించారు.

## 2.2.8. ప్రపంచీకరణ కవిత్వం:

20వ శతాబ్దం చివరి దశకంనుండి గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రైవెటైజేషన్ అనే మూడు మాటలు ప్రపంచ దేశాల రూపురేఖల్ని మార్చివేశాయి. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్.)కు ప్రపంచ బ్యాంకు (డబ్ల్యు.టి.వో.)కు వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల్ని అప్పగించి వాళ్ళ నియంత్రణకు లోబడి వ్యవహరించడమే లిబరలైజేషన్. వేరు వేరు దేశాల మధ్య సరుకులు, సేవలు స్వేచ్ఛగా వినిమయం కావడానికి, స్వేచ్ఛా విపణిగా దేశాలను సన్నద్ధం చేయడమే ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) నష్టాల పేరుతో నడిచే కంపెనీలతో పాటు కొత్తగా స్థాపించే కంపెనీలను కూడా ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగించి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ భాగస్వామ్యాన్ని క్రమక్రమంగా వదిలించుకోవడమే ప్రైవేటీకరణ అని బూదాటి వెంకటేశ్వర్లు ప్రపంచీకరణ స్వరూపాలను చెప్పారు (*2012:పుట:314*). ఈ ప్రపంచీకరణ ప్రభావం 1990లో భారతదేశంమీద కూడా బలంగా పడింది. దాంతో సరళీకృత విధానాలను, విదేశీ పెట్టుబడులను, ప్రైవేటీకరణను ప్రోత్సహించడంతో దేశంలో సాంస్కృతిక విధ్వంసం జరిగింది. ఇవన్నీ నేడు స్వదేశీ సంస్కృతి పునాదులనే కూల్చడానికి చూస్తున్నాయి. అంతే కాకుండా 'ప్రపంచీకరణ' అనేది ప్రపంచం మొత్తానే ఒక కుగ్రామంగా మార్చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా జన జీవితాల్ని అమానవీయంగా చేస్తున్నవి. ఇటువంటి సందర్భంలో ఈ ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ కవిత్వం ఆవిర్భవించింది. దీనిని వ్యతిరేకిస్తూ తొలిసారిగా కవిత్వాన్ని రాసినవారు నందిని సిద్ధారెడ్డి. ఈ విధంగా తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణపై వ్యతిరేక ధోరణితో ప్రపంచీకరణ కవిత్వం ప్రారంభమైంది.

ప్రపంచీకరణ వ్యతిరేక ధోరణితో వెలువడుతున్న కవిత్వాన్ని దినపత్రికలు కూడా ప్రచురించి కొత్త ప్రక్రియల పుట్టుకకు కారణమవుతున్నాయి. వాటి వికాస అభివృద్ధి వ్యాప్తులకు విశేష కృషిని చేస్తున్నాయి. ఈ విధంగా ఉన్న కవితను పరిశీలిద్దాం. కవి అయిన గోపి రాసిన కవిత 'నాపేరు సారాంశం' ఈ కింది విధంగా ఉంది.

**అర్థం కాని జీవనం**
**అర్థం పర్థం లేని సంగీతం**
**అర్థాలు మారిపోతున్న కాలం**
**దీనికే పొంతన కుదరదు**
**వంతెన కట్టేవాడు దొరకడు**
**..................................**

**..................................**
**తెగిన దారాలను**
**అసంబద్ధ చిత్రాలు వేలాడుతున్నాయి**
**విశాలమైన భూములను**
**ఎ.సి. రూములు మింగేస్తున్నాయి**
**పునరావాసాలను**
**గుమస్తాలు నిర్ణయిస్తారు**
**ఫిలాసఫీ**
**డబ్బుకు ఊడిగం చేస్తున్నది**
**బలుపును అభివృద్ధి అంటున్నారు**
**వార్త పత్రికలు**
**మొద్దుబారిపోతున్నాయి**
**ఇంత అందమైన బీభత్సం**
**మునుపెన్నడూ లేదు**
**ప్రపంచమంతా**
**ఒక వలస వేదనతో**
**కొట్టుమిట్టాడుతుంది**
**పరాయితనమంటే ఏమిటో**
**సారంశహితంగా**
**అనుభవంలోకి వస్తున్నది**
**అర్థాలు మారిపోతున్నా కాలం**
**అర్థ రహితంగా**
**మిగిలిపోతున్న**
**సామాన్యుడు (సూర్య – అక్షరం, 14/11/2011)**

ప్రపంచీకరణవల్ల మొదట పల్లెటూర్లు దాదాపు చావుకు దగ్గరగా ఉన్నాయని చెప్పాలి. అభివృద్ధి పేరిట, భవనాల పేరిట వ్యవసాయ భూములను ఈ కార్పొరేట్ సంస్థలు తినేయడం ప్రారంభించాయి. విశాలమైన భూములను ఎ.సి. రూములు మింగేస్తున్నాయి. తేనె పూసిన కత్తి చందాన తియ్యగా ప్రపంచీకరణ అంతా సంస్కృతిని దెబ్బ తియటానికి రెడీ అవుతుంది. పరాయివాడి పాలనలో ఉండే ఇబ్బందులు కొద్ది కొద్దిగా ప్రత్యక్షమవుతున్నాయి. ఏది ఏమైనా చివరికి తలుపు మధ్యన పడ్డ బల్లలా నలిగిపోయే వాడే ఆ సామాన్యుడు.

‘గడ్డ కట్టిన సముద్రం’ అని శిఖా ఆకాష్ ప్రపంచీకరణలో జాలరి జాడ ఎలా లేకుండా పోతుందో చెప్పడం జరిగింది.

**నీటి పొత్తిళ్ళలో సిగురులేసిన చందమామలు వాళ్ళు**

**సముద్రమే భూమిపాదమైన వాళ్ళు**
**సంద్రానికి తొలిపొద్దు రెక్కలై**
**ఆనంద రాగాలను ఆకాశానికి అలిమినవాళ్ళు**
**అలలకు అలసిపోని కలలనిచ్చిన**
**సెమట సేతుల తొలకరి మబ్బులువాళ్ళు**
**చిన్నప్పుడే చేతల వలతో**
**సముద్రాన్ని చాతి కింద బంధించిన వాళ్ళు**
**బోసి మొలల చాపల స్వారీ చేసే**
**చలాకీ కెరటాల యోధులు వాళ్ళు**
**సముద్రన్నో నీలి ఆకాశం చేసి**
**చేప పిల్లల్ని నక్షత్రాలుగా దోసలిపట్టె**
**జావళీల జాలరోళ్ళు**
**శివుడు నెత్తిన గంగను**
**తమ కాళ్ళ కింద నేలను చేసుకున్న**
**ప్రకృతి విజేతలు వాళ్ళు**
**డాలర్ గాలానికి చిక్కిన పక్కి పిల్లై విలవిల్లాడుతూ**
**సంతలో వేలం పాటైపోయింది దినం**
**కళ్ళలో నీలి సముద్రం పోటెత్తుతోంది క్షణం క్షణం**
**సముద్రాన్ని వలలో బంధించిన జీవితం**
**ఇక్కడి దళారీ సంకెళ్ళలో చిక్కబడిపోతున్నది**
**కత్తి పడవై నీటిన ఈదినవాడే**
**ఒడ్డున కొట్టుకున్న చేప పిల్లలా కునారిల్లు తున్నది**
**ఎన్నెన్ని సోరల్ని వేటాడాడు**
**బహుళజాతి డాలర్ తిమింగలాలు**
**రాజ్యాల దళారీ కోరల్లో**
**పెద్ద చేపకు చిన చేపై...!**
**..................................**
**...................................**
**డాలర్ నాగరికత నైలన్ తాడై**
**తెరచాపకు ఉరలేసింది**
**బెస్తల కళ్ళల్లో**
**పుస్తెలు తెగిన సముద్రం**
**గడ్డ కట్టింది? (సూర్య – అక్షరం, 14/11/2011)**

అంటూ రచయిత ప్రపంచీకరణ నేపథ్యంలో జాలర్లు పడుతున్న కష్టాలను కళ్ళకు కట్టారు. సముద్రంలో కష్టపడి చెమటోడ్చి చేపలను పట్టుకొస్తే ఈ మధ్యలో దళారి విసిరిన వలకు చిక్కుకుపోతున్నారు. మార్కెటు మార్కెటు

రేటు అంటూ అక్షర జ్ఞానంలేని వాళ్ళను అమాయకుల్ని చేసి ఆడిస్తుందీ డాలర్ వ్యవస్థ. ఏది ఎమైనా ప్రపంచీకరణ అన్నది అన్ని రంగాల్లో మంచిది కాదని అవగతమవుతున్నది.

'ఇప్పుడు ఊరు ఊరులా లేదు'! అంటూ ప్రపంచీకరణ నేపథ్యంలోనే వల్లాభాపురం జనార్ధన్‌గారు కింది కవితను రాశారు.

**ఇపుడు ఊరు ఊరులా లేదు**
**మానవుల ఆనవాళ్ళు ప్రవహించడంలేదు**
**నడుస్తున్న రాతి బండల చషకాలు**
**నట్టింట్లో పోగు పడుతున్నాయి**
**ముచ్చట్ల కెరటాల ఊయల తాడు తెగి**
**పునాదులు పూడ్చుకుపోతున్నాయి**
**తలపు తలుపుకు మధ్య ప్రహారీ గోడలు**
**జరాసంధ శరీరాలుగా మొలుస్తూనే వున్నాయి**
**ప్లాస్టిక్ బొమ్మల ఫాషన్ పరేడు ధాటికి**
**కుండలు కుక్క ముట్టిన కుండలై పగులుతున్నాయి**
**ఉమ్మడి వినియోగ ఫ్యాక్టరీ ముచ్చెలు**
**పల్లెరుగాయాల పరుపులపై పోర్లాడుతున్నాయి**
**........................................................**
**........................................................**
**ఇప్పుడు ఊరు ప్రపంచీకరణ మందు పాతరలు**
**సృష్టించిన విస్ఫోటన శకలాలు కుప్పల నడమ**
**కొడుకును పొగొట్టుకున్న ఏడుస్తున్న**
**కన్న తల్లి కన్నీటి ఏరులా వుంది**
**పెనంమీంచి జారి**
**నిప్పుల గుండంలో పడ్డ రొట్టెలా ఉంది**
**అవును ఇప్పుడు ఊరు ఊరులా లేదు**
**పట్టపగలు దొంగలు పడ్డ దొంగలా వుంది**

**(సూర్య – అక్షరం, 16/05/2011)**

ప్రపంచీకరణ ద్వారా గ్రామాల్లో తెచ్చిన మార్పును కవి అయిన వల్లభాపురం జనార్ధన్ చాలా చక్కగా వివరించారు. గ్రామాలలో జనాలు లేరు, పంటలు లేవు, బంధుత్వాలు అస్సలే లేవు. 100 ఎకరాల ఆసామి కూడా బహుళ కంపెనీల అంతస్థుల ముందు గేటు కీపరుగా మారవలసి వచ్చింది. గ్రామాలలో కాటికి కాలు చాపుకొని కూర్చున్న అవ్వాలు తప్ప ఎవ్వరూ లేరు. దేశానికి పల్లెటూర్లు పట్టుగొమ్మలు అన్నారు. పట్టుగొమ్మలు పెలపెల విరిగి పోతున్నాయి. ప్రపంచీకరణ ఎవరి బాగు కోసం! అనే బాధను వ్యక్తం చేశారు.

## 2.2.9. అనుభూతివాద కవిత్వం:

ఏ కాలంలోనైనా కవి స్వతంత్రుడే. కవికి ఒక అంతరంగ ప్రపంచమూ బహిరంగ ప్రపంచమూ ఉంటాయి. కవి స్వేచ్ఛకు, కవి ఔన్నత్యాన్ని మమ్మటాచార్యుడు.

**నియంకృతి నియమ రహితాం**
**హ్లాదైక మయిమనన్యపరతంత్రామ**
**నవరస రుచిరీం నిర్మితి**

"మావధతీ భారతీ కవేర్జయతీ" (కావ్యప్రకాశమ్) అనే మాటలో తెలిపాడు.

కవులు కొన్నిసార్లు తమను తాము నిరంకుశులుగా కూడా తెల్పుకున్నారు. 'కవులు మిప్పటి రూల్సుకు కట్టుబడం' అని చెళ్ల పిళ్ళ వెంకట శాస్త్రి ఖండితంగా పలికారు (*2వ శతాబ్ది తెలుగు కవిత్వం:పుట:190: అనుభూతి కవిత్వం*).

మనుషుల సంస్కృతి, జీవితం, అనుభూతులు మారినప్పుడల్లా సమాజం మారుతుంది. సమాజం మారిందంటే ఆర్థిక సంబంధాలు కూడా మారుతున్నాయని అర్థం. సమాజ పరిణామ క్రమాన్ని బట్టి మానవుని జీవితంలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. అవే మనిషి జీవితంలో ప్రతిబింబిస్తాయి. ఈ విధంగా తెలుగు ఆధునిక సాహిత్యంలో అనుభూతి కవిత్వం ఆవిర్భవించింది. ధనస్వామ్య సంస్కృతి అన్ని రంగాల్ని వ్యాపారంగా మార్చి మనిషి జీవితాన్ని దుర్భరం చేసింది. రాజకీయం మొదలుకొని సాహిత్యం దాక అన్ని వ్యాపార కేంద్రాలుగా మారాయి. అలాగే కవిత్వంలోకి రాజకీయం ప్రవేశించడం ప్రారంభమైంది. అది నచ్చని కొందరు మధ్య తరగతి కవులు లోకానుభూతులకి తట్టుకోలేక ఆత్మానుభూతుల్ని ఏర్పరచుకున్నారు. ఈ రకమైన మనస్తత్వంలో తెలుగు సాహిత్యంలో అనుభూతివాదం అనే ప్రక్రియ రూపుదిద్దుకుంది. ఏకాంతంగా అనుభూతి పొందిన కవిత్వం రాయడం వారి సిద్ధాంతం. ఈ సిద్ధాంతంలో మధ్య తరగతి మనస్తత్వం, శ్రద్ధ కళావాదం, వ్యక్తివాదం, ఆనంద లక్ష్యం, శిల్పదృష్టి పరిస్థితుల సానుకూలనం మొదలగు కారణాల వల్ల అనుభూతి కవిత్వం ఆవిర్భవించింది. తెలుగు సాహిత్యంలో అనుభూతి కవిగా ముద్ర వేసుకున్న మొట్టమొదటి కవి బాల గంగాధర తిలక్ ఆ తర్వాత గుంటూరు శేషేంద్రశర్మ, ఇస్మాయిల్, వేగుంట మోహనప్రసాద్ అనుభూతి కవులుగా చరిత్రలో నిలిచిపోయారు.

నా పరిశోధనా అంశం ప్రకారం సూర్య దినపత్రిక సాహిత్య సేవ సమకాలీన దృక్పథం (2011) అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. సూర్య దినపత్రికలో సాహిత్య పేజీ (అక్షరం) అన్నింటిని పరిశోధన చేస్తున్న సందర్భంలో అత్యధికంగా 34 అనుభూతివాద కవిత్వ విభాగానికి చెందిన

కవితలు రావడం జరిగింది. దీనిని బట్టి ఆయనకు అవగతమవుతున్నది అనుభూతివాద కవిత్వం ఎంత ప్రసిద్ధిగా ఉందో.

'తుఫాను తరువాత' అనే శీర్షికన గోదారి సుధీర కింది కవిత రాయడం జరిగింది.

**కారు మబ్బు కార్మికులు**
**జడివాన జెండా ఎత్తి**
**విప్లవం వర్థిల్లాలని**
**ఉరుములు పిడుగులై**
**విను వీధుల యజమానిని**
**గడగడమని వణికించారు**
**వాన విప్లవం వెలిశాక**
**ఒళ్ళు విరుచుకొని**
**పెళ్ళిపనులు చేసిన**
**పెద్ద ముత్తైదువుల్లా**
**చెట్లన్ని అచలమయ్యాయి**
**గూడు చెదిరిన నేల చేరిన**
**పిల్ల గోరింక ఒకటి**
**అమ్మని అదే పనిగా**
**కలవరిస్తుంది**
**.........................**
**.........................**
**వర్షోత్సవాలు జరుపుకున్న**
**గొడుగు పూలన్నీ తలలు వాల్చి**
**మరో వాన వసంతాన్ని**
**స్వప్నిస్తున్నాయ్**
**తుఫాను తరువాత ఊరంతా**
**వెలిసిపోయి చెదపట్టిన**
**పాతకాలం నాటి ఫొటోలా బోసిగా వుంది**

వర్షం వచ్చిన తరువాత తన నగరాన్ని గూర్చి చాలా చక్కగా వివరించాడు కవి. తన చుట్టూ ఉన్న పరిసరాలలో వర్ష ప్రభావానికి పక్షుల గూళ్ళు చెదిరి క్రింద పడిపోయాయి. పిల్లలు ఇంకా కొన్ని రోజులు వాన కురిస్తే బాగుండు అని ఆశపడుతున్నారంటూ కవి పిల్ల మనస్సులను కవీత్వకరించాడు.

పూరి ఇల్లలో వర్ష ప్రభావానికి ఇల్లంతా నీళ్ళతో సముద్రమయితే ఇంటి ఆవిడ ఉన్న గిన్నెలన్నీ వర్షం పడకుండా ఆపడానికి ఆమె చేసే ప్రయత్నాన్ని కవి చాలా చక్కగా వివరించాడు. కవి గొడుగులను పూలతో

పోల్చడం జరిగింది. గొడుగులన్నీ వర్షం వెలిసిన తరువాత మరో వాన వసంతాన్ని కలలు కంటున్నాయి అంటూ చాలా చక్కగా వర్ణించాడు.

'పాత గాయమే!' అనే శీర్షకను మొహమ్మద్ ఖాన్ ఈ కింది కవితను రాయడం జరిగింది.

**ఎన్నో గాయాలను మోశాను**
**నొప్పి నిజస్వరూపాన్ని మట్టానికి చవి జూచాను**
**గాయాలు నున్న ఆత్మీయంగా చూపాయి తప్ప**
**నన్నొక ప్రత్యర్థిగా ఏనాడు కక్ష గట్టలేదు**
**అందుకే అవి నాదృష్టిలో గాయాలు అనిపించుకోలేదు నా దృష్టిలో నిజం!**
**అయితే నా జీవితం**
**గాయాల స్నేహంలో కొనసాగింది నిత్యం**
**అయినా నాకు చింతలేదు**
**గరళం కూడా కొద్దిగా కొద్దికొద్దిగా**
**అలవాటుగా శరీరం స్వీకరించాక**
**గరళం తన శక్తిని శరీరంపై ప్రయోగించక చాలదు**
**ప్రయోగించినా ఫలితముండదు**
**.......................................**
**.......................................**
**ముల్ల కాటుకు బలయిన సందర్భం**
**నాకు గుర్తుంది**
**అదే**
**నేడు బాధయి తొలుస్తూ ఉంది**
**పాత గాయమే (సూర్య – అక్షరం, 07/11/2011)**

కష్టాన్ని ఇష్టంగా స్వీకరించాలి తప్ప కష్టాన్ని కష్టంగా ఎప్పుడు తీసుకోకూడదు అన్న ధోరణిలో ఈ కవిత సాగింది.

కాని జీవితంలో కష్టాలు అన్నవి నీటి మీద బుడగలు వంటివి. వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. అదే విషయాన్ని కవి తన కవిత ద్వారా ప్రపంచ మానవాళికి చక్కటి సందేశాన్ని చెప్పడం జరిగింది.

'ఎవరిని అడగను నా దారేదని' అనే కవితను స్వాతి శ్రీపాద రాశారు.

**మానవారణ్యం నడిమధ్యన దారి తప్పిపోయాను**
**ఎవరిని అడగను నాదారేదని**
**పెదవులపై తేనెల వాకల చిరునవ్వులు అతికించకు**
**హృదయం నిండా మోసపు విషమోసులు నింపుకున్న**

**ఈ సామాన్యప్పు ముసుగులోని విషసర్పాలకా**
**కంటి నొసల్లో ప్రేమ మెరుపులు పూయిస్తూ**
**పూ పుప్పొడుల మధువులో వంచన**
**మత్తు జల్లె**
**ఈ ప్రేమ పిపాసి పెదవులనా?**
**లేనివన్ని కానివన్ని కృత్రిమంగా చిత్రించకు**
**భ్రమ విభ్రమల్లో మయసభకు మారుపేరుగా**
**నయగారాల నవరూప దారినా**
**చూపులకు కనిపించే స్వర్గం వెనుక ఒదిగివున్న**
**చేదు నీడల నిజాలకు తేనెపూతలు వేసుకున్న**
**నియాన్ లైట్ల వెలుగుల వంటి రూపాలనడుగనా?**
**(సూర్య – అక్షరం, 19/09/2011)**

స్వాతి శ్రీపాద 'మానవారణ్యం నడిమధ్యన దారి తప్పిపోయాను' అంటూ సమాజంలో ఉండే భిన్న కోణాల గురించి సమాజంలో మనుషుల గురించి, వారి భిన్నమైన మనస్సుల గురించి, మనుషుల రూపంలో ఉన్న విషసర్పాలు గురించి పై కవితలో చెప్పడం జరిగింది.

అయ్యంకి వేణుగోపాల్ 'చెట్టు చెట్టుకో చరిత్ర ఉంది' అనే కవితను రాశారు.

**ఇక ఇంటి దీపాన్ని ఆర్పేసినప్పుడల్లా**
**మెరుపుల వానజల్లు కురుస్తుంది**
**అతడు నేల గూలిన చోట ఒక పూల మొక్క మొలుస్తుంది**
**చెట్లు అమరుల సజీవ స్మారకాలు**
**ఇప్పుడీ ప్రాంతమంతా వేలాది స్మారక చిహ్నాల వనంగా మారింది**
**చెట్టంత కొడుకును పోగొట్టుకున్న గర్భకోశం**
**పొగమంచై చమ్మలు చెమ్మలుగా కమ్ముకుంది**
**వేలాడుతున్న చితాభస్మం కుండ సాక్షిగా**
**ప్రతి చెట్టు ఒక కళ్ళు చెమర్చే కథ చెప్తుంది**
**ఇవేవి కనకుండా వినకుండా**
**కసితో కత్తివాటు వేస్తే**
**.............................................**

**.............................................**
**పచ్చని చెట్టు మీద ఒట్టేసి చెబుతున్న**
**నేల పొర్లల్లో వేగంగా విస్తరిస్తున్న**
**తల్లి వేరు**

**రేపు భూకంపం సృష్టిస్తుంది**
**తన బిడ్డ కోసం**
**భూదేవి కూడా**
**నేలను చీల్చక**
**తప్పలేదు (సూర్య – అక్షరం, 01/08/2011)**

అయ్యంకి వేణుగోపాల్ గారు సర్వ మానవాళి బ్రతుకుతున్నది చెట్ల వల్ల కనుక వాటిని ఎడాపెడా కొట్టకుండా వాటిని జాగ్రత్తగా రక్షించుకోవాలి అన్న కోణంలో పై కవిత రాయడం జరిగింది. మానవాళి భూమిపై జీవించటం మొదలుపెట్టినప్పటి నుండి చెట్లు మానవుడికి సహాయపడుతూ ఉన్నాయి. కాని మానవుడు వాటిని మాత్రం విచ్చలవిడిగా నరికివేస్తున్నాడు. అందువలన భూకంపాలు రావడం జరుగుతుంది. పై కవిత లాగానే జంధ్యాల అనే కవి కూడా 'చెట్టు ఇవ్వాల్టి నా కొత్త జననం' అనే కవితను రాయడం జరిగింది. ఆ కవిత యొక్క అర్థం కూడా మానవాళికి చెట్టు అవసరం గూర్చి తెలపడమే (*సూర్య – అక్షరం, 01/08/2011*).

'కొంతమంది' అంటూ సౌభాగ్య ఈ కింది కవితను రాశారు.

**సహజమైన మనుషుల గురించి**
**సాధారణమైన జనం గురించి**
**వింతగా చెప్పుకోడానికి విశేషాలేమి ఉండవు**
**వాటిని ముక్కలు చేస్తారు**
**పరవశాన్ని పక్కకు తోసేస్తారు**
**ప్రేమగా గులాబినిస్తే ముళ్ళ వేపు చూస్తారు**
**నవ్వు వాళ్ళని చూసి ఉపసంహరించుకుంటుంది**
**.............................................................**
**అందరికి లాగే వాళ్ళకూ వయసు పెరుగుతుంది**
**వయసుతో పాటు పెరగనిదేదో వాళ్ళని ఒడిసిపట్టుకొని ఉంటుంది**
**వాళ్ళు అనురక్తులే అభిశప్తులు**
**ప్రతిదాన్ని పట్టుకుంటారు**
**అన్నింటిని కోల్పోతారు (సూర్య – అక్షరం, 26/09/2011)**

సౌభాగ్య అన్న కలం పేరుతో విజయ్‌కుమార్ సమాజంలో ఉండే మనుషుల గురించి ఈ కవిత రాశారు. సమాజంలో ఉండే కొంతమంది మనుషులు దేనినైనా భూతద్దంలో చూస్తూ ఉంటారు. ప్రతి దానికి అనుమానం. ప్రతి విషయంపై చర్చోపచర్చలు. ప్రతిదానిని పట్టి పట్టి చూస్తుంటారు. చివరకు

దేనిని గెలువలేరు. అన్నింటిని కోల్పోతారు అంటూ కవి పై కవితలో తెలియజేశారు.

'వెలుతురు పక్షులు' అంటూ అవనిగడ్డ సూర్యప్రకాష్ కవితను రాశారు.

**కళ్లు చీకటి కుదుళ్ళలోంచి**
**నక్షత్రాలు వెక్కిరిస్తున్నాయి**
**ఊహల సరసీ జలాలలో**
**మానవ కలహంస ఈదులాడుతోంది**
**ఏవో అవ్యక్తానుభూతులను నెమరేసుకుంటూ**
**నాలో స్తబ్ధంగా ఉండిపోయిన స్మృతి భృంగాలు**
**రెక్కలు విప్పుకొని ఎగిరిపోతున్నాయి**
**వాంఛల పూరెమ్మలోకి**
**నారీశా మధువును తాగుతూ**
**జీవన ఎడారిలో ఆశా మరీచికల వెంట నేను**
**...........................................................**
**.................................................................**
**జీవితం రెక్కలు తెగిన పక్షిలా విలవిల పోతుంది**
**ఏ శిశిరమూ రాల్చేసిన ఈ చీకటి వృక్షాలపై**
**ఎప్పటికైనా వెలుతురు పక్షులు వాలకపోవన్న**
**నిరీక్షణతో ఊపిరి ఉలిపి కట్టెకు వేలాడుతూ**

**(సూర్య – అక్షరం, 26/09/2011)**

జీవితంలో ఎప్పటికైనా మనిషి ఆశావాద దృక్పథంలో ఉండాలి. ఏ శిశిరమూ రాల్చేసిన ఈ చీకటి వృక్షాలపై ఎప్పటికైనా వెలుతురు పక్షులు వాలకపోవా అన్న నిరీక్షణతో మానవ జీవితం కొనసాగాలి. ప్రతి జీవికి కష్టాలు అన్నవి చాలా సహజం. కష్టాలు వచ్చినప్పుడు కుంగిపోకుండా, సుఖాలు వచ్చినప్పుడు విర్రవీగకుండా అన్నింటినీ ఒకేలా తీసుకొని ముందుకు సాగిపోవడమే జీవితం అన్నది కవి ఉద్దేశం, ఈ కవిత ఉద్దేశం కూడా.

***

# అధ్యాయం – 3
# సూర్య దినపత్రిక సాహిత్య దృక్పథం – విశ్లేషణ

## 3.1. అక్షరం – నేపథ్యం:

- భావాలు వాటంతటవే రావు. "అభిప్రాయాల స్వరూపం మనిషి అస్థిత్వానికి సంబంధించిన సత్యం ద్వారా నిర్ణయమవుతూ ఉంటుంది" అంటారు మార్క్స్. నిజం అనేది ప్రజలబ నుంచి వస్తుంది. ప్రజల దగ్గరికి భావాలను తీసుకెళ్ళడం కాదు – ప్రజా హృదయాల దగ్గరగా వెళ్ళాలి. వాళ్లు అంగీకరిస్తే వాళ్ల భావాలకనుగుణంగా సరియైన స్పష్టమైన అభివ్యక్తినివ్వాలి.
- సరిగ్గా అదే లక్ష్యంతో వెలిసింది సూర్య దినపత్రిక. 'సూర్య'లో సాహిత్య సాంస్కృతిక వేదిక 'అక్షరం'. ఇది లక్ష్యసాధనకై పరుగులు తీస్తున్న 'అక్షర' రథానికి పూన్చబడి హవ్యములు (అశ్వములు), రథసారథి హవ్యవాహన వడి సామానులు కావడం మరో విశిష్టాంశం.
- సాహిత్యం సమాజపు ఉపరితల నిర్మాణం కాదు. సమాజ మూలాలతో దృఢంగా పెనవేసుకొన్న వాస్తవ సంఘటనలకు 'అక్షర' రూపం. అట్టిదే 'సూర్య'లో ఈ 'అక్షరం'.

## 3.2. సూర్య దినపత్రికలోని సాహిత్య వ్యాసాలు – విశ్లేషణ:

### 3.2.1. ఎం.బి.డి. శ్యామల:

సమాజంలో స్త్రీవాద నేపథ్యంలో స్త్రీ అస్తిత్వం కోసం అక్షరంలో తమ గొంతును వినిపించింది ఎం.బి.డి. శ్యామల.

'ఫెమినిజమ్ (Feminism) అనే మాటకు సమానార్థకంగా తెలుగులో వాడుకలోకి వచ్చిన మాట 'స్త్రీ'వాదం. మానవ సమాజంలోని సగ భాగమైన స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా అణచివేతకు గురి అవుతూ, పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థితిలో ఉండటాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ విముక్తిని కాంక్షిస్తూ, సమాజంలో ఎన్నో కట్టుబాట్లకు లొంగి పురుషుడి చేతిలో కీలుబొమ్మగా కాలం గడుపుతూ సంప్రదాయాల పేరుతో వంచింపబడిన స్త్రీలు తమ సమస్యలను ఏకరవుపెడుతూ తమ అస్థిత్వాన్ని నిలుపుకోవడానికి చేయు సాహిత్య ప్రయత్నమే స్త్రీవాద సాహిత్యం. ఈ అస్థిత్వ పోరాటంలో పితృస్వామ్య వ్యవస్థను ఉతికి ఆరేసిన వైనం డా॥ ఎం.బి.డి. శ్యామల తన వ్యాసాల ద్వారా పాఠకుల కళ్ళకు కట్టింది. ఇవి పాఠకుల కళ్ళనే కాదు హృదయాలను కూడా కట్టిపడేశాయనడం సత్యదూరం కాదు. అయితే ఇది

సమానత్వానికై ఉబలాటమే కాని, ఆధిపత్యానికై ఆరాటం కాదని మనం గ్రహించవచ్చు.

'అస్థిత్వం కోసం ఆగని ధిక్కారం' అనే శీర్షికతో సూర్య 'అక్షరం'లో 21 మార్చి 2011 (సోమవారం)న ప్రచురింపబడ్డ డా॥ ఎం.బి.డి. శ్యామలగారి వ్యాసంలో ఆదికాలం నుంచి స్త్రీని ఒక వైపు మాతృమూర్తిగా, ఇంటికి దీపంగా, త్యాగశీలిగా పరిగణిస్తూనే మరో వైపు బానిసగా, వ్యక్తిత్వం, స్వేచ్ఛలేనిదానిగా మొత్తం మీద పరాధీనగా చూశారని వాపోయింది. వేదకాలంలో 'గార్గి', 'మైత్రేయి' వంటి విదూషీమణులను గూర్చి ప్రస్తుతించింది. ప్రాచీన భారతీయ వ్యవస్థ స్త్రీకి పురుషునితో సమాన హోదాతో పాటు అఖండ గౌరవాన్నిచ్చి అత్యున్నత స్థానంలో నిలబెట్టింది. ప్రపంచ వాఙ్మయానికే మూలమైన ఋగ్వేద ఋక్కులను రచించిన వారిలో వాక్, రాకా, ఆర్చిష్మతి, సినీవాలి వంటి ఋషికలున్నారు. వేదకాలంలో వైద్య విద్యను బోధించడానికి స్త్రీలుండేవారు. వృత్తి విద్యలను నేర్చుకునేవారు. యజ్ఞయాగాది క్రతువులను నిర్వర్తించేవారు. యుక్త వయస్సులో నచ్చిన వరుణ్ణి పెళ్ళి చేసుకునే స్వేచ్ఛ ఉండేది. గృహిణిగా ఉదాత్తమైన గౌరవాభిమానాలు పొందేవారు. 'గోణికాదేవి' అనే కాశ్మీర దేశపు యోగినీమణి పతంజలిని యోగ భాష్యకారునిగా తీర్చిదిద్దింది. గౌతముని కన్నా ముందు 'సుబాల' అనే ఆమె న్యాయశాస్త్ర ప్రవీణిగా ఖ్యాతి నొందింది. మహా జ్ఞానిగా పేరొంది, జనకుని సభలో సత్కారాలందుకుంది. 'సులభ', 'గార్గి', 'మైత్రేయి' ఉభయ భారతులు వేదాంత తత్వవాదినులుగా కీర్తినొందినవారు. ఇదంతా గతంలో గతం కావడం శోచనీయం.

స్మృతుల కాలం నాటికి మత విశ్వాసాలు ప్రబలి స్త్రీ ఉన్నత స్థానం తగ్గించబడింది. పురాణ గాథలు, ధర్మశాస్త్రాలు, నీతి సూత్రాలు సృష్టించబడి పున్నమానరకం నుండి తప్పించేవాడు పుత్రుడు అని, పుత్రులు లేని వారికి సధ్గతులు ప్రాప్తించవని చెప్పుకొచ్చారు. మనుస్మృతిలో స్త్రీకి దుర్గుణాలు పోవని, చంచల స్వభావులని, వంచకులని, స్త్రీ బుద్ధి ప్రళయాంతకమనీ అందుకే మగాడి చాటునే ఉండాలని నిర్దేశింపబడింది. అనగా మనుధర్మ శాస్త్ర కాలానికి స్త్రీని దారుణంగా అణచివేయడం జరిగింది. దీనిని ఎంత మాత్రం నేటి స్త్రీ సహించరాదని తమ తిరస్కారాన్ని తెలియజేస్తున్న ఎంతో మంది స్త్రీవాద రచయిత్రుల మరియు కవయిత్రుల కంఠస్వరాలకు ఈ వ్యాసంలో స్థానాన్ని కల్పిస్తూ తనదైన ధిక్కార స్వరాన్ని వినిపించడం ద్వారా డా॥ ఎం.బి.డి. శ్యామల 'అస్థిత్వం కోసం ఆగని ధిక్కారం' అనే శీర్షికకు అసలైన అర్థాన్ని దాని వెనుక గల అంతరార్థాన్ని చెప్పకనే చెప్పింది.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్య పరిధి విస్తృతమయింది. వస్తు శిల్ప భావాల్లో ఎన్నో కొత్తదనాలు చోటు చేసుకున్నాయి. అనేక అస్థిత్వ ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. ముందుగా స్త్రీవాదం తరువాత దళిత, మైనారిటీ, బహుజన, ప్రాంతీయవాదాలు పుట్టుకొచ్చాయి. వీటన్నింటికీ పాశ్చాత్య సాహిత్యమే పునాది అని చెప్పుకోవచ్చునేమో గాని స్త్రీవాదం పూర్తిగా పాశ్చాత్య దేశాలనుండి దిగుమతి చేసుకున్నది కాదు. 1950–60లనుంచి నేటివరకూ స్త్రీల ఆలోచనా ధోరణి మన దేశంలోని స్త్రీల దుస్థితికి వ్యతిరేకంగా తలెత్తి బలం పుంజుకొని 1980 దశకం ప్రథమార్థానికి ఉద్యమరూపం దాల్చింది.

‘వ్యక్తి జీవితం స్వేచ్ఛ, సామాజిక సంబంధాలతో సాపేక్షమైన అంశంగా ఉంటుంది’ అని అస్తిత్వవాద పితామహుడు జీన్‌పాల్ సార్త్ర మాటలను ఉటంకిస్తూ ‘పితారక్షతి కౌమారే | భర్తారక్షతి యౌవనే | పుత్రో రక్షతి వార్ధక్యే |న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి’ అని తేల్చి చెప్పడంతో హక్కుల సంగతి అటుంచి కనీసం స్త్రీని ఒక వ్యక్తిగా కూడా పితృస్వామ్య సమాజం గుర్తించడం లేదని ప్రస్ఫుటీకరించింది. స్త్రీని భోగ వస్తువుగా, ఆస్తిగా, ఆట వస్తువుగా భావించే పురుషాధిక్య ప్రపంచాన్ని ఖండించింది. బహుభార్యత్వం, అవిద్య, బాల్యవివాహాలు, వితంతు పునర్వివాహ నిర్మూలనం, సతీసహగమనం – ఇలా స్త్రీ అణచివేత బహుముఖీయమైనదని చెబుతూ; ఈ ఛాందస భావాలకు వ్యతిరేకంగా ఉద్యమించి స్త్రీ అభ్యున్నతికి కృషి చేసిన ‘ఈశ్వర’చంద్ర విద్యాసాగర్, వీరేశలింగం వంటి వారికి స్త్రీ జాతి మొత్తం ఋణపడిందని శ్యామల ఈ వ్యాసం ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తుంది.

మోసేవారికి తెలుస్తుంది కావిడి బరువు అన్నట్టుగా, ప్రసవ వేదన అనుభవించే వారికే తెలుస్తుంది ఆ బాధలేమిటో. “ఒకసారి ప్రసవ వేదన అనుభవించడం కంటె పదిసార్లు యుద్ధ రంగానికి వెళ్లి రావడం సులభం” అంటుంది ఒక స్త్రీవాద రచయిత్రి. ఎవరో వచ్చి తమ సమస్యలకు గొంతెత్తుతారనే ఆశను వదలి, తమ గొంతును సవరించుకొని గళమెత్తారు ఎందరో స్త్రీవాద రచయిత్రులు, కవయిత్రులు. వారి రచనల్లో ఆవేదన, ఆర్ద్రత సమపాళ్ళలో ప్రవహిస్తున్నాయి. అట్టి వాటిలో రంగనాయకమ్మ ‘జానకి విముక్తి’ వంటి రచనలు ఎంతగానో ప్రభావితం చేశాయి. 1990లో వచ్చిన ‘గురిచూసి పాడే పాట’, 1993లో వచ్చిన ‘నీలిమేఘాలు’ కవితా సంపుటంతో పాటు, వసంత కన్నాభిరన్ రాసిన ‘స్త్రీగా రాయడమంటే’, ఓల్గా రాసిన ‘సంకెళ్ళు తెగుతున్న సంగీతం’ అనే వ్యాసాలు స్త్రీవాద దృక్పథాన్ని, సిద్ధాంత పరిధిని విస్తృతపరిచాయి. 1973లోనే ఓల్గా ‘ప్రతి స్త్రీ ఒక నిర్మల

కావాలి' అన్న కవితలో "అందమైన దోపిడికి/పవిత్రమైన హింసకి/న్యాయమై దాస్యానికి/ బలయిపోయిన నేను/భారతస్త్రీని!" అంటూ వాపోయారు. ప్రాకృతికంగా స్త్రీ పురుషులు సమానులే. కానీ, నేడు విభజించి పాలించే సంస్కృతిని గూర్చి వివరిస్తూ సావిత్రి 'బందిపోట్లు' కవితలో 'పెళ్ళి' 'మొగుడు' అనే పదాలకు స్త్రీలు కొత్త అర్థాలను ఎలా కల్పించుకోవలసి వచ్చిందో స్పష్టమవుతుంది.

**"పాఠం ఒప్పజెప్పకపోతే పెళ్ళి చేస్తానని**
**పంతులు గారన్నప్పుడే భయం వేసింది**
**ఆఫీసులో నా మొగుడున్నాడు!**
**అవసరమున్నా సెలవివ్వడని**
**అన్నయ్య అన్నప్పుడే**
**అనుమానం వేసింది**
**పెళ్ళంటే పెద్ద శిక్షని**
**మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని**
**మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే**
**మమ్మల్ని విభజించి పాలిస్తోందని?"**

పెళ్లిలో అరుంధతి నక్షత్రం చూపిస్తూ ఆకాశంలో సగం చూపి, అవకాశాలలో సగం ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మొక్కపాటి సుమతి 'మిత్ర వైరుధ్యం' అనే కవితను ఆధారంగా చేసుకొని వ్యాసకర్త ఈ వ్యాసంలో ప్రశ్నించారు. కవిత్వంలోనే గాక కథా సాహిత్యంలోనూ స్త్రీలు విస్తృత కాన్వాస్‌పై అనేక పాత్రలు చిత్రించారు. బండారు అచ్చమాంబ మొదలైన స్త్రీ చైతన్య కథాసాహిత్యం – స్త్రీవాద కవితోద్యమం వరకూ స్త్రీ అస్థిత్వాన్ని వెలువరించే కథనంలో, ఆలోచనాత్మక ప్రవాహ గతిలో వచ్చిన మార్పులను వివరించింది. చలం, భమిడిపాటి వంటివారు స్త్రీ అస్థిత్వం గూర్చి ఎన్నో కథలు రచించారని; ముఖ్యంగా చలం స్త్రీ హృదయాన్ని అర్థం చేసుకున్నాడని, స్త్రీకి నిజమైన స్వేచ్ఛ అంటే ఆమె కోరుకునే విధంగా జీవించడమేనని, ఆమెను కుల, మత కట్టుబాట్ల మధ్య పంజరంలో బంధించడం సరికాదని, లైంగిక స్వేచ్ఛను సైతం ఆమెకు అందివ్వాలని, అసలు స్వేచ్ఛ ఒకరు ఇస్తే వచ్చేది కాదని, అది ఎవరో పెట్టిన భిక్ష కాదని చలం తన రచనల ద్వారా నిజమైన స్త్రీ స్వేచ్ఛ ఆకాంక్షిగా మిగిలిపోయిందని ఎం.బి.డి. శ్యామల తన వ్యాసంలో తెలియజేసింది.

ఇవాల్టి స్త్రీ అస్తిత్వవాద రచయిత్రులు, కవయిత్రులు తమను తాము వ్యక్తం చేసుకుంటూ, తమకు జరగాల్సిన న్యాయంకోసం తమ వాణిని వినిపిస్తున్నారు. భయపెట్టేవి సమాజ పరిస్థితులూ, సమాజమూ మాత్రమే

కాదని, తమ మనసులో తరతరాలుగా పేరుకున్న భయ సందేహాలూ, ఆలోచనలేనని తెలుసుకుంటూ తమదైన మార్గంలో ప్రయాణించడానికి తమకున్న హక్కును నిర్ద్వంద్వంగా వ్యక్తం చేస్తున్నారు అంటూ స్త్రీకి మానసిక ధైర్యాన్ని నూరిపోసినట్టుగా ఉంది శ్యామల గారి వ్యాసం.

**'ఇద్దరు పురుషుల జెండర్ జెండా'** అనే శీర్షికతో డా॥ ఎం.బి.డి. శ్యామల 'అక్షరం' లో ఏప్రిల్ 4, 2011 (సోమవారం) నాడు ఒక వ్యాసాన్ని ప్రచురించారు. ఇందులో ఇద్దరు పురుషులు స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిచ్చి, ఆర్థిక స్వాతంత్ర్యానికి బాటలు వేయుటకు బాలికా పాఠశాలలు పెట్టి, వితంతు వివాహాలు చేసి స్త్రీకి చేయూతనిచ్చిన వారొకరు. ఎవరూ ఆలోచించని విధంగా స్త్రీ హృదయానికి, దాని స్పందనలకు ప్రాధాన్యతనిచ్చి స్త్రీల తరపున ప్రపంచంతో వాదించి అనేక రచనలతో స్త్రీ హృదయానికి అద్దం పట్టిన వారింకొకరు. ఒకరు ఆనాటి సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు. మరొకరు స్త్రీ జనాభ్యుదయవాది గుడిపాటి వెంకటాచలం. వీరిద్దరూ స్త్రీలకు చేసిన సేవను పేర్కొంటూ శ్యామల ఈనాటి స్త్రీ పరిస్థితిని, స్త్రీ స్వేచ్ఛనీ గూర్చి ఈ వ్యాసం ద్వారా పాఠకులను ఆలోచింపజేసింది.

**'దీవీం వాచమ జనయంత**
**దేవాస్తాం విశ్వరపాం పశవో వదంతి'**

ఋగ్వేదంలో 8వ మండలంలోని ఋక్కు ఇది. దేవతలంతా కలసి వాగ్రూపమైన దేవి (సరస్వతి)ని సృష్టించుకున్నారని ఈ ఋక్కుకు అర్థం. విద్యకు చిహ్నమైన దేవత స్త్రీ అయినా మొన్న మొన్నటిదాకా స్త్రీకి విద్య అందని ద్రాక్ష కావడం ఎంత విడ్డూరం! అని శ్యామల ప్రశ్నిస్తుంది.

ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో 'రాజుల్ మత్తులు వారి సేవ| నరక ప్రాయంబు వారిచ్చు నంభోజాక్ష చతురంతయాన తరుణీ భూషాదులాత్మ వ్యధాబీ| జంబులు' అంటాడు! రాజులిచ్చే పల్లకులు, ఆడు గుర్రాలు, అలంకార వస్తువులతో పాటు స్త్రీలు (అంభోజాక్షులు) కూడా దాన వస్తువులవడం ఎంత దుర్మార్గం? అని ప్రశ్నిస్తుంది వ్యాసకర్త. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు; కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీల సాధికారతను గూర్చి ఘోషిస్తున్నాయి. శాసనాలు చేశారు. అయినా స్త్రీల వరకట్నపు చావులు, అత్యాచారాలకు గురవుతుండడాన్ని ఈమె ఈ వ్యాసం ద్వారా పాఠకులను ప్రశ్నిస్తున్నారు. తల్లిదండ్రులు మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను ఉన్నత విద్యకు పంపుతున్నారా? ఎవరి ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యతనిస్తున్నారని? ప్రశ్నిస్తూ నేటి సమాజంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు రావాలని వ్యాసకర్త కోరుకుంటుంది. స్త్రీ

అంగాంగ వర్ణనలను గొప్పగా చిత్రించిన ప్రబంధ కాలపు కవులు స్త్రీకి ఒక హృదయం ఉన్నదనే విషయాన్ని మర్చిపోయినారు. 'స్త్రీకి శరీరం ఉంది, దానికి వ్యాయామం ఇవ్వాలి. స్త్రీకి మెదడు ఉంది, దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది దానికి అనుభవం ఇవ్వాలి' అన్న చలం మాటలను గుర్తుచేస్తే స్త్రీని వంటిల్లుకే పరిమితం చేసిన పితృస్వామ్య వ్యవస్థపై ధ్వజమెత్తిన వైనాన్ని ఈ వ్యాసంలో గమనించవచ్చు.

కందుకూరి గాని, గురజాడగాని ఆచారాలు, కట్టుబాట్ల ముసుగులో స్త్రీ జీవితాలను హింసకు గురిచేయడాన్ని అధిక్షేపించారు. ఆవేదనతో రచనలు చేశారు. కాని స్త్రీ పరిపూర్ణ స్వేచ్ఛపట్ల, మహిళా చైతన్యపు సాధికారత పట్ల సీరియస్‌గా ఆలోచించలేకపోయారు అంటూ అందుకు ఆనాటి సాంఘిక పరిస్థితులే కారణం అని వ్యాసంలో చెప్పారు. కందుకూరిది స్త్రీల విషయంలో ఒక రకమైన బాట అయితే చలంది మరో మార్గం. చలం స్త్రీల విషయంలో లోతుగా ఆలోచించి, అధ్యయనం చేసి స్త్రీలు ఎన్ని విధాలుగా అణచివేతకు గురవుతున్నారో – మానసిక హింసకు బలవుతున్నారో తన రచనల ద్వారా లోకానికి తెలియజేశాడు. అంతే కాకుండా సాంస్కృతికంగా స్త్రీల అణచివేతను బహిర్గతం చేస్తూనే – వారి మనస్సు ఎంత కోమలమో, ఎలాంటి స్వేచ్ఛను వారికి అందించాలో, స్త్రీల మనోగతాలేమిటో అర్థం పడుతూ స్త్రీ చైతన్యం ప్రధాన భూమికగా రచనలు చేశాడు. కందుకూరి అన్నెం పున్నెం ఎరుగని బాలికలను ఆడుకునే వయస్సులో 'పెద్దయ్య' లాంటి పెళ్ళి కొడుకులకిచ్చి పెళ్లి చేయడాన్ని 'బ్రహ్మ వివాహం' అనే ప్రహసనంతో దుయ్యబట్టాడు. ఇది నిజానికి ప్రహసనమే అయినా ఇలాంటి పరిస్థితులు ఒక్క తెలుగు రాష్ట్రంలోనే కాదు. దేశమంతటా ఇదే పరిస్థితి. కందుకూరి తన సాహిత్యంతో మేధావులను ఆలోచింపజేయడమే కాదు, స్త్రీల దయనీయ పరిస్థితికి అవిద్యయే కారణమని గుర్తెరిగి బాలికల కొరకు పాఠశాలలు నిర్మిస్తున్నప్పుడు రాళ్లె దెబ్బలు తిన్న సందర్భాలను ఈ వ్యాసం ద్వారా పాఠకులకు శ్యామల తెలియజేస్తున్నారు. దేశంలో మెకాలే ప్రవేశ పెట్టిన ఆంగ్ల విద్యా ప్రభావంతో 'జానకమ్మ' లాంటివారు స్వాతంత్ర్యానంతరం స్త్రీలలో విద్యావ్యాప్తికి జరిపిన కృషిని గుర్తుచేస్తున్నారు శ్యామల. పూర్వం నుండి పురుషుని ఇచ్ఛానుసారమే స్త్రీలు వస్త్రధారణ, వేషధారణ మొదలగునవి కొనసాగించబడుతున్నాయని, కనీసం అలంకరణలోనైనా ఆడదానికి స్వేచ్ఛలేదే... ఇంకెక్కడ స్త్రీ స్వాతంత్ర్యం, ఇంకెక్కడి స్త్రీ పురుష సమానత్వం అని ప్రశ్నాస్త్రాలను పాఠకుల గుండెలకు గురి పెట్టింది. కవీశ్వరులు కావలసినవారు, సంగీత విద్వాంసులు కాగలవారు పురుషాధిపత్య సమాజంలో వంటిల్లే ప్రపంచంగా

వంట పాత్రలే సంగీత వాయిద్యాలుగా తయారు చేయబడి, చివరికి ఆ పాత్రలపై కూడా తమ పేరు లేదని బోరున తల బాదుకున్న వైనాన్ని వ్యంగ్యంగా చమత్కరించారు శ్యామల.

రాజకీయాలలో స్త్రీకి సముచిత స్థానం కల్పించాలని 33% కోటాతో సీట్లను కేటాయించి, గెలిచిన తరువాత స్థానిక సంస్థల్లో ఆమె భర్తనో, తండ్రో పరోక్షకంగా అధికారం చెలాయించడం జగమెరిగిన సత్యం. ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీలు వ్యాపార ప్రకటనల సరుకుల వైనాన్ని శ్యామల ప్రస్తుతించారు.

ఇలా స్త్రీని ఆట వస్తువుగా, అంగట్లో సరుకుగా, రాజకీయ చదరంగంలో పావుగా, వంటింట్లో పనిమనిషిగా, ఇంటికి బానిసగా, చదువుకు దూరంగా, బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహ నిర్మూలనం లాంటి సాంఘిక దురాచారాల మత్తులో అసలు ఆమెకు మనసొకటుందని మరిచిన పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ అభ్యున్నతియే లక్ష్యంగా కంకణబద్ధులైన మహనీయులు ఇద్దరు. ఒకరు స్త్రీల విద్యకు, ఆర్థిక స్వాతంత్ర్యానికి బాటలు వేస్తే, స్త్రీ హృదయ స్పందనలకు ప్రతిస్పందించినది మరొకరు. వారు ఇద్దరు కాదు ఒక్కరే ఎందుకంటే వారి ఎజెండా ఒక్కటే వారు స్త్రీల దృష్టిలో మహనీయులు కాదు. మహాశక్తి. ఆ మహాశక్తి పేరే కందుకూరి చలం.

'స్వేచ్ఛ'ను వాంఛించే వారెవరైనా ఇతరుల బానిసత్వాన్ని సమర్థించరు. స్త్రీ పురుష సమానత్వాన్ని భావకవులు కాంక్షించారు. అమలిన శృంగారానికి పెద్ద పీట వేయడం ద్వారా స్త్రీని ప్రణయ దేవతగా ఆరాధించడం గూడా కనబడుతుంది. ఈ నేపథ్యంలో కృష్ణశాస్త్రి దృక్పథంలో 'కృష్ణపక్షంలో స్త్రీ వెలుగు పక్షం' (*అక్షరం, మే 2, 2011*) అనే వ్యాసంలో ఎం.బి.డి. శ్యామల స్త్రీ మూర్తిని పరిశీలించింది. కృష్ణశాస్త్రి మాటల్లో చూస్తే (*'ఊర్వశి' ప్రసంగ వ్యాసం... కృష్ణశాస్త్రి వ్యాసావళి – 2, పుట:59*) ఒక ఆంధ్రకవి కృష్ణపక్షంలో ప్రవాసియై తిరిగి తిరిగి, కంటపడ్డ ప్రతి లావణ్యాన్ని కదిపి కదిపి, లోకంలో తనకు నచ్చిన సౌందర్యం లేదని, తన్ను ప్రేమించి, తాను ప్రేమించే ప్రేయసి లేదని, కృంగిపోయి 'నాకు గాదులు లేవు నాకు షస్సులు లేవు' అని నరకంలోకి వచ్చాక, తపస్సు పూర్తి అయి శాంతచిత్తుడై తానే ప్రేయసిని సృష్టించుకున్నాడట! ప్రవాసి అయనవాడు కృష్ణశాస్త్రి సృష్టించుకున్న ప్రేయసి 'ఊర్వశి'. ఈ ఊర్వశి దేవ వేశ్య అయిన ఊర్వశి కాదు. ఎన్నడెన్నడో కంట సోకిన ప్రతి సౌందర్య ఖండాన్ని, ఎపుడెపుడో పలకరించిన ప్రతి ప్రేమ శకలాన్ని, ఎక్కడెక్కడికో పరిగెత్తకు వెళ్ళి ఏరి ఏరి తెచ్చుకొని నిర్మించుకున్న అపూర్వ సౌందర్యరాశి!

కృష్ణశాస్త్రి తన ప్రేయసికై ఆరాటపడ్డాడు. 'ఆకులో ఆకునై పూవులో పూవునై' అని ప్రకృతిలో తన ప్రతి ప్రయాణంలో ప్రేయసిని వెతికాడు. ఆమె స్వచ్ఛమైన ప్రేమను కాంక్షించాడు. తన్ను కనుల నిండా నింపుకొని కలలు కన్నాడు. హృదయాసనాన్ని వేసి ఆరాధించాడు. ఆమెలోని స్వేచ్ఛా ప్రియత్వాన్ని మలిన పరిచే అవకాశవాదులను నిందించాడు, నిలదీశాడు. మోసమే ఎరుగని పూబాల తన్ను దరిచేరిన మధుపాణిని మనసారా విందు చేస్తే, తేనె నిండుకున్నాక ముఖం చాటేసిన తుమ్మెదను నిందించి... లోకాన ఇలాంటి అమాయకపు స్త్రీలు ఎందరో కదా? అంటూ స్త్రీ మనస్తత్వాన్ని స్పృశించాడు, స్తుతిమెత్తగా స్త్రీని హెచ్చరించాడు.

అంతః సౌందర్యాన్ని అసలు పట్టించుకోకుండా క్షణికమైన బాహ్య సౌందర్యానికి అపారమైన ప్రాధాన్యతనిచ్చిన ప్రాచీన సాహిత్యంపై ఒక పెద్ద తిరుగుబాటు చేసిన భావకవిత్వం స్త్రీ హృదయానికి, వ్యక్తిత్వానికి అమిత గౌరవాన్నివ్వడం ఆనందకరమే అయినా... 'ఆడది అబల' అనే భావన నుండి భావకవులు కూడా బయటకు రాలేదు. ఇనుప పంజరాల నుండి స్త్రీ వ్యక్తిత్వాన్ని విడుదల చేసినా, అందమైన బలిష్ఠమైన పూల తీగల పంజరంలో స్త్రీని సగౌరవంగా కూర్చోబెట్టారనిపిస్తుంది! అయితే తరువాత స్త్రీ స్వేచ్ఛా వాదానికి బాటలు వేసినది మాత్రం భావకవులేననేది నిర్ద్వంద్వంగా కాదనలేని సత్యం! ఇంకొక వైపు స్త్రీలోని మానవత్వాన్ని, ప్రేమని, వాత్సల్యాన్ని, ఔదార్యాన్ని అనేక పార్శ్వాలలో తన నవల్లో ప్రతిబింబింపజేసిన ప్రముఖ నవలా రచయిత శరత్ చంద్ర ఛటోపాధ్యాయ. ఒక్క బెంగాలీనే కాదు... భారతీయ స్త్రీ హృదయాన్ని అద్భుతంగా ఆవిష్కరించినవాడు శరత్. ఈయన ప్రతి నవలలోను అవ్యాజ ప్రేమమూర్తి, అనిర్వచనీయ త్యాగమూర్తి అయిన స్త్రీ మహోన్నత హృదయం ఆవిష్కృతమవుతూనే ఉంటుంది. తెలుగులో బొందలపాటి శివరామకృష్ణ, శకుంతల దేవిల అనువాదం సరళంగా చక్కగా ఉంటుంది. శరత్ నవలలో పాత్రలన్నీ సామాన్యమైనవే! సమాజంలో తిరుగుతూ, వారితో కలిసిమెలిసి ఉంటూ తాను చూసిన జీవితాల బాధల గాథల్ని, మూర్ఖపు సాంప్రదాయాల బారిన పడి బలై బలవంతపు పాతివ్రత్యాన్ని కట్టపెట్టిన నిర్భాగ్యురాళ్లని, శరీరంతో వైధవ్యాన్ని భరిస్తూ హృదయంలో అంకురించి తుంచిన కొద్ది ఇగురులెత్తే ప్రేమానుభూతిలో ఘర్షణ పడే స్త్రీలను, సమాజపు మేడిపండు చందాన్ని ఒక్కోచోట మెత్తగా, ఒక్కో చోట తీవ్రంగా, ఒక్కో చోట కంటనీరు పెట్టించే విధంగా ఆర్ద్రంగా చెప్పగలిగాడు శరత్! అందుకే మన తెలుగు దేశంలో స్త్రీవాదిగా ముద్రపడ్డ చలం 'నేను స్త్రీలకు వెన్నుముకనిచ్చి నిలబెడితే... శరత్ వాళ్లకు హృదయాన్నిచ్చి

బతికించాడు!' అని ప్రశంసించాడు. శరత్ నవలల్లోని పాత్రలేవి సమాజంచే అత్యున్నతంగా గౌరవించబడ్డవి కావు. సావిత్రి, కిరణ్మయి, కమల, రాజ్యలక్ష్మి సభ్య సమాజంచే పతితలుగా ముద్ర వేయబడ్డవారే. వివాహం, పాతివ్రత్యం, పవిత్రత – ఇలాంటి కుహనా ముసుగులన్నిటిపైనా పిడుగుపాటు లాంటిది అభయ పాత్ర. శరత్ స్త్రీ పాత్రలన్నీ పరిశీలిస్తే అభయ తీసుకున్న లాంటి నిర్ణయం సాధారణంగా ఏ పాత్ర తీసుకోలేదు. హృదయాన్ని అర్థం చేసుకోకుండా సమాజం చేసే బొమ్మల పెళ్ళిళ్లతో ఎన్ని బతుకులు బలైపోతాయో అనేందుకు సజీవ తార్కాణం కిరణ్మయి పాత్ర. శరత్ 'బడదీది'లో వితంతులైన బడదీది మాతృ హృదయం అమాయకుడైన నరేంద్రుని ప్రేమిస్తుంది. అతని క్షేమం కోసం తల్లడిల్లిపోయింది. అలాగే 'సరయు'లోని సరయు తల్లి పాత్ర భర్తనొదిలి ఆకర్షణలో పడి వేరొకరితో వెళ్లి పోయి... తర్వాత తన 'సరయు' ప్రేమకోసం తల్లడిల్లే పాత్ర. శరత్ సృష్టించిన పారు, దేవదాసు పాత్రలు, వారి భగ్న ప్రేమ భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయింది.

శరత్ నవలల్లో స్త్రీలు వారి ఆంతరంగిక సంఘర్షణలు, పురుషున్ని నమ్మి మోసపోయి మోడుగా మిగిలిన జీవితాలు, భర్త రెండో పెళ్ళి చేసుకొని తిరిగి ఈమెను కూడా పొందుటకు ప్రయత్నిస్తే నేనేమైనా వేశ్యనా అని ప్రతిఘటిస్తూ తనను ప్రేమగా చూచుకొనే వాడిని పెళ్ళి చేసుకొనే తెగింపు, పెళ్ళి చేసుకొని మోసం చేసి వెళ్ళిపోయిన భర్తకై వేచి చూసే అమాయకపు మనస్తత్వం ఇలా ఇవన్నీ శరత్ సృజన చేస్తే వెలుగు చూసినవి కావు నాటి సమాజంలో స్త్రీల వాస్తవిక గాథలు. శరత్ నవలలు సమాజాన్ని ఆలోచింపచేశాయి. సమాజంలో సగమైన స్త్రీల జీవితాలలో మార్పును ఆకాంక్షించాయి. తద్వారా హృదయ శూన్య సమాజంలో స్త్రీల అమృత హృదయాలను ఆవిష్కరించిన మానవతావాదిగా శరత్‌ను నిలబెట్టాయి.

### 3.2.2. జూపాక సుభద్ర:

## తెలుగు కథ దళిత మహిళావాదం:

సమాజంలో ఆధిపత్య ధోరణులు ప్రబలి ఏదో ఒక వర్గం యొక్క ఉనికే ప్రశ్నార్థకమైతే కచ్చితంగా పీడనానికి గురవుతున్న ఆ వర్గం ప్రతిఘటన చేయడం సర్వ సాధారణం. అది ఉద్యమ రూపాన్ని అందుకోవడం కూడా సహజమే. అలా సమాజంలో అస్థిత్వానికై చేసే ఉద్యమాలే అస్థిత్వ ఉద్యమాలు. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, ప్రాంతీయవాదం మొదలైనవన్నీ ఆ విధంగా పుట్టుకువచ్చినవే. ప్రతి వాదంలోను అంతర్గతంగా ఘర్షణలు మొగ్గ తొడగడం అనివార్యమైపోయింది. ఆ కోవకు చెందినదే స్త్రీవాదంలో దళిత

మహిళావాదం కూడా. ఈ భావాన్ని పురస్కరించుకొని జూపాక సుభద్ర 'తెలుగు కథ – దళిత మహిళావాదం' అనే శీర్షికతో సూర్య దినపత్రిక 'అక్షరం'లో 23/05/2011న ఒక వ్యాసం ప్రచురించారు.

తెలుగు స్త్రీవాద సాహిత్యం ప్రధానంగా కోస్తా, సీమ ఆధిపత్య కులాల స్త్రీలనుంచే వచ్చింది. తమ కథల్లో జీవితాలకంటే ఎక్కువగా ఫెమినిస్టు సిద్ధాంతాలనే ప్రతిపాదించారు. స్త్రీలంతా ఒక్కటే అనే సిద్ధాంతం చేసి తమ సమస్యలే మొత్తం స్త్రీలందరి సమస్యలుగా బుకాయించారు. దళిత మహిళల కుల దోపిడిని, శ్రమ దోపిడిని, హింసని, దురాచారాల్ని, వారి అనుభవాల్ని, సంస్కృతుల్ని అణచి వేయడంలో ఆధిపత్య మగవాళ్లనే అనుసరించారు. 'మాకు గోడలు లేవు' అని ప్రకటించుకున్న స్త్రీవాదులు కుల గోడల్ని కూల్చడంలో మౌనం వహించారు. కుల జెండర్ అస్థిత్వాలైన కులం, శ్రమ వారి రచనల్లో కనిపించదు. ఈ దురాచారాన్ని నిత్యం ప్రశ్నిస్తున్న ఉత్పత్తి కులాల స్త్రీలను స్త్రీవాదులు సీరియస్‌గా చర్చ చేయక నిరాకరించుతూనే ఉన్నారు. దానితో స్త్రీవాదం పితృస్వామ్య విముక్తిగానే ఆగిపోయింది. సమాజంలో అగ్రవర్ణాలకు అన్ని విధాలుగా సేవలందిస్తూ, శ్రమదోపిడికి గురవుతూ సమాజానికి దూరంగా వెలి వేయబడుతూ వివక్షకు గురవుతున్న దళిత మగవారు బానిసలుగా బ్రతికితే ఆ బానిసలకు బానిసలుగా దళిత స్త్రీలు జీవిస్తున్నారు. ఇట్టి పరిస్థితులకు చలించిపోయిన దళిత కథా రచయిత్రులు తమ కలాన్ని వారికై కదిలించారు. నంబూరి పరిపూర్ణ 'స్ఫూర్తి' కథ – ఇంటిని, పిల్లల బాధ్యతల్ని పట్టించుకోకపోగా, తాగి తందనాలాడుతూ కొట్టి తిట్టే భర్తను వదిలించుకునే భార్య ముందడుగు గురించి చెబుతుంది. స్త్రీ పురుషుల సమానత్వం అన్నది నోటిమాటే గాని నిజం కాదు అని లలితా పీటర్ తన 'కరిగిన స్వప్నం' కథలో చెప్పారు. ఇంకా మామిడి సత్యవతి, సెంటినా సరోజిని, మానుకొండ జ్యోతి స్త్రీ పురుషుల సమానత్వం, కుటుంబ బాధ్యతల మీద పురుషుల నిర్లక్ష్యాన్ని నిలదీసే కథలు వరుసగా 'తెర తొలగింది', 'వింత పశువు', 'వెలుగు రేఖలు'లో చిత్రీకరించారు. కింది కులాలు నీచం అనీ, శీలం లేనోళ్ళు అనీ – గర్వంతో అవమానించే ఒక ఆధిపత్య కులపామె తన బిడ్డని ఆసుపత్రికి తీసుకొస్తుంది. ఆ బిడ్డ చావు బతుకుల్లో కొట్టు మిట్టాడుతుంటుంది. 'ఒక రిక్షావాడి రక్తం ఉంది ఎక్కించమంటారా?' అని అడుగుతుంది – ఆమె దగ్గర, ఆమె ఇంట్లో పని చేసి, ఛీత్కారాలకు గురై, చదువుకోని, డాక్టరైన సమీర (దళిత స్త్రీ) ప్రశ్నిస్తుంది గెద్దాడ కస్తూరి కథ 'రక్తమా నీదే కులం'లో. దళిత పిల్లలే బాల కార్మికులుగా మారడాన్ని పుట్ల హేమలత 'నూతిలో కప్ప' కథలో ప్రశ్నిస్తుంది. కులాంతర వివాహాలు చేసుకున్న తర్వాత కూడా దళిత

సంస్కృతిని, భాషని హేళన చేసిన సంఘటనలను వ్యాసకర్త ఇక్కడ వివరించింది.

జాజుల గౌరి 'మన్ను బువ్వ' కథా సంకలనం మొత్తం దళిత కులాల్లో అడుగడుగునా ఎదుర్కునే సంఘర్షణలను, అవమానాల్ని, హేళలను ఆవిష్కరించారు. గోగు శ్యామల 'ఏనుగంత తండ్రి కన్నా ఏకుల బుట్టంత తల్లి నయం' కథలో బయట కూలి పనీ, ఇంటి పనీ, పిల్లల సంరక్షణ, పోషణ అంతా దళిత తల్లులే చూడాల్సిన బాధ్యతగా ఉంటుంది. తండ్రి కన్నా తల్లే నయమని బాధ్యతా రహితులైన తండ్రుల్ని నిలదీస్తుంది. అత్యాచారం చేసే మగవాని రెండు కాళ్ల మధ్యలో తన్ని పారిపోయి వచ్చే దళిత అమ్మాయి కథ 'తాటకి'లో చెప్పారు. ఎం. వినోదిని 'మరియ' దళిత స్త్రీలపై ఆధిపత్య కులాలు లైంగిక అత్యాచారాలు చేసినా అది తప్పు కాదనే ఆధిపత్య కులాల నీతి దళిత స్త్రీలను ఎలా బలిచేస్తుందో చెప్పే కథ. జూపాక సుభద్ర – దళిత ఆడవాళ్ళకి, అదీ ఉద్యోగం చేసే దళిత మహిళలకు ఇండ్లు కిరాయికి దొరకని కులనీతిని, ఎన్నో పోరాటాలు చేసి మేము పగలగొట్టిన ముంత, మల్లా మూతికి కడుతున్నట్టే ఉంది అని 'శుద్ధి చేయాలి' కథలో వివరించారు. కులాంతర వివాహం చేసుకున్న దళిత మహిళ ఎంత విధ్వంసానికి గురవుతుందో చెప్పే కథ 'ఆదర్శ విధ్వంసం'. మాదిగలను ఆశ్రయించి బతికే డక్కలి మహిళ కథ 'మాన్యం'. కామందు పెండ్లికి నడుము విరిగేటట్లు చాకిరి చేసినా పిడికెడు మెతుకులకు కూడా నోచుకోక సొమ్మసిల్లి పడిపోయిన దళిత మహిళ కథ వి. నాగమణి 'మనువు గాడి పెండ్లి' కథ.

ఇలా కులపు మరకలు వంటికే కాదు రక్తానికి కూడా అంటుకున్న వైనాన్ని బాధాతప్త హృదయంతో జూపాక సుభద్ర వ్యాసీకరించింది.

ఈ విధంగా సమాజంలో తమచుట్టూ ఉన్న, తమపై జరుగుతున్న అన్నిరకాల అవమానాల్ని, అంటరానితనాల్ని, కుల వివక్షల్ని, మగాధిపత్యాల్ని, శ్రమ దోపిడిని ప్రశ్నిస్తూ... దళిత స్త్రీలు ఈ కుల పంకిల సమాజంలో చదువుకోవడమే ఒక సవాలు. రాయడమనే ప్రక్రియ ఒక యుద్ధం. అది అచ్చు కావడం ఇంకో అణు యుద్ధం. అయితే కథలు చెప్పడంలో దళిత స్త్రీ తర్వాతే ఎవరైనా! అంటుంది వ్యాసకర్త జూపాక సుభద్ర.

ఆధునిక తెలుగు కథ ఆరంభ వికాసాల చరిత్రలో రచయిత్రులు రాళ్ళెత్తిన కూలీలవలె నిర్లక్ష్యానికి గురయ్యారు. తొలి తెలుగు కథకుడుగా ప్రసిద్ధుడైన గురజాడకు పూర్వం నుంచే స్త్రీలు కథలు రాశారు. ఆ కథలు ఆషామాషీగానో, కాలక్షేపం కోసమో రాసినవి కావు. స్త్రీలు రచనా రంగంలోకి

రావడం అంటేనే అది వాళ్ళ చైతన్యానికి గుర్తు. కుటుంబంలోని పరిస్థితుల పట్ల అనుకూల, ప్రతికూల స్పందనలెన్ని ఉన్నా, తరతరాలుగా ఇస్తున్న పితృస్వామిక శిక్షణ కారణంగా అలవడిన సంస్కారంతో స్త్రీలు చాలా కాలం తమ మనోభావాలను అణచి ఉంచుకున్నారు. ఆధునిక యుగ స్వభావం చదువుకోవడానికి, భావాలు ఏర్పరచుకోవడానికి కలిసి వచ్చిన అవకాశం. భావ వ్యక్తీకరణకు అందుబాటులో కొచ్చిన పత్రికా రంగం మొదలైనవి స్త్రీలను రచయిత్రులుగా చేశాయి. ఆ క్రమంలోనే స్త్రీలు కౌటుంబిక సమస్యల పట్ల మాత్రమే కాక సమకాలీన, సామాజిక, రాజకీయ ఉద్యమాల పట్ల కూడా ప్రతిస్పందన కలిగిన కొత్త చైతన్యాన్ని పొందారు. ఆ చైతన్యంతో 1890–1940 మధ్య కాలంలో కథలు రాసిన తొలి తరం కథా రచయిత్రులుగా బండారు అచ్చమాంబ, భాస్కరమ్మ, దుర్గాబాయి, కనుపర్తి వరలక్ష్మమ్మ, బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి, తాడి నాగమ్మ మొదలగువారిని ప్రస్తుతిస్తూ కందాల శోభారాణి సూర్య దినపత్రిక 'అక్షరం'లో రెండు వ్యాసాలు (06/06/2011, 01/08/2011) తొలితరం కథా రచయిత్రులు 'బండారు అచ్చమాంబ, దుర్గాబాయి, వరలక్ష్మమ్మ' అనే శీర్షికలతో ప్రచురించారు.

బండారు అచ్చమాంబ రాసిన 1) స్త్రీ విద్య (భార్యాభర్తల సంవాదం), 2) ధనత్రయోదశి కథలు 1902లో వచ్చాయి. సంస్కరణోద్యమానికి ప్రతినిధి రచనలివి. వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమ ప్రభావం ఈమెపై కనిపిస్తుంది. స్త్రీలలో గల అవిద్య మూలంగానే సమాజంలో స్త్రీలు వివక్షను తిరస్కరించి బయటపడలేక పోతున్నారని, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ఆర్థిక స్వావలంబనకు, అసలు ఒక వ్యక్తిగా సమాజం వారిని గుర్తించుటకు సరైన మార్గం స్త్రీ విద్యావంతురాలు కావడమే అని అచ్చమాంబ భావిస్తుంది. సరిగ్గా అదే విషయాన్ని తన 'స్త్రీ విద్య' కథలో చెబుతుంది. స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబం సజావుగా సాగదని, భర్త ఆయుష్షు తగ్గుతుందని నమ్మే సమాజపు మూఢ విశ్వాసాల సంకెళ్ళను పగలగొడుతుంది అని అచ్చమాంబ 'స్త్రీ విద్య' అనే కథ ద్వారా తెలియజేశారు.

సహజంగా సంస్కరణోద్యమ ప్రభావంతో పైకి వచ్చిన అచ్చమాంబ దేశమంతా పర్యటించి, స్త్రీ విద్య వ్యాప్తికై చర్చించి, స్త్రీ విద్యను ప్రగాఢంగా ఆకాంక్షించింది. వీరేశలింగం బాలికల విద్యకు చేస్తున్న కృషికి తన సంఘీభావం తెలిపి, ఆయన ఆశయాన్ని కొనసాగింపచేయడానికి బండారు అచ్చమాంబ 1920లో బందరులో 'బృందావన స్త్రీ సమాజం' అను దానినొకటి ఏర్పాటు చేసింది.

స్త్రీలు ఖాళీ సమయాలలో ఇరుగుపొరుగు వారితో ముచ్చటలాడు కోవడం సహజం. కనీసం ఆ వృథా సమయాన్ని చదువు కోసం వెచ్చించినా స్త్రీలు ఎంతో కొంత విద్యను నేర్చుకోగల్గుతారని, అయితే స్త్రీలు అక్షరాస్యులు అవడం కాదు, విద్యావంతులై ఉద్గ్రంథాలను చదివి అర్థం చేసుకునే స్థాయికి ఎదగాలని అచ్చమాంబ భావిస్తుంది. అంతేకాదు పిల్లలకు సద్గుణాలను నేర్పించే ఉత్తమ గురువు తల్లి అని, అందుకే స్త్రీలు విద్యావంతులు కావడం అత్యావశ్యకమని అచ్చమాంబ స్త్రీ విద్య అనే కథలో చెబుతుంది.

అనవసరపు ఆర్భాటాలకు పోయి, ఆర్థికంగా కృంగిపోయి బ్రతుకు తెరువుకై బొంబాయికి వలస పోతుంది. పది రూపాయల జీతానికి గుమస్తా పని చేస్తున్న వెంకటరత్నంకి భార్య విజయలక్ష్మి రవికలు మొదలగునవి కుడుతూ చేదోడుగా ఉంటుంది అయినప్పటికీ దారిద్ర్యం తాండవిస్తుంది. దీపావళి ముందు రోజు త్రయోదశి. అది కూడా పర్వదినమే. లక్ష్మీపూజ చేసే రోజది. పిల్లలకు కొత్త బట్టలు, టపాకాయలు కొనిపెట్టలేని దీన స్థితి. దొంగ సొమ్ముకు ఆశపడ్డ భర్తను మందలిస్తుంది విజయలక్ష్మి. భర్తకు ఎదురు చెప్పడం తప్పుగా భావించే కాలంలో న్యాయంగా జీవించాలనే ఉద్దేశంతో విజయలక్ష్మి ఉద్బోధ చేయడం 'ధన త్రయోదశి' కథలో కనిపిస్తుంది. మనిషికి నిజమైన ధనం సత్యమార్గం, విలువలతో కూడిన జీవితం అని అచ్చమాంబ చెప్పకనే చెబుతుంది. ఈ విధంగా అచ్చమాంబ సంస్కరణ భావాలను పుణికిపుచ్చుకొని స్త్రీ అభ్యున్నతిని కాంక్షించిన తొలి తరం కథా రచయిత్రి అని కందాల శోభారాణి తన వ్యాసంలో ప్రస్తుతించింది.

స్వాతంత్రోద్యమ ప్రచారానికై విరాళాలు సేకరించే ఉద్దేశంతో రాజమండ్రి బహిరంగ సభలో ప్రసంగించిన గాంధీజీ ఉపన్యాసంతో 11 సంవత్సరాల ప్రాయంలోనే ప్రభావితురాలై తన చేతికున్న రెండు బంగారు గాజులను విరాళంగా ఇచ్చిన దేశ భక్తురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్. జాతీయోద్యమంలోకి మహిళాభ్యుదయ దృష్టితో దూసుకొచ్చిన వనిత దుర్గాబాయి. ఆ నేపథ్యంలోనే 1929లో ఆమె రాసిన కథ 'నేను ధన్యనైతి'.

బాల వితంతువైన శారదా బాయి సంప్రదాయాలను ధిక్కరించి పూణేకు వెళ్ళి చదువుకొని వచ్చి పాఠశాల స్థాపించి నడుపుతున్న చైతన్యశీలి. స్త్రీ విద్యకై తను స్థాపించిన పాఠశాలను తరువాత ఎవరు నడుపుతారో అన్న భయ సందేహాలకు లీలా శ్యామసుందరుల ప్రవర్తన ఒక సమాధానంగా నిలుస్తుంది. శారదాబాయి జబ్బుపడ్డప్పుడు తన తరువాత తన ఆశయ నిర్వహణ బాధ్యతను వాళ్ళిద్దరూ అప్పగిస్తూ 'నేను ధన్యనైతి' అన్నది ఈ కథలో శారదాబాయి పలికిన అంతిమ వాక్యం. స్త్రీ జీవిత ధన్యత్వం స్త్రీ విద్య, ఉద్యమ నిర్వహణలో, స్త్రీల అభివృద్ధి కోసం చేపట్టే

కార్యాచరణలో ఉన్నదని దుర్గాబాయి సమాజానికి ఆ పాత్ర ద్వారా తెలియజేసిందని వ్యాసకర్త చెప్పకనే చెబుతుంది.

గాంధీజీ మద్రాసులో విదేశీ వస్త్ర బహిష్కరణ గూర్చి పిలుపునిచ్చారు. స్వరాజ్య స్థాపనకు దౌర్జన్య రహిత సహాయ నిరాకరణమే శరణ్యమని అభిప్రాయపడ్డారు. ఆ స్ఫూర్తితోనే కనుపర్తి వరలక్ష్మమ్మ 'ప్రేమ ప్రభావం' అనే కథను 1927లో రాశారు.

లక్ష్మి, వెంకయ్యనాయుడు కొడుకు రామస్వామి గాంధీజీ సహాయ నిరాకరణోద్యమానికి ప్రభావితుడై, చదువుకు స్వస్తి పలికి ఆ ఉద్యమంలో చేరుతాడు. అది రుచించని తండ్రి రామస్వామిని ఇంటినుండి వెళ్లగొడతాడు. తల్లికి నచ్చజెప్పి రామస్వామి ఉద్యమంలో చేరి జాతీయ గీతాలను పాడుతూ, స్వదేశీ వస్త్రాలను విక్రయిస్తుండగా పట్టుకొని కఠిన శిక్ష విధించి జైలుకు పంపబడిన విషయం తెలిసి తండ్రి వెంకయ్యనాయుడు ఇంట్లోగల విదేశీ వస్త్రాలన్నింటినీ బయటకు విసిరివేసి, తన రావు బహదూర్ బిరుదును కూడా త్యజిస్తాడు. సంవత్సరం తరువాత రామస్వామి విడుదల రోజున పుష్ప వర్షం కురుస్తుంది. జయ జయ ధ్వనాలు మ్రోగుతాయి. ఒక అపరిచిత వ్యక్తి రామస్వామిని కౌగిలించుకుంటాడు. అతనెవరో కాదు తండరి వెంకయ్యనాయుడే. రామస్వామి తండ్రి కాళ్ళపై పడి ఆనందభాష్పాలు రాలుస్తాడు.

పరులకు చేయూతనిస్తూ, స్వార్థ రహితమై సేవను అందిస్తూ, ఫలాపేక్షలేని దృక్పథం కలిగి, దేశభక్తి కలిగి, మానవసేవ చేయడంలోనే జన్మ సార్థకత పొందుతుందని దుర్గాబాయి, వరలక్ష్మమ్మలు తమ కథల ద్వారా వినిపించినట్లుగా వ్యాసకర్త తన వ్యాసం ద్వారా పాఠకులను ఆలోచింపజేస్తున్నట్లు నాకు తోస్తుంది.

## 3.2.3. వేంపల్లి గంగాధర్:

భారతీయ నవలా సాహిత్యంలో విశేష కీర్తిని పొందిన టాగోర్ నవల 'గోరా'కు వందేళ్ళ సందర్భం అది. గోరా నవల వందేళ్ళ తర్వాత కూడా పాఠకులను విశేషంగా అలరించడానికి ఎన్నో కారణాలు కనిపిస్తున్నాయి. టాగోర్ నవలా వస్తువును ఎంపిక చేసుకోవడంలోనే సగం విజయం సాధించాడు. కథానాయకుడి పేరు 'గోరా' శీర్షికతో నవలను తీర్చిదిద్దడం సాహసమే. నిజానికి అతడి పూర్తిపేరు 'గౌర మోహన్!'.

నాటి సమాజంలో (వంగ దేశం) మత, కుల, సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్ని గోరా నవల అద్దంలా ప్రతిబింబిస్తుంది. ప్రాచీన భావాలు వెంటాడుతూ సంఘాన్ని పీడిస్తున్న పరిస్థితుల్లో సహజంగా జరిగే

పెనుగులాట, సంఘర్షణ, మానసిక స్థితి, అంతరాలు వంటివన్ని పొరలు పొరలుగా ఆవిష్కరిస్తాడు టాగోర్.

ఈ నవలలో ఒక్కో పాత్ర ఒక్కో రకమైన ప్రాధాన్యతను కలిగి ఉండి తన భావాల్ని వెల్లడిస్తూ ఉంటుంది. నవలా వస్తువుతోపాటు టాగోర్ కథనం సాగించిన తీరు ప్రశంసనీయం. పాత్రల స్వరూప స్వభావాలు, సంభాషణలు నిర్దిష్టంగా ఉంటాయి. గోరా పెంపుడు తల్లి ఆనందమయి, తండ్రి కృష్ణదయాల్. వాస్తవానికి గోరా తండ్రి యుద్ధంలో ప్రాణాలు విడిచిపోగా, తల్లి బిడ్డని ప్రసవించి కన్ను మూసింది. గోరా ఆరడుగుల ఎత్తు, ధవళ వర్ణం, పులిలాంటి స్వరూపం, గంభీర కంఠస్వరం. అతడిని చూడకుండా ఉండలేరు. అందరి చూపులు అతడిపైనే!

మూఢ నమ్మకాలను ఖండించి, పేదవారికి చదువు చెప్పించడమే సమాజానికి అత్యవసరమని భావిస్తాడు. మేజిస్ట్రేట్ బ్రౌన్ భార్య మిషనరీ స్త్రీల కోసం బాలికల పాఠశాలను నడుపుతుంది. వారిచ్చే సాయంత్రం పార్టీ – దొరతో గోరా వాగ్వివాదం – చెరసాలకు వెళ్ళడం – వరదా సుందరి బ్రహ్మ సమాజ కార్యక్రమాలు – గోరా విడుదల – వినయుడి బ్రహ్మ ధర్మ దీక్షా – గోరా .... సుచరితల మధ్య చర్చ – గంగానది ఒడ్డున ప్రాయశ్చిత్తం – తన పుట్టుక గూర్చి గోరాకు అసలు విషయం తెలియడం – సంక్షిప్తంగా 'గోరా' నవలలోని కథాంశం ఇది!

ఆనాటి క్రైస్తవ మిషనరీలకు బ్రహ్మ సమాజానికి మధ్య వివాదాలు, వాటిపై చర్చలు, దేశీయ సంస్కృతి – సాంప్రదాయాలు ఆచార వ్యవహారాల్ని ఈ నవలలో గమనించవచ్చు. జాతీయ భావాల పట్ల ఆకర్షణ, ఆధునికత వైపు సమాజ పయనం వంటి అంశాలు అంతర్గతంగా సాగిపోతూ ఉంటాయి. పాత్రల మధ్య స్నేహం, ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయత, మానవ సంబంధాల మధ్య ఘర్షణ ఇందులో టాగోర్ నిక్షిప్తం చేశారని వ్యాసకర్త పాఠకులకు వివరించారు.

దుఃఖం ఉంది, మరణమూ ఉంది, విరహమనే అగ్ని కూడా ఉంది. అయితే శాంతి, ఆనందం, శాశ్వతత్త్వం మేల్కొనుగాక అంటారు టాగోర్. 'గోరా' నవలలో చివరిగా ఇచ్చే సందేశంలో 'నేను భారతీయుడను. నాలో హిందూ, ముసల్మాన్, క్రిస్టియన్ అనే సమాజ భేదాలు లేవు. ఇవాళ ఈ దేశంలో అన్ని జాతులు నావే. అందరి ఆహారం నాదే. చిన్నతనం నుంచి నేటివరకూ నాకు అజ్ఞానం ఆవరించింది. అది గతించి నాకిప్పుడు నూతన జన్మ సిద్ధించింది' అని పశ్చాత్తాప పడతాడు గోరా.

టాగోర్ రచనల్లో భావోద్రేకాలతో పాటు అంతః సంఘర్షణలు అడుగడుగునా ఆవిష్కరింపబడి, ఎంతో లోతైన జీవిత అన్వేషణతో,

విస్తృతమైన సమాజ అనుభవంతో అచ్చమైన భారతీయతను ప్రతిబింబిస్తూ టాగోర్ ముగ్ధ ప్రణయ గాథగా గోరా నవలను తీర్చిదిద్దాడు. అందుకే వ్యాస రచయిత వేంపల్లి గంగాధర్ 'కాలం నదికి నవలా వంతెన – గోరా' అనడం సర్వ విధాలా సముచితం. పాత్రల మనోసంఘర్షణలను టాగోర్ బహుముఖ ప్రజ్ఞతో పట్టుకుంటే, వ్యాసకర్త ఆ సంఘర్షణల సారాన్ని, టాగోర్ యొక్క అంతరంగాన్ని చాలా ఒడుపుగా ఒడిసి పట్టుకొని ఈ వ్యాసం ద్వారా పాఠకులకు అందించాడనడంలో సంశయం లేదు.

వైవిధ్య భరితమైన సాహిత్య ప్రభావ వైభవాలు రాయలసీమలో కనిపిస్తాయి. రాయల ఆస్థానంలోని అల్లసాని పెద్దన, ప్రజాకవి వేమన, కాలజ్ఞానకర్త వీరబ్రహ్మం, పదకవితా పితామహుడు అన్నమయ్య వంటి మహానుభావులు ఎందరో ఈ ప్రాంతంలో సాహితీ సేద్యం చేశారు. అయితే ఆధునిక కథా సాహిత్యం 1901లో బండారు అచ్చమాంబ రాసిన ధన త్రయోదశి కథతో ప్రారంభమైందని భావిస్తే, రాయలసీమలో మొదటి కథ 1941 వరకూ పుట్టనే లేదు. కథ కోసం సీమ 40 సంవత్సరాలు నిరీక్షించింది. 1941 మార్చి 26న ప్రచురితమైన అనంతపురం జిల్లాకు జి.రామకృష్ణ రాసిన చిరంజీవి కథ మొదటి కథగా వెలుగులోకి వచ్చింది. సీమలో ఆధునిక జీవితమే ఆలస్యంగా మొదలు కావడం ఇందుకు ఒక కారణం.

1941 నుండి 1970 వరకు గల కథా రచయితలు, కె. సభా, జి. రామకృష్ణ, మధురాంతకం రాజారాం, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, సొదుం జయరాం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, పి. రామకృష్ణారెడ్డి, కలువ కొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, భారతం నాదమునిరాజు, ముంగర శంకర రాజు మొదలగువారిని మొదటి తరం కథారచయితలుగా పేర్కొనవచ్చు. వీరు మధ్య తరగతి జీవన స్థితిగతులను కథా వస్తువుగా స్వీకరించి కథలను నిర్మితం చేశారు. ఆర్థికంగా మారుతున్న జీవన వైవిధ్యాలను కథాంశాలుగా మార్చారు.

కథా శిల్పంమీద రాచమల్లుకి అద్భుతమైన పట్టుంది. మధ్య తరగతి జీవితాల్లోని మార్పులను కేంద్రంగా స్వీకరించి అత్యుత్తమ కథలకు ప్రాణం పోశారాయన. ఆయన 'అలసిన గుండెలు' కథా సంకలనం దానికి ప్రబల నిదర్శనం. తర్వాత అదే స్థాయిలో శక్తిమంతమైన కథకునిగా కేతు విశ్వనాథరెడ్డి కన్పిస్తారు. వీరి జప్తు, ఇచ్చాగ్ని, అమ్మవారి నవ్వు కథా సంకలనాల్లోని కథలు ప్రపంచ స్థాయి కథానికల కోవకు చెందినవిగా చెప్పుకోవచ్చని వ్యాసకర్త డా॥ వేంపల్లి గంగాధర్ 'మూడు తరాల సీమ కథాసేద్యం' (*సూర్య పత్రిక – అక్షరం, 03/10/2011*) అనే వ్యాసంలో వివరించారు. వీరి కథలు చారిత్రాత్మకమైన హోదాను కలిగి ఉండి పాఠకుడి

మనస్సుపై తీవ్రమైన ప్రభావాన్ని ఏర్పరుచుతాయి అని వ్యాసకర్త పునరుద్ఘాటించారు.

దాదాపు 300లకు పైగా కథలు రాసినటువంటి కె. సభా తన కథలలో చిత్తూరు జిల్లా స్థానికతకు, ప్రాంతీయతకు పెద్ద పీట వేశారు. బంగారు, పాతాళ గంగ, నీటి దీపాలు వీరి కథాసంపుటాలు.

చిన్న వయస్సులోనే 'వీరోచిత వర్తకం' అనే కథను రాసిన మధురాంతకం రాజారాం వర్షించిన మేఘం (1961), తాను వెలిగించిన దీపాలు (1963), పునర్నవం (1968), కమతెమ్మర (1968) మొదలగు కథాసంపుటాలను వెలువరించి సీమ కథకు కొత్త అర్థం చెప్పారని వ్యాసకర్త తెలియజేస్తున్నారు.

విమర్శకుడిగా గుర్తింపు పొందిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య 1962లో 'అన్యధా శరణం నాస్తి' కథ ద్వారా కథకుడుగా కూడా సాహిత్య రంగానికి పరిచయమయ్యారు. అలాగే ఆర్వీయార్, జయరాం, పులికంటి కృష్ణారెడ్డి మొదలైనవారు కూడా గొప్ప కథలను రచించారు.

1970 నుండి 1995 వరకు గల రచయితలైన ఇనాక్, సింగమేనని నారాయణ, నామిని సుబ్రహ్మణ్య నాయుడు, ఎం.వి.ఆర్., శశిశ్రీ, డా॥ కేశవరెడ్డి, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, చిలుకూరి దేవపుత్ర, రాసాని మొదలగువారిని రెండవ తరం కథకులుగా వ్యాసకర్త పేర్కొన్నారు. వీరు రైతులకు సంబంధించిన ఇతివృత్తాలతో పాటు కరవు, గ్రామీణ కక్షలు (ఫ్యాక్షన్), వ్యవసాయ సంక్షోభాల పైన విస్తృతంగా కథలు రాశారు.

1995 నుండి నేటివరకు గల కథకులను మూడవ తరం కథకులుగా వ్యాసకర్త విభజించారు. పాలగిరి విశ్వ ప్రసాద్, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, నాగప్పగారి సుందరరాజు, రాప్తాడు గోపాల కృష్ణ, సుంకోజి, ఎం. హరికిషన్, తుమ్మల రామకృష్ణ మొదలైనవారు మూడవ తరం కథకులు. మూడవ తరం కథకులు ప్రపంచీకరణ ప్రభావాన్ని, దళితుల ఆవేదనల్ని, స్త్రీ అభ్యుదయ భావాల్ని అక్షరబద్ధం చేసారు.

రాయలసీమ కథకులు కరువు, కక్షలు, స్త్రీ అభ్యుదయం, దళితుల సమస్యలు, రైతుల వలసలు ప్రపంచీకరణ మిగిల్చిన చేదు అనుభవాలు మొదలగువాటిని కథాంశాలుగా తీసుకొని కథలను నిర్మిస్తూ తమదైన యాసలో కథలు రాస్తూ ప్రాంతీయతకు పట్టంగడుతున్నారని ఈ వ్యాసం ద్వారా మనకు అవగతమవుతుంది.

### 3.2.4. నండూరి రాజగోపాల్:

ఏ మనిషిలోని చైతన్యం అయితే చరిత్ర పుట్టుకకు కారణమయ్యిందో... మళ్ళీ అటువంటి చైతన్యమే రావలసిన, కావలసిన సందర్భం వచ్చింది.

ఎక్కడైతే ఒక వ్యక్తి లేదా వర్గం ఉనికి ప్రశ్నార్థకమవుతుందో అక్కడ ఆ వ్యక్తి నేనున్నాను. నన్ను సమాజంలో ఒకడిగా గుర్తించండి అంటూ ఉనికికై చేయు పోరాటమే అస్థిత్వ పోరాటం. మనిషిలోని తీవ్రమైన ఆలోచనలలోంచి పుట్టిన భావం ఆచరణగా మారడమే అతని 'అస్థిత్వాన్ని' నిలబెడుతుంది.

మనిషి పుట్టుక, పెరుగుదల, చుట్టూ ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారినప్పుడు, మనల్ని వ్యక్తీకరించుకోడానికి, మన గురించి మనం చెప్పుకోడానికి ఇబ్బంది పడుతున్న సందర్భంలో ఎలాగైనా మనం నిలబడాలని, మనకి మనం చేయూత అవ్వాలనే ఒక తపన, ఒక ప్రయత్నం మొదలవుతుంది. ఆ ప్రయత్నంలోంచి, తపనలోంచి పుట్టినదే అస్థిత్వ దృక్పథం. ఆ తపనని సరైన సమయానికి గుర్తించి, అక్షరాలలో వెలిగించడం తెలుగు కథారచయితలు చేసిన గొప్ప సత్కారం. ఈ సత్కారానికి బీజం వేసింది శ్రీ కాశీపట్నం రామారావు.

కొడుకు బానిసగా ఉండడానికి ఇష్టపడని తండ్రి కొడుకుని చంపి శవాన్ని పంచాయితీ ముందు నిలబెట్టడం 'యజ్ఞం' కథలో చూస్తాం. రేపటి నూతన స్వేచ్ఛా అంకురానికై తనకు తాను మొలకై నేడు మట్టిలో కలిసిపోవుటకు సిద్ధపడడం, దొరల అహంభావాన్ని, దౌర్జన్యాన్ని ఖండిస్తూ అగ్నిలో దూకి విస్ఫులింగమై వ్యక్తిలో చైతన్యాన్ని రగిలించడం, తాగడానికి గుక్కెడు నీళ్ళివ్వని అగ్రవర్ణ స్త్రీల ఆగడాలను అరికట్టుటకు 'ఊర బావి'లో జంతు కళేబరాన్ని పడవేయడం వంటివి 'తెలుగు కథల్లో అస్థిత్వ నాద' శంఖారావానికి అసలైన నిదర్శనాలని నండూరి రాజగోపాల్ 'తెలుగు కథల్లో అస్థిత్వనాదం' (*సూర్య దినపత్రిక – అక్షరం, 15/08/2011*) అనే శీర్షికతో ప్రచురించిన వ్యాసంలో గుదిగుచ్చాడు.

చలం ఎప్పుడో స్త్రీకి శరీరమే కాదు మనస్సు, మెదడు, హృదయం ఉందని ఆ హృదయ స్పందనలను తన కథలలో ప్రతిధ్వనించాడు. స్త్రీ అస్థిత్వాన్ని ప్రగాఢంగా కాంక్షించే మహిళాభ్యుదయవాదిగా అబ్బూరి ఛాయాదేవి మొదలగు స్త్రీవాద రచయితలు కూడా చలాన్ని అనుసరించారు, అనుకరించారు.

నాలుగు కులాలు అడ్డుపెట్టి మనిషిని కాపాడుకోవాల్సిన రోజులలో ఉన్నాం. నాలుగు గళాలు వినిపించి మనిషిని మేల్కొలపవలసిన అవసరంలో ఉన్నాం అంటూ నిజానికి ఆ అవసరపు స్థాయి ఎక్కువగా ఉందేమోగాని నాలుగు దశాబ్దాల క్రితమే తెలుగు కథారచయితలు దీనిని గుర్తించడం, తదనుగుణంగా... మనిషిని కోల్పోతున్న సమాజపు జాడలను కథలలో పొందుపర్చడం ఆశ్చర్యకరమని వ్యాసకర్త ఈ వ్యాసంలో పాఠకులకు విపులంగా వివరించాడు.

మనిషిని నిర్లక్ష్యం చేస్తున్న ప్రతిచోట మనిషి ఉనికి మసకబారుతున్న ప్రతి వేళ కలాలు కరవాలాలై, అక్షరాలు ఆయుధాల్లా ఉద్యమిస్తున్నాయని, మనిషిని కాపాడుకోవడం కోసం, మనిషి సాంస్కృతిక నేపథ్యం సజీవంగా ఉంచుకోవడం కోసం, మనిషి కోసం మరింతగా పదునెక్కాలని ఆశిద్దాం అంటూ నండూరి రాజగోపాల్ తన వ్యాసాన్ని ముగించాడు ప్రస్తుత కథకులను, పాఠకులను ఆలోచనల్లో పడవేస్తూ.

## చిక్కిపోతున్న కథావరణం:

ప్రపంచంలో కథను విననివారు, చెప్పనివారు ఉండరంటే అతిశయోక్తికాదు. మనిషి జీవితంలో కథ అల్లుకుపోయింది. తెలుగునాట కథ పుట్టి వందేళ్ళు దాటిపోయింది. ఒకప్పుడు కథకై పాఠకులు ఆత్రుతగా ఎదురుచూసే వాళ్ళు. ఇప్పుడు కథే పాఠకులను వెతుక్కోవాల్సి రావడం విచారకరం. దానికి కారణం ప్రపంచీకరణ నేపథ్యం, గ్లోబలైజేషన్ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చివేసి, మనిషిని ఉరుకులు పరుగులు పెట్టించడం ఒక కారణమైతే, మంచి కథలూ రాకపోవడం మరో కారణం. నండూరి రాజగోపాల్ కథ గతంవలే విశేష పాఠక బాహుళ్యాన్ని, ఆదరణని కోల్పోతూ గత వైభవం రానురాను క్షీణించి పోవడాన్ని 'చిక్కిపోతున్న కథావరణం' (*సూర్య దినపత్రిక – అక్షరం, 17/10/2011*) అనే శీర్షికతో ప్రచురింపబడిన ఒక వ్యాసంలో వివరించారు.

చలం అన్నట్లు 'ఒకసారి కథ మొదలుపెడితే పాత్ర చెప్పినట్టే కథ నడవాలి అప్పుడు మాత్రమే ఆ కథ పాఠకులను సొంతం చేసుకొని కాలాన్ని జయిస్తుంది'. నేడు కథ కాలాన్ని జయించడం పక్కన పెడితే పాఠకుడు కథను చదువుటకు కాలాన్ని కేటాయించక పోవడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

కథంటే ఒక ఊహ. కథంటే గతం తాలూకు జ్ఞాపకం. కథంటే మనల్ని అల్లుకున్న తేమ. కథంటే ఊరు పుట్టుక. కథంటే సాంస్కృతిక చైతన్యం. కథంటే – మన సంతోషం, మన దుఃఖం, మన విజయం, మన ప్రయాణం, మన అలసట, మన విశ్రాంతి. మొత్తంగా చూస్తే కథంటే – నిలువెత్తు మనిషి జీవితం. అలాంటి కథకు ఇప్పుడు పాఠకులు కరువవుతున్నారు. మంచి కథ కోసం పాఠకులే కాదు పత్రికలూ ఎదురుచూడడం ఇవాల్టి ఒక వింత పరిస్థితి.

శకలాలు శకలాలుగా విడిపోతున్న మానవ జీవితాన్ని వ్యాఖ్యానించడానికి కథ outlet అయింది. అయితే నేడు అలా వ్యాఖ్యానించే క్రమంలో 'కథ'లో గొప్ప లక్షణమైన ఐక్యతను అందుకోలేకపోవడం శోచనీయం.

కథకు ప్రాణం వస్తువు. అంత మాత్రాన కథంటే వస్తువు మాత్రమే కాదు. కేవలం వాస్తవ జీవన చిత్రణ పత్రికలో వెలువడే రిపోర్టుగా మాత్రమే భాసిస్తుంది. 'మంచి కథంటే పాఠకుణ్ణి నిద్రనుండి మేల్కొపగలిగిందే' అంటారు చేఖోవ్ (Chekhov). కథ మానవ సంబంధాల మధ్య ఆంతరంగిక సంఘర్షణలను ఆవిష్కరించి, ఆ క్రమంలో ఐక్యతను సాధించే ఒక సాహిత్య ప్రక్రియ. ఆడ, మగ మధ్య అనుబంధాన్ని కలుగజేయడం అంటే ... లెక్కల ఫార్ములాను వివరించినట్లుగా విశదీకరించడం కాదు. ఆ అనుబంధంలో రీజనింగ్ ఉండదు. లాజిక్ ఉండదు. కేవలం అనుభూతి, ఒకరిపై ఒకరికి నమ్మకం ఉంటుంది. ఒకరిని విడిచి ఒకరు ఉండలేని ఆత్మీయత ఉంటుంది. కథలో ఇది అంతర్లీనంగా కనబడాలి. అవి కల్పించడానికి ఎంతో ప్రతిభ కావాలి. వాటి విలువ తెలుసుకోడానికి ఎంతో పరిజ్ఞానం కావాలి. అవి బోధ పరచడానికి బుద్ధి సూక్ష్మత కావాలి. అలా ఉంటే కథలు కళ్ళకి వెలుగునిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. అయితే, కథంటే వస్తువును మాత్రమే వ్యక్తీకరించడం కాదు అనే వాస్తవం ఇవాళ రచయితలు మర్చిపోవడం కూడా కథలపట్ల ఆసక్తి తగ్గిపోవడానికి కారణమవుతోంది.

'దిద్దుబాటు' పేరుతో గురజాడ నిజానికి కథ రాయలేదు. ఒక జీవితపు శకలాన్ని చెప్పాడు. కథంటే ఊహ మాత్రమే కాదు. అది మనిషిని అల్లుకున్న జీవితం. సాంస్కృతిక చైతన్యం. ఇప్పుడు ఇదే సమస్యను చెప్పడానికి రచయితలు ఎక్కువ సంభాషణలను ఉపయోగించుకుంటున్నారు. పాత్రలను ప్రవేశపెడుతున్నారు. దాంతో కథ కాస్తా నాటకం పోకడల్ని అందుకుంటుందని వ్యాసకర్త ఇందులో చక్కగా వివరించారు.

కథంటే మనిషి కోల్పోతున్న జీవితం గురించిన హెచ్చరిక మనుషుల మధ్య దూరమైపోతున్న అనురాగాల జాడను వెతికే సైన్ బోర్డు. కథంటే గుప్పెడు దుఃఖం గూర్చి చెప్పడమే కాదు, గుండె నిండా హాయిని కలిగించే 'సముద్రాన్ని' సృష్టించడం కూడా! ఈ నిజాన్ని ఇప్పటి రచయితలు గ్రహిస్తే – కథా గోదావరి పచ్చటి నేలను పుడమంతా పండిస్తుంది.

ఇలా చిక్కనైన కథా పారిజాత తరు సమాన కథాకన్య నేడు సన్నని సన్నజాజి తీగవలె చిక్కిపోవడానికి గల కారణాలను బహు విధాలుగా వివరిస్తూ రాజగోపాల్ రాసిన ఈ వ్యాసం వర్తమాన కథకులను మీమాంసలో ముంచి, వారికి నూతన లక్ష్యాలను నిర్దేశించేటట్లు ఉన్నది.

## కథల వాకిట్లో శేష ప్రశ్నలు.:

ప్రపంచ సాహిత్యంలో ఏదో ఒక సమయంలో కథా సాహిత్యంలో స్తబ్దత ఉందని మనకి తెలుసు. కాని, తెలుగు కథకు ఏ కాలంలోనూ అటువంటి

గ్యాప్ కాని, స్తబ్ధత కాని లేకపోవడం విశేషం. కథ మెల్లగా పెద్దలని, పిల్లలని కలిపే ఒక స్థావరం అయింది. కథ చెప్పని నాయనమ్మలు, కథ వినని మనవళ్లు ఒకప్పటి మన ఘన చరిత్ర లేకపోవడం గమనించ దగ్గ పరిణామం. ఇప్పటికే పిల్లలకి కథంటే అనగనగా ఒక రాజు, ఆ రాజుకు ఏడుగురు కొడుకులు... అంటూ 'చందమామ' చుట్టునో, 'బాలమిత్ర' చుట్టునో తిరగడం ఇప్పటి నాయనమ్మల వంతైతే, అసలు పిల్లలకు కథలే చెప్పలేకపోవడం నేటి ఆధునిక గృహిణి నైజం. అయినా పిల్లలకు కథలు వినే ఓపిక ఎక్కడ ఉంది. పొద్దస్తమానం బడిలో, పొద్దుపోయాక హోంవర్క్‌తో కుస్తీపడుతూ ఉంటే గృహిణి మాత్రం టీ.వీ. సీరియల్స్ నుండి బయటపడితేగా కనీసం స్కూలుకెళ్ళని పిల్లలకైనా కథలు చెప్పడానికి, రెండూ సాధ్యపడే పరిస్థితిలో నేటి కుటుంబ వ్యవస్థ ఉంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో మొత్తం వ్యవస్థతోపాటు మనిషి కూడా మూలాలు కోల్పోతున్న తరుణంలో వెనుకబడిన తన వర్గానికి, ప్రాంతానికై అస్థిత్వ పోరాటం చేయవలసిన అవసరం ఏర్పడింది. కథ దీనిని అంది పుచ్చుకొని ఆ ప్రాంతానికో, వర్గానికో పరిమితమైపోతుంది. ఒక ప్రాంతంనుండి కథలు రావడంలేదని, ఒకటి రెండు ప్రాంతాలనుండే కథా సాహిత్యం విరివిగానూ, మంచిగానూ వస్తుందనే అభిప్రాయం బలపడింది. కథని ఎవరికి వారు తమ సొంతం చేసుకోవడంవల్ల మొదలెట్టాక ఆశ్చర్యంగా కథకులకు, కథాసంపుటాలకు, కథాసంకలనాలకు పాఠకులు తగ్గడం ప్రారంభమైంది. ఒక అవసరానికి, ఒక విషాదానికి, ఒక ప్రమాదానికి 'కథ' వేదికవుతోంది. ఒక గట్టి స్వరమవుతుంది.

అయితే, ఈ తీవ్రత పైన పేర్కొన్నట్టు పరిమిత వృత్తమవుతుంది. రాష్ట్రంలో ఏ మూల అయినా సమస్య తలఎత్తితే ఆ సమస్యను ఆ ప్రాంతాలకే పరిమిత చేసే కథలు రావడంవలన అది చదివిన పాఠకుడు ఆ సమస్య పట్ల సహానుభూతి చెంతలేక పోతున్నాడు. అలా అని అస్థిత్వానికై కథ రావడం తప్పు కాదు. ఆ కథ ఆ కాలాన్ని, ఆ సమాజాన్ని దాటి వెళ్ళకపోవడం ఇప్పటి కథాసాహిత్యాన్ని వేధిస్తున్న సూటి ప్రశ్న.

వలసపోయిన జానపదులు, ఖాళీ అయిన గ్రామాలు, తాళాలేసిన లోగిళ్ళు, కర్మాగారాలైన తీర ప్రాంతాలు, మోడు బారిన భూములు, మురికి వాడల్లో అస్థవ్యస్థ జనజీవనం ఇలా కన్నీటి గాథలు ఏ ఒక్క దిక్కుకో సంబంధించినవి కావు. రాష్ట్ర నలుమూలలకు చెందినవి. కథలు కూడా అలానే సర్వ హృదయాలను కదిలించాలి, కరిగించాలి. ఈ బాధలేవీ లేవనుకుంటున్న కోస్తాని కథల సహారాగా భావించడం బాగా ఎక్కువైన

పరిస్థితిలో – అసలు కథ ఎలా ఉండాలి? ఎలా స్వీకరించాలి? అన్న మౌలిక ప్రశ్నలు పాఠకుల్లో ఉదయిస్తున్నాయి.

శుభలేఖల దాకా వచ్చి ఆగిపోయిన పెళ్ళిళ్ల గూర్చి, పట్టుమని పది నిమిషాలైన నడవలేని, కూర్చోలేని, పని చేయలేని యువత దయనీయ స్థితిని గూర్చి, ఆడపిల్లలు తక్కువైపోతున్న దయనీయ పరిస్థితి గూర్చి, డైటింగ్ పట్ల పెరుగుతున్న ఆసక్తి గురించి, పదిమంది ఉన్న కుటుంబాలనుండి – నలుగురున్న దశకి, నలుగురున్న స్థితినుండి ఇద్దరున్న పరిస్థితికి, భార్యాభర్తలు చెరొక చోట, పిల్లలు మరో చోట బతుకున్న దౌర్భాగ్యం గురించి, పదహారేళ్ళకే పిల్లల్లో పెరుగుతున్న ఆవేశాల గురించి – రాయవలసిన అంశాలెన్నో ఇవాళ కథకుల ముందు కొలువుదీరి ఉన్నాయని నండూరి రాజగోపాల్ 'కథల వాకిట్లో శేష ప్రశ్నలు' (*సూర్య దినపత్రిక – అక్షరం, 26/12/2011*) అనే శీర్షికలో ప్రచురించిన వ్యాసంలో వివరిస్తూ, ఇవన్నీ నేడు కథా సాహిత్యానికి శేష ప్రశ్నలుగా పరిణమించాయని భావిస్తున్నారు.

### 3.2.5. పెన్నా శివరామకృష్ణ ముస్లింవాద స్పష్టరూపం 'రెహల్':

ముస్లిం మైనారిటీ వాదం ఒక స్పష్టరూపం సంతరించుకోవడంలో ఇతరులతో పాటు కవిగా స్కైబాబా కృషి అవిస్మరణీయం. స్కైబాబా రాసిన రెహల్ అనే కవితను తీసుకొని పెన్నా శివరామకృష్ణ 'సూర్య దినపత్రిక – అక్షరం'లో 'ముస్లింవాద స్పష్టరూపం - రెహల్' (*24/10/2011*) అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు. 'రెహల్' ముస్లిం స్త్రీవాదానికి ప్రతీకగా నిలుస్తుంది.

నిజానికిది 'రెహల్'. దీని రూపాంతరం 'రిహల్'. పవిత్ర గ్రంథాన్ని ఉంచే పీఠం (వ్యాసపీఠం) అని అర్థం. శీర్షిక చూడగానే ఇస్లాం విశిష్టతతో, ఖురాన్ ప్రశస్తమైన వస్తువు కావచ్చునని అనుకునే అవకాశముంది. పాఠకుడిలో ఆసక్తిని ఇనుమడింపచేయడమే ఈ శీర్షికను ఎన్నుకొనుట వెనుక గల వ్యూహం.

**"కన్నీటి దారల్తో జీవన వస్త్రానికి మాసికలేస్తూ**
**తరాల చీకటి కమ్మేసిన గోషాలో**
**పాలిపోయిన చంద్రశిలా దేహంతో**
**అనుక్షణం**
**'బిస్మిల్లా ఇర్రహ్మా నిర్రహీమ్'**
**అనే కదులుతుంది అమ్మీజాన్....."**

తొలి పంక్తులు దారిద్ర్యాన్ని; మలి పంక్తులు మత సంప్రదాయాలు, కట్టుబాట్ల వల్ల కలుగుతున్న దుఃఖాన్ని సూచిస్తాయి. ఈ రెండింటి ఫలితం పాలిపోవడం. 'బిస్మిల్లా ఇర్రహ్మా నిర్రహీమ్' అంటే 'దయామయుడైన, కృపాహృదయుడైన అల్లా పేరుతో ఆరంభిస్తున్నాను' అని అర్థం. పనిని ఆరంభించే ముందు చేసే దైవ ప్రార్థనన్నమాట.

అనేక తరాలుగా ముస్లిం స్త్రీలు గోషావల్ల అనుభవిస్తున్న అంతర్గత వేదనకు తన తల్లి గోషాను ప్రతీకగా చెబుతున్నాడు కవి.

**"తల్లి పాదాల వద్ద ఉండదంటారు**
**మా అమ్మీ పాదాలపై వంగిన ప్రతిసారీ**
**చెమరిన నా చూపు**
**ఆమె పాదాల పగుళ్ళలో**
**చిక్కుకుని గిలగిలలాడుతుంది"**

ఆమె పాదాలను చూడడంతోనే చెమ్మగిల్లిన చూపు పాదాల పగుళ్లు కనిపించగానే ఇంకెంత తల్లడిల్లుతుందో ఊహించుకోవచ్చని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. గుప్తంగా దయనీయ హృదయవేదన వ్యక్తమయింది. తల్లి పాదాల చెంత స్వర్గం లేకపోగా పాదాలలోనే బీటలు ఉన్నాయన్నది వ్యంగ్యం.

తండ్రి అసహాయత వల్ల తన చెల్లిని ఎవరికో రెండో పెళ్ళాంగా అంటకట్టవలసి వచ్చిందని, చెల్లి విలపిస్తూంటే తల్లే ఆ బాధకు ఎక్కువగా తల్లడిల్లి పోయిందని కవి చెప్పినట్టు వ్యాసకర్త పాఠకులకు గుర్తెరిగించారు.

చివరకు ఖురాన్‌ను మోసే 'రెహల్' లా మిగిలిపోవలసిందేనా? అని ప్రశ్నిస్తూ... 'కనుబొమ్మల నెలవంకల మీద చీకటిరాశుల్ని మోయడం' అనే మాటలు – 'తరాల చీకటి కమ్మేసిన 'గోషా'' అనే ఈ కవితలోని తొలి దృశ్యంతో అనుసంధిస్తాయి. కాలానుగుణంగా ఆచార సంప్రదాయాలలో మార్పులను అంగీకరించని 'ధర్మాల'ను మోస్తూ అనామకంగా అణగారుతున్న అమ్మను 'రెహల్'తో పోల్చాడు స్కైబాబా. స్కైబాబా కవిత 'రెహల్'ను తీసుకొని ముస్లిం వాదానికి 'రెహల్' ఒక దర్పణంలా ప్రతిబింబిస్తుందని ఈ వ్యాసంలో వివరించారు.

## 'ముగింపు' ఒక దీపస్తంభం:

కమ్యూనిస్టు మేనిఫెస్టో చదివిన వారికి అందులోని మొదటి వాక్యమేదో గుర్తుండక పోవచ్చు కాని చివరి వాక్యాలు ఖచ్చితంగా గుర్తుంటాయి. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి. పోరాడితే పోయేదేమీ లేదు – బానిస సంకెళ్ళు తప్ప' – ఇవి ఆ చివరి వాక్యాలు. 'పోరాడితే బానిసత్వం తొలగిపోతుంది తప్ప మనం కోల్పోయేదేమీ ఉండదు' అనే విధంగా

చెప్పవచ్చు. కాని అలా చెప్పి ఉంటే ఆ పదును, ఫోర్సు ఉండదు. చివరి వాక్యానికున్న ప్రాధాన్యం వ్యక్తం కాదు. మొదట 'పోయేదేమీలే'దని చెప్పి, దానిని విరుద్ధంగా జోడించిన వాక్యాంశంలో తొలగి పోవలసిందే, పోతుందనడం చమత్కారం. మేనిఫెస్టోలోని సారాన్ని, లక్ష్యాన్ని ఇమిడ్చి కవితాత్మకంగా వ్యక్తీకరించినందువల్లనే ఈ వాక్యం అంతర్జాతీయ నినాదమైంది. శక్తివంతమైన 'ముగింపు'కు బహుశా ఎప్పటికీ తాజాగా ఉండే దృష్టాంతమిది పెన్నా శివరామకృష్ణ 'ముగింపు ఒక దీపస్తంభం' (*సూర్య దినపత్రిక – అక్షరం, 07/11/2011*) అనే శీర్షికతో సూర్య పత్రికకు రాసిన వ్యాసంలో అంటారు.

కాదేదీ కవితకనర్హమని, కవితావేశంతోనే శిల్పాన్ని ఉపేక్షించకుండా రచనచేస్తే అది శోభాయమానంగా ఉంటుందని చెప్పే శ్రీశ్రీ 'ఋక్కులు' కవిత 'ప్రపంచం ఒక పద్మవ్యూహం/ కవిత్వమొక తీరని దాహం' అనే వాక్యాలతో ముగుస్తుంది. కవితే ఈ కవిత వస్తువు కనుక 'ప్రపంచం' ఇక్కడ ఉపమానమే.

'స్పర్శానురాగాన్ని ఆలపిస్తూ....' అనే జయప్రభ కవిత 'స్పర్శ ప్రవహించిన ప్రాంతమంతా/అణువులన్నీ అరవిచ్చుకుంటాయి' అనే సానుకూల ప్రతిస్పందనను తెలిపే వాక్యంతో ఆరంభమవుతుంది. 'అయినా/ఎందుకో మరి/నీ స్పర్శతో దీపించే నేను/ నా స్పర్శతో జ్వలించే నీవు/ ఎప్పుడూ దూరంగానే ఉంటాము/ పృథ్వీ ఆకాశాలమై' ఇదీ ఈ కవిత ముగింపు.

ఏ పరిష్కారమూ లేని (కనీసం లేనట్లు కనిపించే) అనుభూతులు, వేదనలు వస్తువులైనప్పుడు ముగింపు కవికి అగ్నిపరీక్షే. పాటిబండ్ల రజని 'అబార్షన్ స్టేట్‌మెంట్' అనే కవిత 'అయ్యో! పాలింకి పోవడానికున్నట్లు/మనసింకి పోవడానికీ/ మాత్రలుంటే ఎంత బాగుండు' అంటూ ముగుస్తుంది. కె. గీత 'పరపరాగ విరాగం' అనే కవిత 'ఈ ఒక్క అవయవాన్నీ విసిరవతల పారేస్తే చాలు/ మరో సృష్టి ఇంకాగిపోతే చాలు' అంటూ ముగిస్తుంది.

నిర్దిష్ట భావ ప్రాధాన్యాన్ని ఉద్వేగ తీవ్రతను తెలుపడానికి కవులు కొన్ని వాక్యాలను పునరుక్తం చేస్తుంటారు. పాఠకుని మనస్సులో భావం బలంగా ముద్రితమవడానికి ఆమ్రేడిత వాక్యంతో ముగించడం ఒక పద్ధతి. 'నాకోసం ఎదురుచూడు' (శివసాగర్), 'చేదుపాట' (శ్రీశ్రీ) మొదలైన కవితలు ఆమ్రేడిత వాక్యాలతో ముగుస్తాయి.

వస్తువులోని అంతర్వైరుధ్యాలను సంఘర్షణను చెప్పిన తర్వాత పతాకస్థాయిని గమనించి ముగించాలి. లేదా ముగింపునే పరాకాష్టగా మార్చాలి. పతాక స్థాయిని గమనించడం లేదా పతాక స్థాయికి చేర్చడం,

ముగించవలసిన చోటును గుర్తించడం కవి విజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది. శీర్షిక, ఆరంభం, నిర్వహణలలో కవి చూపిన కొత్తదనం, నైపుణ్యం లాంటి వాటన్నిటినీ స్థిరపరిచే పునాది ముగింపు. కవితలోని 'కంఠస్వరం' (టోన్) ముగింపులోను వినిపించాలి. ముగింపు ఎంత ధ్వన్యాత్మకంగా ఉంటే కవిత అంత జిగువుగా, శక్తిమంతంగా ఉంటుంది. కావ్యానుభూతి సమగ్రమయ్యేది సార్థకమైన ముగింపుతోనే. ప్రతి ఉత్తమ కవితలో శైలి ననుసరించి 'సార్థకమైన ముగింపు' అనేది ఎప్పటికే సాపేక్షమే అని వ్యాసకర్త ఆరంభం ఉచితంగా లేకపోయినా ముగింపు సార్థకతను సంతరించుకోవాలని వ్యాసంలో వివరించారు.

**3.2.6. జరపుల రమేశ్**

**తలచుకోడానికైనా మిగలని 'తండా':**

తెలుగు సాహిత్యంలో నేటికి అనేక రకాలైన ప్రక్రియలు ఉన్నాయి. ప్రస్తుత తరుణంలో నూతనంగా ప్రవేశిస్తున్న ప్రక్రియ, చేరడానికి ఆవశ్యకత ఉన్న ప్రక్రియ గిరిజన సాహిత్యం అని జరపుల రమేష్ సూర్య పత్రిక 'అక్షరం' (*10/10/2011*) కు 'తలచుకోడానికైనా మిగలని 'తాండా'!' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో అభిప్రాయపడ్డారు. గిరిజన సాహిత్యం లేదా బంజారాల సాహిత్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ, గిరిజన సాహిత్యం లేదా బంజారాల గురించి అనువాదాలేమైనా వచ్చాయా అనే ప్రశ్న వేసుకున్నప్పుడు 'తాండా' నవల తారసపడిందని, ఈ నవల కన్నడంలో 'హవన' పేరుతో వెలువడిందని వ్యాసకర్త పేర్కొన్నారు. తెలుగులో జయశ్రీ మోహన్‌రాజ్, ఎస్. మోహన్ రాజ్ అనువదించారు.

ఈ నవలలో లంబాడాల సంస్కృతిని ఎంతో గొప్పగా చిత్రించారని, వారి దినచర్య, వారి పండగలు, కట్టుబాట్లు స్థూలంగా మొత్తం లంబాడాల సంస్కృతి కనిపిస్తుందని వ్యాసకర్త వివరించారు. ప్రాచీన కాలం నుండి బంజారాలు ఉన్నారని, పృథ్వీరాజ్ చౌహాన్ రెండవ తైరాన్ యుద్ధంలో ఓడిపోయిన తర్వాత ముస్లింల దాడినుండి తమను తాము రక్షించుకొనుటకు అడవులలోకి వెళ్ళిపోయి, గిరిజనుల వస్త్రధారణను పోలి ఉండే జంతు దంతాలు మరియు ఆకులతో కూడిన వస్త్రధారణను అలవర్చుకున్నారని వ్యాసకర్త సవివరంగా వివరించారు.

బంజారాల తరతరాలనుండి వస్తున్న 'తీజ్' పండగ పెద్ద పండగని, ఇప్పటికీ రాజస్థాన్, హర్యానాలలో ఘనంగా జరుపుకుంటున్నారని అయితే తెలుగు రాష్ట్రాలలో ఆ పండగ స్థానంలో 'వినాయక చవితి' ప్రవేశించిందని వ్యాసకర్త వివరిస్తున్నారు. ఆధునిక కాలంలో ప్రపంచీకరణ ప్రభావంతో వారి సంస్కృతి, సంప్రదాయాలు మరుగున పడిపోతున్నా దానిలో భాగంగా

స్త్రీలు చీరలు, రవిక ధరిస్తున్నారని, మగవారు ఫ్యాంట్ షర్ట్ ధరిస్తున్నారని, వారి సాంప్రదాయ దుస్తులైన పెట్యా, కాళీ తాండాలలో ముసలివారు, పేదలు మాత్రమే ధరిస్తున్నారని రమేష్ వివరిస్తూ; ఆధునికతను ఆహ్వానించాలి కానీ తమ అస్థిత్వాన్ని కోల్పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యతను మర్చిపోరాదని ఈ వ్యాసం ద్వారా వివరించారు. తమదైన సంస్కృతిని కాపాడుకొని, తరువాతి తరాలకు అందివ్వకపోతే భవిష్యత్ తరాలు తెలుచుకోడానికి 'తాండా!' అయినా మిగలదని వ్యాసకర్త హెచ్చరిస్తూ, సంస్కృతిని సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి బంజారాకు ఉందని ఈ వ్యాసం ద్వారా గుర్తెరిగించారు జరపుల రమేశ్.

## తెలుగు సాహిత్యం గిరిజన స్త్రీ స్వేచ్ఛాన్వేషణ:

తెలుగు సాహిత్యంలో స్త్రీ వాద ఉద్యమం 20వ శతాబ్దంలో వచ్చింది. ఈ వాదం పాశ్చాత్య ప్రభావంతో వచ్చిందన్నది నిర్వివాదాంశం. ఇది తెలుగులో అస్థిత్వ వాదాలలో మొదటి వాదం. తరువాత దళిత, మైనారిటీ, ప్రాంతీయ మొదలగు అస్థిత్వ వాదాలు తెరపైకి వచ్చాయి. జరపుల రమేష్ 'సాధన' రాసిన 'రాగో' అనే నవలను ఆధారంగా తీసుకొని సూర్య దినపత్రిక 'అక్షరం'కు 'తెలుగు సాహిత్యం గిరిజన స్త్రీ స్వేచ్ఛాన్వేషణ' (*31/10/2011*) అనే వ్యాసంలో గోండుల సంస్కృతి సంప్రదాయాలలో గిరిజన స్త్రీ పడే అవస్థలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వివక్ష వలన జీవితంలో వారు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోతున్న వైనం, ఉద్యమ పోరాటంలో గిరిజనుల బ్రతుకు చిత్రణ మొదలగు అనేక అంశాలను సవివరంగా విశ్లేషించారు.

ప్రాచీన కాలంనుండి చూస్తే సాహిత్యంలో గిరిజన స్త్రీ ప్రస్థావన రామాయణంలో శబరి, మహాభారతంలో హిడింబి మొదలైన గిరిజన స్త్రీల పాత్రలు కనిపిస్తాయి. ఆధునిక కాలం వచ్చేసరికి స్త్రీలు ఎటువంటి చట్రంలో ఇరుక్కుపోయారో, ఎటువంటి వివక్షకు గురవుతున్నారో 'సాధన' రాసిన 'రాగో' నవలలో వివరించే ప్రయత్నం జరిగిందని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. 'సాధన' రాసిన 'రాగో' 1993లో ప్రచురితమైంది.

'రాగో' యుక్తవయస్కురాలైన (మాడియా) గోండు యువతి. రాగో తల్లిదండ్రులు మేనమామ కొడుకు 'సంఘొ'తో పెళ్ళి నిర్ణయిస్తారు. ఆమెకు ఈ పెళ్ళి ఇష్టంలేదు. అదే ఊరిలో 'నాన్సు' అనే వ్యక్తిని ప్రేమిస్తుంది. ఆ సంబంధాన్ని తల్లిదండ్రులు ఒప్పుకోరు. చేసేదేమి లేక 'రాగో' అడవుల్లోకి పారిపోయి, అన్నల్లో కలసిపోయి, అచిరకాలంలోనే డిప్యూటీ కమాండర్‌గా ఎదుగుతుంది. అనేక గిరిజన గూడేలు తిరిగి గిరిజన స్త్రీలలో మార్పును

తీసుకొస్తుంది. తండ్రి ఆమె నిర్ణయాన్ని సమర్థించడంతో నవల ముగుస్తుంది.

సమాజంలో సగభాగం గల స్త్రీలు పురుషాధిపత్య ప్రభావానికిలోనై తక్కువ సాంఘిక స్థాయిని ప్రశ్నిస్తూ అస్థిత్వానికై చేసే పోరాటమే స్త్రీవాదం లేదా స్త్రీ అస్థిత్వ ఉద్యమం.

'రాగో' అంటే గోండు భాషలో 'రామచిలుక'. పంజరంలో గల రామచిలక స్వేచ్ఛకై ఎప్పుడూ ఎదురుచూస్తున్నట్లుగానే రాగో అనే మాడియా గోండి స్త్రీ స్వేచ్ఛకై ఎదురుచూసి చూసి చివరికి తానే ధైర్యం తెచ్చుకొని జనజీవన స్రవంతిలో కలసిపోతుంది. గిరిజన స్త్రీల పరిస్థితిని ఒకసారి అవలోకనం చేసుకుంటే మొదటి సమస్య అవిద్య. దానికి సంప్రదాయాలు, ఆచారాలు ఒక కారణమైతే; స్త్రీ విద్యావంతురాలైతే విద్యావంతుడైన భర్తను తీసుకురావడం తలకు మించిన భారం. పేదరికం ఒక కారణం, విద్య పట్ల విముఖత, అననుకూల పరిసరాలు, చదువుకున్న స్త్రీ పురుషునితో పొలం పనిచేయుటలో చేదోడు వాదోడుగా ఉండలేదనే అభిప్రాయం ఇవన్నీ గిరిజన స్త్రీ వెనుకబడుటకు కారణాలు.

గిరిజనులలో స్త్రీల అభిప్రాయానికి అంతగా ప్రాధాన్యత ఉండదు. రాగో నవలకు మూల కారణం లామడే (ఇల్లరికం). రాగో ఇష్టప్రకారం 'నాన్సు'తో పెళ్ళి చేస్తే పోయేదేమీ లేదు. కానీ ఆమె మాటకు విలువలేదు. సంప్రదాయం అందుకు అడ్డుపడుతుంది. పూర్వం నుండి వేళ్లూనుకొని ఉన్న పితృస్వామ్య వ్యవస్థ గిరిజనులలో కూడా స్త్రీ స్వేచ్ఛను భక్షిస్తుంది. స్త్రీలు బహిష్టు సమయంలో పడే బాధలు ఐదు రోజులు ఆమెను ఎవరూ పట్టించుకోరు. ఎండైనా, వానైనా గుడిసెకు దూరంగా ఉండాల్సిందే. చివరికి తల్లి కూడా ఆ ఆచారాన్ని జవదాటకూడదు. ఇది గిరిజన స్త్రీ పాలిట గుదిబండగా మారిన సమస్య. అంతే కాకుండా గిరిజనేతరుల చేతిలోనో లేదా దారి దోపిడి వాళ్ళ చేతిలోనో ఆమె మోసపోయిన సంఘటనలు కోకొల్లలు. వీటన్నింటికీ అక్షర రూపం ఇస్తూ, స్త్రీని మేల్కొల్పే విధంగా రాగో పాత్ర తీర్చిదిద్దబడి గిరిజన స్త్రీలలో మార్పును కాంక్షిస్తూ, స్వేచ్ఛా చైతన్యం వైపు వాళ్ళను ఆలోచింపచేస్తూ రాయబడ్డ నవల 'రాగో' అని ఈ వ్యాసం ద్వారా జరపుల రమేష్ సవివరంగా వివరించారు.

## అలుపెరగని పోరాట గాథ:

సాహిత్యం సమాజ ప్రతిబింబం అనుకున్నప్పుడు సమాజాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యాన్ని మించిన సాధనం లేదు. ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా ప్రధాన జీవన స్రవంతిలో భాగం కాకుండా, మైదాన ప్రాంతాలకు దూరంగా కొండల్లో, కోనల్లో జీవిస్తున్న ఆటవిక (గిరిజన) తెగలు

ఎన్నో ఉన్నాయి. ఆధునిక కాలంలో గిరిజనులు చేస్తున్న పోరాటాలు భూమి కోసమే. ఆ పోరాటాలలో 'మరణించిన గిరిజన యోధులు ఎంత మందో'. భూమి కోసం, నీటి కోసం గోండులు సాగించిన పోరాటాలను 'అడవి వెన్నెల' కథల సంపుటి నిరూపించిందని జరపుల రమేష్ 'సూర్య దినపత్రిక – అక్షరం (*14/11/2011*) కు 'అలుపెరుగని పోరాట గాథ' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో వివరించారు.

'అడవిలో వెన్నెల' కథల సంపుటి రాసిన రచయితల పేర్లు పేర్కొనలేదు ఇది 1985లో వెలువడింది. అడవుల్లో గోండులు నీటి కోసం పడుతున్న బాధలు అంతా ఇంతా కాదు. 'సక్కుబాయి' నిండు చూలాలు. నీటి కోసం వెళ్ళిన సక్కుబాయిని గుడ్డెలుగు కొట్టిన దెబ్బకు కడుపులో బిడ్డ చనిపోతుంది. నిజానికి ఆ గోండుల గూడాల్లో ఒక బావి ఉంటే సక్కుబాయి కడుపులో ఎన్నో ఆశలతో పెరుగుతున్న పసిబిడ్డ లోకాన్ని చూడకుండానే వెళ్ళిపోయేది కాదేమో! అని వ్యాసకర్త ఈ వ్యాసంలో నీటికై వారు పడుతున్న బాధను 'అడవిలో వెన్నెల' ఆధారంగా వివరించారు.

సంచార జీవనం నుండి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న తరువాత గిరిజనులు భూమికై పోరాటం చేయవలసి వచ్చింది. గోండులు పూట గడవని పరిస్థితులలో ఉన్నప్పుడు – 'ఐదు రూపాయలు' కథలో షావుకారు రామయ్య వద్ద కొమరం జంగు తీసుకున్న అప్పుకు మేకలు, ఆవులు, జొన్నలు మొదలైనవన్ని రామయ్య వశమవుతాయి. చివరికి జంగు కొడుకు రాంసావు ఆ అప్పు తీర్చలేక తన భూమిని కూడా రామయ్యకు ఇచ్చేస్తాడు. ఈ విధంగా మోసపూరిత వడ్డీతో గిరిజనుల భూములను దోచుకుంటున్న బడా బాబులు చేసే దుర్మార్గపు యధార్ధ సంఘటనలకు రూపం ఈ కథ.

ఫారెస్టు అధికారులు, ప్రభుత్వ అధికారులు గిరిజన స్త్రీలను చేరదీయడం, లైంగిక వేధింపులకు గురిచేయడం వంటి సంఘనలను ఈ కథా సంపుటి వివరిస్తుంది. ఈ కథల్లో గిరిజనులు తమకు కావాల్సిన అవసరాల కోసం ప్రకృతిలో, గిరిజనేతర వ్యవస్థలతో పోరాటాలు చేశారు. ప్రభుత్వం వారికి సహకరించాల్సింది పోయి వారిని అణచివేసేదిగా, దోపిడి చేదేదిగా మారింది. ఈ నేపథ్యంలో జరిగిన, జరుగుతున్న ఆదివాసీల ఉద్యమాలకు మద్దతుగా 'అడవిలో వెన్నెల' కథల సంపుటి వారి ఆశలను, ఆరాటాలను, పోరాటాలను అక్షరీకరించిందని, అలుపెరగని పోరాట గాథే గోండుల జీవితంగా నిరూపించిందని రమేష్ సవివరంగా ఈ వ్యాసంలో వివరించారు.

### 3.2.7. పులికొండ సుబ్బాచారి

### దళిత, కులీన దృక్పథాలు రెండు – పైట ఒక్కటే:

ఆధునిక వచన కవిత్వంలో ఒకే వస్తువును తీసుకొని ఇద్దరు స్త్రీ వాద కవయిత్రులు ప్రత్యాభిముఖంగా కవిత రాసిన అరుదైన ఘట్టం ఒకటుంది. ఇద్దరూ మంచి ప్రతిభావంతులైన కవయిత్రులు. స్త్రీవాద దృక్పథంతో కవిత రాయడంలో బాగా ఆరితేరిన వారు. ఇద్దరూ పరస్పర భిన్నమైన నేపథ్యాలనుండి వచ్చారు. ఇద్దరూ రెండు భిన్నమైన జీవన దృక్పథాలతో ఈ కవితల్ని రాశారు. ఒకరు జయప్రభ. ఈమె రాసిన కవిత 'పైటని తగలెయ్యాలి'. ఇంకొకరు జూపాక సుభద్ర. ఈమె రాసిన కవిత 'కొంగు నా బొచ్చుమీద కావలుండే బొంత పేగ్గాడు'. ఈ రెండు కవితలు పైట చెంగును ఆధారంగా, ఆసరాగా చేసుకొని రాసినవే. అయితే ఈ కవితలు – ఈ కవయిత్రులు ఇద్దరూ యాదృచ్ఛికంగా ఒకరికొకరు అనుకోకుండా రాసిన కవితలు కావని, వారివారి దృక్పథాలను, పైటపై వారివారి దృక్కోణాలను వివరిస్తూ ప్రొ॥ పులికొండ సుబ్బాచారి సూర్య దినపత్రిక 'అక్షరం'కు రాసిన (*04/07/2011*) 'దళిత, కులీన దృక్పథాలు రెండు – పైట ఒక్కటే' అనే వ్యాసం విశ్లేషించారు.

జయప్రభ కవిత 1988 మే 31న ప్రచురితమైంది. సుభద్ర కవిత 2007లో ప్రచురితమైంది. 'పైటని తగలెయ్యాలి' కవిత ఆ రోజుల్లో వాడి వేడి చర్చకు స్థానం కల్పించి, జయప్రభకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చి, ఆమె స్త్రీవాద కవయిత్రి అనే ముద్రను సుస్థాపితం చేసింది.

'పైట కొంగును చూస్తే/నాకెందుకో పాతివ్రత్యం గుర్తుకొస్తుంది/భుజాలనుంచి క్రిందికి వేలాడే గుదిబండలా/అదెప్పుడూ నా స్వేచ్ఛని హరిస్తునే ఉంటుంది'. పైట చెంగును పాతివ్రత్యానికి చిహ్నంగా, ఒక సామాజిక భావానికి చిహ్నంగా, అది స్వేచ్ఛను హరించే గుదిబండగా భావించారు జయప్రభ. అది తనను వంగదీయాలని ప్రయత్నిస్తూ, తనకు అలవాటులేని సిగ్గును మప్పుతుంది. తన చుట్టూ ఏదో కంగారుని పిట్టలా తిప్పుతుంది అని రాశారు. తను మనిషి అనే భావాన్ని మరిపింపజేసి తనను ఆడదానివంటూ హిప్నొటైజ్ చేస్తుంది అని అంటారు. దాని ముందు తానెప్పుడు ఓడిపోతూనే ఉన్నట్లు ఉంటుందని, పైట ఊబిలా తనను గుంజేస్తూ ఉంటుందని చెబుతారు జయప్రభ. 'నన్ను అబలను చేసిన పితృస్వామ్యపు అదృశ్య హస్తం పైట' అని జయప్రభ చెబుతుంది. కానీ సుభద్ర పైటను మరొక దృక్కోణంలో చూశారు. పల్లీయ జీవితంలో ముఖ్యంగా ఆరుగాలం కాయకష్టం చేసుకొనే స్త్రీ జీవితంలో దైనందిన కార్యక్రమాలలో పైట ఎన్ని రకాలుగా స్త్రీకి ఉపయోగపడుతుందో చాలా వివరమైన జీవన చిత్రాన్ని చూపారు. అసలు కవిత పేరునే జయప్రభ కవితకు ప్రతిముఖంగా పెట్టారు. జయప్రభ 'నాకు కావలి కాస్తూ నా

పాతివ్రత్యాన్ని కాపాడే కంచెలా కావాలంటూ పితృస్వామ్య వ్యవస్థని కాపాడుతూ ఉంది' అని అంటే సుభద్ర 'కొంగు నా బొచ్చ మీద కావలుండే బొంత పేగ్గాడు' అని మొదలు పెడతారు. వక్ష స్థలాన్ని లేదా ఛాతిని తెలంగాణ పల్లె భాషలో బొచ్చ అని అంటారు. పేగు అనే మాటను గుడ్డకి సమానార్థకంగా వాడతారు.

జయప్రభ కవిత 'పైటను తగలెయ్యాలి'లో అర్బన్ ఎలీట్ భావాలు, హైఫై సంస్కృతికి చెందిన నగర జీవన స్త్రీ భావాలు కనిపిస్తాయి. పైట పాతివ్రత్యానికి కాపలాగా, గుదిబండలాగా ఉందని, పితృస్వామ్య సంస్కృతికి, పెట్టుబడిదారీ దోపిడి సంస్కృతికి చిహ్నంగా ఉంది అని జయప్రభ చెబితే, సుభద్ర పల్లీయ జీవితంలో ఆరుగాలం కష్టపడి పనిచేసే స్త్రీ జీవితంలోని ఎన్నో ఘట్టాల్లో పైట చెంగు సహచరిగా సైదోడుగా కైదోడుగా ఉంటుందని జీవన దృశ్యాన్ని చూపుతూ రుజువు చేస్తూ చెబుతారు. రెండు కవితల్లోని భాష కూడా ఇందుకు అనుగుణంగా సాగింది. జయప్రభ కవితలోని భాష ఆధునిక ప్రామాణిక వ్యవహార భాషలో ఉంటే సుభద్ర కవితలోని భాష నూటికి నూరుపాళ్లు తెలంగాణ పల్లీయ జీవనాన్ని ప్రతిబింబించే సహజమైన భాష.

ఈ విధంగా పైటపై రాసిన ఇద్దరు స్త్రీవాద రచయిత్రుల విభిన్న దృక్పథాలను సుబ్బాచారి ఈ వ్యాసంలో బహుముఖంగా విశ్లేషించారు.

## మనస్తంత్రులు మీటే మాధురీ కవి:

కవిత్వం ఎలా రాయాలో పదహారో శతాబ్దానికి చెందిన మొల్ల తన రామాయణంలో ఇలా చెప్పింది... "తేనె సొక నోరు తియ్యనయగురీతి/దోడనర్థమెల్ల దోపకున్న/ గూఢ వితతి గొట్లాడు పనియెల్ల/మూగ చెవిటివారి ముచ్చటగును" పదిహేడో శతాబ్దానికి చెందిన రాజకవి రఘునాథ నాయకుడు కవిత్వం గూర్చి ఇలా చెప్పాడు "చెప్పగవలె, కప్పురములు/కుప్పలుగా పోసినట్లు, కుంకుమ పైపై/ గుప్పిన క్రియ, విరిపొట్లము/ విప్పిన గతి, ఘుమ్మనం గవిత్వము సభలన్". ఈ భావాలు సర్వకాలికమైనవి. ఆధునిక కవులలో వచన కవితను పండించిన కవులు దీవి సుబ్బారావు రాసిన కవిత సరిగ్గా ఈ రీతిలో ఉంటుందని చెబుతూ 'అక్షరం'కు (12/10/2011) రాసిన 'మనస్తంత్రురులు మీటే మాధురీ కవి' అనే వ్యాసంలో సోదాహరణంగా ప్రొ॥ పులికొండ సుబ్బాచారి వివరించారు.

తెలుగు ఆధునిక వచనకవులలో హంసలదీవి సుబ్బారావు విలక్షణమైన కవి. ఈ విలక్షణమైన అనే మాట – ఆయన వ్యక్తిత్వానికి, కవితా వ్యక్తిత్వానికి చెందుతుంది. ఈయన తన నూతన యౌవనం నుండి అంటే 1957 నుండి కవిత్వం రాస్తున్నా, ఆనాడు రాస్తున్న పాత కవులలాగా

అందరినోట నానిన కవి కాదు. తన ఉద్యోగం తాను చేసుకుంటూ, తన ప్రపంచ విహాయసంలో తాను విహరిస్తూ తన కోసమే కవిత్వం రాసుకున్న అరుదైన కవి దీవి సుబ్బారావు. తొలి కవితా సంపుటిని 'వైశాఖ సముద్రం' అనే పేరుతో తెచ్చారు. అది ఆరోజులలో మంచి పేరు తెచ్చుకుంది.

తను చూసిన దృశ్యాలను అత్యంత సహజ సుందరంగా, తేనె సోకినట్లు, అత్యంత సరళంగా కంటికింపుగా చూపే నైపుణ్యం ఈయన ప్రతి కవితలో కనిపిస్తుంది. పదాలకు రంగు, రుచి, వాసన ఉంటాయనే విషయం ఈయన కవిత చదివిన తరువాత మరింత బలంగా తెలుస్తుంది. ఇందుకు వైశాఖ సముద్రంలోని ప్రతి కవితను మచ్చుగా చూపవచ్చు అని వ్యాసకర్త అభిప్రాయపడుతున్నారు. వర్షం వెలసిన సమయాన / ఆకాశవీధిలో పోతుండగా / వార్షికాభ్రములు చిందినయ్ కాబోలు / సముద్రం ఒడ్డున రథాన్ని దింపి / చక్రాలు కడుగుతుండగా / మీరు నమ్మారు గానీ సూర్యుణ్ణి నేను చూశాను. సముద్రంలో సూర్యాస్తమయాన్ని లేదా సూర్యోదయాన్ని చాలామంది కవులు వర్ణించారు. కానీ ఇలాంటి దృశ్యాన్ని, కమనీయ రాగరంజిత రీతిని మరెవరూ చూపలేదు. సముద్రం ఆవలి దిజ్మండలంలో దిగిన సూర్యుడు ఈ కవికి ఎలా కనిపించాడంటే సముద్రం ఆవలి ఒడ్డున తన రథాన్ని దింపి తన రథచక్రాలను కడుక్కుంటున్నట్టుగా! దీన్ని ఏ అలంకారం అని చెప్పడమూ సరిగ్గా కుదరదు. ఈ ఊహ పోహలింపు అత్యంత నూతనం, తనదే అయిన ముద్ర.

ప్రకృతి వర్ణన వినూత్నంగా చాలా తాత్వికంగా కూడా ఉంటుంది. చీకటిని వర్ణించిన తీరు ఇక్కడ చూడవచ్చు. "చీకటి రాలుతోంది పైనుంచి / కొండలమీద / చెట్టుకొమ్మల మీద / పొలాలమీద / పట్టణం పొలిమేరమీద / దోవ కిరుపక్కల గుట్టలుగా గుబుర్లుగా పోగులుపడి పేరుకు పోతుంది / చీకటిని పీల్చి గాలినల్లబడుతుంది". ఒక ప్రాచీన కావ్యశాస్త్రకారుడు – కవికి ప్రపంచం చాలా భిన్నంగా కనిపిస్తుంది. అతను చూచిన రీతినే ప్రపంచం మారిపోతుందని ఒక శ్లోకంలో రాశాడు. ఇక్కడ సుబ్బారావు కవితలో ఈ గుణం కనబడుతుంది. చీకటికి లేని భౌతిక గుణాన్ని చీకటికాపాదించి ఇనానిమేట్‌ని, యేనిమెట్‌గా అంటే నిర్జీవ గుణ ప్రకృతికి జీవ గుణాన్ని ఆపాదించి చెప్పిన రీతి అప్పటికి చాలా సరికొత్త లక్షణం. 'చీకటిపై నుండి రాలుతూంది' అని చెప్పడం ఆధునిక తెలుగు కవితలో ఒక వినూత్న ధోరణిని ఆహ్వానించడమే అని ఆ మాధురీ కవి గూర్చి వ్యాసకర్త భావించారు.

దీనిని సుబ్బారావు ప్రపంచంలోని మంచి కవిత్వాన్ని తెలుగులోనికి తెచ్చే ప్రయత్నం చేశారు. సూఫీ కవిత్వం, నవనవం, పరమ గీతం, మాటన్నది జ్యోతిర్లింగం అనే గ్రంథాలు ఇవే. వీటిల్లోనూ తన ముద్రను

చూపారు. తన మృధు మధురమైన తేనె శైలిలో రచించారని ఈ అనువాదాలకే ఈయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిందని వ్యాసకర్త మనస్తంత్రుల మీటే మాధురీ కవి హంసలదీవి సుబ్బారావు గూర్చి ఈ వ్యాసంలో మధురంగా వ్యాఖ్యానించారు.

**జాషువా దళిత కవా?:**

సమాజంలో అగ్రవర్ణాల ఆధిపత్యం క్రింద నలిగిపోతూ సామాజికంగా తక్కువ సాంఘిక స్థితిలో ఉండడాన్ని నిరసిస్తూ, తరతరాలుగా అనుభవిస్తున్న అవమానాల్ని పోగొట్టుకోవాలనీ, అందరిలాగానే తామూ గుర్తింపబడాలనీ, ఆత్మ గౌరవాన్నీ కాపాడుకోవాలనీ, సాంస్కృతికంగా తమకో అస్థిత్వాన్ని కల్పించుకోవాలనీ ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన ప్రాతినిధ్యం కోసం పోరాడుతూ సమాజంలో అణచివేతకు గురవుతున్న దళితులు తమ అభ్యున్నతిని కాంక్షిస్తూ సృష్టింపబడుతున్న సాహిత్యమే దళిత సాహిత్యం లేదా దళితవాద సాహిత్యం. ఇది తెలుగు సాహిత్యంలో 1980వ దశకంనుండి తనదైన ప్రత్యేక గుర్తింపును సంతరించుకుందని చెప్పవచ్చు.

అయితే అంటరానితనం అనే దౌర్భాగ్యపు రక్కసి కోరలలో పడి నలిగి బాధాతప్త హృదయనేత్రుడై అగ్రవర్ణాల దాష్టీకాన్ని ఎండగడుతూ 'గబ్బిలా'న్ని సృష్టించిన 'జాషువా దళిత కవా?' అన్న ప్రశ్నను వెలయిస్తూ అదే శీర్షికతో 'అక్షరం' (సూర్య దినపత్రిక, 26/09/2011) లో పులికొండ సుబ్బాచారి ఒక వ్యాసం ప్రచురిస్తూ, జాషువా దళిత కవా? కాదా? అన్న విషయాన్ని తనదైన దృక్కోణంలో చక్కగా చిక్కగా విశ్లేషించారు.

జాషువా 1895లో జన్మించారు. 1919 నుండి తన సాహిత్యాన్ని ప్రచురించడం ప్రారంభించారు. అయితే తన బాల్యంలోనే ఆశుపద్య రచన చేయగల్గిన ఘనుడు జాషువా. జాషువా తన మొదటి కావ్యం రుక్మిణీ కళ్యాణం (1919) నుండి స్వీయ చరిత్ర 'నా కథ' (1966) వరకూ సాహిత్య వ్యవసాయం చేయడమే కాదు విరగ పండించాడు.

జాషువా అనగానే గబ్బిలం, గబ్బిలం అనగానే జాషువా గుర్తుకు రావడం సాధారణమైన విషయం. గబ్బిలం రాకముందే జాషువాకు మంచి పేరు వచ్చింది. అప్పటికే సరిగ్గా 60 ఖండ కృతుల్ని వెలయించాడు. అంటరానితనం గూర్చి చాలా మంది కవులు కవిత్వం రాశారు. కాని జాషువా కవిత్వమే నేటికీ నిలిచింది. ప్రజల మనస్సులో నాటుకుంది. దీనికున్న కారణం జాషువా చూపిన అత్యున్నత స్థాయి సృజనశీలత, కవితా ప్రతిభ.

గబ్బిలంలో అంటరానితనానికి భూమికగా ఉన్న కర్మ సిద్ధాంతాన్ని వర్ణ వ్యవస్థ దౌష్ట్యాన్ని, హిందూమతంలో అంతర్గతంగా ఉన్న లోపాలను

వివిధ పద్యాలలో ఎత్తి చూపాడు జాషువా. ఇక తనకు ఎదురైన వ్యక్తులు కులం పేరుతో తన పట్ల చూపిన దౌష్ట్యాన్ని కూడా బాగా నిరసించాడు. గబ్బిలం రెండవ భాగంలో హిందూమతంలో పాటిస్తూ వస్తున్న అనుష్ఠానాలలో, ఆచార కాండలో ఉన్న సాంఘిక వైషమ్యాన్ని, గుడ్డిగా చేసే అనాచారాలని ఘాటుగా నిరసిస్తాడు జాషువా. అంటరానితనం అనే దౌష్ట్యం జాషువాను ఎంతగా బాధించిందో చెప్పడానికి ఒక పద్యాన్ని తప్పక చెప్పుకోవలసి ఉంది.

**"నా కవితా వధూటి వదనంబునెగాదిగా జూచి. రూపురే**
**ఖా కమనీయ వైఖరులు గాంచి భళి భళీ యన్నవాడే మీ**
**దేకులమన్న ప్రశ్న వెలయించి, చివాలున లేచిపోవుచో**
**బాకున గ్రుమ్మనట్లగును పార్థివ చంద్ర వచింపసిగ్గగున్"**

అని చెప్పే పద్యం బాధకు ప్రత్యక్ష రూపం. బాకుతో కుమ్మినట్లుంటుందని అంటే బాకుతో పొడిచి, బాగా కలదిప్పినట్లు పేగులు తెగినట్లు బాధ కల్గుతుందని చెప్పడం, తాను అంటరానితనం ఎలా అనుభవించాడో చెప్పడానికి పరాకాష్ట.

జాషువా మహాభారతంలోని భీష్ముడు, కర్ణుడు వంటి ప్రధాన పాత్రలపైన ఖండ కావ్యాలు రాశాడు. అందులో ఆయన చూపిన నైపుణి అబ్బురాన్ని కల్గిస్తుంది. ఈయన మొత్తం మహాభారతాన్ని రచించి ఉంటే నన్నయ, తిక్కనల సరసన నిలబెట్టదగినవాడు – అనిపించేలా ఉన్నాయి ఆ ఖండ కావ్యాలు. ఇంత గొప్ప పాండిత్యాన్ని, కవితాశక్తిని, పద్యరచనా నైపుణ్యాన్ని, భాషా జ్ఞానాన్ని కలిగిన కవిని, ఇంత విస్తృతమైన విషయం ఉన్న కవిత రాసిన కవిని కేవలం 'దళిత కవి' అని ఈ కాలంలో అనడం సబబేనా అని ఇక్కడ చర్చింపవలసి ఉందని వ్యాసరక్త అభిప్రాయ పడుతున్నారు. జాషువాలో ఉన్న కొన్ని వైరుధ్యాలను గూర్చి కూడా ఇక్కడ ప్రస్తావించాలి.

ఆయన అంటరానితనానికి కారణమైన ఏ అగ్రకులాలను బాగా నిరసించాడో, అదే అగ్రకులాల వారు ఆయనను బాగా ప్రేమించారని, ప్రోత్సహించారని, ఆయనే రాసుకున్న స్వీయచరిత్రలో తెలుస్తుంది. ఆయన తన పుస్తకాలను చాలావరకూ అగ్రకూలాల వారికే అంకితమిచ్చాడు. ఆయనకు ఘన సన్మానం చేసినవారు దాదాపు అగ్రకులాలవారే. తను పుస్తకాలను అంకితంగా గ్రహించగా, జాషువా కీర్తించిన వారు కూడా అగ్ర కులాలవారే. దళిత సమస్యమీద నేడున్న దళిత కవులలో ఉన్న దృక్పథం జాషువా దృక్పథం ఒకటి కావు. జాషువా సంపూర్ణంగా గాంధేయవాది. కానీ

నేటి దళిత వాదం గాంధేయవాదాన్ని తిరస్కరిస్తుంది. హరిజన అనే భావననే తిరస్కరిస్తుంది.

'మా జీవితంలో మౌలికమైన మార్పులు తీసుకు రాకుండా మీ దేవుణ్ణి మావాడకు తీసుకువస్తే మాకు జరిగేదేమిటి' అని ప్రశ్నించింది నేటి దళితవాదం. జాషువా నాటి కాంగ్రెస్ నాయకుల్ని మెచ్చుకున్నాడు. కానీ నేటి దళితవాదం అగ్రకులాల రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తూ దళితులకు కావాల్సింది రాజ్యాధికారమే కానీ, మీరు చూపే సానుభూతి కాదు. పద్మభూషణ్ బిరుదును, శాసనమండలి సభ్యత్వాన్ని కూడా పొందాడు జాషువా. తనకు కావాల్సిన పదవులను జాషువా తన ప్రతిభ వల్ల పొందాడే తప్ప, ఇతరుల దయాదాక్షిణ్యాలతో కాదని వ్యాస కర్త వివరణ. నేటి దళితవాదంలో ఇమడని చాలా ఆలోచనలు – దళితులకు కావలసిన విషయాలలో పరిమితమైన ధోరణి ఉన్న జాషువా కాలంలో ఉన్న అంటరానివారుగా భావించిన వారి సామాజిక స్పృహ భిన్నమైనవి.

నేటి సామాజిక, సాహిత్య విశ్లేషణ పరికరాలతో దళిత దృక్పథంలో 33 కావ్యాలు రాసిన జాషువాను కొలవడం సమంజసం కాదు. జాషువాను దళితకవి అని లేదా దళిత కవిత్వానికి ఆదికవి
అని ముద్ర వేయడం ఉచితంగాదు. జాషువాను దళిత కవి అనే చట్రంలో బంధించడం కుదరదు. పద్య రచనలో కాని, కావ్య రచనలో కానీ, పాండిత్యంలో కానీ ఆనాటి ఏ కవులకు తీసిపోని జాషువాను విశ్వనాథ వంటి అగ్ర కవులకు సమంగా నిలిపి చూడాలి తప్ప, ఆయన పుట్టిన కులాన్ని మాత్రమే ఆధారంగా చేసుకొని ఆయన దళితకవి అని బ్రాండు వేయడం జాషువాకు చేసే అపచారం అవుతుంది. జాషువాను మహాకవి అనడమే సబబు.

### 3.2.8. ఎండ్లూరి సుధాకర్:

### 46 శతాబ్దాల దళిత గాయం – 'గోసంగి' కావ్యం:

తెలుగులో దళిత కవిత్వమనే ఒక ప్రత్యేకమైన వింగడింపు ప్రారంభమై చాలా కాలమే అయ్యింది. 1980 దశలోనే ఇది స్పుటంగా ముందుకు వచ్చింది. అయితే ఇంతకు ముందు కవిత్వంలో దళిత ప్రస్థావన గాని, వారి గూర్చి రాయడం కాని లేదనికాదు. అది ఈ పేరుతో ప్రత్యేకంగా లేదని చెప్పవచ్చు. ఈ మధ్య కాలంలో దళిత కవిత్వంలో కొంత స్తబ్దత ఏర్పడిన స్థితిలో ఎండ్లూరి సుధాకర్ ఇటీవలే ప్రకటించిన 'గోసంగి' ఆ మంచుని విరిచింది. శ్రీకృష్ణ దేవరాయల వారి పంచశత వార్షికోత్సవాలను పురస్కరించుకొని 2010 జూలై 3న సుధాకర్ ఈ దీర్ఘ కవితను రాశారు.

'గోసంగి' కావ్యంను ఆధారంగా చేసుకొని ప్రొ॥పులికొండ సుబ్బాచారి 'అక్షరం'లో 22/08/2011 న 'శతాబ్దాల దళిత గాయం ఎండ్లూరి సుధాకర్ – 'గోసంగి' కావ్యం అనే శీర్షికతో ఒక వ్యాసం వ్రాశారు.

సుధాకర్ గోసంగి కావ్యం రాయడానికి రాయల ఉత్సవాలు ఒక మిష అయితే, దళితులలోని ఇతర ఉపకులాలవారికి సంబంధించిన విషయాన్ని ప్రముఖం చేసి కావ్య సృజన చేయాలన్నదే అసలు కారణంగా తెలుస్తుంది. కోరంగి కులాన్ని 'ఆముక్త మాల్యద' కావ్య వ్యాఖ్యానం రాసిన వేదం వేంకటరామశాస్త్రి 'మాలదాసరి'గా మార్చి రాసారని, దీని వల్ల స్వతంత్ర అస్థిత్వం ఉన్న గోసంగి కులానికి అన్యాయం జరిగిందని సుధాకర్ వాదన. నిజానికి మాల దాసరి అనే మాటను మొదటిసారిగా ప్రయోగించింది వేదం వారు కాదు వావిళ్ల వారు.

ఎండ్లూరి సుధాకర్ గోసంగిని ఉద్దేశించి ఈ కావ్యాన్ని రచించారు. స్వతంత్ర అస్థిత్వం గల దళితులలో గల అనేక కులాలను ఒక గాట కట్టి చూడవద్దని, విడివిడిగా వారి అస్థిత్వాన్ని గ్రహించమని ఆయన వాదన. 'గోసంగి' ఈ భావనతో ఆరంభమైన కావ్యమైనా ఇందులో ఉన్న తాత్వికత మాత్రం ఒక దళిత గాయమే. శతాబ్దాలుగా ఈ గాయం మానకుండా వస్తూ ఉన్నా దీనికింకా సరి కొత్త ఇన్ఫెక్షన్లు వస్తున్నాయే కానీ గాయం మానడం లేదనే తత్వాన్ని ఇక్కడ సుధాకర్ చెప్పదల్చుకున్నారు. శ్రీకృష్ణ దేవరాయలు దళిత గాయకుని గురించి ఇంత గొప్పగా కథ రాసినా అతని ఆస్థానంలో దళిత కవికి స్థానం లభించలేదని బాధపడతారు సుధాకర్.

'కృష్ణరాయా/కీర్తికాయా/నీ భువన విజయంలో/నాక వనం కనబడుతుందా/ అష్టాదశ వర్ణనల్లో అస్పృశ్య వర్ణ నిషిద్ధం/ నీ ప్రబంధాలలో/ నాజాతి అందం ప్రతిబింబిస్తుందా/ నీ భువన విజయాలో/ నేను కాలు మోపి ఉంటే/అష్టదిగ్గజాలేం కర్మ్మవేల దిగ్గజాల నీలి పాదాలు/ గండపెండేరాలతో ఘల్లుమనేది/ ఈ సైన్యంలో మేముంటే/ నీ కీర్తి పతాక హిమాలయాన్ని ముద్దాడేది' అంటారు సుధాకర్. ఒక దళిత కవి ప్రతిభను గుర్తించలేదు రాయలు అని భావిస్తూ మాదిగ కులం ఒకటే కాక ఇతర చిందు, పంబల, డక్కలి, కిన్నెర... మొదలైనవారి కళా ప్రతిభను గుండెకు తగిలేలా ఈ కావ్యంలో సుధాకర్ రాశారని వ్యాసకర్త వివరించారు.

ఎండ్లూరి ఇక్కడే ఒక దళిత కవిగా ఇతర దళిత కులాల అస్థిత్వాన్ని గూర్చి ప్రస్తావించి కవిత రాయడంలో కృతకృత్యుడయ్యారు. లోతుగా చూస్తే రాయల గూర్చి చెప్పడం ఇక్కడొక మిష మాత్రమే. అతను తాత్వికంగా ఇక్కడ చెప్పదల్చుకున్నది శతాబ్దాలుగా మానని దళిత గాయం. విభిన్న కుల అస్థిత్వాలతో ఉన్న ఈ దళిత గాయాల్లో ఎంత కళ ఉందో చెప్పడమే

ఈయన లక్ష్యంగా ఇక్కడ కనిపిస్తుందని వ్యాసకర్త వివరించారు. గోసంగి కథ వినడానికి ఆర్ద్రత కావాలని చెప్పిన సుధాకర్ 'గోసంగి' దీర్ఘ కవితలో అడుగడుగునా ఈ ఆర్ద్రతని చిప్పిల చేయడంలో మంచి కౌశల్యాన్ని చూపారని వ్యాసకర్త పాఠకులకు ఈ వ్యాసం ద్వారా తెలియపర్చారు.

ఈనాడు నిలిచి ఉన్న అంటరానితనం అనే సాంఘిక విషమ సమస్యను చారిత్రకంగా చూచి, తర్కించి రాయడానికి దాసరి కథ లేదా గోసంగి కథ సుధాకర్‌కి మంచి భూమికగా ఉపయోగపడుతుంది. అంతే కాదు దళిత కులాలలో అనేక సంఖ్యాకులుగా ఉన్న స్వతంత్ర అస్థిత్వం కలిగిన కులాల గురించి తనలోని ఆర్ద్రతను తెలియపర్చడానికి ఈ కావ్యం కూడా సార్థకమైంది. ఈ దళిత వస్తువుపైన దీర్ఘకవిత రావడానికి కూడా ఇది ఆస్కారంగా నిలిచిందని వ్యాసకర్త 'గోసంగి' కావ్యం యొక్క లక్ష్యాన్ని సుధాకర్ యొక్క ఆంతరంగిక దృక్కోణాన్ని ఒడుపుగా పట్టుకొని, విశ్లేషణాత్మకంగా వివరించారు.

### 3.2.9. వేదగిరి రాంబాబు:

## వస్తు వైవిధ్యభరితం – నేటి కథానిక:

కథానిక అందరికీ అర్థమయ్యే సులభ వచనంలో ఉండడమే కాకుండా పరిమాణంలో కూడా చిన్నది. చదవడానికి పట్టే వ్యవధి తక్కువ. చదువురలకు నీరసం కలగకుండా చెప్పగలగడం కథానిక ప్రత్యేకత. కథానిక వందేళ్ళ చరిత్రను పరిశీలించినప్పుడు మనం ఒక ప్రత్యేక విషయాన్ని గమనిస్తాం. గురజాడ నాటి సమాజంలోని చెడును చీల్చి చెండాడుతూ ఆధునిక కథకి శ్రీకారం చుట్టారు. అయితే నేడు కథానిక వస్తువుగా విభిన్న అంశాలు దర్శనమిస్తున్నాయి. ఆధునిక ప్రపంచపు ప్రతి పోకడని కథానిక ప్రతిబింబించడం అశించ దగ్గ విషయం. నేటి కథానిక వస్తు వైవిధ్యాన్ని ప్రస్తావిస్తూ డా॥ **వేదగిరి రాంబాబు** 'అక్షరం' (*సూర్య దినపత్రిక – అక్షరం, 14/04/2011*) కు రాసిన 'వస్తు వైవిధ్య భరితం – నేటి కథానిక' అనే వ్యాసంలో విపులంగా వివరించారు.

పాలగుమ్మి పద్మరాజు కథానిక గురించి మాట్లాడుతూ ఒక సందర్భంలో "తెలుగు కథానిక గురజాడ చేతుల్లో యవ్వనంలో పుట్టింది. ఆ తర్వాత దాదాపు ఇరవై ఏళ్ళపాటు బాల్యానికి లోనై తప్పటడుగు వేసింది" అని అన్నారు.

అరవై, డెబ్బైలలో మధ్యతరగతి కథానికలే వచ్చాయని, ఎనభైలో బూతుమయం అయ్యాయని అభిప్రాయం కొందరు వెలిబుచ్చారు. కథానిక వందేళ్ళ చరిత్రలో పెదవి విరుపులు ఎప్పుడూ ఉన్నవే అని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. అయతే నేడు గ్లోబలైజేషన్, పాశ్చాత్య ప్రభావం, ఆధునిక

పోకడలు వస్తువుగా దర్శనమిస్తున్నాయి. వీటి ప్రభావంతో చిన్నాభిన్నమైన గ్రామీణ జీవితం, కరువు కాటకాలవల్ల ఖాళీ అవుతున్న గ్రామాలు, వలసపక్షులై సరైన గూడులేక విలపిస్తున్న బ్రతుకులు, స్త్రీకి కనీస రక్షణలేని భయాందోళనా ప్రేరిత సమాజ స్థితి, దోపిడికి గురవుతున్న బ్రతుకులు, సెజ్‌ల పేరిట కాస్త పంటపొలం కూడా పోగొట్టుకున్న చిన్న, సన్నకారు రైతుల ఆక్రోశాలు – ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నిర్వాసితులై అస్థిత్వాన్ని గిరిపుత్రుల బ్రతుకులు ఇదంతా ఒక పార్శ్వం. ఆకాశాన్ని తాకే అధిక ధరలు కూలీలు మధ్యతరగతి కుటుంబాన్నే కాదు చిన్న ఉద్యోగిని కూడా అతలాకుతలం చేస్తుంది. జీవన వైవిధ్యం వల్ల వచ్చే మార్పులు కుటుంబ బంధాలను చిద్రం చేస్తుంది. మనీమయమై పోతున్న మనస్తత్వాలు మానవ సంబంధాలను అణు సమాన శకలాలుగా చేసేస్తున్న వైనం ఇలా అదీ ఇదీ అని కాదు కథానికకు నేడు విశిష్ట వస్తువైవిధ్యాన్ని సంతరించుకుందని వ్యాసకర్త ఉదాహరణ పూర్వకంగా పాఠకులకు అందించారు.

## చిన్నకథను చెంగు చెంగున పరుగెత్తించిన శ్రీపాద:

తెలుగులో ఆధునిక కథ – కథనానికి గురజాడ శ్రీకారం చుడితే దానికి వస్తురీత్యా, భాషారీత్యా పరిపూర్ణ తెలుగుదనాన్ని సంతరింపజేసినవారు శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి. ఒకవైపు కందుకూరి, మరోవైపు గురజాడ ఆయనకి స్ఫూర్తి దాతలు. సంఘ సంస్కరణ అభిలాషతో శ్రీపాద ఎన్నో చిన్న కథల్ని అందించారు. ఒక చిన్న కథలో వీరేశలింగం ప్రసక్తి ప్రశస్తి తెచ్చారు కూడా. రఘుపతి వెంకటరత్నం నాయుడు స్ఫూర్తితోనూ కథను మలిచారు. పద్య రచనలు, నాటకాలు, నాటికలు, రేడియో నాటికలు, నవలలు, అనువాదాలు, వైద్య గ్రంథాలు రాసినా ఆయనకి చిన్న కథలే పెద్ద పేరు తెచ్చాయని చెబుతూ డా॥ వేదగిరి రాంబాబు 'అక్షరం'కు వ్రాసిన 'చిన్నకథను చెంగు చెంగున పరుగెత్తించిన శ్రీపాద' అనే వ్యాసంలో వివరించారు.

అప్పటి అవసరం కోసం ఆంధ్రపత్రిక ఆఫీసులో కూర్చొని మొదటి చిన్న కథ, 'ఇరువురు ఒక చోటకే పోదాం' అనే భగ్న ప్రేమకథ గ్రాంథిక భాషలో వ్రాశారు. తరువాత చెవులూరించే తెలుగు భాషలో చిన్న కథలని 80కి పైగా రాశారు. 75 వరకూ సంపుటాల్లో భద్రపరిచారు. సంపుటాల్లోకి రాని 13 చిన్న కథలు మిగిలి ఉన్నాయి.

'తియ్యనిదనం, చవులిచ్చినదాయన శైలి'. ఆయన రచనలు మరో భాషకు లొంగవు. ఆధునిక కథ చెప్పడంలో గురజాడ పాటించిన క్లుప్తతని, శిల్పాన్ని ఆయనంతగా పట్టించుకోలేదనిపిస్తుంది. విస్తృతంగా చెప్పడం ఇతని నైజం.

కథలల్లడమంటే మాటలనుకున్నారేమో? అవి కల్పించడానికి గొప్ప ప్రతిభ ఉండాలి. వాటి విలువ తెలుసుకోవడానికి ఎంతో పరిజ్ఞానం ఉండాలి, చెప్పడానికి ఎంతో నేర్పు ఉండాలి. అవి వినడానికి ఎంతో రుచి ఉండాలి. కథలు కళ్ళకు వెలుగునిస్తాయి. బుద్ధికి పదునుపెడతాయి. మనసుకు ఉత్సాహం, ఉల్లాసం కల్గిస్తాయి ఈ లక్షణాలన్నీ శ్రీపాద వారి చిన్న కథల్లో కనిపిస్తాయని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. కలుపు మొక్కలు, గులాబీ అత్తరు, వడ్లగింజలు, అన్నంత పనీ జరిగింది, తాపి మేస్త్రీ, అరికాళ్ల కింద మంటలు, మార్గదర్శి, ఇలాంటి తవ్వాయివస్తే, విష భుజంగం ఇవి పైన పేర్కొన్న లక్షణాలకు ఉదాహరణలు మాత్రమే.

శ్రీపాద కథలు విని ఉండకపోతే తెలుగు ఉనికి అయోమయం కొన్ని చిన్న కథలనైనా చదివితే తెలుగు కుటుంబాల ఆపేక్ష, అంతఃకరణాలు ఎలాంటివో, ఆ మర్యాదలు, మన్ననలూ ఎట్టివో అర్థమవుతుంది. ఆశ్చర్యమేస్తుంది, ముచ్చటవుతుంది. చదువరులకు చదువు చెప్పేది ఆయన రచన అంటూ చిన్న కథను పరుగులెత్తించిన శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి సృష్టించిన కథా సాహిత్య సాగరాన్ని మన కళ్ళ ముందు ఉంచారు వ్యాసకర్త.

## జర్నలిస్టుగా ముళ్ళ'పాడి':

"ఆ రోజుల్లో పత్రికకు ఓ స్థాయి ఉండేది. దాన్ని దిగజార్చడానికి యాజమానులు గానీ, సంపాదకులు గానీ ఇతర స్టాఫ్ గాని ఇష్టపడేవారు కారు. ఆ స్థాయి దిగజారకుండా పత్రికను తీర్చిదిద్దడానికి కృషి చేసేవారు అన్నారు ముళ్ళపూడి వెంకటరమణ, నాటి రోజుల్ని తలచుకుంటూ.

'జర్నలిస్టుగా ముళ్ళ'పాడి' ' అనే శీర్షికతో వేదగిరి రాంబాబు 'అక్షరం' (*28/02/2011*)లో ముళ్ళపూడి వెంకటరమణ వృత్తి జీవితం గూర్చి ఒక వ్యాసం వ్రాశారు. సూటి దనం ముళ్ళపూడి వారి నైజమని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. సినిమా చూసి తనకు అనిపించిన దానినే రివ్యూగా రాసేవారు. వత్తిళ్ళకు లొంగేవారు కాదు. ప్రకటనలు రాకపోయినా దానిపై పత్రికారచన స్థాయిని దిగజార్చడానికి ఇష్టపడేవారు కాదు. కుటుంబ పత్రికలకు ప్రధాన పాఠకులు ఇళ్ళలో ఉండే స్త్రీలు, యువత అని అట్టి పత్రికలలో వ్యాసాలు వ్రాసినప్పుడు మరియు కథలు, సీరియల్స్‌లో భాష దిగజారకుండా జాగ్రత్తలు వహించేవారు.

అప్పట్లో సీరియల్స్ ఒకటి, కథలు ఎక్కువగా ఉండేవి. సీరియల్ మీద సర్క్యులేషన్ పెరగడం, తగ్గడం ఆధారపడి ఉండేది. అయితే సర్క్యులేషన్ పెంచడం కాదు, విలువల్ని కాపాడుకుంటూ పాఠకుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పత్రికను నడుపుటకు విశేషంగా శ్రమించేవారు. పత్రిక

సామాన్యులను చేరాలి, వారిని దూరం చేసే పెద్ద పెద్ద సాహిత్య చర్చలకు, వ్యాసాలకు చోటు కల్పించడం తగదని నిక్కచ్చిగా చెప్పేవారు. ఏజెంట్ల ఫీడ్‌బ్యాక్‌కు వాల్యూ ఇచ్చేవారు. పత్రికలను సరాసరి అమ్మేవాళ్లు వాళ్లే కాబట్టి వాళ్ళ అభిప్రాయాలను పాఠకుల అభిప్రాయాలుగా గౌరవించేవాళ్లు ఈ విధంగా జర్నలిస్టుగా 'ముళ్ళపూడి వెంకటరమణ' తనదైన ముద్ర వేసుకున్నారని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు.

## లక్ష్యసాధనకు లక్ష్యాలూ తెలియాలి!:

తెలుగులో ప్రతి సాహిత్య ప్రక్రియకు కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు ఉంటాయి. ఏ విషయాన్నయినా కళాత్మకంగా, సరైన ధోరణిలో ఆలోచింపచేసే విధంగా మలిస్తేనే అది సాహిత్య ప్రక్రియ అవుతుంది. ఏ విషయాన్నయినా మలిచే తీరును బట్టి ప్రక్రియ ఆధారపడి ఉంటుంది. కవిత్వానికి, నాటకానికి, నవలకి ఉన్నట్లు గానే కథానికకి కూడా కొన్ని లక్షణాలు ఉంటాయి. కథానికకు గల లక్షణాలను దృష్టి యందుంచుకొని కథానిక నిర్మాణం జరగాలని, అలా అయితేనే అనుకున్న లక్ష్యం నేరవేరుతుందని డా॥ వేదగిరి రాంబాబు 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 29/03/2011*) కు 'లక్ష్య సాధనకు లక్ష్యాలు తెలియాలి!' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

కథకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. కథానికకు వందేళ్ళ చరిత్రే ఉంది. ఆధునిక కథని 'కథానిక' అనంటారు. ఆధునికత అనేసరికి ఇప్పుడు మనం మాట్లాడుకునే భాష, మన చుట్టూ ఉన్న సమాజంలోని వస్తువు, ఒక ప్రత్యేక శిల్పం, ముఖ్యంగా క్లుప్తత ఉండాలి. కథ మొదట ఎక్కడో ఆకాశంలో సంచరించేది? అందులోని పాత్రలు మనకు నీతి బోధించేవి మన నడ'వడి'ని సరిచేసేవిగా ఉండేవి. ముఖ్యంగా దేవుళ్ళు, రాక్షసులు, దెయ్యాలు పాత్రలుగా ఉండేవి. తరువాత అందు రాజులు ప్రవేశించి వీరగాథలుగా కథ నడిచింది. కానీ నేడు కథ ఆధునికత సంతరించుకొని సమాజంలో నిత్యం చోటుచేసుకుంటున్న విషయాలని వస్తువుగా స్వీకరించి, సామాన్యులు సైతం పాత్రలుగా పొదగబడి, తక్కువ నిడివితో, సరళమైన భాషలో, తక్కువ సమయంలో చదవడానికి వీలుగా 'కథానిక' రూపంలో రూపొందడంతో తన లక్ష్యసాధనలో పూర్తిగా సఫలీకృతమవుతూ లక్ష్యాలు తెలిసిన ప్రక్రియగా వెలుగొందడం ఆధునిక సాహిత్యంలో చెప్పుకోదగ్గ గొప్ప పరిణామం.

కథ ప్రచారం కొరకు రాయకూడదు. రాస్తే 'కళ' నష్టమైపోతుంది. కథలు కళాహీనమైపోతాయి. పీడిత మానవత్వాన్ని వస్తువుగా తీసుకోవాలి అంటారు ఎమ్. నాగేశ్వరరావు. 'కథానికలో పది పుటలు ఉండవచ్చు. పది పదులు వ్యాపించవచ్చు. ఆది మధ్యాంతాలు అదృశ్యం కాకుండా, ప్రధాన విషయం భ్రష్టు పట్టకుండా ఉన్నంతసేపూ దీర్ఘమైనా లోపం లేదు. చిన్నవైనా, సింహావలోకనం లేక చెడిపోయినవి అనేకం. తాత్పర్యార్థం మీద తలంపు ఉండడం ధర్మం... వాక్యం మీద, వాక్య సందోహంమీద, వాక్య గమనంమీద మనస్సుండాలి. వాడేది వ్యావహారిక భాష అయినప్పటికీ వాక్యాలు గంభీరంగా ఉండాలి" అన్నారు తల్లావర్ఝుల శివశంకర శాస్త్రి.

'దేశీయ అవసరాలను పూర్తి చేస్తే బాగుంటుంది' అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు బూర్గుల రంగనాథరావు. "కథలు జీవితాన్ని ప్రతిబింబించడమే కాదు వ్యాఖ్యానించాలి. పాఠకుణ్ణి రంజింపజేయడంతో పాటు మేధస్సుని కూడా కదిలించాలి" అన్నారు కొడవటిగంటి కుటుంబరావు.

నేలకు దిగిన కథ, నేలబారున సాగకుండా సమాజంలో మూల మూలలకీ క్రమక్రమంగా చొచ్చుకు పోసాగింది. వస్తుపరంగా ఆధునికతని సంతరించుకోడానికి ఆ తరువాత దాదాపు అరవై రెండేళ్లు పట్టింది అని తెలియజేస్తున్నారు వ్యాసకర్త ఈ వ్యాసం ద్వారా.

### 3.2.10. రామా చంద్రమౌళి:

## కదిలించే కథలు:

చుట్టూ ప్రపంచం రోజురోజుకూ దుర్మార్గంగా, నీతి హీనంగా, అనైతికంగా మారుతూ జీవావరణాన్నంతా అతి దారుణంగా కలుషితం చేస్తూ హృదయం నిండా నిశ్శబ్ద క్షోభను మిగులుస్తున్న వర్తమాన సంక్షుభిత సందర్భంలో సాంద్రమైన కవిత్వమో, కథలో, వైవిధ్య భరితమైన నవలో దొరికితే బాగుణ్ణు అన్న ఆలోచనలో ఉన్న నాకు అంతరాంతరాలను స్పర్శించే నాలుగు కథలు దొరికాయంటూ 'అక్షరం' *(సూర్య దినపత్రిక, 31/10/2011*) కు రాసిన 'కదిలించే కథలు' అనే వ్యాసంలో పాఠకులతో ఆ కథలలో గల విషయాలను పంచుకున్నారు. ఆ నాలుగు కథలు

1) నాన్నంటే! -- జగన్నాథ శర్మ
2) చింత కింది మల్లయ్య ముచ్చట -- రాజిరెడ్డి
3) ఒక సాయంత్రపు అదృష్టం -- మహ్మమద్ ఖదీర్‌బాబు
4) దుబ్బ చెలక -- ఎలిశెట్టి శంకర్‌రావు

'పేగుకాలిన వాసన' అనే కథల సంపుటిలోని 'నాన్నంటే!' కథ, నాన్నంటే ముద్దు! నాన్నంటే మెరుపు! నాన్నంటే స్పర్శ! నాన్నంటే సువాసన!... నాన్నంటే నాకంతే తెలుసు' అని అందరికీ తెలిసిన ఒక అజ్ఞాత జీవిత శకలాన్ని సన్నివేశంగా గొంగళి విప్పినట్టు పరిచి... ఒక తల్లి, ఒక అక్క, అడవి పోరులో మగ్నమైన అదృశ్యవ్యక్తిగా ప్రస్తావించిన ఒక నాన్న! కథలో మనతో ఇన్ని మాట్లాడింది ఎనిమిదేళ్ల బాలుడు. ఇవి నాన్నంటే కథలో పాత్రలు. ఎంతో ఆప్యాయంగా అల్లుతున్న ఎర్రని స్వెటర్ – అక్కా నాకేనా – కాదు నాన్నకి – నాన్న ఎక్కడుంటాడు – ఆమె చూపుడు వేళు తూర్పు కొండలవైపు ఉదయిస్తున్న ఎర్రని సూర్యునివైపు చూపిస్తుంది. ఒకరోజు తూటాల దెబ్బకు రంధ్రాలైన ఒక స్వెటర్, లాల్చీ, పంచెను ఇంటికి తెచ్చి

ఇచ్చిపోతారు అజ్ఞాతవీరులు. వాటిని ముఖానికి అత్తుకొని నాన్న స్పర్శను రుచిచూస్తాడు కొడుకు. ఈ కథను జగన్నాథ శర్మ నడిపించినవైన చదివిన ప్రతివ్యక్తినీ కంట తడిపెట్టిస్తుంది అంటారు వ్యాసకర్త.

'వర్తమాన తెలుగు కథ 2009' కథల సంపుటిలోనిది 'చింత కింది మల్లయ్ ముచ్చట' అనే కథ. దీనిని రాజిరెడ్డి రాశాడు. మల్లయ్య కల్మషంలేని మనిషి. ఒట్టి పల్లెటూరి నిరక్షరాస్యుడు. సాదాసీదా శుద్ధ మానవుడు. ఒక రకంగా నిజాయితీ నిండిన నిజమైన మనిషి. 'నా జల్మానికి ఏం కారణం లేదు. కారణం ఉండడానికి నేనేమన్నా శిశుపాలున్నా, నరసింహ సామినా? నేను, నా ఇద్దరు ఆడ పిల్లలు, ఓ మొగపోరడు... ఈ దేశంలోని కోటాను కోట్ల మంది అమాయక, నిస్వార్థ, నికార్సయిన పల్లెటూరి నిజమైన మనుషుల నిర్మలమైన ఆత్మ ఈ కథ అని అంటారు వ్యాసకర్త.

'వర్తమాన తెలుగు కథ 2009' కథల సంపుటిలోనిది 'ఒక సాయంత్రపు అదృష్టం' అనే కథ. ఇది మనిషి ఎలా ఆలోచించకూడదో చెబుతూ, ఎలా ఆలోచించాలో కూడా విస్పష్టంగా తెలియజేసే కథ. 'ఒక అతి సాధారణ మధ్య తరగతి ఉద్యోగి... తన ఆఫీసు గది కిటికీలో నుండి కురుస్తున్న వర్షాన్ని చూస్తూ... తన యాంత్రిక ప్రవర్తన భిన్నంగా ఆలోచించి, తిరిగి నిజ స్థితికి వస్తాడు. ఎన్నో ఆలోచనలు మెదులుతాయి. ఎప్పుడూ అతడు భవిష్యత్తులో లేదా గతంలో ఆలోచిస్తాడు. వర్తమానంలో ఆలోచించడు. భార్య మల్లెపూలు తెమ్మంటే రేపు ఆఫీసులో పని గూర్చి, తను దాటివచ్చిన అమ్మాయి నడుం గూర్చి, ఆమెతో రతి గూర్చి ఊహిస్తూ అదే ఆలోచనల్లో ఉంటాడు. అయితే ఈ తత్వాన్ని జయించి చూపును సరైన దృష్టిలో మరుల్చుకొన్న వ్యక్తిగా ఆ పాత్రను తీర్చిదిద్ది రచయిత మనిషి ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదో కళ్ళ ముందు చూపాడని వ్యాసకర్త వివరించారు.

ఎలిశెట్టి శంకరరావు 'దుబ్బచెలక' – గత కొన్ని దశాబ్దాలుగా... తెలంగాణ అంటే పోరాటం ... తెలంగాణ అంటే దుఃఖం... తెలంగాణ అంటే ధిక్కారం... తెలంగాణ అంటే గాఢ సంవేదన. ఈ ఛిద్ర నేపథ్యాన్ని రచయితే తెలంగాణంలోని ఒక దుఃఖితగ్రామంలోని పసిపిల్లవానిగా మారి... ఒక దీన జీవితమై, ఒక కన్నీటి గాథై, వలసలు వలసలుగా బతుకు విచ్ఛిన్నమై నెర్రెలు మోసిన నేలవలె విస్తరిస్తున్న క్రమంగా చెబుతూంటే... అబ్బా... ఎందుకిన్ని జీవితాలు యింత దుర్భరంగా ఉన్నాయి. ఎందుకీ ప్రజలు అనాథులై అల్లాడుతున్నారు. వీళ్ళనెవరాదుకుంటారు. వీళ్ళ జీవితాలిలా దుబ్బ చెల్కవలె మట్టికొట్టుకు పోవాల్సిందేనా అని నిశ్శబ్ద రోదనలో కూరుకుపోతాం. శంకర్ రావు ఉత్తమ పురుషలో కథను చెప్పుకుపోయిన తీరు చాలా గొప్పగా ఉంది. ఎక్కడా ఎటువంటి నగిషీలు లేకుండా సాదాసీదాగా

కథ నడిపిన తీరు పాఠకుణ్ణి అప్రతిభుణ్ణి చేస్తుంది అంటున్నారు వ్యాసకర్త ఈ వ్యాసంలో.

మనిషి చదవకుండా ఉండలేకపోవడం ఒక వ్యసనం. మంచి కథను చదివి పైరుగాలికి మొక్కజొన్న కర్ర తలూపుతూ పరవశించినట్టు... పొంగిపోవడం ఒక గొప్ప గుణం... మంచి కథలు పునః పునః ఆవేశపరుస్తూ జీవింపజేస్తాయి అన్న భావన ఈ వ్యాసం చదివిన పాఠకులకు కలగడం సహజం.

## వైయుక్తికంలోనే సమూహం:

స్పష్టత, సంక్లిష్టత, నగ్నత... వెరసి భావాన్ని తొడుక్కున్ని, అనుభూతుల్ని ధరించి వాక్యాలు వాక్యాలుగా పదాలు పక్షులై, హృదయాంబర వీధులనిండా మహార్ణవ రసాకృతులను ఆవిష్కరిస్తూ... మనిషిని ఒక స్వరంగా, రాగంగా, ఒక జెండాగా... ఒక భూనభ పర్యంతం శబ్దించే ఒక స్వ-పర ద్వంద్వంగా ఆకృతీకరిస్తూ కవిత్వ రహస్యం తెలిసిన ఎందరో సృజనకారులు కాగితాలపై కావ్యాలై ప్రవహిస్తున్న వర్తమానంలో... వైయుక్తికమే ఐనా కవిత్వం ఎలా సమూహంగా పరివర్తిందో రామా చంద్రమౌళి 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 11/04/2011*) కు 'వైయుక్తికంలోనే సమూహం!' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో ఉదాహరణపూర్వకంగా వివరించారు.

అసలు 'కవిత్వమే' ఏ నిర్వచనానికి లొంగని ఒక ఉన్మాద స్వానుభవం. వ్యక్తి వ్యక్తికీ దాని ప్రతిఫలన, అనుస్పందన మారుతునే మళ్ళీ ఏకధారగా రూపాంతరమవుతూ నిరంతరమయ్యే మేధోద్రవ్యం.

కవి... ఎవనికి వానికి ఒక పౌనఃపున్యముంటుంది. వాడి భావవ్యక్తీకరణకు ఒక స్థాయి కూడా ఉంటుంది. నిగ్రహాతీత మహాభావావేశంలో 'కవిత్వం' అనే ఒక లావా వంటి మహోద్ధృత అగ్నిచ్ఛటను సృజిస్తున్నప్పుడు... ఒకటే కేంద్రం... చుట్టూ పరిధి, విస్తరణ... వైశాల్యం అనంతం... నడకను బట్టి, పరుగును బట్టి, విస్ఫోటనను బట్టి. వాక్యాలు కొంగ్రొత్త అమృతతత్వాని నింపుకుని కవిత్వమై ప్రవహిస్తాయి. వ్యక్తీకరణ ఒక వైయక్తిక అభిజ్ఞ. మారతూంటుంది... కవికి – కవికి. కాని హృదయం మారదు. ఐతే కవి పాఠకుణ్ణి తన స్థాయికి పౌనఃపున్య ఉన్నతికి తీసుకురాగలగాలి. రెండు రైళ్లు ప్రక్కప్రక్కన సమాన వేగాలతో పయనిస్తూంటేనే పరస్పరం స్పష్టంగా కనబడ్తాయి. లేకుంటే వేగాల హెచ్చు తగ్గులు దృశ్యాన్నీ, అనుభూతినీ ఆభాసిస్తాయి. ట్యూన్ చేసుకుని 'కవిత్వాన్ని' స్వీకరించే సంస్కారాన్ని అలవర్చుకోవాలి. అందుకు శిక్షణ పొందాలి. ఏ లిఖిత విద్యయైనా అక్షరాధ్యయనం చేయంది అర్థం కానట్టే, తెలియనట్టే ఏ కళైనా తగు

ప్రాథమికాంశాల జ్ఞానంలేనప్పుడు అర్థం కాదు. కాగా అపభ్రంశమౌతుంది కూడా.

ఈ విధంగా 'కవిత్వం' సృష్టించబడుతున్నప్పుడు ఎవరి భావ వ్యక్తీకరణ స్థాయి వారిది. ఎవడి పౌనఃపున్యం వాడిది. ఎవడి వైశాల్యం వాడిది. ఎవడి చుట్టుకొలత వాడిది. ఎవడి వడి వాడిది. ఎవడి సాంద్రత వాడిది. అయినా నిశ్చలంగా నిలబెట్టే 'కేంద్రం ఒకటే'. స్థానభ్రంశం చెందితే అది కేంద్రంతో పాటే. అనగా భిన్న ప్రక్రియలకు (సాహిత్య ప్రక్రియలకు) విభిన్న పరిధులు, లక్షణాలు... అయినా 'హృదయం ఒక్కటే' సాహిత్యానికి కేంద్రం. ఎన్ని లక్షణాల మధ్య బంధించినా అదే హృదయ స్పందన. ఆ స్పందనలు ప్రతిధ్వనించి సమాజంలో ప్రతిబింబిస్తాయి లేదా సమాజంలోని బింబాలకే కవుల హృదయాలు ప్రతిధ్వనిస్తాయి, వారి రచనలు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. హృదయం శరీర భాగాలనుండి వచ్చి చెడురక్తాన్ని తన కర్మాగారానికి (ఊపిరితిత్తులకు) పంపి అటునుండి వచ్చిన స్వచ్ఛరుధిరాన్ని శరీరంలో ప్రతి కణానికీ పంపు చేస్తుంది. ఇన్ని రకాల పనులు ఆ గుండె గదుల్లో గోడల చాటున ఏకతాటిపై ఏ ధాటిగా జరిగితేనే శరీరం ఆరోగ్యంగా ఉండగల్గుతుంది. లేదంటే మొదటికే మోసం వస్తుంది. కవులు కూడా అంతే. విభిన్న పరిధులలో, విభిన్న ధోరణులలో, విభిన్న స్థాయిలలో తమతమ దృక్కోణాలలో, దృక్పథాలలో పంపిణీ చేసిన సాహిత్యం 'విశ్వశ్రేయస్సునే' అనగా సమాజ శ్రేయస్సునే కాంక్షిస్తూ వెలువడినదై లక్ష్యసాధనలో భాగంగా భిన్నదారులలో ఒకే గమ్యాన్ని చేరుటకు వైయక్తికంగా ప్రయాణాన్ని ప్రారంభించి చివరికందరూ తమ ఉమ్మడి గమ్యస్థానాన సమూహంగా నిలవడమే 'వైయుక్తికంలోనే సమూహం!' అన్న వ్యాసకర్త భావనకు నిజ రూపం.

వ్యాసకర్త వ్యాసాన్ని స్పష్టత, సంక్లిష్టత అనే పదాలతో ప్రారంభించారు. అవును ఈ వ్యాసం స్పష్టంగా, సంక్లిష్టంగానే ఉంది. అయినా ఆయనే చెప్పినట్టు తగు ప్రాథమికాంశాలు లేనప్పుడు పాఠకునికి అర్థం కాదు.

**కథకు జేజేలు:**

నిజానికి రచయిత – ఏ భాషా రచయితైనా ఇప్పుడు ఒక సంక్షుభిత సందర్భంలో ఖిన్నుడై నిలబడి ఉన్నాడు. ప్రక్రియ ఏదైనా రచయిత ఒక సామాజిక కార్యకర్త అయి జనజీవన సంక్షోభాలనూ, సంవేదనాలనూ, కష్టాలనూ, కన్నీళ్ళనూ లోలోపల నిశ్శబ్ద సంఘర్షణలను ఒక బలమైన వ్యక్తీకరణంగా ప్రపంచానికి వెలుగెత్తి చాటవలసిన ప్రాథమిక బాధ్యతను నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో, అతని చుట్టూ ఇదివరకు ఎన్నడూ లేనంత వేదన, దుఃఖం, ఉద్వేగం, నిస్సహాయత, కళ్ళ ముందే అనేకానేక

అకృత్యాలు జరుగుతున్న ఒక మేథోజీవిగా ఏమీ చేయలేని అచేతనత – ఇవన్నీ రచయితను కలచివేస్తున్న వర్తమానంగా – విద్వాంస వాస్తవమై ఎదుట నిలబడి ఉంది. దీనికి కారణం పూర్తిగా కలుషితమై పోయిన మానవ పర్యావరణం. సామాజిక, ఆర్థిక పరిస్థితి మొదలగు అన్ని రంగాలయందు పతనమైన విలువలు – ఇప్పుడు మనిషిని మళ్ళీ ఆది మానవుని మూల విలువల పునరన్వేషణ వైపు తరుముతున్న సంక్లిష్ట సందిగ్ధతలో మానవ సమాజం తల్లడిల్లుతున్న సమకాలీనతలో కథ నిలబడి ఉంది అంటూ రామా చంద్రమౌళి 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 09/05/2011*) కు 'కథకు జేజేలు' అనే శీర్షికతో రాసిన వ్యాసంతో వివరించారు.

మనిషి జీవితాన్ని ప్రతిబింబించి, విశ్లేషించి, విప్పి చూపించి అంతిమంగా మనిషిని ఉన్నతీకరించవలసిన పరమ ధర్మాన్ని నిర్వర్తించే కథ – విశ్లేషించి తెలుగు కథ ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల, నాణ్యతలతో పోలిస్తే తలెత్తుకొని నిలబడి తనదైన విలక్షణతతో – శక్తిమంతంగా విస్తృతమవుతూనే ఉంది. తనదైన వస్తు, ఇతివృత్త, రూప, శిల్ప, శైలీ విన్యాసాలతో ప్రపంచ రచయితలు కనబరుస్తున్న సకల విశిష్టతలకు ధీటుగా నిలబడి సొంత గొంతులో తెలుగు కథ గత పది సంవత్సరాలుగా ప్రవర్ధమానమవుతూనే ఉంది అని వ్యాసకర్త కథ విశిష్టతను కొనియాడారు.

సామాజిక మూల విలువలను పరిరక్షిస్తూ పునఃప్రతిష్టతో, పునఃనిర్మాణం చేయవలసిన గురుతర బాధ్యతను స్వీకరిస్తూ, రచయిత ఒక సాంస్కృతిక నాయకుడై, సైనికుడి అక్షరాయుధాలతో ఈ జాతిని నిద్రలేపి కార్యోన్ముఖుల్ని చేయవలసిన దిశలో కూడా రావాల్సినంత స్థాయిలో ప్రేరకాలయ్యే కథలు రావడం లేదు. రావాలి. కథకు ఒక నిర్దిష్ట ప్రయోజనం దీప్తపరిచే చేవ బట్టి వాహకంలోకి కనబడిన విద్యుత్తులా ప్రవేశించి, ప్రవహించి, అద్భుతాలు సాధించగల జీవశక్తి ఉందని కథలు రుజావు చేయాలని వ్యాసకర్త కథకులకు ఉద్బోధించేటట్లుగా, కథకు జేజేలు పలుకుతూనే కర్తవ్యాన్ని గుర్తెరింగించారు అనిపిస్తుంది.

## కథను జ్ఞానపీఠమెక్కించిన జయకాంతన్:

అది మంచి కథైతే మనిషిని వెంటాడాలి. కలవరపర్చాలి. ఎక్కడో హృదయపు అట్టడుగు పొరల్లో పిలిస్తే పలికే జ్ఞాపకమై నిక్షిప్తమై పోవాలి. వస్తువు సార్వజనీనమై చదివిన ప్రతి పాఠకుడు తనను ఆ కథలో ఎక్కడో ఒక చోట గుర్తుపట్ట లేక తనకు తెలిసినదే అయిన ఎవరిదో ఒకరి జీవిత పార్శ్వాన్ని తడుముతున్న మహోత్తరమైన అనుభూతిని పొందాలి. కథ కదలాలి, కదిలించాలి. నడుస్తూ నడిపించాలి. సమగ్రమైన నమూనా వంటి

'కథ'ను రాసి, కథను ఉన్నతీకరించి, కథకు ప్రపంచస్థాయి ప్రతిష్టను కల్పించి, కథకు జ్ఞానపీఠ పురస్కారాన్ని ఇవ్వక తప్పని అనివార్యతను సృష్టించినవాడు డి. జయకాంతన్ అని వ్యాసకర్త రామా చంద్రమౌళి 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 15/08/2011*) లో 'కథను జ్ఞానపీటమెక్కించిన జయకాంతన్' అనే శీర్షికతో ఒక వ్యాసాన్ని ప్రచురించారు.

జయకాంతన్‌కు పెద్దగా డిగ్రీలు లేవు. 1934లో తమిళనాడు ఆర్కాట్ జిల్లా కడలూరులో జన్మించిన జయకాంతన్ చిన్ననాడు పాఠశాలనుండి బహిష్కృతుడు.

జయకాంతన్ 'కథ'ను పరిశోధనాత్మకంగా చదివితే మంచి కథ, గొప్ప కథ ఎలా ఉండాలో తెలుస్తుంది. సహృదయులైన కథా రచయితలకు 'అబ్బా... నేను నా జీవితంలో ఇటువంటి ఒక్క కథ రాసినా బాగుండు కదా' అనే పిచ్చి కోరిక కల్గుతుంది. ఇంతవరకూ కథ చెప్పడంలో చాలా కథకులు విస్మరించే సందర్భోచిత వాతావరణం, పరిసరాలు, సన్నివేశ ప్రస్తావన వాటిలోనూ సజీవ స్పందనలు, వాటికి ప్రతిగా పాత్ర ప్రతి సంవేదనలు వీటిని జయకాంతన్ అద్భుతంగా దృశ్యమానం చేస్తాడని వ్యాసకర్త వ్యాసంలో జయకాంతన్ కథలో పాత్రల సృష్టిని, కథను నడిపించిన విధానాన్ని విపులంగా వివరించారు.

## అత్యాధునిక కవిత్వం:

మనది పాతదీ, గొప్పదీ, ఘనమైందీ, గర్వించదగ్గదీ అయిన తెలుగు వచన కవిత్వం గురించి ఇబ్బడిముబ్బడిగా ఎన్నో ఎన్నెన్నో వ్యాసాలు, గ్రంథాలు, పరిశోధనా వ్యాసాలు, అధ్యయనాలు వెలువడ్డాయి, వెలువడుతున్నాయి, వెలువడతాయి ఇంకా, తెలుగు కథ గూర్చి కూడా ఇంతే గత వైభవ పునః మననంతో భుజాలు చరుచుకోవడం తప్పి అత్యాధునికులు, ఇప్పుడు, కవిత్వాన్నిగానీ, కథనుగానీ, సీరియస్‌గా, హృదయంతో, నిమగ్నమై నిబద్ధతలో రాస్తున్న వారి గూర్చి అవసరమైనంత స్థాయిలో పట్టించుకోవడంగాని, చర్చించడంగాని, విశ్లేషించడంగాని, విమర్శించడంగాని జరగడంలేదు. అందువల్ల ఈ మధ్యకాలంలో మొలకలుగా, కొత్త గొంతులతో కొత్త పరిమళాలతో, కొంగ్రొత్త ప్రయోగశీల ఉద్వేగాలతో వినిపిస్తున్న కవిత్వ సవ్వడిని చెవులు రిక్కించి విందామని, అటు వేపు చూద్దామని చూపును మరల్చుదామనే ప్రయత్నంలో భాగంగా 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 05/09/2011*) రామా చంద్రమౌళి 'అత్యాధునిక కవిత్వం' అనే శీర్షికతో ఒక వ్యాసం రాశారు.

ఏ కవైనా జన్మతః ఒక ముడి పదార్థం. శిల, ఇనుప ఖనిజం, స్వర్ణశిల, పుట్టబోయే మట్టి, వర్షించవలసిన ఆకాశం, చెట్ల కొమ్మల వెనుక వీయబోయే

ముందు నిద్రిస్తున్న గాలి ఇలా అయితే కవి తనను తాను పదునుపెట్టుకోవాలి. తనను తాను శిల్పీకరించుకోవాలి అని వ్యాసకర్త వ్యాసంలో కవి గూర్చి అభిప్రాయపడ్డారు.

వాస్తవంగా అంతా అర్థం కావడమనేది ఒక అసహజ స్థితి. అర్థమై అర్థం కాకుండా నిత్య ఉత్సుకతగా మిగిలేదే సహజం. ఉదాహరణకు జీవితం అర్థం కాదు. జననం అర్థం కాదు. మరణం అర్థం కాదు. నవ్వు అర్థం కాదు. దుఃఖం అర్థం కాదు. నడుక అర్థం కాదు – ఆ కోణంలో ఈ కవిత్వ శకలాలను చూస్తే అంటూ వ్యాసకర్త బి.ఎస్.ఎం. కుమార్, అరుణ్‌సాగర్, బి.వి.వి. ప్రసాద్, అరుణ్‌బవేరా మొదలగు వారి కవిత్వాన్ని ఉటంకిస్తూ 'ఆత్యధునికవిత్వం' అని రాసిన వ్యాసంలో విశ్లేషణాత్మకంగా పాఠకులకు వివరించారు.

### 3.2.11. అంకె శ్రీనివాస్ "అటచని కాంచి'న దేమిటి?":

సిద్ధుడు ఇచ్చిన లేపన మహితతో ప్రవరుడు హిమాలయాలను దర్శించడానికి వెళ్ళాడు. అక్కడ సౌందర్యానికి పరవశుడై పరికించిన హిమనగం ఇలా ఉందని అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లో మనకూ చూపిస్తున్నాడు....

**"అటచని కాంచె భూమిసురడంబర చుంబి శిరస్సరజ్ఝరీ**
**పటల ముహుర్ముహుర్లుఠదభంగతరంగ మృదంగ నిస్స్వన**
**స్ఫుటనటనానుకూల పరిపుల్లకలాప కలాపి జాలముల్**
**కటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్"**

**– మనుచరిత్ర, 2:3.**

ఆకాశాన్ని తాకుతున్న హిమాలయ పర్వతాలనుండి సెలయేర్లు దూకుతున్నాయి. ఆ సెలయేటి ధ్వని మృదంగ ధ్వనిలాగా ఉంది. మృదంగ ధ్వనికి నెమళ్ళు పురివిప్పి ఆనంద తాండవం చేస్తున్నాయి. యేనుగులు తొండాలతో సాల వృక్షాలను ఊపుతున్నాయి. రెండవ పాదంలో మృదంగ ధ్వని స్ఫోరకమైన శబ్దోచ్ఛారణ కలిగిన పదాలు వేసి పద్యాన్ని మృదంగమయం చేశాడు. ఈ శబ్దార్థ సమన్వయం మృదంగస్వనంతో మమేకమైంది. అందువల్లనే తెలుగు సాహిత్యంలోని అపూరూపమైన పద్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఇందులోని సౌందర్య విషయాలను ప్రక్కనపెట్టి, చర్చించవలసిన భౌగోళికాంశాలు చాలా ఉన్నాయంటూ డా॥అంకె శ్రీనివాస్ "అటచని కాంచి'న దేమిటి?" అన్న శీర్షకతో 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 05/12/2011*) లో ఒక వ్యాసం ప్రచురిస్తూ అసలు పెద్దన హిమాలయాల చూడలేదంటూ ఈ క్రింది విధంగా వివరించారు...

"పెద్దన హిమాలయాలను చూడనే లేదు. మంచు కురిసే ప్రాంతాల్లో శృంగాకార అడవులు ఉంటాయి తప్ప సాల వృక్షాలు ఉండనే ఉండవు. సాల వృక్షాలు, మద్దిచెట్లు దక్షిణ భారతదేశంలో మాత్రమే ఉంటాయి. ఆ సాల వృక్షాలను తొండాలతో ఊపడానికి ఏనుగులు ఎక్కడనుండి వస్తాయి. నెమళ్ళు నాట్యం చేయడం సహజం కానీ, దట్టంగా మంచు కురిసే ప్రాంతం లోనా? లేక కారుమబ్బులు చుట్టుముట్టి వాన కురిసే ప్రాంతంలోనా? అంటూ అల్లసాని పెద్దన కోకటం లేదా పెద్దనపాడు గ్రామాలకు చెందినవాడు. అందువల్ల సమీపంలోని ఇడుపులపాయ, గండి ప్రాంతాల్లోని కొండల్ని, లోయల్ని చూసి హిమాలయాలు ఇంతకన్నా పెద్దగా ఎత్తుగా ఉంటాయని ఊహించి వ్రాశాడు. పద్యంలో వర్ణించిన సెలయేర్లు, నెమళ్ళు వంటివన్నీ వర్షాకాలంలో ఇక్కడ అత్యంత సహజమైన విషయాలు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో నెమళ్ళు, ఏనుగులు చాలా ఎక్కువ. ఆ తర్వాతి పద్యాలు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తాయి" అంటూ అలా అని అపురూపమైన ఈ పద్యాన్ని దూరం చేసుకుంటామా? కవి సమయమని అంగీకరించాల్సిందే! అని అంటారు అంకె శ్రీనివాస్ శాస్త్రీయ దృక్కోణంలో.

## 'తెలుగు ఆఫ్ ది వెంట్' అంటే?:

తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అంటారని తెలిసిందే. ఆ విధంగా పోల్చిన వ్యక్తి నికోలో కోంటీ. ఇటాలియన్ భాష తెలుగు భాషలాగా అజంత భాష. ప్రాచీన లాటిన్ భాష నుండి జన్మించింది. ఇటాలియన్ భాషను దేశీయంగా 'ఇటాలియనొ' అని పిలుస్తారు. ఇటాలియన్ వర్ణమాలలోని 21 అక్షరాలు రోమన్ లిపిలో ఉంటాయి. అంటే ప్రస్తుత ఆంగ్ల వర్ణమాలలోని అక్షరాలే! ఇతర భాషల ప్రభావం వల్ల J,K,W,X,Y అనే 5 అక్షరాలు చేరి ఆంగ్ల వర్ణమాలలోని 26 అక్షరాలు ఉంటాయి. మన వర్ణమాలలో మహా ప్రాణాక్షరాలు సంస్కృతం నుంచి అరువు తెచ్చుకున్న విషయాన్ని జ్ఞాపకం చేస్తాయి. తెలుగులో 56 అక్షరాలున్నాయి. గుణింతాలతో కలుపుకుంటే ఈ సంఖ్య చాలా పెరుగుతుంది. అందుకే ప్రపంచ భాషలన్నింటిలోని శబ్దాల్నీ తెలుగు లిపిలో రాయవచ్చు. ఇటాలియనొలో ఉన్న 26 అక్షరాలూ లిపి పరిమితినీ, ఉచ్చారణా పరిమితినీ తెలియజేస్తాయి. వర్ణమాల విషయంలో ఏ విధంగా చూసినా ఇటాలియనొ కన్నా తెలుగు చాలా ఐశ్వర్యవంతమైనది. అందుకే డా॥ శ్రీనివాస్ అంకె 'తెలుగు ఆఫ్ ది వెస్ట్' అని ఇటాలియన్ భాషను అనుటకు అవకాశం ఉందనే ఉద్దేశంలో 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 31/10/2011*) లో 'తెలుగు ఆఫ్ ది వెస్ట్' అంటే? అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు తెలుగు భాషలాగే ఇటాలియనొలోని పదాలకు ఉచ్చారణకు పెద్ద తేడా ఉండదని,

ఒకవేళ ఉన్నా అది మాండలిక బేధాలవల్ల కలిగిన భాషా పరిణామమే! అని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. టస్కనీ మాండలికంలోనే గొప్ప సాహిత్యం ఆవిర్భవించింది. డాంటే ఆలిగరి, పెట్రార్క్, బొకాస్కియో వంటి గొప్ప కవులు టస్కనీ మాండలికంలోనే సాహిత్య సృజన చేశారు. ఈ కవిత్రయం 13, 14 శతాబ్దాలకు చెందినవారు. వీరితోనే ఇటాలియన్ సాహిత్య చరిత్ర ప్రారంభమయింది. వీరికి మన కవిత్రయానికి పోలికలున్నాయి.

భాషా చరిత్ర విషయంలో తెలుగు భాషతో పోల్చితే ఇటాలియన్ చాలా ఆర్వాచీనమైనది. క్రీ.శ.10వ శతాబ్దం నాటి చట్ట సంబంధమైన పత్రాల్లో మొదట ఇటాలియనొ పదాలు కన్పిస్తాయి. తెలుగు ఇటాలియన్ భాషకన్నా కనీసం వేయి సంవత్సరాలు ప్రాచీనమైనది. క్రీ.పూ.1వ శతాబ్దంలోని ప్రాకృత కథాసంకలనం హాలుని 'గాథాసప్త శతి' లో తెలుగు పదాలు విస్తారంగా ఉన్నాయి. ఋగ్వేద సంబంధమైన ఐతిరేయ బ్రాహ్మణంలో ఆంధ్రజ్యోతి ప్రస్తావన ఉంది. ఏ విధంగా చూసినా ఇటాలియన్ సంస్కృతి కన్నా ఆంధ్ర సంస్కృతి కనీసం రెండువేల సంవత్సరాలు ప్రాచీనమైనది.

భారతదేశంలో పర్యటించిన నికోలో కోంటీ (1396–1469) తొలుత గుజరాత్, తరువాత విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీలో అడుగుపెట్టాడు. హంపీ రోమ్ నగరం కంటే అందమైనదనీ, విశాలమైనదనీ తన రచనల్లో రాసుకున్నాడు. మద్రాసు సమీపంలో మైలాపూర్ వెళ్ళి క్రైస్తవ సన్యాసి సెయింట్ థామస్ సమాధిని సందర్శించాడు. అయితే ఆంధ్ర దేశంలో ఉన్నప్పుడే క్రైస్తవ మతాన్ని వదిలేశాడు. స్వదేశం చేరిన వెంటనే స్వదేశీయులు గొప్పగా అభినందించారు. అయితే క్రైస్తవాన్ని వదిలివేయడం వారికి నచ్చలేదు. ఈ విషయం నాటికి వాటికన్ సిటీ పోప్ నాల్గవ ఏజెన్స్ ప్రశ్నించగా, అతని ఆదేశం మేరకు తన పర్యటనా జీవితంలో నేర్చుకున్న అరబిక్, పర్షియన్ భాషలకన్నా గొప్పగా 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని తెలుగుకి తన మాతృభాషతో సమాన గౌరవాన్నిచ్చాడు. రెండు భాషలూ అజంతాలేనని చెప్పాడు. 15, 16 శతాబ్దంలో యూరప్ ఖండాన్ని ఆధునికం చేసిన ప్రఖ్యాత క్రైస్తవ మత సంస్కరణ ఉద్యమానికి కారణమైన గొప్ప పుస్తకాల్లో ఈ పుస్తకం కూడా ఒకటి. అంటే తన ఇటాలియన్ భాష 'తెలుగు ఆఫ్ ది వెస్ట్' (పడమటి తెలుగు భాష) అని అంగీకరించడమే కదా! ఒక విదేశీయుడు తెలుగు భాషను ప్రశంసించడం నికోలోకోంటీతోనే మొదలయిందని వ్యాసకర్త వ్యాసం ద్వారా పాఠకులకు తెలియజేశాడు. ఈ విధంగా తన వాదానికి బలం చేకూర్చుకున్నాడు శ్రీనివాస్ అంకె.

### 3.2.12. రామతీర్థ

## తెలుగువారి ఉత్తర సింహద్వారం – మనం మనం బరంపురం:

ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజం 1900లో బరంపురంలో మొదలై శత వత్సరాలు పూర్తి చేసుకున్నాది. తెలుగు జాతి సాంస్కృతిక పునరుజ్జీవన వికాస క్రమ పరణామాలలో బరంపురం తెలుగువారి, ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజ పాత్ర చరిత్రలో ఎన్నదగిన ముఖ్యాంశం అంటూ వ్యాసకర్త 'రామతీర్థ' "తెలుగు వారి ఉత్తర సింహద్వారం – మనం మనం బరంపురం" అనే శీర్షికతో 17/01/2011న 'అక్షరం' (*సూర్య దినపత్రిక*)లో ఒక వ్యాసం ప్రచురించారు. ఈ వ్యాసంలో బరంపురంతో తెలుగు వారికిగల అనుబంధాన్ని, సాహితీబంధాన్ని వివరించారు.

ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం మొదట గ్రంథాలయంలో మాత్రమే ప్రారంభమైంది. గ్రంథాలయోద్యమ పవనాలు, సాంఘిక ఉదార భావాలు బరంపురంలో బలంగా ఉన్నాయనడానికి తార్కాణం 1910లోనే సహపంక్తి భోజనాల నిర్వహణ. గురజాడవారు ఆ కార్యక్రమంలో పాల్గొని, అక్కడ పది రోజులుండి, ముత్యాల సరాలలో ఆ విషయాన్ని ప్రస్తావించారు. అక్కడనుండి వస్తూ భార్యతో ప్రగతిశీల సరసపు సంభాషణగా భార్యా–భర్తల మాటలు ముత్యాల సరాలుగా దొర్లిపోతాయి. "పట్టున పది నాళ్ళుంటిని/కార్యవశమున పోయి, యచ్చట/సంఘ సంస్కరణ ప్రవీణుల సంగతులు మెలగి/యిల్లు జేరితి నాటి వేకువ; ఔరా, ప్రేయసి నిదుర లేపితి.

సరసం కూడా ప్రగతిశీలంగా ఉంటుందా అంటే, అప్పటికే అరిష్టాల పుట్టగా – భూమికి దగ్గరగా వస్తున్న 'హేలీ' తోక చుక్క గురించి అందరూ భావిస్తుంటే, తెల్లవారు జామున వచ్చిన భర్తను చూసి భార్య తత్తరపడి లేస్తూ ఉంటే 'కంటివే, మింటను కామ బాణాంబమరి యున్నది' అనడంలో భర్త శృంగారాభిలాష స్పష్టమే. ఆమె మొగం చాటు చేసుకుంటే దానిని తోకచుక్కపట్లగల ఆనాటి భయాలను ముడిపెట్టి అది డెబ్బదయిదేండ్లకు ఒకసారి భూమికొచ్చే చుట్టమని, అది భీతికరం కాదంటూ, దేవతాంగనలు చేత ధరించిన తెల్ల కలువగా తోక చుక్కను వర్ణిస్తాడు.

1910లో హేలీ తోక చుక్క రావడం బరంపురంలో వర్ణాంతర సహపంక్తి భోజనాలు జరగడం, గురజాడవారు గేయ రూపంలో రాసి చరిత్రలో చిరస్థాయిగా నిల్చేట్టు చేశారు. అధ్యాపకుడుగా తాపీ ధర్మారావు బోధనలు దేవరాజు కృష్ణారావు 'వేగు చుక్క' గ్రంథమాల ఏర్పాటు, తెలుగు వారి చురుకైన కార్యకలాపాలకు బరంపురం ప్రధాన క్షేత్రం. 1980–90 ల దాకా బరంపురం తెలుగు సాహిత్య సాంస్కృతిక కేంద్రంగా ఉజ్వలంగా వెలుగులీనింది. ఈ విధంగా బరంపురంతో తెలుగువారికి ముఖ్యంగా తెలుగు

సాహిత్యానికి గల సంబంధాన్ని విపులంగా వివరించి మనం మనం బరంపురం అంటూ, అది తెలుగువారి ఉత్తర సింహద్వారమని వ్యాసకర్త ఈ వ్యాసంలో వెలుగెత్తి చాటారు.

## "సాంస్కృతిక సమతూకం అవసరం!":

రాష్ట్రేతర ప్రాంతాలలో నివసిస్తున్న తెలుగువారు రాష్ట్రంలోని తెలుగు వారికంటే ఎక్కువ సమష్టి చైతన్యంతో ఉన్నారన్న విషయం బరంపురంలో జరిగిన అఖిల భారత తెలుగు మహాసభలు మరోసారి నిరూపించాయంటూ ఒరియా ప్రజలు మనకంటే తక్కువ సాంస్కృతిక కాలుష్యంగల సమాజంగా ఉన్నారని, అక్కడ తెలుగు ప్రజలు తెలుగుపై చూపుతన్న చొరవను తెలుగు ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని, తెలుగుకు ప్రాచీన హెూదా పొందాలని తెగ ప్రయాస పడిపోయిన ఆనాటి ప్రభుత్వాలు తీరా ఆ తెలుగు మహాసభల సందర్భంలో అరకొర ప్రాముఖ్యతనివ్వడం మంచి సంకేతాలను ఇవ్వదు అని రామతీర్థ 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 21/02/2011*)లో 'సాంస్కృతిక సమతూకం అవసరం!' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో అభిప్రాయపడ్డారు.

కనీసం గురజాడ 'కన్యాశుల్కం' నాటకమైన ప్రదర్శించకపోవడం, శ్రీశ్రీ మహాప్రస్థానం వంటి వాటి గూర్చి ప్రస్తావించకపోవడం తెలుగు నేలకు బయటగల తెలుగు ప్రజలను అసంతృప్తికి గురిచేసాయని. ఇటువంటి సభలకు సుమారు ఆరు నెలల ముందునుంచే సన్నాహాలు మొదలు కావాలి. బరంపురం నివాసాంధ్రుల బలమైన గొంతు వినబడేలా కార్యక్రమాల రూపకల్పన జరిగి ఉండాల్సిందంటూ విశ్వవిద్యాలయ వర్గాలు రెండేళ్లకొకసారి తెలుగు ప్రజలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండే, దేశానికి చెందిన ఏదో ఒక ప్రాంతంలో జరిపే ఇటువంటి కార్యక్రమాలు ఆ ప్రాంత ప్రజల పాత్ర ఏ మాత్రం ఉండాలనేది నిర్ణయించుకోవాలని, ఏ పదేళ్ళకో మళ్ళా ఈ మహాసభలు ఆ ప్రాంతంలో జరుగుతాయి కనుక అక్కడ ఒక తూకాన్ని నిర్వాహకులు సాధించాల్సిఉందని, తద్వారా సాంస్కృతిక సమతూకం సాధించగల్గుతారని, అది అత్యంత ఆవశ్యకమని వ్యాసకర్త ఈ వ్యాసంలో గుర్తెరింగించారు.

## అరబ్ విప్లవాల అక్షర నేపథ్యం:

టునీసియా, ఈజిప్టులలో దశాబ్దాల తరబడి ఏలుబడి సాగిస్తున్న నియంతృత్వ వ్యవస్థలకు ప్రజలు చెల్లు చీటి రాశారు. టునీసియాలో కొద్ది గంటల్లో అధ్యక్షుడు జైన్–ఎల్–అబ్దీన్ బెన్ ఆలీ దేశం విడిచి పలాయనం చిత్తగించుతాడనగా – అతడికి వీడ్కోలు మాటలుగా రేడియోలో లెబనీస్ వ్యాఖ్యాత "ప్రజలు జీవితాన్ని కోరుకున్నారు. సంకెళ్ళు ముక్కలై

నేలరాలాయి" అంటూ చేసిన వ్యాఖ్యానం నిజానికి టునీసియా దేశపు కవి అబు–అల్–ఖాసిం–అల్–షబీ ఇరవైయో శతాబ్దపు ప్రథమార్థంలో ప్రవక్తృత్వశక్తితో రాసిన కవితలోని మాటలే! అంటూ వ్యాసకర్త రామతీర్థ 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 28/03/2011*)లో 'అరబ్ విప్లవాల అక్షర నేపథ్యం' అనే శీర్షికతో రాసిన వ్యాసం ప్రచురించారు.

'జీవితేచ్ఛ' (ది విల్ ఆఫ్ లైఫ్) గా ఈ కవిత అరబిక్ సాహిత్యంగా సుప్రసిద్ధం. రాసిన కవి అల్ – షబీ 'జీవన గీతాలు' (సాంగ్స్ ఆఫ్ లైఫ్) అరబిక్ అఘానీ 'అల్–హయాత్' పేరిట ఒకే ఒక సంకలనాన్ని వెలువరించాడు. ఇది టునేసియా ప్రజల విప్లవ శంఖారావం అయింది. ప్రకృతి రామణీయకత నుంచి దేశభక్తి వరకూ ఇతివృత్త విభిన్నత అల్–షబీ కవిత్వంలో కనబడుతుంది. అల్–షబీ రాసిన మరో శక్తిమంత గీతం 'ప్రపంచ నియంతలకు' దేశాల ఎల్లలు రాసిన ప్రఖ్యాత నిరసన కవిత.

'జీవితేచ్ఛ' గీతోచ్చాటన ఒక్క టునీషియాతో ఆగలేదు. అందోళన రెక్కలమీద అది ఈజిప్ట్‌లోని తహ్రీర్ కూడలికి ప్రయాణం చేసింది. ఆ మహత్తర గీతం ఇలా సాగుతుంది –

'ఒకానొక నాడు ప్రజలు జీవితేచ్ఛను ప్రకటిస్తే / విధి వారికి అనుకూలంగా స్పందిస్తుంది / వారి నావరించిన కాళరాత్రి వెలవెల పోతుంది / వారి సంకెళ్ళు తెగినేల రాలుతాయి / జీవనార్తి ఆలింగనం పొందని అభాగ్యుడు / గాలిలో గాలిగా కలిసిపోతాడు / ఇదే నాకు సృష్టి చెప్పిన సంగతి... నియంతలను తరిమికొట్టడంలో, అతి తక్కువ నష్టంతో ప్రభుత్వాలను తొలగించడంలో అరబ్ ప్రజలు విజయం సాధించారు. ఈ శతాబ్దపు అత్యంత ప్రభావశీల సంఘటన ఇది. అల్–షబీ గీతం 'ప్రపంచపు నియంతలకు' ఒక హెచ్చరిక అంటూ, ప్రజల నాల్కలపై కవి జీవిస్తాడనేందుకు తాజా ఉదాహరణ మార్పునకు గురవుతున్న అరబ్ సమాజంనుంచి వెలవడడం ఈ శతాబ్దపు ముఖ్య పరిణాయాల్లో భాగం అంటూ వ్యాసకర్త ఇది అరబ్ విప్లవాల అక్షర నేపథ్యం అని ఈ వ్యాసం ముగించాడు.

## గజల్ మొగల్ – బహదూర్ షా:

భారతీయ సంస్కృతిలో సహజ సంపదగా విడిపోయిన గజల్ యుగారంభ చక్రవర్తి బహదూర్ షా జఫర్. కేవలం ఎర్రకోట పరిసర ప్రాంతాలకే పరిమితమై పోయి ఒక విదేశీ ఫించనుదారుగా మిగిలిపోయాడు. మొగల్ చక్రవర్తుల వందేళ్ళ ప్రాభవం కోల్పోయి ఆఖరి మొగల్ చక్రవర్తి బహదూర్ షా కాలానికి నెలకొన్న దీనస్థితి ఇది. బహదూర్ షా వాడిపోతున్న ఆ సామ్రాజ్య క్షీణదశలో మొగల్ దర్బార్‌లో గజళ్ళ ఘల్లు ఘల్లు

సందోహాలకు, తాను స్వయాన కవి; సూఫీ పండితుడు అయి ఉండడం వల్ల ప్రధాన ప్రయోజకుడిగా ఆవిర్భవించాడు.

బహదూర్ షా జఫర్ భారతదేశం గర్వించదగ్గ కవి. ఒక రాజవంశానికి చెంది కష్టాల కడగండ్ల పాలైనవాడు. తన కవిత్వావేశంతో భారతీయ సాహిత్య వైభవానికి కొత్తరూపాన్ని అందించిన కవితోత్సాహి. 1857 తిరుగుబాటుకు నాయకత్వం వహించి తన ఎనబైరెండవ ఏట పెద్ద మూల్యమే చెల్లించాడు ఈ దేశభక్తుడు. తిరుగుబాటును అణచివేస్తూ ఆంగ్లేయులు హుమాయూన్ సమాధి వద్ద దాక్కుని ఉన్న జఫర్‌నూ, అతని ముగ్గురు కుమారులునూ బంధిస్తారు. మేజర్ హడ్సన్ అనే ఆంగ్లేయ సైనికాధికారి జఫర్ ముగ్గురు కొడుకులనూ చంపి వారి తలలు తరిగి తండ్రికి చూపిస్తారు. చాలా నిశ్చలంగా ఇలా అన్నాడు జఫర్ 'తైమూరిద్ వంశీయులకు ఇది అలవాటే. వారి వారసులిలా తండ్రులకు ఎదురుపడుతూనే ఉంటారు'.

ఈ విషయాలని రామతీర్థ 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 09/05/2011*) ప్రచురించిన 'గజల్ మొగల్ బహదూర్ షా' అనే వ్యాసంలో గుదిగుచ్చారు.

దేశాంతరవాస శిక్షకు గురై బర్మాలో అయిదేళ్లు రాజ్య ఖైదీగా జీవించి తన ఎనబై ఏదో ఏట కన్నుమూసిన జాఫర్ రాసినట్టు చెబుతున్న ఒక మక్తా ఇది: ఎంత నిర్భాగ్య జీవితమో నీది ఓ జఫర్/దొరకలేదే గజమైన చోటు/నీ సమాధి ఏర్పరుచు/నీ ప్రియనయగారాల నేలలో! అంటూ వ్యాసకర్త బహదూర్ షా యొక్క దేశభక్తిని, సాహిత్య ఔన్నత్యాన్ని ఈ వ్యాసంలో కొనియాడారు. గజల్‌కు చక్రవర్తి బహదూర్ షా అని ఉద్ఘాటించారు.

## నల్లజాతుల నాగరిక స్వరం:

జాతి వివక్షల కుంపటిగా అమెరికా సామాజిక మనస్తత్వాన్ని, ముఖ్యంగా తెల్లవారి తప్పుడు ఆలోచనా రీతుల్ని ఎత్తిచూపే కవిత్వ లాంగ్‌స్టన్ హ్యూజ్ – మృదువైన మందలింపు ధోరణిలో రాసి ప్రసిద్ధికెక్కాడు. లాంగ్‌స్టన్ హ్యూజ్ గూర్చి రామతీర్థ అక్షరంలో (*సూర్య దినపత్రిక, 13/06/2011*) 'నల్ల జాతుల నాగరిక స్వరం' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు.

నల్లజాతుల నిరసనల నాగరిక స్వరంగా 1920 నుంచి 1960 లద్వారా అమెరికన్ బ్లాక్ కవిత్వాన్ని వెలిగించి లాంగ్ స్టన్ హ్యూజ్ (1902–1967) కూడా తన తొలి యవ్వనంలోనే 1924లో 'నేను పాడతానమికాని' అని ఆత్మవిశ్వాసం ఉట్టిపడే గీతం రాశాడు. 'నేను అమెరికాని పాడుతాను/నేను నల్లని తమ్ముణ్ని/ఎవరన్నా అతిథులొచ్చినప్పుడు/ వారు నన్ను వంటింట్లోకి పంపేస్తారు/ కానీ నేను నవ్వుకుంటాను/ కడుపునిండా

తింటాను/ బలంగా ఏపుగా ఎదుగుతాను/ రేపు నేను టేబుల్ వద్ద ఉన్నప్పుడు అతిధులెవరన్నావస్తే/నన్ను లేచి వంటింట్లోకి పో/ అనడానికెవరూ ధైర్యం చేయరు/ నేనూ అమెరికానే!'

సీమాన్‌గా రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. హ్యూజ్ యుద్ధానంతరం విజయోన్మాదపు మోతాదు ఎక్కువైన పరిస్థితిలో ఉన్న స్వదేశానికి కనువిప్పు కవిత్వం రాసాడని వ్యాసకర్త తెలియజేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడో దేశాల ఆవలి విజయాలు, దేశంలోని ప్రజలను వర్ణ వివక్ష లేకుండా సమానం చేస్తాయా? అని ప్రశ్నించాడు హ్యూజ్. విక్టరి డే అంటే యూరప్‌లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసినరోజు. మిత్రపక్షాలు, అక్షరాజ్య కూటమిని ఓటమిపాలుచేసిన సుదినం. బాగానే ఉంది. ఈ విక్టరి డే – మీ – డే కూడానా అని ప్రశ్నలు సంధిస్తాడు. ఈ విజయ దినం మాకు ఆత్మగౌరవ దినమవుతుందా అని, అమెరికా అంతర్గత పరిస్థితులను చర్చకు తీసుకొస్తాడు. ఇప్పటికీ అమెరికాలో ప్రజానీకం, ఆశించలేనివే 'Will V–day be me–day too?' అన్నది కవిత. అందులో ఒక ముక్య భాగం ఇతి సాగుతుంది... 'నేను నా సైనిక ఉడుపులు విప్పేసాక, ఏ హాని పాల్పడకుండా ఉంటానా? లేక జర్మన్లు యూదులతో వ్యవహరించినట్లు మీరు తలపడతారా? ఈ ప్రపంచానని కాపాడేందుకు నా చెయ్యిందించిన నేనింకా రంగుకి బానిసగానే ఉండాలా? లేక ఈ విజయం మీ పాతకాలపు ఆలోచనల్ని మారుస్తుందా?' అంటూ హ్యూజ్ కవిత్వం పశ్నల వర్షంగా కురవడాన్ని వ్యాసకర్త వివరించారు. నల్లజాతుల నాగరక స్వరంగా అతన్ని కీర్తించారు.

## నడుస్తున్న దళిత విస్ఫోటనం:

నామదేవ్ ధసాల్ (1949) మరాఠి సాహిత్యంలో బలమైన దళిత స్వరం. ముంబాయిలోని ధోర్ బావ్‌లోని అరబ్ గల్లిలో పెరిగాడు. ఒక దయారాహిత్య బాల్యానికి గురైనవాడు నామదేవ్ ధసాల్. పూణే జిల్లాలోని పర్ కర్నేర్సర్ అనే కుగ్రామంలో మహర్ పేద రైతుల ఇంట – తోటి అంటరాని పిల్లలందరితోపాటుగానూ – జన్మించినా, గ్రామంలో కష్టాలకు తట్టుకోలేక ముంబాయి నగరం చేరుకున్న గ్రామీణ వలస కుటుంబం నామదేవ్‌ది. ఈయన గూర్చి రామతీర్థ 'నడుస్తున్న దళిత విస్ఫోటనం' అనే శీర్షకతో 'అక్షరం' లో (*01/08/2011*) ఒక వ్యాసం ప్రకటించారు.

బొంబాయిలో తన చుట్టూ ఉన్న వేశ్యలవాట తనను అట్టడుగవర్గాల కళాకారుడుగా తీర్చిదిద్దడంలో సాయపడింది. 1972లో తన మొదటి కవిత సంపుటి 'గొల్పితా' వెలువడింది. ముంబాయిలో కెల్ల కారు చౌక అయిన రెడ్‌లైట్ ఏరియా 'గొల్పితా'. 'గొల్పితా' ముద్రణ మరాఠీ సాహిత్యంలో పెనుమార్పులకు దారి తీసింది. మాటలకు యాసిడ్ గాఢత, వాక్యాలకు

ఆయుధ తీవ్రత రంగరింపులో నామదేవ్ ధసాల్ మర్యాదస్తుల సమాజం ఉలికిపడే ఉగ్రశేణి కవి. ఆకలి కేవలం భౌతికం కాదు. అది సౌష్ఠవాన్ని దెబ్బ తీసిందని చిత్రిస్తాడని వ్యాసకర్త ధసాల్ గూర్చి విశ్లేషించారు.

'నేను భాష మర్మాంగంలో ఒక సుఖవ్యాధి పుండుని' అని పాఠకుల్ని షాక్ చేసే నామదేవ్ ధసాల్, దళితాగ్రహానికి ఒక మంటల నాలుకనిచ్చారని వ్యాసకర్త ధసాల్ గూర్చి, అతని సాహిత్యం గూర్చి వివరించారు.

## 'శ్రీకాకుళపు సౌరు – గౌరు నాయుడి కథలు!':

శ్రీకాకుళం జీవభాష రాయగలిగిన మట్టి మూలాలమనికి గౌరు నాయుడు – లంచ గొండి ఎస్సైకి, అలాగే అని ముందు ఒప్పుకున్న గ్రామస్తులచే ఆఖర్న ఆంతరంగికంగా సామూహిక సత్కార శికష అమలు చేయిస్తాడు. తమ ప్రయోజనాలు అన్యాయమై పోయే చోట ప్రతి ఘటన – పరిరక్షణ జీవ సూత్రంగా, పాఠకులు నమ్మగలిగే తీరున గౌరునాయుడు కథ నడిపిస్తాడంట్టూ రామతీర్థ" శ్రీకాకుళపు సౌరు – గౌరు నాయడి కతళు! ('*అక్షరం' 08/08/2011*) అనే వ్యాసంలో వ్యాఖ్యానించారు.

రైతు జీవన రాయబారి గంటే కూడ గౌరు నాయుడు. గొప్ప జీవన మర్యాదల్ని రైతులకు ఆపాదించే కవిత్వం రాయగలడు. 'నాగలి' దీర్ఘకవిత, వ్యవసాయ యుగం మానవ ఇతిహాసంలో ఆరంభమైన మూలాన్నించి మొదలైన ఈ పని ముట్టు, ఇవాళ పనిలేక గోడకు వేలాడుతుంటే చూచిన ఇంగ్లీషు మీడియం మనువడి ప్రశ్న 'అదేమిటది'?. అక్కడే మొదలవుతుంది గౌరు నాయుడు రచన 'నాగలి'. ఇందులో 'ఆసరసాల'ను పరిచయం చేస్తాడు.

ఆసరసాల/కొత్త వ్యవసాయ పనిముట్లు కొలువు/రైతన్నల నిత్యవసరాల నెలవు/నాగలి/ నొల్ల/సరుగుడు/బండి/కొడవలి/గొడ్డలి/బొరిగి/పార/కొంచికర్ర/పువ్వుల కొరడా/ములుగర్ర /వ్యవసాయ పనిముట్ల ప్రయోగశాల ఆసరసాల అంటూ గ్రామీణ జీవన పరికరాలను తారుచేసే ఆసరసాల ఆచారి (కమ్మర పనిచేసే వ్యక్తి)ని స్మరిస్తాడు. మారిపోయిన వ్యవసాయ విధానాలను 'నాగలి' కవితలో వివిధ దశలలో చిత్రిస్తాడు. అలతి అలతి మాటలతో ఆదిమ కాలంనుంచే వస్తున్న కథను కవిత్వంగా చెప్తూ, రైతులోకానికి పార వందనం చేస్తాడు ఉప్పొంగే ఆత్మగౌరవంతో 'నాగలి' ఆఖరున.

'నా కథలన్నింటికీ కేంద్రం మా ఊరే. నాగావళీ... ఒడ్డునే మా ఊరు... ఆ మనుషులు, మనుషుల మధ్య అనుబంధాలు, ఆత్మీయతలు, కష్టాలు, కన్నీళ్ళు, – ఇవన్నీ కథల్లో చెప్పాలని...'

ఈ కథా సంపుటాల్లో లేని ఇటీవలి కథ గౌరునాయుడు రాసింది 'మాయ'. ఇది అభివృద్ధి పేరిట విధ్వంసం. గౌరునాయుడు ఇటువంటి దిక్కుమాలిన అభివృద్ధి మొదటి అధ్యాయం పూర్తయిన చోట, అంటే స్థానిక పల్లీయుల పునరావాసం జరిగినచోట తన కథ నెత్తుకుంటాడని వ్యాసకర్త చెబుతున్నారు.

గౌరునాయుడు ఏ వేదనలకు అక్షరాలను ఇచ్చాడో అటువంటి కృషిలో ఎవరెస్టంత ఎత్తైన రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి పేరిట ఏర్పాటైన గౌరవం, పదిహేడవ రాచకొండ రచనా పురస్కారం ఈ నాగావళి తరంగాన్ని ముద్దాడింది అంటారు రామతీర్థ.

## వచన వైభవ శిఖరం తొలినాళ్ళ ఆరుద్ర:

ఆధునిక వచన కావ్యానికి తొలి దశల నిర్వచన శిఖరాలను నిలబెట్టిన వారిలో ముఖ్యుడు ఆరుద్ర అంటూ రామతీర్థ 'వచన వైభవ శిఖరం తొలినాళ్ళ ఆరుద్ర' అంటూ 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 29/08/2011*) ఒక వ్యాసం ప్రచురించారు. తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా కావ్యాలు వెలువరించినవారు కావడం విశేషం. ఆరుద్ర త్వమేవాహం, దాశరథి అగ్నివీణ, సోమ సుందర్ వజ్రాయుధం వెలువడిన రచనలు.

1942 నాటికి ఆరుద్రకు 17 ఏళ్ళు. వారి రచనలు సుమారు రెండు డజన్ల దాకా పత్రికాముఖాలైన వెలుగు చూశాయి. అయితే 'వాటిలో స్పార్కులు మాత్రమే ఉన్నాయి. వాటికి పూర్తి మార్కులు ఇవాళ పట్టించుకోలేదు' అన్నారు ఆరుద్ర అని వ్యాసకర్త చెబుతున్నారు.

జయజయధ్వానాల/విజయనాదాలతో/నీలాల నింగిలో/ఎర్రజెండా తోడ/నీలాల నింగిలో కదలవే కదలవే/కొత్త మార్గాలకై/విశ్వ వీణారవపు/విజయగానమ్ముతో/విజయ శంఖానాద/ విశ్వగీతమ్ముతో/కొత్త మార్గాలపై/కొత్త మార్గాలకై అంటారు ఆరుద్ర. 'శ్రీశ్రీ ప్రభావంలో అనుకరణలూ, పారడీలు ఎక్కువగా చేస్తున్న నేను సోమయాజులు గారి సమక్షంలో అరటిక్కెట్టు మీద ప్రయాణం చేస్తూ పట్టుబడిన ప్యాసింజరులా ఫీలయ్యాను. శ్రీశ్రీని వదిలించుకోవడానికి పఠాభి ప్రభావంలో పడ్డాను' అంటారు ఆరుద్ర అని వ్యాసకర్త చెబుతున్నారు.

ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక తెలుగు కవిత్వ రూప శిల్పాలలో అన్నివిధాలా శ్రీశ్రీ సరసన నిలవగల అగ్ర సహచరుడు ఆరుద్ర. అదివాస్తవికత, అధివాస్తవ చిత్రకళ, తాత్త్విక చింతన, త్వమేవాహంకు ముందే 'ఓపెన్ ఫైర్' (తెలంగాణ రణగీతం) అంటూ నిజాం వ్యతిరేక పోరాటానికి ఊతం ఇచ్చే గీతాల రచన, కొత్తగా ఆసక్తికరంగా ఉండే మాటల ప్రయోగం – ఇవన్నీ ఆరుద్ర ఒక కావ్య సందర్భానికి దారితీసిన సూచనలని వచన రచనకు శిఖర స్థాయికి తీసుకెళ్లిన ఆరుద్ర తొలినాళ్ళ సాహిత్యసేవ గూర్చి వ్యాసకర్త వివరించారు.

## పెరటి వృక్షానికి – సాహిత్య నోబెల్:

ముప్పైయేడేళ్ళ కాల భ్రమణం తరువాత ఈ ఏడాది సాహిత్య నోబెల్ పురస్కారం తిరిగి పుట్టినింటి సాహితీ పురుషోత్తముడునే వరించింది. స్వీడన్ అకాడమీ తమ దేశ రాజధాని స్టాక్‌హోమ్ నివాసి అయిన తోమస్ ట్రాన్స్ ట్రోమర్‌కు 2011 సంవత్సరపు సాహిత్య నోబెల్ పురస్కారాన్ని ప్రకటించింది. దీనిని పురస్కరించుకొని 'పెరటి వృక్షానికి – సాహిత్య నోబెల్'

అను వ్యాసాన్ని రామతీర్థ 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 10/10/2011*) ప్రచురించారు.

తోమస్ రచనలైన 17 కవిత్వ సంపుటాలు ఇంగ్లీషు తదితర 60 ఇతర భాషల్లోకి అనువాదం చెందాయి. ఏక కాలంలో నిర్దిష్టం, విశ్వజనీనమైన లక్షణాలు గల కవిత్వంగా తోమస్ కవిత్వం గూర్చి ఆంగ్ల ప్రచురణకర్త నెల్ ఎస్టే పేర్కొంటూ ఆయనను తాత్విక దార్శనికత గల కవి అని అభివర్ణించారు. తన సాంద్రతర కాంతిమయ ప్రతీకలతో, వాస్తవికతను చేరుకునేందుకు మరొక కొత్త దారి కల్పించిన వాడిగా స్వీడన్ అకాడమీ తోమస్‌ను శ్లాఘించింది.

తోమస్ కవిత్వం సంక్లిష్టంగా ఉంటూనే నేరుగా హృదయాన్ని తాకేదిగా ఉంటుంది. ఇలాంటి గ్రాహ్యత సంతరించుకోడానికి తోమస్ చాలా కాలం సైకాలజిస్ట్‌గా పనిచేయడం ఒక కారణం. అందువల్ల ఆయన రచనల్లో మానవత్వపు లోలోతుల్ని దర్శించే మనస్తత్వ వేత్త లోచూపు కనిపిస్తుంది అని వ్యాసకర్త చెబుతున్నారు.

ప్రఖ్యాత పత్రిక ది గార్డియన్‌లో రాస్తూ పాల్ బాచలర్ తోమస్ 'న్యూ ఎండ్ కలెక్టెడ్ పోయమ్స్' సమీక్షలో తను తన కవిత్వంలో వివేక వాణిలా నీతులు వల్లించడు. అతని మాటల్లో ఒక నిర్దిష్ట వాస్తవం నుంచి ఉన్నత చైతన్య స్థాయి దిశగా ఒక చలనోన్మీలనం ఉంటుంది' అని తన అనుభవాన్ని రంగరించి సమీక్ష చేశారు. నిజానికి మధ్య ప్రాచ్యంలో చెలరేగుతున్న అరబిక్ ప్రజల విప్లవాల నేపథ్యంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి అరబ్ రచయితలకు దక్కుతుందని ఎంతో మంది సాహిత్యరంగ పరిశీలకులు భావించినా, వారి అంచనాలను తలకిందులుచేస్తూ స్వీడిష్ అకాడమీ తమ పెరడులోనే గల ఒక మహావృక్షాన్ని గౌరవించింది అంటారు తోమస్‌కు నోబెల్ బహుమతి దక్కడం గూర్చి విశ్లేషిస్తూ వ్యాసకర్త.

## భారతీయాంగ్ల నవల 'దైవాలు పాచికలాడిన వేళ':

'దైవాలు పాచికలాడిన వేళ' (When Gods Plays Dice), విశాఖలో జీవిచే ప్రహ్లాద్ మహంతి రాసిన ఆంగ్ల నవల. తన డెబ్బైనాలుగో ఏట కంప్యూటర్‌లో ఎలా పనిచేయాలో నేర్చుకుని, తాను ఈ నవల రాశానంటారు రచయిత. ఆ నవల గూర్చి అందు స్పృశించిన విషయాల గూర్చి రామతీర్థ 'భారతీయాంగ్ల నవల దైవాలు పాచికలాడిన వేళ' అనే శీర్షికతో 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 24/10/2011*) ఒక వ్యాసం రాశారు.

ప్రహ్లాద్ మహంతికి చాలా ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆయన ఈ నవలకు తన ముందుమాటలోనే 'నేను హేతువాదిని,

భగవంతుడి పద్ధతులు, ఏ నేరం చేయని దళితులను వివక్ష ద్వారా శిక్షించే ధోరణీ దాన్ని ఘోషించే మన పవిత్ర పురాణాలు – ఇవన్నీ నాకు ఇబ్బంది, ఇరకాటం కలిగించాయి. అయితే స్వతహాగా కొంత పిరికివాణ్ణి కనుక నేనీ ఆలోచనలను బహిరంగంగా చెప్పలేక పోయేవాడిని. ఈ రెండు ధోరణులను నవలాంతర్గతంగా చర్చించగలిగినందుకు సంతోషంగా ఉంది అంటారు నవలాకారుడు.

"ఈ ప్రపంచంలో ప్రతిదీ మారిపోతుంది. మనమూ ఆ కొత్త రీతులకు అలవాటుపడే జీవన పద్ధతులను అలవరచుకుంటున్నాం. మనం ఒక్కసారి మన మతంలో కూడా మార్పులు చేసుకోగలిగితే? అది కూడా ఓ జీవన విధానమే కదా! ఒక్కసారి కొంత విభిన్నంగా, భగవంతుని మతానికి దూరంగా జరిగి ఆలోచించగలిగితే?"

ఈ ఆలోచనా ధోరణే ప్రహ్లాద్ మహంతిని ఒక విలక్షణ రచయితను చేసింది. ఎందుకంటే ఆయన 'Incest' (అన్నాచెల్లెళ్ళ వరసయ్యేవారి మధ్య లేదా తల్లి–కొడుకు, తండ్రి–కూతురు వంటి వరసలు గల వారి మధ్య ఏర్పడిన లైంగిక సంబంధాన్ని ఆంగ్లంలో ఇదే పేరిట వ్యవహరిస్తారు. ఇది ఇవాల్టి సమాజంలో నిషిద్ధం) అన్న సోదరీ, సోదరుల శృంగార సంబంధంతో తన నవలను మొదలుపెట్టారు.

నవలలో – మనిషితో అజ్ఞాత ప్రచండ శక్తి అయిన 'లిబిడో' (విశేష లైంగిక వాంఛ) వల్ల కలిగిన సంబంధాలను వాటి ఫలితాలను నిర్మర్మంగా రాస్తాడు రచయిత. వాటిని సంబంధించిన అనవసర వర్ణనల జోలికి పోకుండా ఏం జరిగిందో పాఠకులకు స్ఫురణ కలిగించగలడు ప్రహ్లాద్ మహంతి అని వ్యాసకర్త తెలియజేస్తున్నారు.

విస్తృత శృంగార చిత్రీకరణకు అవకాశం గల నవలా ఇతివృత్తాన్ని ఇంత సాహిత్య మర్యాదలలో రాయడం కష్టం. నవలలో పాత్రలన్నీ ఒకటికి మించి శృంగార సంబంధాలు కలిగినవే. ఏ పాత్ర పవిత్రలు పాటించిన, వాటి కోసం పాటుపడిన పాత్రలుగా కనిపించవు. దైవాలు మనుషుల మనసుల్తో, దేహాల్తో పాచికలాట ఆడుతారు. కొన్ని చంపుడు పందెలుంటాయి. కొందరు సహజంగానో, అసహజంగానో చనిపోతుంటారు. మన తెలుగు నవలల కంటె ఎంతో విభిన్నంగా ఉండే ఈ నవల, కొత్త కొత్త కథాంశాలు ఎలా పొరుగున ఉన్న సాహిత్యకారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయో తెలిపే రచన ఇది అంటూ వ్యాసకర్త ఇట్టి భిన్న వస్తు స్వీకరణ చేసిన మహంతి నవ్యపథ ప్రయాణాన్ని కొనియాడారు. ఇది భారతీయాంగ్ల నవలగా వెలువడడం విశేషమే కాక, పరిణతి చెందిన వత్సరాలలో ప్రహ్లాద్ మహంతి

వెలార్చిన జీవ దృశ్య పరంపరగా పాఠకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందని...

## కవిత్వ మణిపద్మం ఐరోం షర్మిల:

చిన్నప్పుడు ఒక పాట పాడుకునే వాళ్లం, ఆరుద్ర రాసిన 'గాంధీ పుట్టిన దేశమా ఇది, నెహ్రూ కోరిన సంఘమా ఇది' అంటూ, సత్యాగ్రహం, స్వాతంత్ర్య యుద్ధం చెట్టాపట్టాలు వేసుకు నడిచిన నేల ఇది. అపారమైన అధికారాలు గల సైనిక దళాల ప్రత్యేక చట్టం అమల్లో ఉన్న మణిపూర్‌లో ఒక దశాబ్ద కాలంగా నిరవధిక సత్యాగ్రహం చేస్తున్నది – మొదలుపెట్టినప్పుడు ఆమె ఇరవై ఎనిమిదేళ్ల మహిళ, కవయిత్రి, మానవ హక్కుల ఉద్యమకారిణి – ఐరోం షర్మిల. ఆమె చేస్తున్న నిరాహారదీక్ష గూర్చి, ఆ క్రమంలో ఆమె సృష్టించిన కవిత్వం గూర్చి ప్రస్తావిస్తూ రామతీర్థ 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 28/11/2011*) 'కవిత్వ మణిపద్మం ఐరోం షర్మిల' అనే శీర్షికతో ఒక వ్యాసం వ్రాశారు.

అస్సాం రైఫిల్స్ దళాలు పదేళ్ళ క్రితం పట్టపగలు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పది మంది పౌరులను, వయస్సుపైబడిన స్త్రీలను హత మార్చినందుకు నిరసనగా, సైనిక దళాల ప్రత్యేక అధికారాలు చట్టాన్ని మణిపూర్ నుంచి ఎత్తివేయాలని కోరుతూ ఆమె నిరాహారదీక్ష ఆరంభించారు. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా స్పష్టమైన కార్యాచరణ లేకుండా తాను నిరసన వ్రతం విరమించే తలపే లేదన్నది షర్మిల. ఫలితంగా శాశ్వతంగా అరెస్టు, ఆహారం తీసుకునేందుకు తిరస్కరిస్తున్నందున బలవంతంగా ముక్కు ద్వారా గొట్టాలమర్చి ఆహార ద్రవాలు ఎక్కిస్తున్నారు. తను వెళ్ళి చూస్తే, కుమార్తె దృఢ సంకల్పం ఎక్కడ సడలి పోతుందోనని ఆమె తల్లి కూడా, షర్మిల లక్ష్యం సిద్ధించిన తర్వాతనే ఆమెను కలుస్తానని చెప్తున్నారు.

పదకొండవ సంవత్సరానికి చేరుకున్న షర్మిల నిరాహారదీక్ష, భారత ప్రజాస్వామ్యానికి ఒక ప్రశ్నగా నిలిచింది. 'అఖిల్ కత్యాలే' షర్మిల గురించి ఇలా అంటారు ఓ చిరు కవితలో.... 'సోదా చేసే చెక్ పాయింట్ల వద్ద మధ్య వాదులాట చెలరేగితే/దాన్ని ఆపేందుకు మరో దారిలేదు/ ప్రేమికుల తలల్లోంచి మరో దారి లేనట్టే/ ఏదేమైనా నవ్వుతూ వార్తలు చదువుదామని/మనస్సు స్థిరం చేసుకున్న న్యూస్ రీడర్లకు మల్లే/దేవతలు రాజీనామాలు చేస్తే/స్వర్గానికి మరో దారి లేదు – ఇంకా అలానే తన కవులు ఏళ్ల తరబడి ఆకలితో/ఎక్కడ సంకల్పమున్నదో... అని పాటలు పాడుతుంటే నిమ్మకు నీరెత్తనట్టు కూచున్న దేశానికి కూడా 'మరో దారి లేదు!'.

ఐరోం షర్మిల కవిత్వం కేవలం పన్నెండు కవితలు. ఆమె మైతిలియన్‌లో (మణిపురి భాషలో) రాసినది ఆంగ్లానువాదం జరిగి

Fragrance of Peace (శాంతి సుగంధం) పేరిట ఢిల్లీకి చెందిన జుబాన్ ప్రచురణ సంస్థ ప్రచురించింది. ఈ 'శాంతి సుగంధం'లో షర్మిల కవిత్వ సంవేదనం యావత్తూ నాగరిక భారత సమాజానికి ఒక సూటి ప్రశ్న 'బతుకు ముగిసిన పోయినప్పుడు/మీరు దయతో నా దేహాన్ని/తంత్రి కొబ్రు పర్వత సీమలకు/మసి బొగ్గులుగా మార్చడమన్నా/ గొడ్డలివెటులు పారలతో చేసిన గోతులు/ ఇవన్నీ నాకు జుగుప్సాకారకాలు/ పై తొక్క ఎలానూ ఎండి పోతుంది/దాన్ని నేలలో కుళ్లి చివికి పోనీండి/ రాబోవు తరాలకు కొంత ఉపయుక్తం కానీండి/గని లోపలి ఖనిజంలా రూపాంతరం చెందనీయండి/ రాబోవు యుగాలలో పరిమళాలు వ్యాపింపజేస్తాను!'

ఐరోం షర్మిలను జాతీయ పత్రికలు, టీవీ చానెల్లు పెద్దగా పట్టించుకోలేదు. ఆమె కవిత్వంకన్నా గొప్పది – షర్మిల కఠోర సంకల్పం. మేలం మాసేకర్‌గా కాల్చివేత, మణిపూర్‌లో జరిగిన స్త్రీలు, బాలలు, వృద్ధుల దారుణ కాల్చివేత, మణిపూర్‌లో జరిగిన వందలాది ఆకృత్యాలలో ఒకటి మాత్రమే! అంటూ వ్యాసకర్త షర్మిల ఉక్కుమనిషిగా ఆమె సాగిస్తున్న దీక్ష గూర్చి వ్యాసంలో వివరించారు.

### 3.2.13. దేవరాజు మహారాజు

### మానవతా మధుశాల:

'నీ హృదయపు లోతెంతుందో మధు పాత్ర లోతంతుంటుంది/నీ మనసున మత్తెంతుందో మధువున మత్తంతుంటుంది/నీ భావుకత అందం ఎంతో, సాకీ అంతటి సుందరము/ఎవ్వడెంతటి రసికుడు అయితే, అంతటి రసమయము మధుశాల!' మధుశాల అంటే కేవలం మధుశాల కాదు. ఒక ధ్యేయానికి, ఒక గమ్యానికి అది సంకేతం! ధ్యేయాన్ని బట్టి ఒక్కొక్కరి మధుశాల మారుతూ ఉంటుంది అంటూ దేవరాజు మహారాజు హరి వంశరాయ్ బచ్చన్ సృష్టించిన 'మధుశాల' గూర్చి ప్రస్తావిస్తూ 'మానవతా మధుశాల' అనే శీర్షికతో 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 04/04/2011*) ఒక వ్యాసం వ్రాశారు. డా॥ హరివంశరాయ్ బచన్ (1907 – 2003) ముప్పయి కవిత సంపుటాలు ప్రచురించారు. 'మధుశాల' (1935) ఆయనకు జగద్విఖ్యాతిని తెచ్చిపెట్టింది. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పొందిన మొదటి భారతీయుడు.

హిందీ సాహిత్య రంగంలో 'హాలావదాన్ని' (మధువాదాన్ని) ప్రతిపాదించి, పోషించినవాడిగా పేరు గాంచాడని వాస్యకర్త తెలియజేస్తున్నాడు. 'వర్ధిల్లాలి మధువులనిచ్చే ద్రాక్షలతలు/వర్ధిల్లాలి మధు పాత్రలు చేసే మట్టిపెళ్లలు/మదిరా పిపాస వర్ధిల్లాల వర్ధిల్లాలి

మధుశాల!' 'హలా – అంటే మధువు. మనిషి తనకు కావాల్సిన దాన్ని వెతుక్కోవడంలోనే ఆనందం పొందుతూ ఉంటాడు. మధువంటే మధువే కానక్కర్లేదన్నది ఆయన చెప్పే అంతరార్థం! అని వ్యాసకర్త కవి మనస్సెరిగించాడు.

బచ్చన్ వారి ఇంటి పేరు కాదు. వారి ఇంటి పేరు శ్రీవాత్సవ. హరివంశరాయ్ బాల్యంలో అందరూ ముద్దుగా 'బచ్చన్' అని పిలిచేవారు. బచ్చన్ అంటే చంటాడు, కుర్రాడు, పసివాడని అర్థం. ఒకసారి గాంధీ కలవడానికి వెళ్లిన బచ్చన్‌ను సారాయి కవిత్వం రాసిన కవిని నేను కలుసుకో దలచుకోలేనని అన్నారు. మధ్యలో ఒకాయన కలుగుజేసుకొని ఆయన ఏ సారాయి గురించి అయితే చెబుతున్నారో అది సారాయి కాదు – ప్రేమకు, ఆధ్యాత్మికతకు, జీవన గమ్యానికి అది సంకేతమని వివరణ ఇచ్చారు. అది తెలుసుకొని గాంధీజీ ఎంతగానో సంతోషించారు.

తన కవితా సంపుటాల్లోంచి ఎన్నిక చేసిన కవితలు కొన్ని 1984లో 'మేరీ శ్రేష్ఠ కవితాయేఁ' పేరుతో ప్రకటించారు. హిందీ సాహిత్యంలో ఆయన కృషికి సాహిత్య అకాడమీ అవార్డు, సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, ఆఫ్రో ఏసియన్ రచయితల సమాఖ్య వారి లోటస్ అవార్డు, సరస్వతీ సమ్మాన్ మొదలగు అత్యున్నత పురస్కారాలను స్వీకరించిన హరివంశరాయ్‌కి భారత ప్రభుత్వం 1976లో 'పద్మ భూషణ్' ప్రకటించింది.

'నా కవిత్వం మోహంతో మొదలై – మోహబంధంతో ముగిసింది' అని చెప్పుకున్నారని వ్యాసకర్త అతని ఆత్మలోని మాట, ఆత్మకథలోని వాక్యాన్నీ అక్షరీకరించారు ఈ వ్యాసంలో.

## సాహిత్య సత్యాగ్రహాల మేళవింపు:

'బార్ బార్ ఆతీహై ముఝ్కో/మధుర్ యాద్ బచ్‌పన్ తేరీ/గయా లేగయా తు జీవన్‌కి/ మస్త్ ఖుషీ మెరీ'... బాల్యం మీద హిందీ కవయిత్రి సుభద్రాకుమారి చౌహాన్ రాసిన అద్భుతమైన కవిత అది. 'ఝూన్సీ కీ రాణీ' కవిత బట్టీ పట్టని పిల్లలుండరంటే అతిశయోక్తి కాదు. కవయిత్రిగా, రచయిత్రిగా ఎంత ప్రాచుర్యం పొందారో, 1920 నాటి కాంగ్రెస్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొని దేశంలోనే తొలి మహిళా సత్యాగ్రహి అయ్యారు. ఆనాటి కాలంలో గడప దాటి బయటకు రావడం సామాన్య విషయం కాదు. భర్త అందుకు అన్ని విధాలా స్వేచ్ఛనిచ్చారు. అట్టి సుభద్రా కుమారి చౌహాన్ గూర్చి దేవరాజు మహారాజు 'సాహిత్య సత్యాగ్రహాల మేళవింపు' అనే శీర్షికతో 'అక్షరం'లో (*సూర్య దినపత్రిక, 23/05/2011*) ఒక వ్యాసం ప్రచురించారు.

భారత కోకిల సరోజినీనాయుడు ఈమెకంటే సుమారు పాతికేళ్లు పెద్ద అయినా స్వాతంత్ర్యోద్యమంలో సమాన భాగస్వాములయ్యారు. సాహిత్యానికి సంబంధించి వీరిద్దరిలో ఓ తేడా గమనించవచ్చు.

సరోజిని ఉద్యమంలోకి రాకముందే కవిత్వం రాశారు. ఉద్యమ కాలంలో ఏమీ రాయలేదు. సుభద్రా కుమారి పోరాటంలో పాల్గొన్న స్ఫూర్తితో కవిత్వం రాశారు. పోరాట పటిమ ఆమె కవిత్వానికి పదును పెట్టింది. స్త్రీ పురుష సమానత్వం సాధించుటకు నిరంతరం కృషి కొనసాగించారు.

కవయిత్రిగా ఆమెకు సమున్నత స్థానం సంపాదించి పెట్టినవి 'ముకల్', 'బిభిరే', 'మోతి', 'ఉన్మాదిని', 'సధీ సాధేచిత్రే' మొదలయినవి. భారతీయ హిందూ సమాజంలోని రుగ్మతల్ని ముఖ్యంగా బాల్య వివాహాలు, బహు భార్యత్వం వంటి వాటి గూర్చి ఆమె రచనల్లో నిర్ద్వంద్వంగా విమర్శించారు. ముక్కు పచ్చలారని బాలిక వితంతువులు కావడాన్ని సహించలేకపోయేవారు.

రచయితగా ఆమె తనను తాను ఎప్పుడూ గొప్పగా ఊహించుకోలేదని, నిజానికి 1930–40 ప్రాంతాల్లో ఆమె రచనలు విస్తృతంగా వెలువడడమే కాదు, ఆమెకు మహోన్నత స్థానాన్ని కల్పించాయి. కాని ఆమె మాత్రం జీవితాంతం కాళ్లకు చెప్పులు కూడా లేకుండా జాతీయోద్యమ కార్యకలాపాల్లో పాల్గొంటూనే వచ్చారని వ్యాసకర్త వివరిస్తూ; ఆమె అటు దేశ స్వేచ్ఛ కాంక్షిస్తూ సత్యాగ్రహ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూనే, ఇటు సాహిత్య సేవ చేసిందని, ఈమె సాహిత్య సత్యాగ్రహాల మేళవింపని వ్యాసకర్త వేనోళ్ళ కొనియాడారు.

## హైదరాబాద్ సంస్థాన విదూషకుడు హాస్యోక్తుల వనమాలి:

నిన్న మొన్నటి వరకు హైదరాబాద్ నగరంలో సయీద్ జమాలుద్దీన్ పేరు బాగా వినిపిస్తూ ఉండేది. ఆయన చెప్పిన హాస్యోక్తులు, ఆయన ఆశువుగా చెప్పిన షాయరీ, చురకల్లాంటి చెణుకులూ నగరవాసుల సంభాషణల్లో తరచూ దొర్లేవి. నిజానికి ఆయన ఎవరు? నిజాం రాజు ఆస్థానంలో విదూషకుడు, అటువంటి వారెవరైనా నిజాం ఆస్థానంలో ఉన్నారా అంటూ డా॥ దేవరాజు మహారాజు 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 07/11/2011*) లో "హైదరాబాద్ సంస్థాన విదూషకుడు హాస్యోక్తుల వనమాలి" అనే శీర్షికలో ఒక వ్యాసం ప్రచురించారు.

నిజానికి జమాలుద్దీన్ నిజాం కొలువులో విదూషకుడు కాదు. కానీ అనధికారికంగా అంతటి వాడే. నిజాం ఆస్థానంలో విదూషకుడెవరులేరు. 'జమాలుద్దీన్' అనేది ఎవరో సృష్టించిన పాత్ర అని కూడా అనుకున్నారు. కాని ఆయన నిజాం కాలంలో రంగ ప్రవేశం చేసి, తనదైన పాత్ర పోషించి ఈ

జీవిత నాటకరంగం నుండి నిష్క్రమించిన సజీవ విదూషకుడు. నిజాం రాజు ఆయనను ఆస్థాన విదూషకుడిగా నియమించకపోయినా ప్రజల దృష్టిలో ఆయన హైదరాబాద్ సంస్థానానికి విదూషకుడయ్యాడని వ్యాసకర్త ఈ వ్యాసం ద్వారా పాఠక లోకానికి తెలియజేస్తున్నాడు.

నిజాం కుటుంబానికి అతి సన్నిహితుడైన జమాలుద్దీన్ టిప్పు సుల్తాన్ వంశంలోనివాడు. 1881 మద్రాసులో పుట్టాడు. విద్యాభ్యాసం కోసం హైదరాబాద్ వచ్చాడు. మెట్రిక్యులేషన్ పాసయ్యాడు. అదృష్టం కలిసొచ్చి జమాలుద్దీన్ – నవాబ్ కాజిమ్ యార్ జంగ్ సోదరి గౌజియాబేగంను వివాహమాడాడు. కాజిమ్ యార్ నిజాం ప్రభుత్వంలో ఒక శాఖకు మంత్రి. నిజాం కొలువులో ఉద్యానవన శాఖలో చిరుద్యోగిగా చేరి 'బాగ్-ఎ-ఆమ్' (పబ్లిక్ గార్డెన్స్)కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి సాధించాడు. నిజాం పంపగా జపాన్ వెళ్ళి అక్కడ తోటల పెంపకం నిర్వహణ గూర్చి అధ్యయనం చేసి వచ్చి తోటల పెంపకానికి నిజాం ఇచ్చిన లక్ష రూపాయలు సొంతానికి వినియోగించుకొని పని ప్రారంభించలేదు. నిజాం తనిఖీకి వచ్చి పని ఎంతవరకు వచ్చిందని అడగగా 'జపాన్ గార్డెన్ అంతా సిద్ధమైంది ప్రభూ! కానీ ఒక్కటే తక్కువ! జపాన్ నుంచి అగ్ని పర్వతాలు దిగుమతి చేసుకోవలసి ఉంది' అని నివేదించుకున్నాడు. నిజాం చిరునవ్వు నవ్వి, మరికొంత డబ్బు మంజూరు చేశారు. కొంత కాలానికి అద్భుతమైన గార్డెన్‌ను అభివృద్ధి చేశాడు జమాలుద్దీన్.

జమాలుద్దీన్ బతికి ఉన్నంతకాలం నిజాం రాజును అపహాస్యం చేస్తూనే ఉండేవాడు. జమాలుద్దీన్ – టోపి ముందు భాగాన్ని వెనక్కి పెట్టుకుని తిరిగేవాడట. అదేమంటే, ఏమో, నిజాం ప్రభువు గబుక్కున వెనుకనుంచి వస్తే ఎట్లా? అందుకే ఈ ఏర్పాటు అనేవాడట. ఈ విధంగా సయిూద్ జమాలుద్దీన్ హైదరాబాద్ సంస్థానంలో వనమాలి మాత్రమే కాదు 'హాస్యోక్తుల వనమాలి' అని ఈ వ్యాసం ద్వారా రుజువు పరిచారు వ్యాసకర్త డా॥ దేవరాజు మహారాజు.

### 3.2.14. డా॥ దార్ల వెంకటేశ్వరరావు: ఆదికవి సాహిత్యకీయం:

తెలుగు కవుల్లో నన్నయ, వేమన పేర్లతో కొన్నాళ్ల క్రితం ఆంధ్ర ప్రదేశ్‌లో రెండు విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయి. నిజంగా ఇది తెలుగు కవులకు దక్కిన గొప్ప గౌరవంగా పైకి అనిపిస్తున్నా, వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే అలా విశేషణాలతో పేర్లు పెట్టడం సమంజసమేనా అనిపించక మానదు అంటూ ప్రముఖ విమర్శకుడు, కవి డా॥ దార్ల వెంకటేశ్వర రావు సూర్య దినపత్రిక 'అక్షరం'లో (*03/01/2011*) 'ఆదికవి సాహిత్యకీయం' అనే

వ్యాసంలో తన భావాన్ని పాఠకులతో పంచుకున్నారు. ఇందు సాహిత్య చరిత్రలో వర్ణ వివక్ష కొనసాగిన తీరుని ఎండగట్టారు.

నన్నయ వంటి కవి దొరకడం తెలుగు జాతి చేసుకున్న అదృష్టమని, అట్టి వారిని గౌరవించడం తెలుగు జాతి విద్యుక్త ధర్మమని భావిస్తూ, విశ్వవిద్యాలయాలకు కవుల పేరును పెట్టడం ఎవరూ నిరాకరించరని వ్యాసకర్త చెబుతూనే – నన్నయ్య పేరుకు ముందు 'ఆదికవి' అని చేర్చవలసిన అవసరమేమిటని పండితలోకాన్ని ప్రశ్నిస్తున్నారు దార్ల. అసలు నన్నయే తొలి తెలుగు కవి అవుతాడా? నన్నయకు ముందు తెలుగు సాహిత్యం లేదా? ఉంటే నన్నయే ఆదికవి ఎలా అవుతారు? అంటూ దార్లగారు కురిపించిన ప్రశ్నల వర్షం అసలు చరిత్రను దాచి నన్నయను ఆదికవిగా సమర్థించుటకు ఎంతగానో కష్టపడుతున్న సంప్రదాయ పండితుల మస్తిష్కాలలో పేరుకు పోయిన కుల వివక్షతా పంకిలాన్ని కడిగేసేటట్లు ఉంది ఈ వ్యాసం.

నన్నయకు ముందు 'ఆది పురాణ' కర్త సర్వదేవుడు, కవిజనాశ్రయకర్త మల్లియరేచన, కవిరాజ శిఖామణి నన్నెచోడుడు, వేములవాడ భీమన్న మొదలగు కవులు ఉన్నారని సాహిత్య చరిత్రకారుల అభిప్రాయం. వైయుక్తికమైన కారణాలతో కవుల పట్ల, వారి రచనల పట్ల – కులం, అగ్రవర్ణత్వం ఆధారంగా వివక్ష ప్రదర్శించిన వైనాన్ని బహుజన సాహిత్యవాదం బయటపెడుతోందని, సాహిత్య చరిత్రలో వర్ణవివక్ష కొనసాగిన తీరును దార్ల గారు ఆధారపూర్వకంగా ఈ వ్యాసంలో పాఠకుల ముందుంచారు.

అలాగే వేమన విశ్వవిద్యాలయం అని కాకుండా ఒక విశేషణాన్ని ముందుంచి 'యోగి వేమన విశ్వవిద్యాలయం' అని పేరిడడం, నాగార్జున విశ్వవిద్యాలయం ముందు ఆచార్య అని చేర్చి నాగార్జునుడిని స్మరించేటట్లు చేయడం వంటివన్నీ కూడా భవిష్యత్తులో వివాదాలు తలెత్తే అవకాశముందని భావించి వాటిని సమాధానపర్చుటకు ముందుగానే గట్లు వేయడం వంటిదని భావిస్తూ వ్యాసకర్త విమర్శనాత్మక దృష్టితో ఈ వ్యాసం రాసినట్లు పాఠకులకు అనిపించడం సహజం, సమంజసం.

## నిలువెత్తు భారతీయత:

'భరియించెద భర్తలుగా/పరియిం చెదమీ మనోజ్ఞ భావమ్ముల, నే/చరియించెద నిష్టామతి/ కురియించెద వలపు మలపు కూర్మలెసంగన్' – ఇది డా॥ **యస్**.టి. జ్ఞానానంద కవి సాహిత్య అకాడమీ బహుమతి పొందిన 'ఆమ్రపాలి' కావ్యంలోని ఒక చక్కని కంద పద్యం. దార్ల వెంకటేశ్వరరావు జ్ఞాననంద కవి వ్యక్తిత్వం గూర్చి, ఆయన సృష్టించిన సాహిత్యం గూర్చి

సూర్య దినపత్రిక 'అక్షరం' (*17/01/2011*)లో 'నిలువెత్తు భారతీయ' అనే శీర్షికతో ఒక వ్యాసం వెలువరించారు.

ఆమ్రపాలి అందమైన అమ్మాయి. ఆమెను షోడష జన పథాలకు చెందిన రాజులు గణభోగ్యగా చేసుకొని, అందరి భార్యగా మార్చుకోవాలనుకున్నప్పుడు, తండ్రి నిస్సాయస్థితిలో కూరుకుపోతాడు. అప్పుడు ఆమ్రపాలి ప్రకటించిన నిర్ణయాన్ని పై పద్యంలో వర్ణించారు కవి. కందం రాసినవాడే కవి అనే సామెత ఒకటుంది. కందమే కాదు తెలుగులో ఏ పద్యాన్నైనా వర్ణించడంలో సిద్ధహస్తుడు అభినవ శ్రీనాథుడనే కీర్తికి పాత్రమైన కవి పద్మశ్రీ డా॥ యస్.టి. జ్ఞానందకవి. కూలీనుండి కళాప్రపూర్ణ వరకూ ఎదిగిన ఈయన విజయనగరం జిల్లా బొబ్బిలిలో 1922 జూలై 16న సురగారి పాపమ్మ, ఎల్లయ్య దంపతులకు జన్మించారు.

చిన్న వయస్సులోనే సీసపద్యాలతో ఒక శతకాన్ని పూర్తి చేయడాన్ని గమనించి తెలుగు పండితులు జ్ఞానానందకవిని చూసి ఆశ్చర్యపోయేవారు. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు సభాధ్యాక్షులుగా గల ఒక సభలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని వర్ణిస్తూ రాసిన పద్యాల్ని ఆలపించారు. ఆ పద్యాలు విని ఇకపై నీ పేరు జ్ఞానానందకవిగా ప్రసిద్ధి చెందుతుంది అని ఆశీర్వదించారు. ఆనాటి నుండి సురగాలి తిమోతి జ్ఞానానందం – యస్.టి. జ్ఞానానందకవిగానే ప్రాచుర్యం పొందారు.

ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన వ్యక్తి కవిగా గుర్తింపు పొందడమే కష్టం. అటువంటిది సంప్రదాయ పండితుల మెప్పు పొంది, కనకాభిషేకాల్ని, అభినవ జాషువ, కవి కోకిల, కవిత శ్రీనాథ, కవితోక విభూషణ వంటి బిరుదుల్ని పొందడం వెనుక కవి నిరంతర కృషి దాగి ఉందని వ్యాసకర్త వివరిస్తున్నారు.

తాను పుట్టి పెరిగిన కుల, మత, ప్రాంతమేదైనా, తనని భారతీయతకు ప్రతిరూపంగా అందరూ భావించాలనే ఆత్మవిశ్వాసం కలిగించే ప్రయత్నం ఆయన ప్రతి రచనలోను కనిపిస్తుందని వ్యాసకర్త వెల్లడిస్తున్నారు. సమకాలీన కవుల్లో గుర్రం జాషువ, విశ్వనాథ, మధు నాపంతుల సత్యనారాయణ, దాశరథి వంటి వారెందరో జ్ఞానానంద కవి కవిత్వాన్ని ప్రశంసించారని, తుది శ్వాస విడిచే వరకు అవిశ్రాంతంగా ఆయన తన పద్య విద్యను కొనసాగించారని దార్ల ఈ వ్యాసంలో గుదిచ్చారు. ఈయన 36 కావ్యాల్ని ప్రచురించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, మైసూరు, ఉస్మానియా విశ్వవిద్యాలయంల్లో అనేక సంవత్సరాలపాటు వీరి ఆమ్రపాలి కావ్యం పాఠ్యాంశంగా ఉంది. వీరిపై అనేక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు

జరిగాయి. జ్ఞానానందకవి రచనలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2000లో ‘పద్మశ్రీ’ అవార్డును అందించింది.

పెడ్యూల్డు కులాలు అంటరానివా? అనే పరిశోధన గ్రంథాన్ని రాస్తే, దాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే ప్రచురించింది. దీనిలో మనువాద భావాల్ని తూర్పారబట్టారని, నిజానికి వేదాల్లో లేని కులాన్ని తర్వాత స్వార్థపరులు సృష్టించి, దాన్ని వాడుకుని సమాజాన్ని విచ్ఛిన్నం చేసిన తీరును నిలదీస్తూ, తన రచనల్లో నిలువెత్తు భారతీయతను నింపుకున్న జ్ఞాని జ్ఞానానంద కవి అని దార్లగారు ఈ వ్యాసంలో చెప్పకనే చెప్పారు.

## జాతీయ కవి బోయి భీమన్న:

డా॥ బోయి భీమన్న సుమారు 70 పుస్తకాల్ని రాసినట్లు తెలుస్తోంది. పద్య, గేయ, వచన రచనలతోపాటు, నాటకాలను కూడా రాశారు. వివిధ పుస్తకాలకు రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. ఏ రచయిత దృక్పథాన్నైనా అంచనా వేయాలంటే, వివిధ పరిణామాలుగా సాగిన రచనలన్నింటినీ స్పర్శించగలిగినపుడే అది సాధ్యమవుతుంది. అలా కాకుండా దళిత పదాన్ని ప్రయోగించలేదనీ, దాన్ని వ్యతిరేకించాడనీ, భారత దేశంలో కులం లేదన్నారనీ, ఆయన వర్గాన్నే సమర్థించారనీ, కులం గూర్చి రాయలేదని వక్రీకరించే వాళ్లని చూసిన తర్వాత ఆయన సాహిత్య దృక్పథాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుందంటూ డా॥ దార్ల వెంకటేశ్వర రావు సూర్య దినపత్రిక 'అక్షరం' (*28/02/2011*) లో 'జాతీయ కవి బోయి భీమన్న' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు.

హైమావతి చక్కని కథనాత్మక శైలిలో రాసిన "పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న" గ్రంథం వీరి సాహిత్య దృక్పథాన్ని తెలిపే చుక్కాని లాంటిదని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. దానిలోని సూచనల్ని గమనిస్తే, ఆయన రాసిన రచనల్లో పరిశోధకులకు, విమర్శకులకు తమదైన విశ్లేషణకు ప్రేరణ దొరుకుతుందని, భారతదేశంలోని 'భిన్నత్వంలోని ఏకత్వం' లాగే, భీమన్న రచనల్లోనూ ఆ లక్షణం కనిపిస్తుందనీ, ఆయన కులమతాలకంటే మానవత్వాన్నే ఆశించిన జాతీయవాది అనీ ఆ గ్రంథం ప్రతిపాదిస్తుందని వ్యాసకర్త తెలియజేస్తున్నారు.

తమ తెలివితేటలతో ఆధిపత్యంలో ఉన్న వాళ్ళు ఒక క్రమబద్ధమైన జీవన విధానమే మతమని ప్రబోధిస్తూనే కర్మ సిద్ధాంతం పేరుతో అస్పృశ్యులను తయారుచేశారనే అంబేద్కర్ ఆలోచనా విధానాలే భీమన్నలో కనిపిస్తాయి. పురాణేతిహాసాలు, సంప్రదాయ సాహిత్యాల పేరుతో పాలక వర్గాలతో 'ఆలోచనాపరులు' కలిసి కొనసాగించిన కుట్ర ఫలితంగా నేటికీ కులాధిపత్య సాహిత్యమే ఉత్తమ సాహిత్యంగా కొనసాగిపోతోందంటూ భీమన్న దీనిని నిరసిస్తాడు.

కుల నిర్మూలనకు కులాంతర వివాహాలు తోడ్పడతాయని చెప్పినట్లైనా, తర్వాత వారి పిల్లలకు తల్లిదండ్రులలో ఏదో ఒక కులాన్ని ఆపాదిస్తే కులనిర్మూలన జరిగినట్లేలా అవుతుందో ఆలోచించాలని భీమన్న ప్రశ్నిస్తాడు. 'పాలేరు' నాటకంలో వెంకన్న చదువుకొని వెంకటేశ్వర రావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టర్‌గా గ్రామానికొచ్చి భూస్వాముల దురాగతాలను అడ్డుకుంటాడు. వనబాలను పెళ్ళి చేసుకుంటాడు. 'గుడిసెలు కాలిపోతున్నై' (1973) కావ్యంలో ఓట్ల కోసం వచ్చే వారిని నిలదీసే

చైతన్యం దళితుల్లో కలగాలనే ఆశయం కనిపిస్తుంది. హింసావాదానికి భీమన్న వ్యతిరేకి. దళితులందరూ శ్రామికులనే వారిని భీమన్న వ్యతిరేకించారు.

కూలీలంతా అభ్యుదయం సాధించాలంటే ముందుగా అంటరానితనాన్ని తొలగించాలి అన్నారు. వర్గపోరాటాలు జరుగుతున్న తీరుని విమర్శిస్తూ 'నాయకులంతా దేశీయ స్థితిగతులను గుర్తించకుండా ప్రపంచ కార్మిక దృష్టి మాత్రమే కలిగిన ధనిక సవర్ణులు' అని ప్రకటించారు. ఇంత స్పష్టంగా కులనిర్మూలనను ఆశించిన భీమన్న సాహిత్యాన్ని వివిధ జాతీయ సదస్సుల్లో కులం లేదన్నారని వక్రీకరిస్తున్నారు. వర్ణాంతర వివాహాలవల్ల కుల నిర్మూలన జరగడాన్ని ఆకాంక్షించారు. ఈ విషయాలన్నీ బాధ్యతగల సాహితీవేత్తలు గుర్తించాల్సిన అవసరం ఉందని వ్యాసకర్త ఈ వ్యాసంలో అభిప్రాయపడుతున్నారు.

## సామాజిక విప్లవ దార్శనికుడు:

సాహిత్యంలో తమ అస్తిత్వాన్ని వెతుక్కునే క్రమంలో ప్రమాణాలు మారుతుంటాయి. తమ కులం, మతం, ప్రాంతం వంటివన్నీ ఆ సాహిత్యాన్ని అర్థం చేసుకోవడంలో కొత్తవాదాల్ని తెరపైకి తెస్తాయి. ఈ మధ్యకాలంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యం గురించి చర్చ జరుగుతోంది. వేమన వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యం ప్రచారంలో ఉన్నదంతా నిజంగా వాళ్ళదేనా? లేక ఆ పేరుతో మరెవరైనా రాశారా? అనే అనుమానాలకి కారణాలున్నాయంటూ సూర్య దినపత్రిక 'అక్షరం'లో (*14/02/2011*) 'సామాజిక విప్లవ దార్శనికుడు' అనే శీర్షికతో డా॥ దార్ల వెంకటేశ్వర రావు ఒక వ్యాసం ప్రచురించారు. అట్టి అనుమానాలకి ఆ కవుల్లో వచ్చిన పరిణామం ఒక కారణమైతే, ఆ సాహిత్యం వివిధ పాఠాంతరాల్లో ప్రజల్లో ప్రచారం కావడం మరో కారణంగా విశ్లేషించుకోవచ్చు.

విగ్రహారాధనను వ్యతిరేకించిన వారికే ప్రజలు విగ్రహాలు, దేవాలయాలు నిర్మించారు. విగ్రహారాధనకీ, చారిత్రక వ్యక్తుల విగ్రహాల ఏర్పాటుకు మధ్య తేడాల్ని గమనించకపోతే, సామాన్యులను మూఢత్వం వైపు నడిపించడమే అవుతుందని, అది ఆ దార్శనికుల ప్రబోధాలకే చేటు తెస్తుందని; వేమన వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యాన్ని కూడా ఇలాగే అర్థం చేసుకోవాలని వ్యాసకర్త పాఠకులను ఆలోచింపజేస్తున్నారు తన వ్యాసంతో.

వీరబ్రహ్మేంద్ర స్వామి – ఆ కాలం నాటి పాలకులు, భూస్వాములు కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వాళ్ళపై చేసే దురాగతాలకు స్పందించి, ఒక నిస్సహాయ స్థితిలో కొన్ని తత్త్వాల్ని చెప్పారు. తామేది చెప్తున్నారో, దాన్ని ఆచరించి చూపడానికి వీలుగా కుల, మతాలకు

అతీతంగా వివిధ వృత్తుల వాళ్ళని దగ్గరకు చేర్చుకున్నారు. లోక పరిశీలన వల్ల వచ్చిన అనుభవంతో తాను చెప్పేవి జరుగుతుండడం వల్ల, నాటి సమాజంలో సంస్కరణల్ని ఆశించేవాళ్లు, సామాన్యులు సహజంగానే ఆయన బోధనలకు ఆకర్షితులయ్యేవారు. ఆ విధంగా వ్యవస్థీకృత పద్ధతిలో, శాంతియుతంగానే ప్రజల్ని ఆలోచించేలా చేశారు. ఈయన సాహిత్యంలో మార్మికత ఒక లక్షణమని పరిశోధకుల అభిప్రాయం. కులం వద్దంటూనే, తన కులం గురించి ఉన్నతీకరించుకోవడం ఆయన కులం వద్దంటూనే, తన కులం గురించి ఉన్నతీకరించుకోవడం ఆయన సాహిత్యంలో ప్రతిఫలించింది. 'మతం మత్తు గూర్చు మార్గమ్ము కారాదు' అన్నారు వీరబ్రహ్మేంద్ర స్వామి అని వ్యాసకర్త వివరించారు.

మతాన్ని నిరసిస్తూనే, అచల వేదాంతాన్ని బోధించారు. గురువుని అధికుడిగా భావిస్తారు. శివకేశవులు వేరు కాదనీ అంతా బ్రహ్మమేనని బోధిస్తారు. తనను తాను తెలుసుకోవడమే బ్రహ్మం. దీన్నే అద్వైతమని అంటున్నా, అచల మతంగా ప్రాచుర్యం పొందింది. సంప్రదాయంలో ఉంటూనే సంప్రదాయంపై తిరుగుబాటు చేయడం వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యంలో కనిపించే ఒక వ్యూహం. సంప్రదాయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రత్యక్షంగా కనిపించకపోయినా, పరోక్షంగా ఆయన చేసింది అదే అని వ్యాసకర్త వీరబ్రహ్మేంద్ర స్వామి సాహిత్యమాధారంగా ఈ వ్యాసంలో నిరూపించారని నా భావన.

## అమెరికా ఆర్థిక నయనాలతో 'అనేక':

సరదాగానో, సీరియస్‌గానో పదేళ్ళ కవిత్వాన్ని గమనిస్తే ఎలా ఉంటుంది, లేదా పదేళ్ళ నుండి కవులు ఎలాంటి కవిత్వాన్ని రాస్తున్నారు, లేదా పదేళ్ళలో పత్రికలు, ఇంటర్నెట్ పత్రికలు, కవుల్లో స్వయంగా ప్రచురించుకున్న పుస్తకాల్లోనో, బ్లాగుల్లోనో ఎలాంటి కవిత్వాన్ని వెలువరించారనే ప్రశ్నలకు సంతృప్తి సమాధానం ఇవ్వలేకపోయినప్పటికీ, అలాంటి ప్రయత్నంతో వెలువడిన ఒక కవిత సంకలనాన్ని చూపించవచ్చు. దీని పేరు 'అనేక'. 2000 నుండి 2009 వరకూ తెలుగులో వచ్చిన వచన కవితల్లో 182 కవితల్ని అఫ్సర్, వంశీకృష్ణ సంపాదకత్వంలో 'అనేక' పేరుతో సారంగ పబ్లికేషన్స్ ప్రచురించింది. దీనిని పురస్కరించుకొని డా॥ దార్ల వెంకటేశ్వర రావు సూర్య దినపత్రిక 'అక్షరం'లో (*11/04/2011*) 'అమెరికా ఆర్థిక నయనాలతో 'అనేక' అనే శీర్షికతో ఈ పదేళ్ళ కవిత్వ పట్టుకున్నదేమిటి? అని విశ్లేషిస్తూ ఒక వ్యాసం ప్రచురించారు.

విలువైన విషయాల్ని ప్రస్తావిస్తూ సంపాదకీయం రాసినా, ఇందు కొన్ని అంశాల్ని స్పృశించలేకపోయారని, పైగా సేకరించిన కవితల్లోని అంశాల కంటె ఇతర అంశాల్ని ఎక్కువగా ప్రస్తావించినట్లుందని, దండోరా నుండి గ్లోబలైజేషన్ దాకా, ముస్లిం కవితల్ని తీసుకున్నా ఆయా కాలాల్లో వచ్చిన ఉద్యమాలకి ప్రాతినిథ్యం వహించ గలిగే కవితల్ని ఎంపిక చేయకపోవడం వల్ల ఈ పదేళ్ళ కాలంలో వచ్చిన ఉద్యమాలకి ఈ సంకలనం సరైన ప్రాతినిథ్యం ఇచ్చినట్లు అనిపించట్లేదని వ్యాసకర్త ఉదాహరణ పూరకంగా ఈ వ్యాసాన్ని ప్రచురించారు. ఫలితంగా ఆ కాలంలో ఆ ఉద్యమం పట్ల కవి ఆశించిన దానిని నీరు కార్చే ప్రయత్నం చేసినట్లయిందని విమర్శనాత్మకంగా తన అభిప్రాయాన్ని వెళ్ళగక్కారు.

కవితల్ని ఎంపిక చేసిన వారికి స్వేచ్ఛ ఎంత ఉన్నా, అన్నింటికీ ఆర్థిక కోణమే ప్రధానమనే రీతిలో సంపాదకీయం కొనసాగించినా, కవిత్వం పేరుతో సౌందర్యానుభూతికే అధిక ప్రాధాన్యాన్నిస్తూనే, ఆర్థిక సంఘర్షణలే నిర్దిష్ట వాదాలు బయలుదేరడానికీ, బలం పుంజుకోవడానికీ కారణభూతమైయ్యాయని, అందువల్ల ప్రపంచీకరణ నీడలోనే పదేళ్ళ కవిత్వం నడిచిందనే సూత్రీకరణ చేసే ప్రయత్నం చేశారు. నిజానికిది ప్రపంచాన్నీ, ఆంధ్ర ప్రదేశ్‌ని అమెరికా ఆర్థిక నయనాలతో చూడ్డమే తప్ప, అన్ని అస్తిత్వ ఉద్యమాలకీ ఆర్థికమే కారణమనడం సరికాదు. కమ్యూనిస్టులు ప్రతిదాన్నీ ప్రపంచీకరణతో ముడిపెట్టి, దాన్ని వ్యతిరేకించడం ఒక ఫ్యాషన్‌గా, దేశీయ వాస్తవికతను విస్మరించి కులాన్నీ ప్రాంతీయతనీ దానిలోనే ఇరికించాలనుకునే ప్రగతిశీల గతస్మృతుల్నీ, అనుబంధాల్నీ, వీడలేని సాహితీవేత్తలు కూడా ప్రయత్నిస్తున్నారని, దీనిలోని భాగంగానే దీన్ని భావించాలని 'అనేక' పై తనదైన అనేక భావాలను వ్యక్తీకరించారు వ్యాసకర్త.

పైకి ప్రపంచీకరణ ప్రభావమనేది వ్యవస్థీకృత చైతన్యంగా కనిపించినా, వాళ్ళ జీవిత లోతుల్ని తాకని కవిత్వాన్ని స్వీకరించి ఆ వ్యక్తుల్ని గుర్తించి, పరోక్షంగా వైయక్తికంగా పీట వేశారనిపిస్తుందని దార్లగారు అంటున్నారు.

సుమారు తొమ్మిది వందల సంవత్సరాలుగా అవిచ్ఛిన్న ప్రవాహమైన పద్య కవిత్వాన్ని బావ కవిత్వం బద్ధలుకొడితే, భావ కవిత్వంలోని స్వేచ్ఛా ప్రియత్వం పేరుతో సమాజాన్ని పట్టించుకోని కవుల్ని అభ్యుదయ కవిత్వం గాడిలో పెట్టింది. రాయడం వరకే పరిమితమైపోతే కుదరదని, దాన్ని ఆచరణలోనూ చూపాలని విప్లవ కవిత్వం కవుల్ని మరింత హెచ్చరిస్తే, ఆచరణలోని ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ, దళిత, బహుజన, ప్రాంతీయ,

ముస్లిం, క్రైస్తవ మైనారిటీ కవిత్వ ఉద్యమాలు ముందుకొచ్చిన తర్వాత చాలా మంది కలాలు మూతపడ్డాయి. దానితో అంతకు ముందు రాసిన వాటితోనే తమకి దక్కిన 'కవి' గౌరవ మర్యాదల్ని కొనసాగించుకుంటూపోతున్న వాళ్ళెంతోమంది ఉన్నారని, పదేళ్ళ కాలంలో జరిగిన సంఘటనల్ని సరైన రీతిలో గుర్తిస్తే మరింత బాగుండేదని వ్యాసకర్త సూటిగా విమర్శిస్తూ ఈ వ్యాసాన్ని రచించినట్లు పాఠకునిగా, పరిశోధనా విద్యార్థిగా నా భావన. తన విద్యుక్తదర్మ నిర్వహణలో దార్లగారు దారి తప్పడని మరోసారి నిరూపించింది ఈ వ్యాసం. **శ్రీశ్రీ పై వివాదాలు వ్యక్తిగతమా?:**

శ్రీశ్రీ అనే రెండు అక్షరాలు తెలుగు సాహిత్యంలో తెచ్చిన సంచలనం ఇంతా అంతా కాదు. ఒక సందర్భంలో తానే యుగకవినని ప్రకటించుకోవడం, దానితో అనేక వివాదాలకు కేంద్రం కావడం శ్రీశ్రీ వంతైంది. కేవలం 'యుగకవి' అని ప్రకటించుకోవడమే కాదు, ఆయన సాహిత్యంలో ఉన్న అనేక అంశాలు కూడా వివాదాస్పదమవ్వడానికి కారణాలైయ్యాయి. సాధారణంగా రచయితలు వివాదాస్పదులు కావడానికి రెండు కారణాలుంటాయి. అవి వ్యక్తి కేంద్రంగా గాని, ఆ రచనల సాహిత్య కేంద్రంగా గాని జరుగుతుంటాయి. ఇలా తెలుగులో వివాదాస్పదులైన రచయితలు చాలా మంది ఉన్నా, శ్రీశ్రీ, చలం తర్వాత విశ్వనాథ, దిగంబర, స్త్రీ దళిత ముస్లిం వాద కవుల్ని, ప్రాచీన సాహిత్యంలో శివకవుల్ని ప్రధానంగా పేర్కొనవచ్చు అంటూ శ్రీశ్రీ పై గల వాదాల గూర్చి డా॥ దార్ల వెంకటేశ్వరరావు సూర్య దినపత్రిక 'అక్షరం' (*13/06/2011*) లో 'శ్రీశ్రీ పై వివాదాలు వ్యక్తిగతమా?' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు.

విశ్వనాథ, చలం, శ్రీశ్రీలది పైకి భావజాలపరమైన వివాదంగా కనిపించినా, అది ప్రధానంగా వ్యక్తుల్ని ఆశ్రయించుకున్నదే అని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. శ్రీశ్రీ చిన్నప్పుడే కొన్ని భావగీతాల్ని రాసుకుని 'ప్రభవ'గా ప్రచురించినా, వాటికి ప్రాచుర్యం రాకపోవడానికి పేదరికమే ఒక ప్రధాన కారణం. ఆ పేదరికమే తెలిసో, తెలియకో ఆయన ఎలా రాసినా, ఆ రచనల్లో మార్క్సిస్టు భావాల్ని పలికించేలా చేసింది. అలాంటి భావాలే ఆ భావజాలాన్ని ప్రచారం చేసే సాహిత్య సంస్థల్లోకి ప్రవేశించడానికీ కారణాలయ్యాయి. ఆ సంస్థల్లో 'పని' చేయడం వల్లేనేనేమో ఆ భావజాలం ఉత్సాహంతో రాస్తున్న తొలిదశల్లో ఆ సిద్ధాంత చట్రంలో ఒదగని అంశాల్ని రాయలేకపోయాడు. దానిలో ఒకటి కులం వాసర రాకుండా శ్రామిక వర్గం చట్రంలోనే రచనలు చేయడం. రెండవది తెలంగాణకు బదులు సమైక్యాంధ్రనే సమర్థించడం జరిగింది. 1969లో వచ్చిన ప్రత్యేక తెలంగాణ

ఉద్యమాన్నీ, 1972లో వచ్చిన ప్రత్యేకాంధ్ర ఆందోళనను శ్రీశ్రీ వ్యతిరేకిస్తూ కవిత్వాన్ని రాశాడు.

అస్తిత్వ నేపథ్యంలో 'క్షమించండి' నాస్నేహితుల్లారా/వక్రీకరణకు వత్తాసుగా/ పద బంధాన్ని సృష్టించి/ నన్ను వెక్కిరించడానికి వెనుదీయని / మహాకవినీ నేను మన్నించలేనని 'కసాయిబు' వంటి పదాల్ని సృష్టించడాన్ని వ్యతిరేకించారు. అలాగే శ్రీశ్రీ పదజాలంలో బ్రహ్మణీయ పదజాలమే అత్యధికంగా కనిపిస్తుందనే విమర్శ కూడా ఉందని వ్యాసకర్త వివరించారు.

శ్రీశ్రీ సాహిత్యంలో కనిపించినంత కమ్యూనిస్టు భావజాలం, సామాన్యుణ్ణి సైతం ఉద్రూతలూగించగల శబ్ద విన్యాసం మరో కవిలో కనిపించకపోవడమే శ్రీశ్రీ సాహిత్యం నేటికీ ఒక వర్గం వారికి ఆదరణీయమవడానికి కారణం. ఈ పరిధుల్లోనే శ్రీశ్రీది వ్యక్తిగతమైన వివాదమైనా వ్యవస్థీకృతంగా కనిపిస్తోంది అని అలాగే శ్రీశ్రీ పై చేసే విమర్శలు కూడా వ్యక్తిగతంగా కనిపించినా, అవీ వ్యవస్థీకృతమే అవుతాయని గుర్తించాలని వ్యాసకర్త వ్యాసంలో ప్రతిపాదించారు.

## 'మహిళా చైతన్యమా, మార్మిక శిల్పమా?':

కొద్దికాలం క్రితం సంచలనం సృష్టించిన నవల డా॥ కేశవరెడ్డి రాసిన 'మునెమ్మ'. ఈ నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవల బహుమతి లభించింది. ఈ నవలికలో ఒక స్త్రీ పాత్రను కేంద్రంగా చేసి భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న మహిళల జీవితాల్ని చిత్రించాను. స్త్రీని అర్థం చేసుకోవడంలో వైఫల్యానికి గురవుతున్న పురుషుల అంతరంగాల్ని ఆవిష్కరించారు. మాతృస్వామ్యంపై పెత్తనం చెలాయించే పితృస్వామిక వికృత స్వరూపాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు. నిజానిజాల్ని పసిగట్టడం అంత సులువైన పని కాదన్నట్లు, దానికి సరిగ్గా సరిపోయే మ్యాజిక్ రియలిజమ్ టెక్నిక్‌ని ఎన్నుకున్నారని, నోరుండీ తమకిష్టమొచ్చినట్లు మాట్లాడే మనుషులకంటే, నోరున్నా మాట్లాడలేని పశువుల్లో ఉండే ఉదాత్తతని కళ్ళముందు నిలిపారు. బొల్లిగిత్తను ఒక పాత్రగా తీసుకుని నిష్కల్మషమైన వాత్సల్యం, విశ్వాసం, కృతజ్ఞతలను వర్ణించి వాటితో పోల్చుకున్నప్పుడు మానవుడు ఎంత వరకూ ఎదిగాడో పరీక్షించుకొమ్మనట్లుగా ఈ నవలికను మలిచారంటూ దార్ల వెంకటేశ్వర రావు సూర్య దినపత్రిక 'అక్షరం' (*16/05/2011*) లో 'మహిళా చైతన్యమా, మార్మిక శిల్పమా?' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు.

ఈ రచనను మూడు కోణాల్లో అర్థం చేసుకోవాలి. మొదటిది మునెమ్మలో ఉన్న మహిళా చైతన్యం. రెండవది వాస్తవమనిపించేలా

చారిత్రకాంశాల్ని గుదిగుచ్చుతూ, కథని ముందుకీ వెనక్కీ నడిపిస్తూ, కథనంలో ప్రవేశించే అవాస్తవిక విషయాల్ని అద్భుతంగా చిత్రిస్తూ వాస్తవాలుగా చెప్పే మ్యాజిక్ రియలిజమ్ శిల్పంలో రచన కొనసాగించడం. మూడవది రచనను సాధ్యమైనంత ఎక్కువ మంది చదివించగలిగేందుకు తోడ్పడే విషయ ప్రకటనల్లో కావాలనే వివాదాస్పదంగా మార్చగలగడం. మొదటిది రచన ద్వారా రచయిత చెప్పాలనుకున్న సందేశం. రెండవది రచన ద్వారా రచయి నిరూపించుకోవాలనుకున్న రచనా నైపుణ్యం. మూడవది రచనను మార్కెట్ అని పూర్తిగా అనలేంగానీ, సమకాలీన టీవీ, సినిమా, ఇంటర్నెట్ వంటి వాటి ప్రభావం నుండి పుస్తక పఠనాన్ని సీరియస్‌గా మార్చగలిగే ఆలోచనలు వ్యక్తమవుతున్నాయని వ్యాసకర్త వివరిస్తున్నారు.

మునెమ్మ ఒక అద్భుతమైన పాత్ర. సమయస్ఫూర్తి నిశిత పరిశీలన, బాధాసహిష్ణుత, పరేంగితావగాహన, సున్నితత్వము, కాఠిన్యం కలగలిపిన పాత్రగా తీర్చి దిద్దబడి తెలుగు నవలికా సాహిత్యంలో ఇదొక సంకలనం అని, మహిళా చైతన్య పరిమాణంలో మునెమ్మ ఒక ధీర వనిత అని వ్యాసకర్త అభిప్రాయపడుతున్నారు. మునెమ్మ పితృస్వామ్యంతో మాతృస్వామ్యం చేస్తున్న సంఘర్షణకి ప్రతిరూపమని వ్యాఖ్యానించారు దార్లగారు. అందుకే దీన్ని ఎవరెన్ని రకాలుగా వ్యాఖ్యానించినా 'మునెమ్మ' లో మహిళా చైతన్యం ఉందనే నా ప్రతిపాదన అంటూ పాఠకుల అనుమానాల్ని నివృత్తి చేస్తూ దార్లగారు ఈ వ్యాసాన్ని ముగించారు.

## సంకెళ్ళు కాకూడని సాహిత్య నియమాలు:

'లోపల ఒకటి/ బయట ఒకటి/ మేడిపండు గురించి/ ఎవరికి తెలియదు' ఇది ఒక ఆధునిక కవి (మసన చెన్నప్ప) రాసిన నానీ. దీన్ని చదివిన వెంటనే పాఠకులకు వేమన చెప్పిన "మేడిపండు చూడ మేలిమైయుండును...." అనే పద్యమే గుర్తుకొస్తుంది. వేమన ఆశువుగా చెప్పినా ఆ పద్యాల్లో ఛందో నియమాల్ని పాటించారు. అయినా ప్రజల నోళ్ళలో నేటికీ ఆ పద్యాలు నాట్యం చేస్తూనే ఉన్నాయి. వేమన పద్యాల్లో ప్రజలు లక్షణాల్ని పట్టించుకున్నారా, పద్యంలోని భావాలే ముఖ్యమనుకున్నారా? అనుకుంటే రెండవదానికే ఓటేశారని చెప్పొచ్చు. ఇదంతా ఎందుకంటే సంకెళ్ళలో కవిత్వాన్ని బంధించే ప్రయత్నం మొదలవుతుందేమోననే అనుమానం కలుగుతోంది. దీన్ని తెలిసి చేస్తున్నారా, తెలియక చేస్తున్నారా? అనే దానికంటే, ప్రయోగాలు చేయాలనే కుతూహలమే ఈ పని చేయిస్తుందేమో అనీ అనిపిస్తుందంటూ సాహిత్యం నియమాల మధ్య బందీ అయి సామాన్యులకు దూరం

కాకూడదనే ఉద్దేశంతో సూర్య దినపత్రిక 'అక్షరం' (*12/09/2011*) కు రాసిన 'సంకెళ్ళు కాకూడని సాహిత్య నియమాలు' అనే వ్యాసంలో పాఠకులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

ఒకప్పుడు మినీ కవిత్వాన్ని ఎక్కువగా రాశారు. 'మినీ కవిత ఆయుష్షు మెరుపంత/ కానీ అది ప్రసరిస్తుంది కాలమంత' అని సి.నా.రె. వంటి కవి ప్రశంసను మినీ కవిత పొందింది. 'ఎన్ని గజాలు/ రాశాడన్నది కాదు/ ఎన్ని నిజాలు/ చెప్పాడన్నది ముఖ్యం' (ఆరుద్ర) అనే పద్ధతిలో చాలా మందిని ఆకర్షించింది. కొంత మంది ఇప్పటికీ ఛందో బద్ధంగానే కవిత్వం ఉండాలనే పండిత కవులు వివిధ సన్మానాలకు పంచరత్నాల్ని రాస్తూనే ఉన్నారు. అందుకనే అటువంటి లఘు కవితా ప్రక్రియల్లో సామాజికత ఉన్నా సామాజిక స్పృహ కనిపించదు అంటున్నారు వ్యాసకర్త.

కవిత్వాన్ని నిత్య నూతనం చేయడంలో కొత్త కొత్త కవిత రూపాలు అవసరమే. అలాగని ఆ రూపాలు కవిత్వాన్ని ఎక్కువ మందికి అందించకుండా పోకూడదు. కవిత్వం రాయడం కొందరికి మాత్రమే సాధ్యమనే భ్రమను పెంచకూడదు. సాహిత్య విలువల్ని కాపాడుకుంటూనే, పరభాషా సాహిత్యాల్లో నుండి వచ్చే ప్రక్రియల్ని మనం సొంత చేసుకున్నప్పుడు కొన్ని నియమాల్ని సరళీకరించుకోవాల్సిన అవసరం ఏర్పడవచ్చు. అదే పరిస్థితి మన తెలుగులోకి వచ్చిన గజల్, రుబాయత్, హైకూ మొదలైన ప్రక్రియలలో కనిపిస్తున్నదని వ్యాసకర్త అభిప్రాయపడుతున్నారు.

జపాన్ కవిత్వ ప్రభావంతో తెలుగులోకి వచ్చిన హైకూలకు కూడా లక్షణాలను అంటగట్టారు. నిజానికి జపాన్ భాషకి తగినట్లు అక్షర నియమాన్ని ఏర్పర్చినా అవే లక్షణాలని తెలుగులో పాటించడం కుదరలేదు. అలాగే గజల్స్, రుబాయత్ వంటి ప్రక్రియలు కూడా అలాగే పాఠకుల్ని/ప్రేక్షకుల్ని అలరించినా లక్షణాలకంటే కవితల్లోని మానవీయ స్పందనలకే ప్రాముఖ్యం లభించిందని దార్లగారు అభిప్రాయపడ్డారు.

ఆధునికతకు అత్యంత ప్రాణపదమైంది 'శాస్త్రీయమైన మానవీయ కోణం. మానవుణ్ణి కేంద్రంగా చేసుకోవడంతో పాటు హేతు పూర్వకమైన రసస్పందనతో కవిత్వం వెలువడాలి. స్వేచ్ఛకీ, సహజ స్పందనకీ ప్రాధాన్యానిస్తూనే, సాహిత్యంలో ప్రయోగాల్నీ చేయాలి. వస్తువుని స్వీకరించడం మంచిదే. అలాగే ఒక క్రమాన్ని పాటిస్తూ తర్వాత తరాలు కూడా అందుకునేలా కొన్ని నియమాల్ని పాటించినా అవి మళ్ళీ సంకెళ్ళుగా మారకూడదని వ్యాసకర్త తన వ్యాసంలో పరిశోధనాత్మకంగా వివరించారు.

## సాహిత్య పరిశోధనలు – కుల, రాజకీయ, ఆర్థిక అంశాలు:

తెలుగులో ఏదైనా ఒక కొత్త పుస్తకం వచ్చిందంటే దానిపై ఏడాది తిరక్కముందే ఏదో ఒక విశ్వవిద్యాలయంలో పరిశోధన జరిగిపోతోందనే మాట వింటున్నాం. అంతే కాదు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు గాని, లేదా పర్యవేక్షణార్హతగల డిగ్రీ అధ్యాపకుల్ని గాని ఆ గ్రంథావిష్కరణకు పిలిస్తే, ఆ సభలోనే హామీ దొరకవచ్చనే వ్యంగ్య బాణాలూ ఈ మధ్యనే కాదు, అంతకు ముందునుండే వినబడుతున్నవే. నిజానికి చాలా సందర్భాల్లో అలా జరగడం చూస్తూనే ఉన్నామంటూ డా॥ దార్ల వెంకటేశ్వర రావు 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 18/07/2011*) లో 'సాహిత్య పరిశోధనలు – కుల, రాజకీయ, ఆర్థిక అంశాలు' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురించారు.

కొన్ని పుస్తకాల విషయంలో పరిశోధన జరగాల్సిన అవసరం ఉన్నా, కనీసం ఆ కవితా/ కథ–సంకలనం/ నవలపై ఏ పత్రికలోనైనా సమీక్షలు గాని, వ్యాసాలు గాని వచ్చాయో లేదో పరిశోధకులు/పర్యవేక్షకులు గమనిస్తున్నారో లేదో ఆధార గ్రంథాలే చెప్తున్నాయి. చాలామంది వాటిని చూడడంలేదు. అలాంటప్పుడు, అసలు ఆ పరిశోధనాంశంపై పరిశోధకుడికి ఆసక్తి ఉందా? లేదా పర్యవేక్షకుని సూచన మేరకు చేస్తున్నాడా అనే అనుమానాలు కలగక మానదు. అయితే ఆ అనుమానాలు, అనుమానాలు మాత్రమే కాదు వాస్తవ రూపాలుగా రూపాంతరం చెందడం శోచనీయం అని వ్యాసకర్త చింతిస్తున్నారు.

సృజనాత్మక రచయితల్లో లాగే విమర్శకుల్లో కూడా చాలామందికి ఒక ప్రాపంచిక దృక్పథం ఉంటుంది. చాలా మంది ప్రాచీనమో, ఆధునిక సాహిత్యమో – ఇలా రకరకాల ప్రత్యేకాంశాల్లో మాత్రమే పరిశోధనలు చేయించేవారు, చేసేవాళ్ళూ ఉన్నారు. దీనికి ప్రధాన కారణం ఆ విభాగంలో మాత్రమే వారికి అవగాహన ఉండడం. ఒకవేళ ఆ విభాగంలో అవగాహన ఉన్నవారికి గల అయిష్టత వల్ల చేయించరు. కేవలం ఇవే కాదు వేరే కారణాలు కూడా ఉన్నాయి. భావజాలం నచ్చినా పర్యవేక్షకుడు/ పరిశోధకుడు మధ్య భిన్నాభిప్రాయం కూడా ఒక కారణం. తన కులస్థుడైతేనో, తన ప్రాంతానికి చెందిన వాళ్ళైతేనో కూడా పరిశోధనలు చేయించడమో, చేయడమో జరుగుతుంది. ఇప్పటివరకూ జరిగిన పరిశోధకుల్ని, పర్యవేక్షకుల్ని వారి వారి కులాల్ని గమనిస్తే, వారిరువురిలో అత్యధికులు ఒక కులానికి చెందిన వాళ్ళై ఉంటారు. విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల్ని ఈ దృష్టితో పరిశీలిస్తే, ఈ విషయం స్పష్టమౌతుంది.

ఒక విద్యార్థి వామపక్ష భావజాలంతో వస్తే, ఆర్.ఎస్.ఎస్ భావజాలం గల రచనలపై పరిశోధన చేయించిన సందర్భం ఉంది. అతని డిగ్రీ కావాలి.

ఇతనికి పదోన్నతికి ఎన్ని పరిశోధనలు పూర్తయ్యాయో సంఖ్య కావాలి. పరిశోధన చూస్తే పర్యవేక్షకుడి దృక్పథం, భావజాలం కనిపిస్తుంటాయి అంటూ వ్యాసకర్త అభిప్రాయపడుతున్నారు. అలాగని అన్ని పరిశోధనలూ అలాగే జరుగుతున్నాయనీ చెప్పలేం! అని వివరణ ఇస్తున్నారు.

ఏది ఏమైనా చాలా వరకు సాహిత్య పరిశోధనలపై కుల, రాజకీయ, ఆర్థికాంశాల ప్రభావం కనిపిస్తున్నదని చెప్పకుండా ఉండలేమని వ్యాసకర్త అభిప్రాయపడుతున్నారు. దాని పూర్తి బాధ్యత పర్యవేక్షకునిదే అనే విషయం మరవరాదని సున్నితంగా హెచ్చరించినట్లు కనిపిస్తుంది ఈ వ్యాసం.

## సాహిత్యం – అభిరుచి – వ్యాపారం:

తెలుగులో మూడు భావజాలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లనిపించే ప్రచురణ సంస్థలు కనిపిస్తున్నాయి. ఒకటి మార్క్సిస్టు భావజాలం రెండు సంప్రదాయ సాహిత్యాన్ని ప్రచురించడానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రచురిస్తున్నవి, మూడు కులనిర్మూలన లక్ష్యంగా, ప్రాంతీయ వివక్షల్ని వివరించే సాహిత్యాన్ని ప్రచురిస్తున్న సంస్థలు. ఇలాంటి విభజనకు ప్రమాణాలేమిటని ఎవరైనా ప్రశ్నించవచ్చు. మార్కెట్లోను, గ్రంథాలయాల్లోను లభిస్తున్న పుస్తకాలే వీటికి ఆధారం అంటూ డా॥ దార్ల వెంకటేశ్వర రావు 'అక్షరం' లో (*08/08/2011*) 'సాహిత్యం – అభిరుచి – వ్యాపారం!' అనే ఒక వ్యాసం ప్రచురించారు.

ధార్మిక సంస్థల వారు అమ్మే పుస్తక విక్రయశాలల్లో ఎక్కడా మార్క్సిజం వాసన కూడా రానివ్వకుండా జాగ్రత్తపడతారు. మార్క్సిస్టు ప్రచురణ సంస్థలు ఇంతగా కాకపోయినా కుల నిర్మూలనను, కుల చైతన్యంతో రాసే సాహిత్యం మాత్రం ప్రచురించకుండా జాగ్రత్త పడుతున్నారు. తెలుగులో కుల నిర్మూలన చైతన్యంతో రాసే రచనల్ని ప్రచురించే సంస్థల్ని గాలించాల్సి పరిస్థితే కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితే వార్తాపత్రికల్లోనూ కనిపిస్తోంది. అటువంటప్పుడు సృజనకారునికి ఉన్న స్వేచ్ఛ కొంత హరించక తప్పదు. అయితే అదే క్రమంలో 'స్వేచ్ఛ'తో కూడి విశృంఖలత్వానికి దారితీయకుండా ఉండేందుకు ఆ మార్గం ఉపయోగపడుతుంది. బ్లాగుల్లో రాసిన రచనల్లో సమగ్రత లోపించిందనిపించినప్పుడు దాన్ని సరిదిద్దుకొనే అవకాశం ఉండడంవల్ల రచయితకు మరో అవకాశం దొరుకుతుంది. అలాగే క్లిష్టమైన అంశాల్ని విశ్లేషించుకోవచ్చు. ఇంటర్నెట్‌లో అయితే, తనకు నచ్చిన భాషలో కావలసినంతగా రాసుకోడానికి బ్లాగులు పరిజ్ఞానం వల్ల తాను ఇంతకు ముందు రాసిన దాన్ని మళ్లీ గురిచేసుకొనే వీలుంది. కానీ వెంట వెంటనే

మార్చేసుకొనే వీలుండడం వల్ల బ్లాగుల్లో వచ్చే రచనల విశ్వసనీయత అనుమానాస్పదమే అవుతుంది. వాటిని మార్చకుండా వాద ప్రతివాదనలు చేసేవాళ్ళు ఉన్నారు.

ఇవన్నీ ఇలా ఉండగా, ఇటీవల కాలంలో UGC, న్యూఢిల్లీవారు వివిధ పదోన్నతులకు ఖచ్చితంగా (ISBN – International Standard Book Number), (ISSN – International Standard Serial Number) గల పత్రికలు, పుస్తకాలనే పరిగణలోకి తీసుకోవాలనే నిబంధన ఒకదాన్ని పెట్టింది. ఆంగ్ల పుస్తకాలకి ఈ నిబంధన సులువుగా అనువర్తించుకునే అవకాశం ఉంది. తెలుగులో పుస్తకాలు ప్రచురించేవారు వీటిని అంతగా పట్టించుకోవడం లేదు. ఈ నెంబర్లు ఉంటే సర్క్యులేషన్‌కు ప్రాధాన్యతనిచ్చే సంస్థలు ఉన్నాయి. కొన్ని దేశాల్లో ఈ నెంబర్లు లేని పుస్తకాలను గ్రంథాలయాల్లో ఉండడానికి ఇష్టపడరు.

సాహిత్యం రాజాస్థానాలను ఆక్రమించి. వారి చెప్పు చేతుల్లో, వారి అభిరుచికి తగ్గట్టుగా నడవడం మొన్నటి వరకూ చూశాం. నిన్న స్వేచ్ఛా విహంగాలలో విహరిస్తుందని సంతోషించే సమయాన నేడు మళ్ళీ అభిరుచులు మారి, అది వ్యాపార సరుకై ఏదో ఒక నిర్దిష్ట రుచినే అందించేదిగా మారిపోతున్న వైనాన్ని వ్యాసకర్త ఇందు వివరించారు.

## అస్థిత్వ ఉద్యమాల్లో కుల సాహిత్యం:

తెలుగు సాహిత్యంలో స్త్రీ, దళిత, మైనారిటీ, ప్రాంతీయ, బహుజన ఉద్యమాలు తారాస్థాయికి చేరుకున్న తర్వాత సాహిత్యానికి ఉన్న బాధ్యత పెరిగింది. అంతకుముందున్న సాహిత్యంలోను అది కనిపిస్తున్నా శిష్ట వర్గాలమని చెప్పుకుంటున్నవారి దృష్టి నుండే అది లక్షణీకరణ పొందింది. దానిలో సమాజ శ్రేయస్సు అంటూనే కొన్ని వర్గాల వారి శ్రేయస్సుకే ఒక సాధనంగా సాహిత్యాన్ని మలుచుకునే ప్రయత్నం అవిశ్రాంతంగా, కొనసాగిందంటూ దార్ల వెంకటేశ్వరరావు 'అస్థిత్వ ఉద్యమాల్లో కుల సాహిత్యం' అనే శీర్షికతో 'అక్షరం' (*సూర్య దినపత్రిక, 28/03/2011*) లో ఒక వ్యాసం ప్రచురించారు.

తెలుగు సాహిత్యంలో తొలిసారి అనేక కులాల వారిని ప్రధాన జీవన స్రవంతిలోకి రమ్మని పిలుపునిచ్చిన వాళ్ళు శివకవులే చెప్పుకోవచ్చు. కానీ, సామాజికంగా తక్కువగా చూస్తున్న కులాల వాళ్ళ త్యాగాల్ని శైవమత వ్యాప్తికి ఉపయోగించుకుని పరోక్షంగా కులంపై మతం ఆధిపత్యాన్ని ప్రదర్శించుకుందని వ్యాసకర్త ఈ వ్యాసం ద్వారా వినిపించారు.

మతం మత్తు మందు అని చెప్పి, కులాన్ని కూడా మతంలో అంతర్భాగంగా పరిగణించి, ప్రత్యేక కుల అస్థిత్వాన్ని గుర్తించవలసిన అవసరం లేదని చాలామంది వాదించడానికి కుల పుట్టుక ఒక బలమైన కారణమే. కులం అనేది ప్రధానంగా హిందూ మత భావన నుండే పుట్టినా గుణ, కర్మ విభాగాలు ఆచరణలో చెప్పిందానికి విరుద్ధంగా మానవత్వాన్ని విధ్వంసం చేసి, మరిన్ని కులాల ఆవిర్భావానికి కారణమైంది. హిందూమతం ప్రపంచ వ్యాప్తంగా కుల భావన లేని మతాల్లోనూ కుల విభజనకు మార్గం వేసింది. ఫలితంగా తెలుగులో అస్థిత్వ ఉద్యమ శాఖల్లో ఒకటైన మైనారిటీ ముఖ్యంగా ముస్లిం అస్థిత్వ ఉద్యమంలో కుల సాహిత్యం తిష్ట వేసుకొని కూర్చొంది. అలాగే స్త్రీవాద ఉద్యమంలో కూడా దళిత స్త్రీ వాదం ఒక ప్రత్యేక ఉప శాఖ ఆవిర్భవించక తప్పింది కాదు. తెలుగులో విప్లవోద్యమ సాహిత్యం – తొలిసారిగా దాన్ని ప్రశ్నించినా, కులాన్ని పునాదిగా కాకుండా, ఉపరితలాంశంగానే నిరూపించే ప్రయత్నం చేసింది. కుల, లింగ, ప్రాంతీయ వివక్షలకు గురవుతున్న వాళ్ళను కూడా శ్రామికులు, పీడితులుగానే పరిగణించడం వల్ల వీళ్ళ అస్థిత్వాన్ని గుర్తించడంలో దేశీయ వాస్తవికతలను వర్గవాదులు విస్మరించినట్లయింది అని వ్యాసకర్త ఈ వ్యాసంలో అస్థిత్వ ఉద్యమాల్లో కూడా కుల సాహిత్యం పాత్రను విస్మరించలేమంటూ, దాని ఆవశ్యకతను సవివరంగా వివరించారు.

***

# అధ్యాయం – 4
# సూర్య దినపత్రిక సాహిత్య, సామాజిక సేవ – సమీక్ష
## 4.1. సూర్య దినపత్రిక సాహిత్య సేవ:

సూర్య దినపత్రికలో ప్రతి సోమవారం 'అక్షరం' శీర్షికన సాహిత్య పేజీ వస్తుంది. దీని ద్వారా సాహిత్యం సామాన్య ప్రజలకు చేరువవ్వడానికి అవకాశం వుంది. ఇంకొక ముఖ్య విషయం ఏమిటి అంటే ఉదాహరణకు ఏదేనా ఒక సంఘటన జరిగిందనుకొండి. ఆ సంఘటన మీద పుస్తకం రావడానికి కొంత సమయం అవసరం. కాని పత్రికలో సాహిత్య పేజీ వుండడంవల్ల ఆ విషయాన్ని ప్రజల వద్దకు తీసుకునిపోవడం చాలా సులువు. గ్రామాలలో వుండే ప్రజలకి సాహిత్య పుస్తకాలు కొని చదివే అంత సమయమూ లేదు, అంత తీరికా లేదు. అదే సాహిత్య పేజీ వుండడంవల్ల ఎంతో కొంత సాహిత్య విషయాలను పాఠకలోకం తెలుసుకుంటారు. ఎన్నో చారిత్రక విషయాలమీద సాహిత్య పేజీల్లో చర్చలు జరుగుతుంటాయి. వాటివలన సాహిత్యంలో తప్పొప్పులు తెలుస్తుంటాయి. అనుభవం వున్న ఆచార్య పులికొండ సుబ్బాచారిగారు "అక్షరం"లో జాషువా దళిత కవా? అనే శీర్షికన ఒక దీర్ఘ వ్యాసం రాయడం జరిగింది. ఈ పూర్తి వ్యాసంలో ఆచార్య పులికొండ సుబ్బాచారి గారు జాషువా దళిత కవా అన్న చర్చ చేశారు. కాని పాఠకుడికి జాషువా దళిత కవా అన్న విషయాన్ని తెలుసుకోవాలి అంటే కనీసం జాషువాగారి పుస్తకాలతో పరిచయం వుండాలి కాని అందరికి సాహిత్యంతో పరిచయం వుండదు. అలాంటి పరిచయం లేనివారికి కూడా ఈ వ్యాసం చదివితే జాషువాగారిపై ఒక అభిప్రాయం రావడం మాత్రం కచ్చితం.

ఇలాంటి వ్యాసాలు దినపత్రికలలో అవీ కూడా ప్రత్యేక అనుబంధాలలో రావటం అన్నది హర్షించదగ్గ విషయం. సాహిత్యం అన్నది ప్రజలలోకి వెళ్లటానికి ఇదే సులభమైన మార్గం. ఎక్కడో మారుమూల వున్న గ్రామంలోకి దినపత్రికలు ఈ కాలంలో సకాలంలో చేరుతున్నాయి కనుక అక్కడ ప్రజలు ఒక సాహిత్యవేత్త పుస్తకం ఖరీదు చేసి చదవటం అన్నది జరగని పని ఈ విధంగా వ్యాసాలు దినపత్రికలలో వస్తుంటే ప్రజలలోకి సాహిత్యం వెలుతుంది. ఇలా ఎప్పుడయితే సాహిత్యం ప్రజలలోకి వెలుతుందో సమాజంలో నివసించే ప్రజలు చింతనాపరులు

అవుతారు. అలాగనే ఆచార్య పులికొండ సుబ్బాచారిగారు వ్రాసిన 'దళిత కులీన దృక్పథాలు పైట ఒక్కటే' అన్న వ్యాసంలో జయప్రభగారు రాసిన కవిత మీద జూపాక సుభద్రగారు రాసిన కవిత రెండు కవితలను సుబ్బాచారిగారు పరిశీలించి విమర్శనాత్మకంగా రాయడం జరిగింది. ఈ రెండు కవితలను క్షుణ్ణంగా పరిశీలిస్తే కవయిత్రుల సామాజిక నేపథ్యాలలో ఉన్న భిన్నత్వం వారి కవితలలో ఎలా ప్రతిబింబిస్తుందో బాగా అవగతమవుతుంది. ఒకరు జయప్రభ. ఈమె రాసిన కవిత పైటని తగలెయ్యాలి మరొక కవయిత్రి – జూపాక సుభద్ర ఈమె రాసిన కవిత కొంగునాబొచ్చ మీద బొంత పేగ్గాదు ఈ రెండు కవితలు పైట చెంగులు ఆధారంగా చేసుకొని రాసినవే. అయితే ఈ కవితలు – ఈ కవయిత్రులు ఇద్దరు యాదృచ్చికంగా ఒకరికొకరు అనుకోకుండా రాసిన కవితలు కావు. జయప్రభ కవిత 1988 మే 3న ప్రచురితమైనది. ఆ తర్వాత ఈ కవిత వలే కవిత సంకలనాలు కూడా అచ్చు అయ్యాయి. ఈ కవిత రాస్తున్న ఆమెకు 1984 నుండి మంచి పేరు వచ్చింది. స్త్రీవాద రచయిత్రిగా ఒక ముద్రను వేసుకుంటున్న స్థితిలో పైట తగలెయ్యాలి అనే కవిత ఆమెకు స్త్రీవాద కవయిత్రి అనే ముద్రను సుస్థాపితం చేసింది. ఈ కవితపై ఆ రోజుల్లో మంచి వాడి వేడి చర్చలు జరిగాయి. చాలా మందిని బాగా ఆలోచింపజేసిన ఆనాటి కవితల్లో ఒకటిగా నిలిచింది.

ఇక జూపాక సుభద్ర తన కవిత కొంగు నాబొచ్చ మీద కావలుండే బొంత పేగ్గాదు 7 మే 2007న ప్రచురితమైంది. ఆ తరువాత ఈ రెండు కవితలు వారి వేర్వేరు సంకలనాలలో కూడ అచ్చయినాయి. సుభద్ర స్త్రీవాద కవయిత్రి అయినా ఈ ముద్రకంటే దళితవాద కవయిత్రి అన్న ముద్రనే గాఢంగా వుంది. స్త్రీవాద కవిత్వంలో కులీన స్త్రీవాదులు కన్న దళిత స్త్రీవాదం బహుజన స్త్రీవాదం చాలా భిన్నమైనవి సుభద్ర చాలా గట్టిగా వాదిస్తారు. ఒక బలమైన వాదాన్ని ముందుకు తెస్తూ తనకంటూ స్త్రీవాద కవయిత్రులలో, దళిత కవయిత్రులలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందారు. స్త్రీవాద కవయిత్రులనందరినీ ఒక గాటకట్టి చూడడం సరైన దృక్పథం కాదన్న వాదన చాలామందిలో ఉన్న సుభద్ర తన కవితల ద్వారా ఈ వాదాన్ని సరైన వాదంగా రుజువు చేశారు. ఇలా రుజువు చేశారు అనటానికి 'పైట' పైన ఇద్దరు కవయిత్రులు రాసిన కవితలే ఇందుకు

నిదర్శనం. రెండు సామాజిక సిద్ధాంతాల భూమికనుండి ఈ కవితలు వస్తున్నాయని అర్థం చేసుకోవచ్చు. యాదృచ్ఛికంగా కాక సుభద్ర తన కవితను జయప్రభ 'పైటని తగలెయ్యాలి' అనే కవితను కావాలని ప్రతిముఖంగా రాసినట్లు స్పష్టంగా తెలుసుకోవచ్చు అందుకే ఈ రెంటిని ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరం వుంది ఈ సిద్ధాంత విషయాల్ని సామాజిక నేపథ్యాలన్నీ పరిశీలించడానికి ఈ రెండు కవితల్ని విపులంగా, స్పష్టంగా పరిశీలించి పులికొండ సుబ్బాచారిగారు వ్యాసం రాయడం జరిగింది.

**పైట కొంగును చూస్తే**
**నాకెందుకో పాతివ్రత్యం గుర్తుస్తొంది**
**భుజాల నుంచి కిందికి వేలాడే గుదిబండలా**
**అది ఎప్పుడు నా స్వేచ్ఛను హరిస్తుంటుంది**
**పైట చెంగును పాతివ్రత్యానికి గుర్తుగా**
**ఒక సామాజిక భావానికి చిహ్నంగా**
**లేని సిగ్గును ముప్పుతుంది**

తన చుట్టూ ఏదో కంగారుని పిట్టలా తిప్పుతుంది అని రాశారు. తనను మనిషిని అనే భావాన్ని మురిపింపచేసి తను ఆడదాన్ని అంటూ హిప్నటైజ్ చేస్తుంది అని అంటారు. దాని ముందు తాను ముందు తాను ఎప్పుడూ ఒడి పోతూనే ఉన్నట్లు ఉంటుందని పైట ఊబిలా గురిజేస్తుంటుందని చెబుతారు జయప్రభ. దోపిడి సంస్కృతి నా వ్యక్తిత్వాన్ని శవంగా చేసి దానిపైన కప్పిన తెల్ల దుప్పటి పైట అనే నేను నడిచే శవంగా కాకుండా ఉండాలంటే ముందుగా పైటని తగలెయ్యాలి అని చాలా విస్పష్టంగా చెబుతారు జయప్రభ.

అలాగే జూపాక సుభద్ర పైటను మరొక దృక్కోణంలో చూడడం జరిగింది. పల్లే జీవితంలో ముఖ్యంగా ఆరుగాలం, కాయకష్టం చేసుకునే స్త్రీ జీవితంలో దైనందన కార్యక్రమాలలో పైట ఎన్ని రకాలుగా స్త్రీకి ఉపయోగపడుతుందో చాలా వివరణాత్మక జీవన చిత్రాన్ని చూపారు. అసలు కవిత పేరునే జయప్రభ కవితకు ప్రతిముఖంగా పెట్టారు. జయప్రభ పైట నీకు కావాలి కాస్తూ నా పాతివ్రత్యాన్ని కాపాడే కంచెలా కావలుంటే పితృస్వామ్య వ్యవస్థని కాపాడుతూ వుంది అని అంటే సుభద్ర కొంగు నా బొచ్చుమీద కావలుండే బొంత పేగ్గాదు అని మొదలుపెడతారు. వక్ష స్థలాన్ని

లేదా భీతిని తెలంగాణలో పల్లె భాషలో బొచ్చ అని ఎదురు బొచ్చ అని ఎదురు రొమ్ము అని అంటారు. పేగు అనే మాటను గుడ్డకు సమానార్థకంగా వాడతారు. గుడ్డ పేగు, బొంత పేగు వ్యవహారాలున్నాయి. తెలంగాణ పల్లె జీవితం గాఢంగా పరిచయం వున్న వారికి ఇవి బాగా తెలిసిన పదాలే. ఈ పదాలు వాడి కావలుండే బొంత పేగ్గాదు అని అంటారు జయప్రభ ఇవి నాకు కాపలా కాస్తుంది అని అంటే సుభద్ర ఇది కాపలా కాదు దానికి భిన్నమైన జీవన సాధనం అని వివరంగా వర్ణిస్తారు.

**కొంగు నీ ఆకలిని ముడి వేసుకొని**
**నా కడపు కర్సుకొని కట్టమీని మైసయ్యాలే కావలి బంటది**
**కూలినాలకి నేను సెమట కాల్వనైతే**
**పిల్లగాలై అద్దుకుంటుంది**
**కాయగడ్డలకి గాసం గింజలకి**
**కొమటి దినుసులకి**
**సక్కల్ని ప్రామవుకున్న సందమామాలె**
**సెండ్ల సెల్కల్ల అల్సివుల్లసిలితె పక్కబట్టై వురసతిస్తవి**

ఇక్కడ సుభద్ర పల్లీయ జీవితంలో కష్టం చేసే స్త్రీ కొంగులెన్ని రకాలుగా ఉపయోగిస్తుందో చెబుతూ మైసయ్యలాగా ఆకలి కడుపుకు కావలి పండటం కష్టం చిందే చెమటను తుడవడానికి పిల్లగాలి కావడం ఇలాంటి ఎన్నో సంఘటనలను చాలా చక్కగా జూపాక సుభద్ర చక్కగా పల్లె జీవితాన్ని కవితలో సాక్షాత్కారింపజేశారు అని చెప్పవచ్చు.

మొత్తంగా చూస్తే పై ఇద్దరి కవయిత్రులు చెప్పిన విషయాలు ఒక్కటే వారి దృక్పథాలు వేరు. ఈ కవితలను వేర్వేరుగా చదివితే ఎవ్వరికీ ఇంత ఆలోచన కలుగకపోవచ్చు. కాని దినపత్రికలలో ఇలాంటి సాహిత్య పేజీలు రావడం వలన సుబ్బాచారిగారి లాంటివారు వారి కలాలకు పదునుపెట్టి ఇలాంటి వ్యాసాలు రాయడం వలన కొత్తగా వస్తున్న యువ సాహితీ విద్యార్థులకు, ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ఇలాంటి వ్యాసాలు రావడం వలన విద్యార్థులలో ఆలోచన ధోరణి మారుతుంది. వారికి కూడా భవిష్యత్తులో ఇలాంటి వ్యాసాలు రాయడానికి దోహదపడతాయి. సాహిత్యం అంటేనే భిన్న దృక్పథాలు ఒకటే చోట ఒక వరలో వుంటూ వుంటాయి.

అలాంటిదే సాహిత్యంలో విమర్శ ఒకటి. ఇది కూడా సాహిత్యంలో భాగమే అయినా సాహిత్యం కన్నా చాలా పదునైన విమర్శ (ఇది నా భావన మాత్రమే) *మారుతున్న విమర్శ కొలమానాలు* అంటూ డా॥ దార్ల వెంకటేశ్వరరావు వ్యాసం రాయడం జరిగింది. మన లిఖిత సాహిత్యానికి సుమారు పదిహేను వందల సంవత్సరాల చరిత్ర వుందని పరిశోధకులు, విమర్శకులు పునర్మూల్యాంకనం చేసి చూపిస్తున్నారు. తెలుగు విమర్శ కావ్య అవతారిక నుండే కనిపిస్తుందనుకున్నా అది ఒక ప్రక్రియ ఆధునిక కాలంనుండే గుర్తింపు పొందింది. కందుకూరి వీరేశలింగంగారు 1876లో విగ్రహ తంత్ర విమర్శ నుండి నేటి 2011 వరకు చూస్తే ఇది మూడు దశల్లో విస్తరించింది. సుమారు 135 సంవత్సరాల చరిత్ర వున్న మన తెలుగు సాహిత్య విమర్శ ప్రక్రియ 1914 నుండి నేటి వరకూ విమర్శ పునర్మూల్యాంకన విమర్శలు రెండు మార్గాలలో పయనిస్తున్నాయి (*డా॥ దార్ల వెంకటేశ్వరరావు, సోమవారం 29 ఆగస్టు 2011*). అప్పుడైనా ఒక విషయం గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలంటే కొంత సమయం అవసరం అది కూడా అంత విస్తృతంగా తెలుసుకోవడం కష్టం. కాని సాహిత్య పేజీతో అది సాధ్యం అని గట్టిగా చెప్పగలను. ఉదా: మారుతున్న విమర్శ కొలమానాలు అన్న వ్యాసమే దానిపైన నేను చెప్పిన మాటలే సాక్ష్యం. 135 సంవత్సరాల వయస్సు వున్న విమర్శ సాహిత్యాన్ని ఒక చిన్న సాహిత్య పేజీలో బంధించడం అన్నది చాలా కష్టం దానిని సుసాధ్యం చేశారు దార్ల వెంకటేశ్వరరావుగారు. ఇలాంటి వ్యాసాలు రావడం వలన సాహిత్యం కుంటుపడకుండా సాగిపోతుంది. అలాగే చూసుకుంటే డా॥ దార్ల వెంకటేశ్వరరావు రాసిన మరికొన్ని వ్యాసాలలో కూడా రాయడం జరిగింది. వాటిలో ముఖ్యంగా సాహిత్య పరిశోధనలు, కుల, రాజకీయ, ఆర్థిక అంశాలు అంటూ రాయడం జరిగింది. ఇందులో ప్రథమంగా విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్నా పరిశోధనల గురించి ఇంకా అవి ఏ ప్రాతిపదిక మీద జరుగుతున్నాయో పరిశోధకుడు తన కులస్థుడైతే పరిశోధకుడిగా తీసుకోవడం, తన ప్రాంతానికి చెందినవారైతే వారితో పరిశోధనలు చేయించడమో, చేయడమో జరుగుతుంటుంది. ఇప్పటివరకు జరిగిన పరిశోధకుల్ని, పర్యవేక్షకుల్ని వారి వారి కులాల్ని గమనిస్తే వారిరువురిలో అత్యధికులు ఒక కులానికే చెందినవాళ్ళై ఉంటారు. ఇలాంటి కారణాలే

తొలి, మలి తరం పరిశోధనలలో అత్యధికంగా కనిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల్ని ఈ దృష్టితో పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుంది *(డా॥ దార్ల వెంకటేశ్వరరావు, సోమవారం 18, జూలై 2011*). ముఖ్యంగా సాహిత్య పేజీల వలన సాహిత్యం మీద పట్టే కాకుండా విద్యాలయాల్లో జరిగే విషయాలమీద, వివాదాల మీద ఒక కన్నేసే అవకాశం వుండనే వుంది అని చెప్పడానికి ఈ వ్యాసం ఒక గొప్ప ఉదాహరణ.

'నిలువెత్తు భారతీయత' అనే వ్యాసంలో పద్మశ్రీ అవార్డు పొందిన సురగాలి తిమోతి జ్ఞానానందం అందరూ యస్.టి. జ్ఞానంద కవిగానే ప్రాచుర్యం పొందారు. యస్.టి. జ్ఞానంద కవిగారు రాసిన సాహిత్య అకాడమీ అవార్డు పొందిన అమ్రపాలి కావ్యం గురించి చాలా చక్కగా వివరించడం జరిగింది. అలాగే 'అనేక' ఈ పదేళ్ళ కవిత్వం పట్టుకున్నదేమిటి? డా॥ దార్ల వెంకటేశ్వరరావు విమర్శ బాణాలు వదిలారు. సుమారు పదేళ్ళ కవిత్వాన్ని అఫ్సర్, వంశీకృష్ణ సంపాదకత్వంలో 'అనేక' పేరుతో సాయిరంగా పబ్లికేషన్స్ ప్రచురించింది. విలువైన విషయాల్ని ప్రస్తావిస్తూ సంపాదకీయం రాసినా కొన్ని అంశాల్ని స్పృశించ లేకపోయారు పైగా స్వీకరించిన కవితల్లోని అంశాలకంటే ఇతర అంశాలని ఎక్కువగా ప్రస్తావించినట్లుంది. దండోరా నుండి గ్లోబలైజేషన్ దాకా ముస్లిం సాంస్కృతిక నుండి గుజరాత్ గాయం దాకా వచ్చిన కవిత్వ సంకలనాల నుండి కవితలో తీసుకున్న ఆయా కాలాల్లో వచ్చిన ఉద్యమాలకి సరైన ప్రాతినిధ్యం వచ్చినట్లనిపించలేదు ఆ ఉద్యమాల ప్రస్తావన చేసినా ఆ ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని కవిత్వం రాసినవారి కవిత్వం ఎంపిక చేయకుండా దీన్ని ఒక ముద్రవేసిన తరువాత ఆ కవిని ఆ ముద్రలోంచి చూసి అతని కవిత్వ సారాన్ని, స్థానాన్ని అంచనా వేయడం అందరూ చేస్తారు. కాని అటువంటి పనిచేయడం లేదు అని చెప్పుకుంటూ, మరో కవితని వేయడం, కవి లక్ష్యాన్ని ఆ కాలంలో ఆ ఉద్యమం పట్ల కవి ఆశించిన దాన్ని నీరు కార్చే ప్రయత్నం చేసినట్లవుతుంది. ఉదాహరణకు ఎండ్లూరి సుధాకర్, కృపాకర్ మాదిగ, దుగ్గినపల్ల ఎజ్రాశాస్త్రి వంటివాళ్ళు దండోరా గురించి బలమైన కవిత్వం రాశారు దీన్ని విస్మరించి వాళ్లు ఒకానొక సందర్భంలో రాసిన కవితల్ని ప్రచురించారు (డా॥దార్ల వెంకటేశ్వరరావు). సుమారు తొమ్మిది వందల సంవత్సరాలుగా అవిచ్ఛిన్న ప్రవాసమైన పద్యకవిత్వాన్ని బావ కవిత్వం బద్దలు కొడితే, భావకవిత్వంలోని స్వేచ్ఛా

ప్రియత్వం పేరుతో సమాజాన్ని పట్టించుకొని కవుల్ని అభ్యుదయ కవిత్వం గాడిలో పెట్టింది రాయడం వరకే పరిమితమైపోతే కుదరదని, దాన్ని ఆచరణలోనూ చూపాలని విప్లవ కవిత్వం కవుల్ని మరింత హెచ్చరిస్తే ఆచరణలోని అధిపత్యాన్ని ప్రశ్నిస్తూ స్త్రీ, దళిత, బహుజన, ప్రాంతీయ, ముస్లిం, క్రైస్తవ, మైనారిటీ కవిత్వ ఉద్యమాలు ముందుకొచ్చిన తర్వాత చాలామంది కలాలు మూతపడ్డాయి దానితో అంతకు ముందు రాసిన వాటితోనే తమకు దక్కిన 'కవి' గౌరవ మర్యాదల్ని కొనసాగించుకుంటూ పోతున్నవాళ్లు ఎంతో మంది ఉన్నారు. పై విషయాన్ని బట్టి చూస్తే ఒక పుస్తకాన్ని అచ్చువేసే సమయంలో ఎన్ని విధాలుగా ఆలోచించాలి. ఎలా కవితల్ని ఎంపిక చేసుకోవాలి వాటి పూర్వపరాలను పరిశీలించాలి. సాహిత్య పేజీలవల్ల మనకు సాహిత్యం ఒక్కటే కాదు పుస్తక ప్రచురణలో తీసుకోవాల్సిన మెలకువలు కూడా తెలుసుకోవచ్చని దార్ల గారి వ్యాసాన్ని బట్టి తెలుస్తుంది.

ఆధునిక కాలంలోనే అని చెప్పలేం సాహిత్యంలో ఎప్పుడో ఒకప్పటి ఆధునికం తరువాత కొద్ది కాలానికి అవి ప్రాచీనంగా మారుతుంది ఇటువంటి సందర్భంలో ఆయా సాహిత్యం ఆయా కాలాలకు సరిపోతుంది తప్ప అన్ని కాలాలకు వర్తించాలి కొన్ని సార్లు వర్తించదు. అలాంటి విషయం మీదే 'రాచపాళెం చంద్రశేఖరరెడ్డి' సాహిత్యంగానే చూడడం సాధ్యమా?

తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో అప్పుడప్పుడు వృద్ధ విద్వాంసుల నుండి వర్ధమాన విద్వాంసుల దాకా ఒక అతార్కికమైన అభిప్రాయాన్ని అలా విసిరేస్తూ ఉంటారు. అది సాహిత్యాన్ని సాహిత్యంగానే చూడాలి అన్నది ఈ అభిప్రాయాన్ని సాహిత్య ధర్మాన్ని సాహిత్య అధ్యయన ధర్మాన్ని తలక్రిందులు చేసే అభిప్రాయం ఒక రచనను చదవగానే మెదడున్న పాఠకులేవరైనా మొట్టమొదట చూసేది ఆ రచనలో రచయిత ఏమి చెప్పాడన్న దానినే అందులో రచయిత తీసుకున్న వస్తువేది అని మొదట గుర్తిస్తారు. ఆ వస్తువును రచయిత సరిగా అవగాహన చేసుకున్నారా, ఆ వస్తువు పట్ల తన వైఖరిని ప్రదర్శించారా, సమస్యను సమస్యగా ఆవిష్కరించారా, పరిష్కారం వైపు పయనించారా. వీటి గురించి ఆలోచిస్తారు తర్వాత చెప్పదలుచుకున్న దానిని ఏ రూపంలో, ఏ శిల్పంలో ఎంత ప్రతిభావంతంగా చెప్పాలో పరిశీలిస్తారు. ఇది సాహిత్య అధ్యయన క్రమం రచయితైనా మొదట దేని గురించి రాయాలో నిర్ణయించుకుని ఏ రూపంలో

రాయాలో తర్వాత నిర్ణయించుకుంటాడు. పాఠకుడు అంతే గుర్రం ముందు తర్వాత నాడా!

సాహిత్యాన్ని సాహిత్యంగా చూడాలి అనే అభిప్రాయంలో సాహిత్యాన్ని సామాజిక వాస్తవికతకు ప్రతిఫలంగా చూడవద్దు అనే సూచన వుంది. ఇది ప్రకృతి విరుద్ధం. ఈ అభిప్రాయం ఎలా పుట్టింది ఎందుకు పుట్టింది? 1914 కట్టమంచి రామలింగారెడ్డి కవిత్వ తత్త్వ విచారములో భావ చరిత్రము దిశ చరిత్రమును నిత్య సంయోగములు అనే సిద్ధాంతం చేసి ప్రబంధ సాహిత్యం మీద విరుచుక పడినప్పుడు తెలుగు సాహిత్య విమర్శలో రెండు శిబిరాలు ఏర్పడ్డాయి ప్రగతిశీలవాదులు అంతా కట్టమంచివాదానికి తమతమ వాదాలను జోడించి సాహిత్య విమర్శలో వస్తు దృష్టిని పెంచగా సంప్రదాయవాదులు ప్రగతిశీలవాదులు పాలకులు సాహిత్యం శ్రామిక కులాల సాహిత్యం కాదు, అగ్రకుల సాహిత్యం, పురుషాధిపత్య సాహిత్యం వంటి విమర్శలకు సమాధానం చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలోంచి కేవలం సాహిత్యవాదం పుట్టింది.

**నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కదార్లుగా**
**ఖండల శస్త్రి తుల్యము జగన్నుతా! విప్రలయందు నిక్కమ**
**రెండును రాజులందు విపరీతముగావున ఎప్పుడోపునో**
**పండతి శాంతుడయ్యు నవపాలుడు శాపము గ్రమ్యరింపగన్**

**(మహాభారతం, ఆది పర్వం – 100వ పద్యం)**

ఈ పద్యంలో నన్నయ కులమే స్వభావాన్ని నిర్ణయిస్తుందని చెప్పారు. ఆ పద్యంలో బుద్ధికి కులానికి సంబంధం లేదు అన్నది ఆధునికుల అభిప్రాయం.

పైన జరిగిన వాడి వేడి చర్చలు. ఇలా సాహిత్య పేజీలలో రావడం అన్నది చాలా హర్షించదగ్గ విషయం. ఇంకా చెప్పాలంటే ఇలాంటి వ్యాసాలు ప్రోత్సహిస్తూ సూర్య దినపత్రిక (అక్షరం) వారికి సాహిత్యం మీద వుండే అభిమానాన్ని మనం గుర్తించవచ్చు. ఇలాంటి వ్యాసాలను ప్రజలు చదవడంవలన వారికి ఏది మంచి ఏది చెడూ అని నిర్ణయించుకునే శక్తి కూడా ఏర్పడుతుంది అని నా ప్రగాఢ విశ్వాసం. ఇలాంటి సాహిత్య చర్చలు జరగడం వలన సాహిత్యం ఎక్కువ కాలం నిలిచి వెలుగుతుంది. అలాగే

సాహిత్య పేజీలలో ఎప్పటి మన ప్రాచీన సాహిత్యం మన ఆధునిక సాహిత్యమే కాకుండా ప్రపంచ సాహిత్యాల పరిచయం కూడా అవుతుంది. పరిచయం అని చెప్పడం తక్కువే అనుకుంటా ఒక రకంగా విషయ అవగాహన కూడా వస్తుందని చెప్పవచ్చు ఆంగ్ల రచయితల రచనలు తెలుసుకోవచ్చు వారి శైలి వారి భావాలు కూడా తెలుసుకోవచ్చు. అలాగే హిందీ, మరాఠీ సాహిత్యాల గురించి కూడా అవగాహన పెంచుకోవచ్చు. అలా వచ్చిన వ్యాసాల గురించి ఇప్పుడు చూద్దాం. రామతీర్థ గారు *నడుస్తున్న దళిత విస్ఫోటం* అంటూ నామ్‌దేవ్ ధసాల్ (మరాఠీ దళితకవి) మరాఠీ సాహిత్యం బలమైన దళిత స్వరం ముంబాయిలోని ధోల్‌బాద్‌లోని అరబ్ గల్లిలో పెరిగాడు బాల్యంలో తన చుట్టూ వున్న లోకంలో చిన్నపాటి స్మగ్లర్లు, మాదక ద్రవ్యాల రవాణాదారులు డబ్బు కోసం హత్య చేసే సుపారీ హంతకులు, దొంగలు, అప్పులిచ్చి ఎక్కువ వడ్డీలు గుంజే వ్యాపారులు, గుండాలు, వేశ్యలు, విటులు వీరందరితోనూ నిండి ఉండేది. ఇలాంటి ప్రదేశంలో నామ్‌దేవ్ ధసాల్ (మరాఠీ దళితకవి) బాల్యం సాగింది. నామ్‌దేవ్ ధసాల్ ఇరవై మూడవ ఏట తన మొదటి కవిత సంపుటిని 'గోల్పితా' వెలువరించాడు. సభ్య సమాజం ఉలిక్కిపడే శైలిలో 'గోల్పితా'ను నామ్‌దేవ్ ధసాల్ రచించిన విధానం తమ తెలుగు సాహిత్యంలో అంతకు ముందే వచ్చిన దిగంబర కవిత్వం నమోదైన రీతికి దగ్గరగా తోస్తుంది. 1773 నుండి నామ్‌దేవ్ కవిత్వం క్రమం తప్పకుండా పుస్తకాలు వెలువడుతూ వచ్చాయి. గోల్పితా, ముసలి మూర్ఖుడిచే, ఎంత చదువుకున్నావు నువ్వు, ఆట, ప్రియదర్శిని, గుడ్డి శతాబ్దం, అంబేద్కర్ ఉద్యమం, నేనే సప్తాశ్వ హంతకుణ్ణి నీ వేలు పట్టుకుని నడుస్తున్న వంటి సంపుటాలు వెలువరించారు. ప్రస్తుతం మరాఠీ దినపత్రిక సామ్నాలో వ్యాసాలు ధారావాహికంగా వెలుగు చూస్తున్నాయి.

ఈయన ప్రతిభను గుర్తించి 1999లో సాహిత్యరంగ సేవలకు గాను 'పద్మశ్రీ' పొందారు. 2004లో కేంద్ర సాహిత్య అకాడెమీ నుంచి జీవన సాఫల్య పురస్కారం పొందారు. దినపత్రికలలో వచ్చే సాహిత్య వ్యాసాల ద్వారా ప్రపంచ సాహిత్యాన్ని కూడా తెలుసుకోవచ్చు ఇలా మరికొన్ని వ్యాసాలు రావడం జరిగింది. పి. రవీంద్రన్ of makes and memories శీర్షిక చేసిన ఇంటర్వ్యూలో ఇండియన్ English కవయిత్రి కమలాదాస్ (1934–2004)

Englishలో వెల్లబుచ్చిన అభిప్రాయాలు తెలుగులోకి డా॥ దేవరాజు మహారాజు తెలుగు రాయడం జరిగింది. కళాకారులు మొదట తాము ప్రజలమన్నది మరువకూడదు అన్న శీర్షిక చేయడం జరిగింది. ఈ వ్యాసంలో కమలాదాస్ ఫెమినిజం గురించి నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి మనకు పడమటి దేశాల వారికి ఆలోచనా విధానంలో చాలా తేడా వుంది. అక్కడ స్త్రీలు పురుషులను ద్వేషిస్తారు. ఎందుకంటే వాళ్లంతా లెస్బియన్స్. నేను అబద్ధం చెప్పకూడదు. ఈ దేశంలో స్త్రీలు మగవాళ్లను ద్వేషించరు. తమను కూడా వాళ్ళతో సమంగా చూడాలని మాత్రమే కోరుతారు. నేను నా భర్తను ప్రేమించాను. నా కొడుకుల్ని ప్రేమించాను. ఆ బంధాల్లో సౌకుమార్యం నిలుపుకుంటేనే అందం... ఆనందం ఇంతెందుకు నేను లెస్బియన్‌గా మారదామని ఒక ప్రయోగం చేశాను. కాలేకపోయాను అంటే సమాజంలో మనకు సంపదని ఏవి ఉన్న వాటిని పక్కన పెట్టాల్సిందే. కుళ్లు రాజకీయాలైనా భాందప్ప మతాలైనా, స్త్రీని బానిసను చేసే సామాజిక విధాలైనా మందులు ఎక్స్‌పైరీ డెట్ తర్వాత ఎలాగైతే విషపూరితమవుతాయో – విషపూరితమైన భావాల్ని, విధానాల్ని కూడా మనం సమాజం నుండి తీసివేయాలి (ఆంగ్లంలో పి. రవీంద్రన్) (తెలుగు – డా॥ దేవరాజు మహారాజు) కమలాదాస్ కవయిత్రి) చెప్పింది.

పై వ్యాసం లాగానే రామతీర్థ గారు అస్సాం అక్షరం ఇందిరా గోస్వామి అనే శీర్షికన రాయడం జరిగింది. ఇందిరా గోస్వామిగారు మొట్టమొదట అధా లీఖా దస్తావేజ్ (సగం రాసిన ఆత్మకథ) ఈమె 1988 వెలువరించారు. తన భర్త మరణించిన తరువాత డిప్రెషన్ నుంచి దూరమయ్యేందుకు ఎలా నిద్ర మాత్రలు మింగుతూ రెండు సార్లు ఎలా ఆత్మహత్యా ప్రయత్నాలు చేసింది – వివరిస్తుంది. ఇలా ఆత్మకథతో మొదలైన రచనా వ్యాసంగం తరువాత హిందూ మతంలో వున్న దురాచారాలను వివరిస్తూ అనేక పుస్తకాలు కూడా రాసింది. 'గంగ నుంచి బ్రహ్మపుత్ర దాకా రామాయణం' పేరిట తన రామాయణ అధ్యయనాన్ని వెలువరించింది. అది విలువైన పరిశీలక గ్రంథమని విజ్ఞులు ప్రశంసించారు. దినపత్రికల్లో ముఖ్యంగా సూర్య దినపత్రికలో (*సాహిత్య పేజీ 2011 – అక్షరం*) వచ్చే సాహిత్య వ్యాసాల వలన సాహిత్యానికి ఎంతో మేలు జరుగుతుంది. వాడి వేడి చర్చలు

జరుగుతాయి. ప్రశ్నలు మొదలవుతాయి. ఈ ప్రశ్నలే సాహిత్యం నిలబడడానికి దోహదపడతాయి.

పైన చెప్పిన విషయాలు అన్నింటిని బట్టి చూస్తే సాహిత్యానికి దినపత్రికలు ఎంతో సేవ చేస్తున్నాయి. ముఖ్యంగా సూర్య దినపత్రిక అక్షరం పేజీలో వచ్చే సాహిత్య వ్యాసాలు ఈ వ్యాసాలు చదవడంవలన తెలుగు రచయితల, రచయిత్రుల రచనలే కాకుండా ప్రపంచ సాహిత్యాన్ని కూడా తెలుసుకోవచ్చు. పూర్తిస్థాయిలో కాకపోయినా ప్రముఖ రచయితల గురించి వారి పుస్తకముల గురించి తెలుసుకోవచ్చు. ఇవే కాకుండా ప్రస్తుత కాలం వస్తు, పుస్తక వైవిధ్యాల గురించి తెలుసుకోవచ్చు. సాహిత్య పేజీలలో ముఖ్యంగా (అక్షరం – 2011) పేజీలలో విమర్శ వ్యాసాలు ఎక్కువ రావడం జరిగింది. అంటే విమర్శ సాహిత్యాల గురించి తెలుసుకునే అవకాశం వుంది.

చెప్పుకోవాల్సిన ముఖ్య విషయం కవితల గురించి ముందు రోజు జరిగిన విషయం కావచ్చు ఆ వారంలో జరిగిన ముఖ్య సంఘటనలమీద గాని వెనువెంటనే సాహిత్యం పుస్తక రూపంలో రావడం చాలా కష్టం ఎందుకంటే పుస్తక అచ్చు కావడానికి కొంత సమయం అవసరం కాని సాహిత్య పేజీలో మాత్రం దాదాపుగా ఒక వారంలో ఆ సంఘటన మీద కవితలు రావడం గమనించవచ్చు అంటే సాహిత్యం ఎంత తొందరగా మీ చేతులలోకి రావడానికి సాహిత్య పేజీలు చాలా దోహదపడుతున్నాయి. ఈ విధంగా ఇలా ఒకటి ఏమిటి తెలుగు సాహిత్యంలో వున్నటువంటి దాదాపు అన్ని ప్రక్రియల గురించి వ్యాసాలు రాయడం జరిగింది, జరుగుతున్నవి. ఈ విధంగా తెలుగు సాహిత్యానికి సూర్య దినపత్రిక ఎనలేని సాహిత్య సేవ చేస్తుందని చెప్పగలను.

## 4.2. సూర్య దినపత్రిక సామాజిక సేవ:

ఈ దేశంలోని పౌరులందరికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉందని రాజ్యాంగంలోని 19 (1) ఏ అధికరణ ప్రకటిస్తోంది. పత్రికా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం పేర్కొనక పోయినప్పటికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలోనే ఇది ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు ప్రజాస్వామ్య దేశాలన్నింటిలోనూ పత్రికా స్వేచ్ఛ పరిరక్షించబడుతోంది. వార్త పత్రికలు కేవలం వార్తా పత్రికలుగానే కాకుండా అభిప్రాయాలను, సిద్ధాంతాలను, వ్యాఖ్యలను కూడా ప్రచురిస్తాయన్నవి సుస్పష్టం. ప్రభుత్వం తదితర

పాలనా సంస్థల తప్పొప్పులను లోటుపాట్లను వెలుగులోకి తీసుకొని రావడం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి. అందుకే పత్రికల్ని (మీడియా) ఫోర్త్ ఎస్టేట్‌గా అభివర్ణిస్తున్నారు. "ప్రతికూలమైన పత్రికలని కూడా ప్రభుత్వం ఒప్పుకోవడం అన్నది ఆ దేశ పరిస్థితులకు నిదర్శనం అని J. డగ్గస్ అన్నారు. పత్రికలకు కూడా కొన్ని సిద్ధాంతాల విలువలను నిర్దేశించారు. ఇవి జర్నలిజాన్ని కాపాడుతుంటాయి. పై చెప్పిన విలువలన్నింటినీ తన పత్రికలో ఇముడ్చుకున్నది సూర్య పత్రిక. నూకారపు సూర్య ప్రకాశరావు 21 అక్టోబరు 2007న ప్రారంభించడం జరిగింది. ఆ రోజునుంచి ఈ రోజు వరకు నిరంతరం ప్రజల కోసం పనిచేసిన, పనిచేస్తున్న పత్రిక సూర్య దినపత్రిక. సూర్య దినపత్రిక ప్రారంభించడానికి ఒక ముఖ్య కారణం బి.సి కులాల యొక్క గొంతుకను పెంచడమే దాని ముఖ్య ఉద్దేశంగా ప్రారంభ సమావేశంలో నూకారపు సూర్య ప్రకాశరావు ప్రకటించడం జరిగింది. దాని దిశగా సూర్య దినపత్రిక అడుగులు వేస్తూ పయనిస్తూనే వుంది.

ఎక్కడ అన్యాయం జరిగినా సూర్య దినపత్రిక దానిని పసిగట్టి పత్రికలో ప్రచురిస్తూ వుంది. రాజకీయ విషయాలు గురించి ప్రచురిస్తుంది కాని వాటితో పాటు, ప్రపంచ వార్తలను కూడా ప్రచురిస్తుంది. అలాగే క్రీడా వార్తలు కూడా ప్రచురిస్తుంది. అలాగే సినిమా విషయాలు, పిల్లలకు సంబంధించిన విషయాలు, వ్యాపార సంబంధిత విషయాలు అలాగే ప్రతి సోమవారం సాహిత్య (అక్షరం) అనుబంధాన్ని ప్రచురిస్తుంది. అలానే సాహిత్యాన్ని నిలబెట్టడంలో సూర్య పత్రిక తనవంతు కృషి చేస్తుంది. సూర్య పత్రిక అలాగే మిగతా వారాలన్నీ రాజకీయ సంపాదకీయాలు వెలువరిస్తుంది. అలా చూసుకుంటే సూర్య దినపత్రిక ప్రపంచాన్ని అర చేతిలో చూపే మరొక రూపంగా చెప్పుకోవచ్చు.

ఇలా సూర్య దినపత్రిక చాలా విధాలుగా సామాజిక సేవ చేస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా సాహిత్యం ద్వారా సామాజిక సేవ చేస్తుంది.

***

## 5. ముగింపు

పత్రికల ప్రధాన కర్తవ్యం వార్త ప్రసారం ద్వారా సమకాలీన సమాజ చిత్రీకరణ. ఆధునిక సాహిత్యం కూడా ఇంచుమించు పై లక్ష్యంతోనే ముందుకు నడుస్తుంది. వాస్తవాలకు ప్రాధాన్యతను ఇచ్చే పత్రికలు, కల్పనల మాధ్యమంగా వాస్తవికతను ఎత్తి చూపే సాహిత్యం, కలిసి చేసే జోడు గుర్రాల సవారీ ఉభయతారకమైన అభివృద్ధికి బాటలు వేస్తుంది. ఈ అభివృద్ధే పాఠకుడి సాహిత్య భాషా జ్ఞాన సంపదలను ఉన్నతీకరిస్తుంది. అదే విధంగా వార్త పత్రికలు ముఖ్యంగా సూర్య లాంటి దినపత్రికలు ప్రపంచ సాహిత్యాలను కూడా తెలుగు వారికి పరిచయం చేయదలచుకున్నాయి. ఆ వైపుగా కృషి చేస్తున్నాయి. అలా పత్రికలు ప్రపంచ సాహిత్యాన్ని పరిచయం చేయడంవల్ల అక్కడ రచయితల శైలి వారి దృష్టిలో సమాజం ఏమిటి? అక్కడ సమకాలీన పరిస్థితులు, వారి రచన శైలి తెలుగు పాఠకులకు పూర్తిగా అర్థం కాకపోయినా ఎంతో కొంత అవగతమవడానికి ఆస్కారం ఉంది. ఇలా సాహిత్యాన్ని ప్రజల వద్దకు తీసుకొని పోవడానికి పత్రికలు నిరంతరం వాటి కృషి అవి చేస్తున్నాయి.

మొదట అధ్యాయంలో సూర్య దినపత్రిక పరిచయం దాని చరిత్ర చెప్పాను. ఇంకా సమకాలీన తెలుగు పత్రికలు సాహిత్య పుటలు నేపథ్యం చెప్పడం దానితో పాటు సూర్య దినపత్రిక లక్ష్యాలు, ఆశయాల గురించి చెబుతూనే వాటి వివరణలు కూడా ఇచ్చాను.

రెండవ అధ్యాయంలో సూర్య దినపత్రికలో (2011) వచ్చిన కవిత్వ విశ్లేషణ చేశాను. దాదాపుగా అన్ని రకాల కవిత్వాలకు పత్రిక వేదికగా నిలిచింది. ముఖ్యంగా అనుభూతివాద కవిత్వం ఎక్కువగా ప్రచురితమైందని నా పరిశోధనలో తేలింది. ఇంకా భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, ఉద్యమ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళితవాద కవిత్వం, ప్రపంచీకరణ కవిత్వం కూడా ఉన్నాయి.

మూడవ అధ్యాయంలో సూర్య దినపత్రిక (2011)లో వచ్చిన సాహితి వ్యాసాల గురించి వివరించాను. అనేక మంది రచయితలు వారి శైలి గురించి వారి ఏ ఏ సాహిత్యాల గురించి ఎక్కువగా వ్యాసాలు రాస్తున్నారు,

వారియొక్క దృక్పథం ఏమిటి, ఏ వాదాలను ఎక్కువగా చెప్పుతున్నారు ఇంకా స్త్రీవాద వ్యాసాలు ఇంకా పర భాషలలో వచ్చిన సాహిత్యాన్ని అనువాద సాహిత్యాన్ని గురించి కూడా వచ్చిన సమీక్షలను విశ్లేషించాను. ఈ క్రమంలో ఒక దినపత్రిక సాహిత్య రంగానికి చేయగల సేవను అర్థం చేసుకొనే అవకాశం కలిగింది. ప్రాచీన, ఆధునిక సాహిత్య, భాషా రంగాలలో నిష్ణాతులైన వ్యాస కర్తలను విశ్లేషణలన్నింటినీ క్రోడీకరిస్తే సమకాలీన విమర్శ స్వభావాన్ని, గతిని అర్థం చేసుకునే వీలు కలుగుతుంది. వ్యాస కర్తలందరూ తమ తమ రంగాలలో అనుభవజ్ఞులు కావడం వలన ఈ విమర్శ వ్యాసాలకు సాధికారిత సహజంగానే అబ్బింది. మొత్తం మీద ఈ అధ్యాయంలో సమకాలీన తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల పరిణామ, వికాసాలను విభిన్న దృష్టి కోణాలలో విశ్లేషించిన వ్యాస కర్తల దృక్పథాలను పరిశీలించాను.

నాల్గవ అధ్యాయంలో సూర్య దినపత్రికలో సాహిత్య అనుబంధం (అక్షరం) శీర్షికన ప్రచురించిన వ్యాసాల గురించిన చర్చ కనిపిస్తుంది. ఈ వ్యాసాలు సాహిత్య అభివృద్ధికే కాక సామాజిక అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. సంప్రదాయ సాహిత్య లక్ష్యాలు, ఆనందం ఉపదేశాలైతే, ఆధునిక సాహిత్యం ఈ రెండింటితో పాటు సామాజిక ప్రయోజనాన్ని కూడ లక్ష్యిస్తుంది. ఈ సామాజిక ప్రయోజనం ఒక్క సాంఘిక పరిస్థితుల్లోనే కాదు కుటుంబ జీవనం, వ్యక్తుల మధ్య సంబంధాలు, మనస్తత్వ విశ్లేషణల నేపథ్యంలో కనిపిస్తుంది. పత్రికగా సమాజంలోని మంచి, చెడులను చూపించే సూర్య దినపత్రిక సాహిత్య పుట అక్షరం ద్వారా ఆ మంచి, చెడుల మూలాలను విశ్లేషించి ఉన్నత మానవ విలువల వైపు పాఠకులను ఆకర్షించేలా కృషి చేస్తోంది. 'వార్తా సాహిత్యం' అన్న ప్రత్యేక కోణంలో దిన పత్రికల్లోని సాహిత్య పేజీలను విశ్లేషించి అధ్యయనం చేయవలసిన అవసరాలను సూర్య దినపత్రిక సాహిత్య పేజీ గుర్తు చేస్తుంది. తెలుగు భాషకే ఆదరణ తగ్గుతున్న నేటి కాలంలో సాహిత్య వ్యాప్తికి ప్రచారానికి ప్రసార మాధ్యమాల అవసరం ఎంతో ఉంది. సూర్య దినపత్రిక ఈ కోణంలో ఎంతో సేవ చేస్తోందనే చెప్పాలి.

***

## 6. అనుబంధం – 1

ప్రముఖ సాహితీవేత్త దేవరాజు మహారాజుగారితో పరిశోధకుడు బి.వి.ఎస్. గౌతమ జరిపిన ఇంటర్వ్యూ:

**1. భాష సాహిత్యాల వికాసానికి పత్రికలు ముఖ్యంగా దిన పత్రికలు ఏ మేరకు దోహదం చేస్తున్నాయి అంటారు?**

**జ:** భాషా సాహిత్య వికాసాల కన్నా రాజకీయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయి. సామాజిక అంశాలు మీద దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. చివరికి భాషా సాహిత్యాల మీద కృషి చేస్తున్నాయి. ఆ ప్రయత్నంలో భాగంగానే ఈ సాహిత్య పేజీల ప్రచురణ జరుగుతుంది.

**2. ఏ ఏ పత్రికల్లో మీ వ్యాసాలు ఎక్కువగా ప్రచురితమయ్యాయి? అవుతున్నాయి?**

**జ:** సాహిత్య పత్రికలు అన్నిటిలో సమానంగా అచ్చవుతున్నాయి. అన్ని దిన, వార, మాస పత్రికల్లో సమానంగానే ప్రచురితమవుతున్నాయి.

**3. అక్షరం పేరుతో సూర్య దినపత్రిక ప్రచురిస్తున్న సాహిత్య పత్రికపై మీ అభిప్రాయం?**

**జ:** ప్రత్యేకమైన అభిప్రాయం ఏమీలేదు మిగతా సాహిత్య పత్రికలు నిర్వహించిన విధంగానే వీరు నిర్వహిస్తున్నారు. అన్ని వాదాలకు అక్కడ స్థానం లభిస్తుంది. కవితా ప్రక్రియలకు, వ్యాసాలకు అక్కడ చోటు వుంది.

**4. సూర్య దినపత్రికలో ప్రచురితమైన మీ వ్యాసాలలో ఎక్కువగా ఇతర భాషా సాహిత్యాలకు చెందిన రచయితలు కవులను గురించే సమీక్షించారు? ఎందుచేత?**

**జ:** తెలుగు రచయితల గురించి తెలుగు పుస్తకాలు గురించి రాసేవారు చాలా మంది వున్నారు. వారి అందరికంటే భిన్నంగా నా రచనలు వుండాలని తెలుగు పాఠకులకు అందరి రచనలు పరిచయం చేయాలని కూడా.

**5. అక్షరం పేజీలోని ఇతర సాహితీవేత్తల వ్యాసాలను చూస్తుంటారా? ఎవరెవరి వ్యాసాలు ఆకర్షించాయి? కారణాలు వివరిస్తారా?**

**జ:** అన్ని పత్రికలు చదువుతూ వుంటాను. నచ్చడం నచ్చకపోవడం అంటూ ఏమీలేదు అన్నిటితో పాటు సూర్య పత్రికను కూడా చదువుతుంటాను.

**6. సూర్య దినపత్రికలో సాహిత్య వ్యాసాంగాన్ని, మరికొంత అభివృద్ధి పరచడానికి మీరు ఏమైనా సలహాలు, సూచనలు ఇస్తారా?**

**జ:** సూర్య పత్రిక సంపాదక వర్గం అడిగితే చెప్పడానికి సిద్ధంగానే వున్నాను.

**7. విజ్ఞానశాస్త్ర ఆచార్యులుగా పనిచేసిన మీకు తెలుగు సాహిత్యంపై ఆసక్తి ఎలా ఏర్పడింది?**

**జ:** చిన్నతనం నుండే సాహిత్యంపై మక్కువ ఎక్కువ. ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం కొంత. 'తెలుగు తోట' లిఖిత గోడ పత్రిక సంపాదకత్వ బాధ్యతలు చిన్నతనంలో మాబడిలో నాకే అప్పజెప్పటం జరిగింది. అప్పటినుంచి ఇంకాస్త సాహిత్యం మీద ప్రేమ పెరిగింది. ఆ తర్వాత కాలేజీకి వచ్చిన తర్వాత మాస్టారులు మీ కలంలో బలం మాకు కనబడుతుంది. దానిని పెంచుకో అని చెప్పడం జరిగింది. అందువల్ల నలభై ఐదు ఏళ్ళలో యాభై ఎనిమిది పుస్తకాలు మార్కెట్లోకి వచ్చాయి.

**8. ఎక్కువగా అనువాదం మీదే శ్రద్ధ పెట్టడానికి గల కారణం ఏమిటి?**

**జ:** ఇతర భాషా రచయితల గురించి ప్రజలకు తెలియదు. ముఖ్యంగా మన తెలుగు ప్రజలకు వారి గురించి చదవలేరు కనుక నా పాఠకులకు కొత్త విషయాలు చెప్పాలన్న ఆకాంక్ష నాలో వుండడం వల్ల అనువాదం వైపు మళ్లడం జరిగింది. నలభై ఏళ్ళుగా ఆ కృషి జరిగింది.

**9. మీకు ఎన్ని భాషలు తెలుసు?**

**జ:** నాలుగు భాషలు.

**10. మీరు అనువాదం వచనంలో చేశారా? కవిత్వంలో చేశారా? ఏ ప్రక్రియపై ఎక్కువ చేశారు?**

**జ:** అనువాదం దాదాపు ఎనభై శాతం కవిత్వంపై చేశాను. ఇరవై శాతం వచనంపై చేశాను.

**11. ఏ అనువాద ప్రక్రియ ఎక్కువ కష్టమనిపించింది?**

**జ:** కవిత్వమే కష్టమైన ప్రక్రియ. అనువాదంలో ఎందుకంటే స్వేచ్ఛ తక్కువ కనుక.

***

# 7. అనుబంధం – 2

## సూర్య దినపత్రికలో జనవరి 2011 నుండి డిసెంబరు 2011 వరకు అక్షరంలో వెలువడిన సాహిత్య వ్యాసాలు:

| | | | |
|---|---|---|---|
| 1. | ఆదికవి సాహిత్యకీయం | డా॥ దార్ల వెంకటేశ్వర రావు | 3rd జనవరి 2011 |
| 2. | కాకాని చక్రపాణి రెండు కథా సంకలనాలు ఒక సమీక్ష బై పరమాత్ముని | పి.యస్. నారాయణ | 3rd జనవరి 2011 |
| 3. | జన గణమన – కొన్ని సంగతులు... | మద్దాలి సత్యనారాయణ శర్మ | 3rd జనవరి 2011 |
| 4. | అలరించిన అలనాటి నాటకం | అక్కిరాజు రమాపతిరావు | 10th జనవరి 2011 |
| 5. | సంక్రాంతి భారతంలో గంగిరెద్దుల పర్వం | ఎస్.ఆర్. భల్లం | 10th జనవరి 2011 |
| 6. | సాహిత్యంగానే చూడడం సాధ్యమా? | రాచపాళెం చంద్రశేఖరరెడ్డి | 17th జనవరి 2011 |
| 7. | తెలుగువారి ఉత్తర సింహద్వారం మనం మనం బరంపురం | రామతీర్ధ | 17th జనవరి 2011 |
| 8. | నిలువెత్తు భారతీయత | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 17th జనవరి 2011 |
| 9. | హిందీ ప్రగతివాద కవిత్వం | డా॥ జి.వి. రత్నాకర్ | 24th జనవరి 2011 |
| 10. | జానపద పాటల రారాజు | డా॥ పి.సి. సాయిబాబు | 24th జనవరి 2011 |
| 11. | మంచి మాటల ముల్లె | శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు | 24th జనవరి 2011 |
| 12. | కదిలించే కథలు | ఆచార్య రామా చంద్రమౌళి | 31st జనవరి 2011 |
| 13. | కాలుతున్న పూలతోట సజీవ పాత్రల సంఘర్షణ | పి. గ్లోరీ | 7th ఫిబ్రవరి 2011 |
| 14. | టాగూర్ 'పోస్టాఫీసు' మనిషికి ఉత్తరం | రామతీర్ధ | 7th ఫిబ్రవరి 2011 |
| 15. | సామాజిక విప్లవ దార్శనికుడు | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 14th ఫిబ్రవరి 2011 |
| 16. | వస్తు వైవిధ్య భరితం నేటి కథానిక | డా॥ వేదగిరి రాంబాబు | 10th ఫిబ్రవరి 2011 |
| 17. | చిన్న కథను చెంగు చెంగున పరుగెత్తించిన శ్రీపాద | డా॥ వేదగిరి రాంబాబు | 21st ఫిబ్రవరి 2011 |
| 18. | సాంస్కృతిక సమతూకం అవసరం | రామతీర్ధ | 21st ఫిబ్రవరి 2011 |
| 19. | సాహిత్యంలో సవ్యసాచి | ఆచార్య చందు సుబ్బారావు | 21st ఫిబ్రవరి 2011 |

| | | | |
|---|---|---|---|
| 20. | జాతీయ కవి బోయి భీమన్న | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 28**th** ఫిబ్రవరి 2011 |
| 21. | జర్నలిస్టుగా ముళ్ళ'పాడి' | డా॥ వేదగిరి రాంబాబు | 28**th** ఫిబ్రవరి 2011 |
| 22. | అభియోగం – సమధానం | ఎన్. ఎస్. హరినాథ్ | 28**th** ఫిబ్రవరి 2011 |
| 23. | అస్తిత్వం కోసం ఆగని ధిక్కారం | డా॥ ఎం.బి.డి. శ్యామల | 21st మార్చి 2011 |
| 24. | లక్ష్య సాధనకు లక్ష్యాలు తెలియాలి! | డా॥ వేదగిరి రాంబాబు | 21st మార్చి 2011 |
| 25. | సీమకథకు చిరునామా | పి. గ్లోరీ | 7th మార్చి 2011 |
| 26. | మరుగున పడ్డ మహాకవి | డా॥ దేవరాజు మహారాజు | 7th మార్చి 2011 |
| 27. | అరబ్ విప్లవాల అక్షర నేపథ్యం | రామతీర్థ | 28th మార్చి 2011 |
| 28. | అస్తిత్వ ఉద్యమాల్లో కుల సాహిత్యం | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 4th ఏప్రిల్ 2011 |
| 29. | ఇద్దరు పురుషుల జెండర్ జెండా | డా॥ ఎం.బి.డి. శ్యామల | 4th ఏప్రిల్ 2011 |
| 30. | ఈ పదేళ్ళ కవిత్వం పట్టుకున్నదేమిటి? | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 11th ఏప్రిల్ 2011 |
| 31. | మానవతా మధుశాల | డా॥ దేవరాజు మహారాజు | 4th ఏప్రిల్ 2011 |
| 32. | వైయుక్తికంలోనే సమూహం | రామా చంద్రమౌళి | 11th ఏప్రిల్ 2011 |
| 33. | ఒక వంచిత గీతిక – వరూధిని | మందవరపు హైమావతి | 18th ఏప్రిల్ 2011 |
| 34. | శ్రీలంక అంతర్యుద్ధానికి అక్షర రూపం శోభా శక్తి 'గొరిల్లా' | రామతీర్థ | 18th ఏప్రిల్ 2011 |
| 35. | వ్యక్తి కాదు, మహాద్భుత శక్తి | చెన్ను పెద్దిరాజు | 25th ఏప్రిల్ 2011 |
| 36. | బాబా జీవితమే సందేశం | భగీరథ | 25th ఏప్రిల్ 2011 |
| 37. | దైవ స్వరూపుడు ప్రేమ, శాంతి, సత్యం, ధర్మం, అహింస | వనం జ్వాలా నరసింహారావు | 25th ఏప్రిల్ 2011 |
| 38. | కృష్ణ పక్షంలో స్త్రీ వెలుగు పక్షం | డా॥ ఎం.బి.డి. శ్యామల | **2**nd మే 2011 |
| 39. | జగడం నవల నా ఆత్మకథ! | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | **2**nd మే 2011 |
| 40. | కథకు జేజేల | రామా చంద్రమౌళి | 9th మే 2011 |
| 41. | గజల్ మొగల్ బహదూర్ షా | రామతీర్థ | 9th మే 2011 |
| 42. | మహిళా చైతన్యమా, మార్మిక శిల్పమా? | | 16th మే 2011 |
| 43. | అమ్మపురం పాటల ఊట | బండి రజనీకుమార్ | 11th మే 2011 |
| 44. | తెలుగు కథ దళిత మహిళా వాదం | జూపాక సుభద్ర | 23rd మే 2011 |

| | | | |
|---|---|---|---|
| 45. | సాహిత్య సత్యాగ్రహాల మేళవింపు | డా॥ దేవరాజు మహారాజు | 23rd మే 2011 |
| 46. | మాండలిక రచనల అమ్ములపొది అస్తిత్వ స్పృహ | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 30th మే 2011 |
| 47. | తెలంగాణ తత్త్వకవి కుమ్మరి సిద్ధప్ప | వాసరవేణి పరశురాం | 30th మే 2011 |
| 48. | సాహిత్య విమర్శకుడుగా గురజాడ | ఆర్వీయార్ | 30th మే 2011 |
| 49. | కాలం నదికి నవలా వంతెన 'గోరా'కు వందేళ్ళు | డా॥ వేంపల్లి గంగాధర్ | 6th జూన్ 2011 |
| 50. | తొలి తరం కథారచయిత్రులు | కందాల శోభారాణి | 6th జూన్ 2011 |
| 51. | శ్రీశ్రీ పై వివాదాలు వ్యక్తిగతమా? | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 13th జూన్ 2011 |
| 52. | నల్లజాతుల నాగరిక స్వరం | రామతీర్థ | 13th జూన్ 2011 |
| 53. | అస్పృశ్యత గీత చెరిపే తత్త్వశాస్త్రం కోసం | జయధీర్ తిరుమల రావు, కె.పి. అశోక్ కుమార్, ఎ.కె. ప్రభాకర్ | 20th జూన్ 2011 |
| 54. | తొలి తరం కథారచయిత్రులు | కందాల శోభారాణి | 20th జూన్ 2011 |
| 55. | తెలుగు కథపై వెలుగు సంతకం | డా॥ వేంపల్లి గంగాధర్ | 20th జూన్ 2011 |
| 56. | దళిత, కులీన దృక్పథాలు పైట ఒక్కటే | ఆచార్య పులికొండ సుబ్బాచారి | 4**th** జూలై 2011 |
| 57. | మానవతావాది శరత్ | డా॥ ఎం.బి.డి. శ్యామల | **11**th జూలై 2011 |
| 58. | గ్రీసు విశ్వకవుల సమ్మేళనంలో తెలుగు గళాలు | పెరుగు రామకృష్ణ | **11**th జూలై 2011 |
| 59. | ఆధునిక యుగ మహాకావ్యం కన్యాశుల్కం | మణిమేఖల | **18**th జూలై 2011 |
| 60. | సాహిత్య పరిశోధనలు | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | **18**th జూలై 2011 |
| 61. | విశిష్టతల ఆరోవర్ణం | ఎలనాగ | 21**st** నవంబరు 2011 |
| 62. | పదమూడు రుచులు | రామా చంద్రమౌళి | 21**st** నవంబరు 2011 |
| 63. | దళిత కవితోద్వేగ ప్రవాహం | డా॥ జి.కె.డి. ప్రసాద్ | 21**st** నవంబరు 2011 |
| 64. | నిలువెత్తు తెలుగు సంతకం | కూనిరెడ్డి శ్రీనివాసు | **25**th జూలై 2011 |
| 65. | అరసం – శ్రీ శ్రీ – కొ.కు | చాసో | 25th జూలై 2011 |
| 66. | నడుస్తున్న దళిత విస్ఫోటం | రామతీర్థ | **1**st ఆగస్టు 2011 |
| 67. | తొలితరం కథా రచయిత్రులు | కందాల శోభారాణి | **1**st ఆగస్టు 2011 |
| 68. | శ్రీకాకుళపు సొరు గౌరునాయుడి కథలు | రామతీర్థ | 8**th** ఆగస్టు 2011 |

| | | | |
|---|---|---|---|
| 69. | సాహిత్యం–అభిరుచి వ్యాపారం! | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 8th ఆగస్టు 2011 |
| 70. | తెలుగు కథల్లో అస్తిత్వ నాదం | నండూరి రాజగోపాల్ | 15th ఆగస్టు 2011 |
| 71. | కథను జ్ఞానపీఠమెక్కించిన జయకాంతన్ | రామా చంద్రమౌళి | 8th ఆగస్టు 2011 |
| 72. | శతాబ్దాల దళితగాయం ఎండ్లూరి సుధాకర్ గోసంగి కావ్యం | ఆచార్య పులికొండ సుబ్బాచారి | 22nd ఆగస్టు 2011 |
| 73. | వచన వైభవ శిఖరం తొలినాళ్ళ ఆరుద్ర | రామతీర్థ | 29th ఆగస్టు 2011 |
| 74. | మారుతున్న విమర్శ కొలమానాలు | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 29th ఆగస్టు 2011 |
| 75. | తెలుగుకు ఏమైంది? | వెంకట రామయ్య గంపా | 5th సెప్టెంబర్ 2011 |
| 76. | అత్యాధునిక కవిత్వం | ఆచార్య రామా చంద్రమౌళి | 5th సెప్టెంబర్ 2011 |
| 77. | మనస్తంత్రల మీటే మాధురీ కవి | ఆచార్య పులికొండ సుబ్బాచారి | 12th సెప్టెంబర్ 2011 |
| 78. | సంకెళ్ళు కాకూడని సాహిత్య నియమాలు | డా॥ దార్ల వెంకటేశ్వరరావు | 12th సెప్టెంబర్ 2011 |
| 79. | తొలితరం భారతీయాంగ్ల కవి | రామతీర్థ | 19th సెప్టెంబర్ 2011 |
| 80. | ప్రపంచీకరణ సాహిత్య దృక్పథం | వెంకట రామయ్య గంపా | 19th సెప్టెంబర్ 2011 |
| 81. | జాషువా దళిత కవా? | ఆచార్య పులికొండ సుబ్బాచారి | 26th సెప్టెంబర్ 2011 |
| 82. | కన్యాశుల్కంపై పాశ్చాత్య ప్రభావం | జగద్ధాత్రి | 3rd అక్టోబర్ 2011 |
| 83. | మూడు తరాల 'సీమ' కథా సాహిత్యం | డా॥ వేంపల్లి గంగాధర్ | 3rd అక్టోబర్ 2011 |
| 84. | పెరటి వృక్షానికి సాహిత్య నోబెల్ | రామతీర్థ | 10th అక్టోబర్ 2011 |
| 85. | తలచుకోడానికైనా మిగలని తాండా | జరుపుల రమేశ్ | 10th అక్టోబర్ 2011 |
| 86. | విశ్వనరునికి వినమ్రాంజలి | డా॥ ఎం.బి.డి. శ్యామల | 10th అక్టోబర్ 2011 |
| 87. | చిక్కిపోతున్న కథావరణం | నండూరి రాజగోపాల్ | 17th అక్టోబర్ 2011 |
| 88. | తెలుగు భాషకు మణిదీపం | డా॥ కత్తి పద్మారావు | 17th అక్టోబర్ 2011 |
| 89. | ముస్లింవాద స్పష్టరూపం | పెన్నా శివరామకృష్ణ | 24th అక్టోబర్ |

| | | | |
|---|---|---|---|
| | రెహల్ | | 2011 |
| 90. | భారతీయాంగ్ల నవల 'దైవాలు పాచికలాడిన వేళ' | రామతీర్థ | 24th అక్టోబర్ 2011 |
| 91. | తెలుగు ఆఫ్ ది వెస్ట్ అంటే? | డా॥ శ్రీనివాస్ అంకే | 31st అక్టోబర్ 2011 |
| 92. | తెలుగు సాహిత్యం గిరిజన స్త్రీ స్వేచ్ఛాన్వేషణ | జరుపుల రమేశ్ | 31st అక్టోబర్ 2011 |
| 93. | ముక్తాయింపు 'ముగింపు' ఒక దీపస్తంభం | పెన్నా శివరామకృష్ణ | 7th నవంబరు 2011 |
| 94. | హైదరాబాద్ సంస్థాన విదూషకుడు హాస్యోక్తుల వనమాలి | డా॥ దేవరాజు మహారాజు | 7th నవంబరు 2011 |
| 95. | జనహృదయతంత్రులు మీటిన హజారికా | డా॥ పెంటపాటి పుల్లారావు | 14th నవంబరు 2011 |
| 96. | ఆలుపెరుగని పోరాట గాథ | జరుపుల రమేశ్ | 14th నవంబరు 2011 |
| 97. | కవిత్వ మణి పద్మం ఐరోం షర్మిల | రామతీర్థ | 28th నవంబరు 2011 |
| 98. | అనువాదం కొత్తగా పుట్టిందా | స్వాతిశ్రీపాద | 28th నవంబరు 2011 |
| 99. | కాలాన్ని కవిత్వీకరించిన శేషేంద్ర | డా॥ వెనిగళ్ళ రాంబాబు | 28th నవంబరు 2011 |
| 100. | అస్సాం అక్షరం ఇందిరా గోస్వామి | రామతీర్థ | 5th డిసెంబరు 2011 |
| 101. | 'అటచని కాంచి'న దేమిటి | డా॥ అంకే శ్రీనివాస్ | 5th డిసెంబరు 2011 |
| 102. | కళాకారులు మొదట తాము ప్రజలమన్నది మరవకూడదు | డా॥ దేవరాజు మహారాజు | 5th డిసెంబరు 2011 |
| 103. | ఒక సాహిత్య పోషకుడు ఒక సాహిత్య శాల | డా॥ అంకే శ్రీనివాసు | 19th డిసెంబరు 2011 |
| 104. | సేతు పాండవపురంలో మనోవైచిత్రి | రామతీర్థ | 19th డిసెంబరు 2011 |
| 105. | కథల వాకిట్లో శేష ప్రశ్నలు | నండూరి రాజగోపాల్ | 26th డిసెంబరు 2011 |
| 106. | ఘన 'ఘరానా' కృతి | అమ్మంగి వేణుగోపాల్ | 19th డిసెంబరు 2011 |

***

## 8. ఉపయుక్త గ్రంథసూచి


1. ఆరుద్ర. 2012. **సమగ్ర ఆంధ్ర సాహిత్యం (సంపుటం–4).** హైదరాబాదు: తెలుగు అకాడమీ.

2. గోవిందరాజు చక్రధర్ (సంపాదకులు). 2005. **తెలుగు పత్రికలు ఆధునిక ధోరణులు.** హైదరాబాదు: జర్నలిజం కళాశాల.

3. చిరంజీవి, జోగు. 2013. **తెలుగు దినపత్రికల్లోని సాహిత్యపుటలు: చర్చనీయాంశాలు.** హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగు శాఖకు సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.

4. చెన్నకేశవరెడ్డి, జి. 2015. **ఆధునికాంధ్ర గేయకవిత్వం.** హైదరాబాదు: జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక.

5. నారాయణరావు, వెల్చేరు. 2008. **తెలుగులో కవితా విప్లవాల స్వరూపం.** అమెరికా: తానా ప్రచురణలు.

6. నారాయణరెడ్డి, సి. 2011. **ఆధునికాంధ్ర గేయకవిత్వము – సంప్రదాయములు: ప్రయోగములు.** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

7. నిత్యానందరావు, వెలుదండ. 2013. **విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.** హైదరాబాదు: శ్రీమతి వి. గీతారాణి పబ్లిషర్స్.

8. పవన్ కుమార్, పమ్మి. 1998. **తెలుగు దినపత్రికలలో వార్తారచన: విశేషాభివ్యక్తి.** హైదరాబాదు విశ్వవిద్యాలయం, తెలుగు శాఖకు సమర్పించిన ఎం.ఫిల్. పరిశోధన వ్యాసం.

9. యాదగిరి, కె (సంపాదకులు). 2012. **తెలుగులో కవిత్వోద్యమాలు**. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

10. రాజగోపాల రావు, సి.వి. 2004. **ఆంధ్ర పత్రిక.** హైదరాబాదు: ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ.

11. రామమోహనరాయ్, కడియాల. 2003. **20వ శతాబ్ది తెలుగు కవిత్వం.** హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

12. రామారావు, ఎస్వీ. 2009. **20వ శతాబ్ది కవిత్వ ధోరణులు – సమాలోచన.** హైదరాబాదు: తెలుగు అకాడమీ.

13. వరదాచారి, జి.వి.యస్. 2012. **తెలుగు పత్రిక – తీరుతెన్నులు.** హైదరాబాదు: వయోధిక పాత్రికేయ సంఘం.
14. వేంకటేశ్వర్లు, బూదాటి. 2014. **తెలుగు సాహిత్య ప్రక్రియలు – ధోరణులు.** హైదరాబాదు: హిమకర్ పబ్లిషర్స్.

## పత్రికలు:

1. సూర్య దినపత్రిక (జనవరి, 2011 నుండి డిసెంబరు, 2011).

***